శతకములు

శతకములు

శతకములు

విషయసూచిక

1. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న
2. సుమతీ శతకము - బద్దెన
3. భాస్కర శతకము - మారవి వెంకయ్య
4. కుమార శతకము - ఫక్కి వేంకట నరసింహ కవి
5. కుమారీ శతకము - ఫక్కి వేంకట నరసింహ కవి
6. నీతి శతకము - భర్తృహరి
7. శృంగార శతకము - భర్తృహరి
8. శృంగార శతకము - భర్తృహరి
9. వేమన పద్యములు - వేమన

దాశరథీ శతకము

కంచెర్ల గోపన్న

ఉ. శ్రీరఘురామ చారుతులసీదళదామ శమక్షమాది శృం
గారగుణాభిరామ త్రిజగన్నుతశౌర్యరమాలలామ దు
ర్వార కబంధరాక్షసవిరామ జగజ్జనకల్మషార్ణవో
త్తారకనామ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥1॥

ఉ. రామ విశాలవిక్రమ పరాజిత భార్గవరామ సద్గుణ
స్తోమ పరాంగనావిముఖ సువ్రతకామ వినీల నీరద
శ్యామ కకుత్స్థవంశకలశాంబుధి సోమ సురారిదోర్బలో
ద్దామవిరామ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥2॥

చ. అగణితసత్యభాష శరణాగతపోష దయాలసజ్జరీ
విగతసమస్తదోష పృథివీసురతోష త్రిలోకపూతకృ
ద్గగనధునీమరంద పదకంజవిశేష మణిప్రభా ధగ
ద్ధగితవిభూష భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥3॥

ఉ. రంగదరాతిభంగ ఖగరాజతురంగ విపత్పరంపరో
త్తుంగ తమఃపతంగ పరితోషితరంగ దయాంతరంగ స
త్సంగ ధరాత్మజాహృదయసారసభృంగ నిశాచరాబ్జమా
తంగ శుభాంగ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥4॥

ఉ. శ్రీద సనందనాది మునిసేవితపాద దిగంతకీర్తిసం
పాద సమస్తభూతపరిపాలవినోద విషాదవల్లికా
చ్ఛేద ధరాధినాథకుల సింధుసుధామయపాద నృత్తగీ
తాది వినోద భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥5॥

ఉ. ఆర్యులకెల్ల మ్రొక్కి వినతాంగుఁడనై రఘునాథభట్టరా
చార్యుల కంజలెత్తి కవిసత్తములన్ వినుతించి కార్యసౌ

కర్యమెలర్పనొక్క శతకంబొనఁగూర్చి రచింతునేఁడు తా
త్పర్యమునన్ గ్రహింపుమిది దాశరథీ! కరుణాపయోనిధీ! ॥6॥

చ. మసకొని రేఁగుబండ్లకును మౌక్తికముల్ వెలబోసినట్లు దు
ర్వ్యసనముజెంది కావ్యము దురాత్ములకిచ్చితి మోసమయ్యె నా
రసనకుఁ బూతవృత్తిసుకరంబుగఁ జేకురునట్లు వాక్సుధా
రసములు చిల్కఁ బద్యముఖరంగమునందు నటింపవయ్య సం
తసమును జెంది భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥7॥

ఉ. శ్రీరమణీయహార యతసీకుసుమాభశరీర భక్తమం
దార వికారదూర పరతత్త్వవిహార త్రిలోకచేతనో
ద్ధార దురంతపాతకవితానవిదూర ఖరాదిదైత్యకాం
తార కుఠార భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥8॥

చ. దురితలతాలవిత్ర ఖరదూషణకాననవీతిహోత్ర భూ
భరణకళావిచిత్ర భవబంధవిమోచనసూత్ర చారువి
స్ఫురదరవిందనేత్ర ఘనపుణ్యచరిత్ర వినీలభూరికం
ధరసమగాత్ర భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥9॥

చ. కనకవిశాలచేల భవకాననశాతకుఠారధార స
జ్జనపరిపాలశీల దివిజస్తుతసద్గుణకాండ కాండసం
జనిత పరాక్రమ క్రమవిశారద శారద కందకుంద చం
దనఘనసార సారయశ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥10॥

ఉ. శ్రీరఘువంశ తోయధికి శీతమయూఖుఁడవైన నీ పవి
త్రోరుపదాబ్జముల్ వికసితోత్పల చంపకవృత్తమాధురీ
పూరితవాక్ప్రసూనములఁ బూజలొనర్చెద జిత్తగింపుమీ
తారకనామ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥11॥

చ. గురుతరమైన కావ్యరస గుంభనకబ్బురమంది ముష్కరుల్
సరసులమాడ్కి సంతసిల జాలుదురోటు శశాంకచంద్రికాం
కురముల కిందుకాంతమణికోటి స్రవించినభంగి వింధ్యభూ
ధరమున జాఱునే శిలలు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥12॥

చ. తరణికులేశ నానుడులఁ దప్పులు గల్గిన నీదునామ స
ద్విరచితమైన కావ్యము పవిత్రముగాదె వియన్నదీజలం
బరుగుచువంకయైన మలినాకృతిఁబాఱినఁ దన్మహత్త్వముం
దరమె గణింపనెవ్వరికి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥13॥

ఉ. దారుణపాతకాబ్ధికి సదాబడబాగ్ని భవాకులార్తి వి
స్తార దవానలార్చికి సుధారసవృష్టి దురంతదుర్మతా
చార భయంకరాటవికిఁ జండకఠోరకుఠారధార నీ
తారకనామ మెన్నుకొన దాశరథీ! కరుణాపయోనిధీ! ॥14॥

చ. హరునకు నవ్విభీషణున కద్రిజకుం దిరుమంత్రరాజమై
కరికి నహల్యకున్ ద్రుపదకన్యకు నార్తిహరించు చుట్టమై
పరగినయట్టి నీ పతితపావననామము జిహ్వపై నిరం
తరము నటింపజేయుమిఁక దాశరథీ! కరుణాపయోనిధీ! ॥15॥

ఉ. ముప్పునఁ గాలకింకరులు ముంగిటవచ్చినవేళ రోగముల్
గొప్పరమైనచోఁ గఫము కుత్తుక నిండినవేళ బాంధవుల్
గప్పిన వేళ మీ స్మరణ గల్గునొ గల్గదొ నాఁటి కిప్పుడే
తప్పక చేతు మీభజన దాశరథీ! కరుణాపయోనిధీ! ॥16॥

చ. "పరమదయానిధే పతిత పావననామ హరే"యటంచు సు
స్థిరమతులై సదా భజన సేయు మహాత్ముల పాదధూళి నా
శిరమున దాల్తు మీరటకు జేరకుఁడంచు యముండు కింకరో
త్కరముల కాన బెట్టునఁట దాశరథీ! కరుణాపయోనిధీ! ॥17॥

చ. అజునకుదండ్రివయ్యు సనకాదులకుం బరతత్త్వమయ్యు స
ద్ద్విజమునికోటికెల్లఁ గులదేవతవయ్యు దినేశవంశ భూ
భుజులకు మేటివయ్యు బరిపూర్ణుఁడవై వెలుగొందు పక్షిరా
డ్ధ్వజ మిముఁ బ్రస్తుతించెదను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥18॥

ఉ. "పండిత రక్షకుం డఖిల పాపవిమోచనుఁ డబ్జసంభవా
ఖండలపూజితుండు దశ కంఠవిలుంఠన చండకాండ కో
దండకళాప్రవీణుఁ"డను తావక కీర్తివధూటికిత్తు బూ
దండలుగాఁగ నా కవిత దాశరథీ! కరుణాపయోనిధీ! ॥19॥

ఉ. శ్రీరమ సీతగాఁగ నిజసేవకబృందము వీరవైష్ణవా
చారజనంబుగాఁగ విరజానది గౌతమిగా వికుంఠము
న్నారయ భద్రశైలశిఖరాగ్రముగాఁగ వసించు చేతనో
ద్ధారకుఁడైన విష్ణుఁడవు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥20॥

ఉ. కంటి నదీతటంబుఁ బొడఁగంటిని భద్రనగాదివాసముం
గంటి నిలాతనూజ నురు కార్ముకమార్గణ శంఖచక్రముల్
గంటిని మిమ్ము లక్ష్మణునిఁ గంటి కృతార్థుడనైతి నో జగ
త్కంటక దైత్యనిర్దళన దాశరథీ! కరుణాపయోనిధీ! ॥21॥

చ. హలికునకున్ హలాగ్రమున నర్థము చేకురుభంగి దప్పిచే
నలమటఁజెందువానికి సురాపగలో జలమబ్బినట్లు దు
ర్మలిన మనోవికారినగు మర్త్యుని నన్నొడఁగూర్చి నీపయిం
దలపు ఘటింపఁజేసితివి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥22॥

ఉ. కొంజక తర్కవాదమను గుద్దలిచేఁ బరతత్త్వభూస్థలిన్
రంజిలఁద్రవ్వి కన్గొనని రామనిధానము నేఁడు భక్తి సి
ద్ధాంజనమందు హస్తగత మయ్యె భళీయనగా మదీయహృ
త్కంజమునన్ వసింపుమిఁక దాశరథీ! కరుణాపయోనిధీ! ॥23॥

ఉ. రాముఁడు ఘోరపాతకవిరాముఁడు సద్గుణకల్పవల్లికా
రాముఁడు షడ్వికారజయరాముఁడు సాధుజనావనవ్రతో
ద్దాముఁడు రాముఁడే పరమదైవము మాకని మీయడుంగుఁ గెం
దామరలే భజించెదరు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥24॥

ఉ. చక్కరమాని వేము దినఁజాలిన కైవడి మానవాధముల్
పెక్కురు బక్కదైవముల వేమఱుగొల్చెద రట్లకాదయా
మ్రొక్కిన నీక మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవ యీవలెన్
దక్కినమాట లేమిటికి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥25॥

ఉ. రాకలుషంబులెల్ల బయలం బడద్రోచిన మా కవాటమై
దీకొనిఁ బ్రోచు నిక్కమని ధీయుతులెన్నఁ దదీయవర్ణముల్
గైకొని భక్తిచే నుడువఁ గానరు గాక విపత్పరంపరల్
దాకొనుచే జగజ్జనుల దాశరథీ! కరుణాపయోనిధీ! ॥26॥

ఉ. "రామహరే కకుత్స్థకుల రామహరే రఘురామరామ శ్రీ
రామహరే" యటంచు మది రంజిల భేకగళంబులీల నీ
నామము సంస్మరించిన జనంబు భవంబెడబాసి తత్పరం
ధామనివాసులౌదుఁరట దాశరథీ! కరుణాపయోనిధీ! ॥27॥

ఉ. చక్కెర లప్పకున్ మిగుల జవ్వని కెంజిగురాకు మోవికిం
జొక్కపుజుంటి తేనియకుఁ జొక్కులుచుం గనలేరుగాక నేఁ
డక్కట రామనామ మధురామృతమానుటకంటె సౌఖ్యమా
తక్కినమాధురీ మహిమ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥28॥

ఉ. అండజవాహ నిన్ను హృదయంబున నమ్మినవారి పాపముల్
కొండలవంటివైన వెసఁ గూలి నశింపకయున్నె సంతతా
ఖండలవైభవోన్నతులు గల్గకమానునె మోక్షలక్ష్మికై
దండయొసంగకున్నె తుద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥29॥

ఉ. చిక్కని పాలపై మిసిమిఁ జెందిన మీఁగడ పంచదారతో
మెక్కినభంగి మీ విమల మేచకరూప సుధారసంబు నా
మక్కువపళ్ళెరంబున సమాహిత దాస్యమనేటి దోయిటన్
దక్కెనటంచు జుఱ్ఱెదను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥30॥

చ. సిరులిడ సీత పీడలెగజిమ్ముటకున్ హనుమంతుఁ డార్తి సో
దరుఁడు సుమిత్రసూతి దురితంబులు మానుప రామనామమున్
గరుణఁ దరిల్ప మానవులఁ గావఁగఁ బన్నిన వజ్రపంజరో
త్కరముగదా భవన్మహిమ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥31॥

చ. హలి కులిశాంకుశ ధ్వజ శరాసన శంఖ రథాంగ కల్పకో
జ్జ్వల జలజాత రేఖలను సొంకములై కనుపట్టుచున్న మీ
కలితపదాంబుజ ద్వయము గౌతమపత్ని కొసంగినట్లు నా
తలవునఁజేర్చి కావగఁదె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥32॥

చ. జలనిధిలోనదూఱి కులశైలముమీటి ధరిత్రిగొమ్మునం
దలవడమాటి రక్కసుని యంగము గీటి బలీంద్రునిన్ రసా
తలమునమాటి పార్థివకదంబముగూర్చిన మేటి రామనా
తలఁపుననాటి రాఁగదవె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥33॥

ఉ. భండనభీముఁ డార్తజనబాంధవుఁ డుజ్జ్వలబాణతూణ కో
దండకలాప్రచండ భుజతాండవకీర్తికి రామమూర్తికిన్
రెండవసాటిదైవమిఁక లేఁడనుచున్ గడగట్టి భేరికా
డాండ డడాండడాండ నినదంబు లజాండము నిండ మత్తవే
దండము నెక్కిచాటెదను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥34॥

ఉ. అవనిజ కన్నుదోయితొగలందు వెలింగెడు సోమ జానకీ
కువలయనేత్ర గబ్బిచనుఁగొండలనుండు ఘనంబ మైథిలీ
నవనవయౌవనంబను వనంబునకున్ మదదంతి వీవెకా
దవిలి భజింతు నెల్లపుడు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥35॥

చ. ఖరకరవంశజా విను మఖండిత భూతపిశాచ ఢాకినీ
జ్వరపరితాప సర్వభయవారకమైన భవత్పదాబ్జవి
స్ఫురదురువజ్రపంజరముఁ జొచ్చితి నీయెడ దీనమానవో
ద్ధరబిరుదాంక యేమఱుకు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥36॥

ఉ. జుఱ్ఱెద మీకథామృతము జుఱ్ఱెద మీపదకంజతోయమున్
జుఱ్ఱెద రామనామమున జొబ్బిలుచున్న సుధారసంబు నే
జుఱ్ఱెద జుఱ్ఱుజుఱ్ఱుఁగ రుచుల్ గనువారిపదంబుఁ గూర్పవే
తఱ్ఱులతోడి పొత్తిడక దాశరథీ! కరుణాపయోనిధీ! ॥37॥

ఉ. ఘోరకృతాంతవీరభటకోటికి గుండెదిగుల్ దరిద్రతా
కారపిశాచసంహరణకార్యవినోది వికుంఠమందిర
ద్వార కవాటభేది నిజదాసజనావళికెల్ల ప్రొద్దు నీ
తారకనామ మెన్నుకొన దాశరథీ! కరుణాపయోనిధీ! ॥38॥

ఉ. విన్నపమాలకించు రఘువీర! నహిప్రతిలోకమందు నా
కన్నదురాత్ముఁడు బరమకారుణికోత్తమ! వేల్పులందు నీ
కన్న మహాత్ముఁడుం బతిత కల్మషదూరుఁడు లేఁడునాకు వి
ద్వన్నుత నీవె నాకు గతి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥39॥

ఉ. పెంపనుఁ దల్లివై కలుషబృందసమాగమ మొందకుండ ర
క్షింపను దండ్రివై మెయువసించు దశేంద్రియరోగముల్ నివా
రింపను వెజ్జువై కృప గుఱించి పరంబు దిరంబుగాఁగ స
త్సంపదలీయ నీవెగతి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥40॥

ఉ. కుక్షినజాండ పంక్తులొనఁగూర్చి చరాచరజంతుకోటి సం
రక్షణసేయు తండ్రివి పరంపర నీ తనయుండనైన నా
పక్షము నీవు గావలదె పాపము లెన్ని యొనర్చినన్ జగ
ద్రక్షక కర్త వీవె కద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥41॥

ఉ. గద్దరి యోగిహృత్కమల గంధరసానుభవంబుఁజెందు పె
న్నిద్దపు గండుఁదేఁటి ధరణీసుత కౌఁగిలిపంజరంబునన్
ముద్దులు గుల్కు రాచిలక ముక్తినిధానమ రామ రాఁగదే
తద్దయు నేఁడు నాకడకు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥42॥

చ. కలియుగ మర్త్యకోటి నినుఁ గన్గొనరాని విధంబొ భక్తవ
త్సలతవహింపవో చటుల సాంద్రవిపద్దశ వార్ధిఁగ్రుంకుచో
బిలిచినఁ బల్కవింతమఱపే నరులిట్లనరాదుగాక నీ
తలఁపునలేదే సీత చెఱ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥43॥

చ. జనవర! మీ కథాళి విన సైఁపక కర్ణములందు ఘంటికా
నినద వినోదముల్ సలుపు నీచునకున్ వరమిచ్చినావు ని
న్ననయమునమ్మి కొల్చిన మహాత్ములకేమి యొసంగెదో సనం
దననుత! మాకొసంగుమయ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥44॥

ఉ. పాపము లొందువేళ రణపన్నగభూత భయజ్వరాదులం
దాపద నొందువేళ భరతాగ్రజ మిమ్ము భజించువారికిం
బ్రాపుగ నీవుఁ దమ్ముఁడిరు ప్రక్కియలంజని తద్విపత్తిసం
తాపముమాన్పి కాతువఁట దాశరథీ! కరుణాపయోనిధీ! ॥45॥

చ. అగణితజన్మకర్మదురితాంబుధిలోఁ బహుదుఃఖవీచికల్
దెగిపడ నీఁదలేక జగతీధవ నీ పదభక్తినావచేఁ
దగిలి తరింపగోరితిఁ బదంపడి నాదు భయంబుమాన్పవే
తగదని చిత్తమందిడక దాశరథీ! కరుణాపయోనిధీ! ॥46॥

ఉ. నేనొనరించు పాపము లనేకములైనను నాదుజిహ్వకుం
బానకమయ్యె మీపరమ పావననామము దొంటి చిల్క "రా
మా! ననుఁగావు"మన్న తుది మాటకు సద్గతిఁజెందెఁ గావునన్
దాని ధరింపఁగోరెదను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥47॥

చ. పరధనముల్ హరించి పరభామలనంటి పరాన్నమబ్బినన్
మురిపముకాని మీఁదనగు మోసమెఱుంగదు మానసంబు దు
స్తరమిది కాలకింకర గదాహతి పాల్పడనీక మమ్మునే
తఱిదరిఁజేర్చి కాచెదవొ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥48॥

ఉ. చేసితి ఘోరకృత్యములు చేసితి భాగవతాపచారముల్
చేసితి నన్యదైవములఁ జేరి భజించిన వారిపొందు నేఁ
చేసితినేరముల్ దలఁచి చిక్కులఁబెట్టకుమయ్య యయ్య నీ
దాసుఁడనయ్య భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥49॥

చ. పరుల ధనంబుఁజూచి పర భామల జూచి హరింపగోరు మ
ద్గురుతరమానసంబనెడు దొంగనుబట్టి నిరూఢదాస్య వి
స్ఫురితవివేక పాశములఁ జుట్టి భవచ్చరణంబనే మరు
త్తరువునఁ గట్టివేయఁగదె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥50॥

చ. సలలిత రామనామ జప సారమెఱుంగను గాశికాపురీ
నిలయుఁడఁగాను మీచరణ నీరజరేణు మహాప్రభావముం
దెలియ నహల్యఁగాను జగతీవర! నీదగు సత్యవాక్యముం
దలఁపఁగ రావణాసురుని తమ్ముఁడగాను భవద్విలాసముల్
తలఁచి నుతింప నాతరమె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥51॥

ఉ. పాతకులైన మీ కృపకుఁ బాత్రులు కారె తలంచి చూడ జ
ట్రాతికిఁగల్గె భావన మరాతికి రాజ్యసుఖంబము గల్గె దు
ర్జాతికిఁబుణ్యమబ్బె గపిజాతిమహత్త్వము నొందెఁగావునం
దాతవ యెట్టివారలకు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥52॥

ఉ. మామక పాతక వ్రజము మాన్పనగణ్యము చిత్రగుప్త లే
మేమని వ్రాఁతురో శమనుఁడేమి విధించునొ కాలకింకర
స్తోమ మొనర్చుటేమొ వినఁ జొప్పడదింతకుమున్నె దీనచిం
తామణి యెట్లుగాచెదవొ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥53॥

ఉ. దాసిన చుట్టమా శబరి దాని దయామతి నేలినావు నీ
దాసుని దాసుడా గుహుడు తావక దాస్య మొసంగినావు నే
జేసినపాపమో వినుతి చేసిన గావవు గావుమయ్య నీ
దాసులలోన నేనొకఁడ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥54॥

ఉ. దీక్షవహించి నా కొలది దీనుల నెందఱిఁ గాచితో జగ
ద్రక్షక తొల్లి యా ద్రుపదరాజతనూజ తలంచినంతనే
యక్షయమైన వల్వలిడి తక్కట నా మొఱఁజిత్తగించి ప్ర
త్యక్షము గావవేమిటికి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥55॥

ఉ. నీలఘనాభమూర్తివగు నిన్నుఁగనుంగొనఁగోరి వేడినన్
జాలముసేసి డాగెదవు సంస్తుతికెక్కిన రామనామ మే
మూలను దాచుకోఁగలవు ముక్తికి బ్రాపది పాపమూలకు
ద్దాలముగాదె మాయెడల దాశరథీ! కరుణాపయోనిధీ! ॥56॥

చ. వలదు పరాకు భక్తజన వత్సల నీ చరితంబు వమ్ముగా
వలదు పరాకు నీ బిరుదు వజ్రమువంటిది కావకూరకే
వలదు పరాకు నా దురిత వార్ధికిఁదెప్పవుగా మనంబులో
దలఁతుమె కా నిరంతరము దాశరథీ! కరుణాపయోనిధీ! ॥57॥

ఉ. తప్పులెఱుంగలేక దురితంబులు సేసితినంటి నీవు మా
యప్పవుగావుమంటి నిఁక నన్యులకున్ నుదురంటనంటి నీ
కొప్పిదమైన దాసజను లొప్పిన బంటుకు బంటనంటి నా
తప్పులకెల్ల నీవెగతి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥58॥

చ. ఇతఁడు దురాత్ముఁడంచు జనులెన్నఁగ నాఱడిఁగొంటి నేనెపో
పతితుఁడనంటిపో పతితపావనమూర్తివి నీవుగల్గ నే
నితరుల వేఁడనంటి నిహమిచ్చిన నిమ్ము పరంబొసంగు మీ
యతులిత రామనామ మధురాక్షరపాళి నిరంతరంబు హృ
ద్గతమని నమ్మికొల్చెదను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥59॥

ఉ. అంచితమైన నీదు కరుణామృతసారము నాదుపైని బ్రో
క్షించినఁ జాలు దాన నిరసించెద నా దురితంబులెల్లఁ దూ
లించెదఁ వైరివర్గ మెడలించెదఁ గోర్కుల నీదుబంటనై
దంచెదఁ గాలకింకరుల దాశరథీ! కరుణాపయోనిధీ! ॥60॥

చ. జలనిధులేడునొక్క మొగిఁ జక్కికిఁదెచ్చె శరంబు జాతినిం
పలరగఁ జేసెనాతిగఁ బదాబ్జపరాగము నీ చరిత్రముం
జలజభవాది నిర్జరులు సన్నుతి సేయఁగ లేరు గావునం
దలఁప నగణ్యమయ్య యిది దాశరథీ! కరుణాపయోనిధీ! ॥61॥

ఉ. కోతికి శక్యమా యసుర కోటుల గెల్వను గెల్చెబో నిజం
బాతని మేన శీతకరుఁడౌట దవానలుఁడెట్టివింత మా
సీత పతివ్రతామహిమ సేవకు భాగ్యము మీ కటాక్షమున్
ధాతకు శక్యమా బొగడ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥62॥

ఉ. భూపలలామ రామ రఘుపుంగవరామ త్రిలోకరాజ్య సం
స్థాపనరామ మోక్షఫలదాయకరామ మదీయపాపముల్
పాపఁగదయ్య రామ నినుఁ బ్రస్తుతిసేసెదనయ్య రామ సీ
తాపతి రామ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥63॥

ఉ. నీ సహజంబు సాత్త్వికము నీ విడిపట్టు సుధాపయోధి ప
ద్మాసనుఁడాత్మజుండు గమలాలయ నీ ప్రియురాలు నీకు సిం
హాసనమిద్ధరిత్రి గొడుగాకస మక్షులు చంద్రభాస్కరుల్
నీ సుమతల్పమాదిఫణి నీవె సమస్తముఁ గొల్చునట్టి నీ
దాసుల భాగ్యమెట్టిదయ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥64॥

చ. చరణము సోఁకినట్టి శిల జవ్వనిరూపగు టొక్కవింత సు
స్థిరముగ నీటిపై గిరులు దేలిన దొక్కటి వింతగాని మీ
స్మరణఁ దనర్చుమానవులు సద్గతిఁజెందిన దెంతవింత యీ
ధరను ధరాత్మజారమణ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥65॥

ఉ. దైవము తల్లిదండ్రి తగుదాత గురుండు సఖుండు నిన్నె కా
భావన సేయుచున్న తఱిఁబాపములెల్ల మనోవికార దు
ర్భావితుఁజేయుచున్నవి కృపామతివై నను గావుమీ జగ
త్పావనమూర్తి భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥66॥

ఉ. వాసవ రాజ్యభోగ సుఖవార్ధిని దేలు ప్రభుత్వమబ్బినా
ఉయాసకు మేరలేదు కనకాద్రిసమానధనంబు గూర్చినం
గానును వెంటరాదు కని కానక చేసిన పుణ్యపాపముల్
వీసరబోవ నీవు పదివేలకుఁజాలు భవంబునొల్ల నీ
దాసునిగాఁగ నేలికొను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥67॥

ఉ. సూరిజనుల్ దయాపరులు సూనృతవాదులలుబ్ధమానవుల్
వీరపతివ్రతాంగనలు విప్రులు గోవులు వేదముల్ మహీ

భారముఁ దాల్పఁగా జనులు పావనమైన పరోపకార స
త్కార మెఱుంగలే రకట దాశరథీ! కరుణాపయోనిధీ! ॥68॥

ఉ. వారిచరావతారమున వారధిలోఁ జొఱఁబాఱిఁ క్రోధ వి
స్తారగుడైన యా నిగమ తస్కరవీర నిశాచరేంద్రునిన్
జేరి వధించి వేదముల చిక్కెడలించి విరించికిన్ మహో
దారతనిచ్చితీవెగద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥69॥

చ. కరమనురక్తి మందరము గవ్వముగా నహిరాజు ద్రాడుగా
దొరకొని దేవదానవులు దుగ్ధపయోధి మథించుచున్నచో
ధరణిచలింప లోకములు తల్లడమందఁగఁ గూర్మమై ధరా
ధరము ధరించితీవె కద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥70॥

ఉ. ధారుణి జాపజుట్టిన విధంబునగైకొని హేమనేత్రుఁడ
వ్వారిధిలోన డాఁగినను వానివధించి వరాహమూర్తివై
ధారుణిఁ దొంటి కైవడిని దక్షిణశృంగమునన్ ధరించి వి
స్తార మొనర్చితీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥71॥

చ. పెటపెట నుక్కు కంబమున భీకరదంత నఖాంకుర ప్రభా
పటలము గప్ప నుప్పతిలి భండనవీథి నృసింహభీకర
స్ఫుటపటుశక్తి హేమకశిపున్ విదలించి సురారిపట్టి నం
తటఁగృపఁజూచితీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥72॥

చ. పదయుగళంబు భూగగన భాగములన్ వెసనూని విక్రమా
స్పదుఁడగు నబ్బలీంద్రునొక పాదమునం దలక్రిందనొత్తి మే
లొదవ జగత్త్రయంబు బురుహూతునికియ్య వటుండవైన చి
త్సదమలమూర్తి వీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥73॥

చ. ఇరువదియొక్కమాఱు ధరణీశుల నెల్ల వధించి తత్కళే
బర రుధిర ప్రవాహమునఁ బైతృకతర్పణ మొప్పఁజేసి భూ
సురవరకోటికిన్ ముదము సొప్పడ భార్గవరామమూర్తివై
ధరణినొసంగితీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥74॥

చ. దురమునఁ దాటకం దునిమి ధూర్జటివిల్ దునుమాడి సీతనుం
బరిణయమంది తండ్రిపనుపన్ ఘనకాననభూమి కేఁగి దు

స్తరపటుచండ కాండకులిశాహతి రావణకుంభకర్ణ భూ
ధరములఁ గూల్చితీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥75॥

చ. అనుపమ యాదవాన్వయసుధాబ్ధిసుధానిధి కృష్ణమూర్తి నీ
కనుజుఁడుగా జనించి కుజనావళి నెల్ల నడంచి రోహిణీ
తనయుఁడనంగ బాహుబల దర్పమునన్ బలరామమూర్తివై
తనరిన వేల్పవీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥76॥

చ. సురలునుతింపగాఁ ద్రిపుర సుందరులన్ వరియింప బుద్ధరూ
పరయఁగ దాల్చితీవు త్రిపురాసురకోటి దహించుచున్నప్పుడా
హరునకుఁ దోడుగా వరశరాసన బాణముఖోగ్రసాధనో
త్కర మొనరించితీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥77॥

ఉ. సంకరదుర్గమై దురిత సంకులమైన జగంబుజూచి స
ర్వంకషలీల నుత్తమ తురంగమునెక్కి కరాసిఁబూని వీ
రాంక విలాసమొప్ప గలికాకృతి సజ్జనకోటికిన్ నిరా
తంక మొనర్చితీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥78॥

చ. మనమున నూహపోహణలు మర్వకమున్నె కఫాదిరోగముల్
దనువుననంటి మేనిబిగి దప్పకమున్నె నరుండు మోక్ష సా
ధన మొనరింపఁగావలయుఁ దత్త్వవిచారము మానియుండుట
ల్తనువునకున్ విరోధమిది దాశరథీ! కరుణాపయోనిధీ! ॥79॥

చ. ముదమున కాటపట్టు భవమోహమద ద్విరదాంకుశంబు సం
పదల కొటారు కోరికల పంట పరంబునకాది వైరుల
న్నదన జయించుత్రోవ విపదబ్ధికి నావ గదా సదాభవ
త్పదమల నామసంస్మరణ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥80॥

చ. దురితలతానుసారి భయదుఃఖకదంబము రామనామ భీ
కరతర హేతిచేఁదెగి వకావకలై చనకుండ నేర్చు నే
దరికొని మండుచుండు శిఖదార్కొనినన్ శలభాదికీటకో
త్కరము విలీనమై చనదె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥81॥

చ. హరిపదభక్తి నింద్రియజయాన్వితుఁ డుత్తముఁడింద్రియంబులన్
మరుగక నిల్పనూదినను మధ్యముఁడింద్రియపారవశ్యుఁడై

పరగినచో నికృష్టుడని పల్కగ దుర్మతినైన నన్ను నా
దరమున నెట్లుకాచెదవొ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥82॥

చ. వనకరిచిక్కె మైనసకు వాచవికిం జెడిపోయె మీను తా
వినికికిఁ జిక్కెఁ జిల్వ గనువేఁదుఱు జెందెను లేళ్ళు తావిలో
మనికినశించె దేఁటి తరమా యిరుమూఁటిని గెల్వనైదుసా
ధనములనీవె కావదగు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥83॥

చ. కరములు మీకు మ్రొక్కులిడఁ కన్నులు మిమ్మునె చూడ జిహ్వ మీ
స్మరణఁ దనర్ప వీనులు భవత్కథలన్ వినుచుండ నాస మీ
యఱుతనుబెట్టు పూసరుల కాసగొనం బరమార్థ సాధనో
త్కరమిది చేయవే కృపను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥84॥

చ. చిరతరభక్తి నొక్కతులసీదళ మర్పణ సేయువాఁడు ఖే
చరగరుడోరగ ప్రముఖసంఘములో వెలుఁగన్ సదాభవత్
స్ఫురదరవింద పాదములఁ బూజలొనర్చినవారికెల్లఁ ద
త్పర మఱచేతిధాత్రిగద దాశరథీ! కరుణాపయోనిధీ! ॥85॥

ఉ. భానుఁడు తూర్పునందు గనుపట్టినఁ బావక చంద్రతేజముల్
హీనతఁజెందినట్లు జగదేకవిరాజితమైన నీ పద
ధ్యానముచేయుచున్నఁ బరదైవమరీచులడంగకుండునే
దానవ గర్వనిర్దళన దాశరథీ! కరుణాపయోనిధీ! ॥86॥

ఉ. నీ మహనీయతత్త్వ రసనిర్ణయబోధకథామృతాబ్ధిలోఁ
దామును గ్రుంకులాడక వృథా తనుకష్టముజెంది మానవుం
డీ మహిలోకతీర్థములనెల్ల మునింగిన దుర్వికార హృ
త్తామసపంకముల్ విడునె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥87॥

ఉ. కాంచన వస్తుసంకలిత కల్మషమగ్నిపుటంబు బెట్టి వా
రించినరీతి నాత్మనిగిడించిన దుష్కర దుర్మలత్రయం
బంచిత భక్తియోగ దహనార్చిఁ దగుల్పక పాయునే కన
త్కాంచనకుండలాభరణ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥88॥

ఉ. నీ సతి పెక్కుగల్ములిడ నేర్పరి లోక మకల్మషంబుగా
నీ సుత సేయు పావనము నిర్మితి కార్యధురీణదక్షుఁడై

నీ సుతుఁడిచ్చు నాయువులు నిన్ను భజించినఁ గల్గకుండునే
దాసుల కీప్సితార్థములు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥89॥

ఉ. వారిజపత్రమందిడిన వారివిధంబున వర్తనీయమం
దారయ రొంపిలోన దనువంటని కుమ్మర పుర్వురీతి సం
సారమునన్ మెలంగుచు విచారగుఁడై పరమొందుగాదె స
త్కారమెఱింగి మానవుఁడు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥90॥

ఉ. ఎక్కడి తల్లితండ్రి సుతులెక్కడివారు కళత్రబాంధవం
బెక్కడ జీవుఁడెట్టి తనువెత్తినఁ బుట్టుచుఁ బోవుచున్నవాఁ
డొక్కఁడె పాపపుణ్యఫల మొందిననొక్కడె కానరాఁడు వే
ఱొక్కఁడు వెంటనంటిభవ మొల్లనయా కృపఁజూడవయ్య నీ
టక్కరి మాయలందిడక దాశరథీ! కరుణాపయోనిధీ! ॥91॥

ఉ. దొరసిన కాయముల్మదిమి తోచినఁజూచి ప్రభుత్వముల్సిరుల్
మెఱపులుగాగజూచి మఱి మేదినిలోఁ దమతోడివారు ముం
దరుగుటచూచి చూచి తెగునాయువెఱుంగక మోహపాశము
ల్దరుఁగని వారికేమి గతి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥92॥

చ. సిరిగలనాఁడు మైమఱచి చిక్కిననాఁడు దలంచి పుణ్యముల్
పొరిఁబొరి సేయనైతినని పొక్కినఁగల్గునె గాలిచిచ్చుపైఁ
గెరలినవేళఁ దప్పికొని కీడ్పడువేళ జలంబుగోరి త
త్తరమునఁ ద్రవ్వినంగలదె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥93॥

ఉ. జీవనమింకఁ బంకమునఁ జిక్కినమీను చలింపకెంతయున్
దావుననిల్చి జీవనమె దద్దయుఁ గోరువిధంబు చొప్పడం
దావలఁమైనగాని గుఱి దప్పనివాఁడు తరించువాఁడయా
తావకభక్తియోగమున దాశరథీ! కరుణాపయోనిధీ! ॥94॥

చ. సరసుని మానసంబు సరసజ్ఞుఁడెఱుంగును ముష్కరాధముం
డెఱిఁగి గ్రహించువాడె కొలనేక నివాసముఁగాగ దర్దురం
బరయఁగ నేర్చునెట్లు వికచాబ్జమరంద రసైక సౌరభో
త్కరము మిళిందమొందు క్రియ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥95॥

ఉ. నోచిన తల్లితండ్రికిఁ దనూభవుఁడొక్కడె చాలు మేటి చే
చాఁచనివాఁడు వేఱొకఁడు చాచిన లేదనకిచ్చువాఁడు నో
రాఁచి నిజంబకాని పలుకాడనివాఁడు రణంబులోన మేన్
దాఁచనివాఁడు భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! ॥96॥

ఉ. "శ్రీయుత జానకీరమణ చిన్మయరూప రమేశరామ నా
రాయణ పాహిపాహి"యని బ్రస్తుతిఁ జేసితి నా మనంబునం
బాయక కిల్బిష వ్రజ విపాటనమందఁగజేసి సత్కళా
దాయి ఫలంబు నాకియవె దాశరథీ! కరుణాపయోనిధీ! ॥97॥

ఉ. ఎంతటి పుణ్యమో శబరి యెంగిలిగొంటివి వింతగాదె నీ
మంతనమెట్టిదో యుడుతమైని కరాగ్ర నఖాంకురంబులన్
సంతసమందఁజేసితివి సత్కులజన్మమ దేమిలెక్క వే
దాంతముగాదె నీ మహిమ దాశరథీ! కరుణాపయోనిధీ! ॥98॥

ఉ. బొంకనివాఁడె యోగ్యుఁ డరిబృందము లెత్తినచోటఁ జివ్వకుం
జంకనివాఁడె జోదు రభసంబున నర్థికరంబు సాఁచినం
గొంకనివాఁడె దాత మిముఁ గొల్చి భజించినవాఁడె పో నిరా
తంకమనస్కుఁడెన్నగను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥99॥

చ. భ్రమరము గీటకంబుఁగొని పాల్పడి ఝాంకరణోపకారియై
భ్రమరముగా నొనర్చునని పల్కుటఁజేసి భవాది దుఃఖసం
తమసమెడల్చి భక్తి సహితంబుగ జీవుని విశ్వరూప త
త్త్వమును ధరించుటేమరుదు దాశరథీ! కరుణాపయోనిధీ! ॥100॥

చ. తరువులు పూచి కాయలగు దత్కుసుమంబులు పూజగా భవ
చ్చరణము సోఁకి దానులకు సారములౌ ధనధాన్యరాసులై
కరిభట ఘోటకాంబర నికాయములై విరజానదీసము
త్తరణ మొనర్చుఁజిత్రమిది దాశరథీ! కరుణాపయోనిధీ! ॥101॥

ఉ. పట్టితి భట్టరార్యగురు పాదములిమ్మెయి నూర్ధ్వపుండ్రముల్
వెట్టితి మంత్రరాజ మొడబెట్టితి నయ్యమకింకరాళికిం
గట్టితి బొమ్మ మీ చరణ కంజములందుఁ దలంపుపెట్టి బో
దట్టితిఁ బాపపుంజముల దాశరథీ! కరుణాపయోనిధీ! ॥102॥

ఉ. అల్లన లింగమంత్రిసుతుఁ డత్రిజ గోత్రజుఁడాదిశాఖ కం
చెర్లకులోద్భవుండనఁ బ్రసిద్ధుఁడనై భవదంకితంబుగా
నెల్లకవుల్ నుతింప రచియించితి గోపకవీంద్రుఁడన్ జగ
ద్వల్లభ నీకు దాసుఁడను దాశరథీ! కరుణాపయోనిధీ! ॥103॥

సుమతీ శతకము

బద్దెన

క. శ్రీ రాముని దయ చేతను
నారూఢిగ సకల జనులు నౌరా యనఁగా
ధారాళమైన నీతులు
నోరూఁరఁగ జవులు పుట్ట నుడివెద సుమతీ! ॥1॥

క. అక్కఱకు రాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమునఁ దా
నెక్కినఁ బాఱని గుఱ్ఱము
గ్రక్కున విడువంగ వలయుఁ గదరా సుమతీ ! ॥2॥

క. అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను గొల్చి మిడుకుట కంటెన్
వడి గల యెద్దులఁ గట్టుక
మడి దున్నుక బ్రతుక వచ్చు మహిలో సుమతీ! ॥3॥

క. అడియాస కొలువుఁ గొలువకు
గుడిమణియము సేయఁబోకు, కుజనులతోడన్
విడువక కూరిమి సేయకు
మడవినిఁ దోడరయ కొంటి నరుగకు సుమతీ! ॥4॥

క. అధరము గదలియుఁ గదలక
మధురములగు భాషలుడిగి మౌనవ్రతుఁడౌ
నధికార రోగపూరిత
బధిరాంధక శవముఁ జూడఁ బాపము సుమతీ! ॥5॥

క. అప్పుగొని చేయు విభవము
ముప్పునఁ బ్రాయంపుటాలు మూర్ఖుని తపమున్

దప్పరయని నృపురాజ్యము
దెప్పరమై మీఁదఁ గీడు దెచ్చుర సుమతీ! ॥6॥

క. అప్పిచ్చు వాఁడు వైద్యుఁడు
నెప్పుడు నెడతెగక పాఱు నేఱును ద్విజుఁడున్
జొప్పడిన యూర నుండుము
చొప్పడ కున్నట్టి యూరుఁ జొరకుము సుమతీ! ॥7॥

క. అల్లుని మంచితనంబును
గొల్లని సాహిత్యవిద్య కోమలి నిజమున్
బొల్లున దంచిన బియ్యముఁ
దెల్లని కాకులును లేవు తెలియర సుమతీ! ॥8॥

క. ఆఁకొన్న కూడె యమృతము
తాఁకొంకక నిచ్చు వాఁడె దాత ధరిత్రిన్
సోఁకోర్చు వాఁడె మనుజుఁడు
తేఁకువ కల వాఁడె వంశతిలకుఁడు సుమతీ! ॥9॥

క. ఆఁకలి యుడుగని కుడుపును
వేఁకటియగు లంజ పడుపు విడువని బ్రతుకున్
బ్రాఁకొన్న నూతి యుదకము
మేఁకల పాఁడియును రోత మేదిని సుమతీ! ॥10॥

క. ఇచ్చునదె విద్య రణమునఁ
జొచ్చునదే మగతనంబు సుకవీశ్వరులున్
మెచ్చునదె నేర్పు, వాదుకు
వచ్చునదే కీడు సుమ్ము వసుధను సుమతీ! ॥11॥

క. ఇమ్ముగఁ జదువని నోరును
'నమ్మా' యని పిలిచి యన్న మడుగని నోరున్
దమ్ములఁ బిలువని నోరును
గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ! ॥12॥

క. ఉడుముండదె నూఱేండ్లును
బడియుండదె పేర్మిఁ బాము పదినూఱేండ్లున్

మడువునఁ గొక్కెర యుండదె
కడు నిలఁ బురుషార్థపరుఁడు గావలె సుమతీ! ॥13॥

క. ఉత్తమ గుణములు నీచున
కెత్తెఱఁగున గలుగ నేర్చు నెయ్యెడలం దా
నెత్తిచ్చి కఱఁగి పోసిన
నిత్తడి బంగారమగునె యిలలో సుమతీ! ॥14॥

క. ఉదకము ద్రావెడు హయమును
మదమున నుప్పొంగుచుండు మత్తేభంబున్
మొదవు కడనున్న వృషభముఁ
జదువని యా నీచుఁ జేరఁ జనకుర సుమతీ! ॥15॥

క. ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాఁడు నేర్పరి సుమతీ! ॥16॥

క. ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడనెడను జెఱకు కైవడి నేపో
నెపములు వెదకును గడపటఁ
గపటపు దుర్జాతి పొందు గదరా సుమతీ! ॥17॥

క. ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాఁడు ధన్యుడు సుమతీ! ॥18॥

క. ఎప్పుడుఁ దప్పులు వెదకెడు
నప్పురుషునిఁ గొల్వఁగూడ దది యెట్లన్నన్
సర్పంబు పడగ నీడను
గప్ప వసించిన విధంబు గదరా సుమతీ! ॥19॥

క. ఎప్పుడు సంపద కలిగిన
నప్పుడె బంధువులు వత్తురది యెట్లన్నన్

దెప్పలుగఁ జెఱువు నిండినఁ
గప్పలు పదివేలు చేరుఁగదరా సుమతీ! ॥20॥

క. ఏఱుకుమీ కసుగాయలు
దూఱుకుమీ బంధుజనుల దోషము సుమ్మీ
పాఱుకుమీ రణమందున
మీఱుకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ! ॥21॥

క. ఒకయూరికి నొక కరణము
నొక తీర్పరియైనఁ గాక నొగిఁ దఱుచైనన్
గకవికలు గాకయుండునె
సకలంబును గొట్టువడక సహజము సుమతీ! ॥22॥

క. ఒల్లని సతి నొల్లని పతి
నొల్లని చెలికాని విడువ నొల్లని వాఁడే
గొల్లండు కాక ధరలో
గొల్లండును గొల్లఁడౌనె గుణమున సుమతీ! ॥23॥

క. ఓడల బండ్లును వచ్చును
ఓడలు నాబండ్లమీఁద నొప్పుగ వచ్చున్
ఓడలు బండ్లును వలెనే
వాడంబడుఁ గలిమి లేమి వసుధను సుమతీ! ॥24॥

క. కడు బలవంతుండైనను
బుడమినిఁ బ్రాయంపుటాలిఁ బుట్టినయింటన్
దడవుండ నిచ్చెనేనియుఁ
బడుపుగ నంగడికిఁ దానె పంపుట సుమతీ! ॥25॥

క. కనకపు సింహాసనమున
శునకముఁ గూర్చుండఁబెట్టి శుభ లగ్నమునం
దొనరఁగఁ బట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ! ॥26॥

క. కప్పకు నొరగాలైనను
సర్పమునకు రోగమైన సతి తులువైనన్

ముప్పున దరిద్రుఁడైనను
దప్పదు మఱి దుఃఖమగుట తథ్యము సుమతీ! ||27||

క. కమలములు నీటఁ బాసినఁ
గమలాప్తుని రశ్మి సోఁకి కమలిన భంగిన్
దమ తమ నెలవులు దప్పినఁ
దమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ! ||28||

క. కరణముఁ గరణము నమ్మిన
మరణాంతకమౌను గాని మనలేఁడు సుమీ
కరణము దన సరి కరణము
మఱి నమ్మక మర్మమీక మనవలె సుమతీ! ||29||

క. కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్నతిండి వికటించుఁ జుమీ
యిరుసునఁ గందెనఁ బెట్టక
పరమేశ్వరు బండియైనఁ బాఱదు సుమతీ! ||30||

క. కరణము సాధై యున్నను
గరి మదముడిఁగినను బాము గఱవకయున్నన్
ధరఁ దేలు మీటకున్నను
గర మరుదుగ లెక్కఁగొనరు గదరా సుమతీ! ||31||

క. కనుగాయఁ గఱచి చూచిన
మసలక దనయొగరు గాక మధురంబగునా?
పసగలుగు యువతు లుండఁగఁ
బసిబాలలఁ బొందువాఁడు పసరము సుమతీ! ||32||

క. కవిగాని వాని వ్రాఁతయు
నవరసభావములులేని నాతుల వలపున్
దవిలి చను పందినేయని
వివిధాయుధకౌశలంబు వృథరా సుమతీ! ||33||

క. కాదుసుమీ దుస్సంగతి
పోదుసుమీ కీర్తికాంత పొందినపిదపన్

వాదుసుమీ యప్పిచ్చుట
లేదుసుమీ సతులవలపు లేశము సుమతీ! ॥34॥

క. కాముకుఁడు దనిసి విడిచిన
కోమలిఁ బరవిటుఁడు గవయ గూడుటయెల్లన్
బ్రేమమునఁ జెఱుకుపిప్పికి
జీమలు వెన మూఁగినట్లు సిద్ధము సుమతీ! ॥35॥

క. కారణము లేని నగవును
బేరణమును లేని లేమ పృథివీస్థలిలోఁ
బూరణము లేని బూరెయు
వీరణములు లేని పెండ్లి వృథరా సుమతీ! ॥36॥

క. కులకాంత తోడనెప్పుడుఁ
గలహింపకు వట్టితప్పు ఘటియింపకుమీ
కలకంఠికంట కన్నీ
రొలికిన సిరి యింటనుంట నొల్లదు సుమతీ! ॥37॥

క. కూరిమిగల దినములలో
నేరము లెన్నఁడును గలుగ నేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచుచుండు నిక్కము సుమతీ! ॥38॥

క. కొంచెపు నరు సంగతిచే
నంచితముగఁ గీడు వచ్చు నది యెట్లన్నన్
గించిత్తు నల్లి కుట్టిన
మంచమునకుఁ జేటువచ్చు మహిలో సుమతీ! ॥39॥

క. కొక్కోకమెల్లఁ జదివినఁ
జక్కనివాఁడైన రాజ చంద్రుండైనన్
మిక్కిలి రొక్కంబీయక
చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ! ॥40॥

క. కొఱగాని కొడుకు పుట్టినఁ
గొఱగామియె కాదు తండ్రి గుణములఁ జెఱచున్

జెఱకు తుద వెన్ను పుట్టినఁ
జెఱకునఁ దీపెల్లఁ జెఱచు సిద్ధము సుమతీ! ॥41॥

క. కోమలి విశ్వాసంబును
బాములతోఁ జెలిమి యన్యభామల వలపున్
వేముల తియ్యఁదనంబును
భూమీశుల నమ్మికలును బొంకుర సుమతీ! ॥42॥

క. గడనగల మగనిఁ జూచిన
నడుగడుగున మడుఁగులిడుదు రతివలు తమలోఁ
గడనుడుగు మగనిఁ జూచిన
నడపీనుఁగు వచ్చెననుచు నగుదురు సుమతీ! ॥43॥

క. చింతింపకు గడచినపని
కింతులు వలతురని నమ్మ కెంతయు మదిలో
నంతఃపురకాంతలతో
మంతనములుమాను మిదియె మతమురా సుమతీ! ॥44॥

క. చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైనయట్లు పామరుఁడు దగన్
హేమంబుఁ గూడఁ బెట్టిన
భూమీశుల పాలఁ జేరు భువిలో సుమతీ! ॥45॥

క. చుట్టములు గాని వారలు
చుట్టములము నీ కటంచు సొంపు దలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగఁ గదరా సుమతీ! ॥46॥

క. చేతులకుఁ దొడవు దానము
భూతల నాథులకుఁ దొడవు బొంకమి ధరలో
నీతియ తొడవెవ్వారికి
నాతికి మానంబు తొడవు నయముగ సుమతీ! ॥47॥

క. తడవోర్వక యొడలోర్వక
కడువేగం బడచిపడినఁ గార్యంబగునే

తడవోర్చిన నొడలోర్చినఁ
జెడిపోయిన కార్యమెల్లఁ జేకుఱు సుమతీ! ॥48॥

క. తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌఁ
దన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ! ॥49॥

క. తన యూరి తపసితనమును
దన పుత్తుని విద్య పెంపుఁ దన సతి రూపున్
దన పెరటిచెట్టు మందును
మనసున వర్ణింపరెట్టి మనుజులు సుమతీ! ॥50॥

క. తన కలిమి యింద్ర భోగము
తన లేమియె సర్వలోక దారిద్ర్యంబున్
దన చావు జగత్ప్రళయము
తను వలచినదియె రంభ తథ్యము సుమతీ! ॥51॥

క. తన వారు లేని చోటను
జనువించుక లేని చోట జగడము చోటన్
అనుమానమైన చోటను
మనుజునకును నిలువఁదగదు మహిలో సుమతీ! ॥52॥

క. తమలము సేయని నోరును
విమతులతోఁ జెలిమిసేసి వెతఁబడు తెలివిన్
(రమణుల చనుమొనలమీఁద రాయని మేనున్)
గమలములు లేనికొలఁకును
హిమధాముఁడు లేని రాత్రి హీనము సుమతీ! ॥53॥

క. తలనుండు విషము ఫణికిని
వెలయంగాఁ దోక నుండు వృశ్చికమునకున్
తల తోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ! ॥54॥

క. తలపొడవు ధనముఁ బోసిన
వెలయాలికి నిజములేదు వివరింపఁగాఁ
దల దడవి బాసఁజేసిన
వెలయాలిని నమ్మరాదు వినరా సుమతీ! ॥55॥

క. తలమాసిన నొలుమాసిన
వలువలు మాసినను బ్రాణవల్లభునైనన్
గులకాంతలైన రోతురు
తిలకింపఁగ భూమిలోనఁ దిరముగ సుమతీ! ॥56॥

క. తాననుభవింప నర్థము
మానవపతిఁ జేరుఁ గొంత మఱి భూగతమౌఁ
గానల నీఁగలు గూర్చిన
తేనియ యొరుఁజేరునట్లు తిరముగ సుమతీ! ॥57॥

క. దగ్గఱ కొండెము చెప్పెడు
ప్రెగ్గడ పలుకులకు రాజు ప్రియుఁడై మఱి తా
నెగ్గుఁ బ్రజ కాచరించుట
బొగ్గులకై కల్పతరువుఁ బొడుచుట సుమతీ! ॥58॥

క. ధనపతి సఖుఁడై యుండియు
నెనయంగా శివుఁడు భిక్ష మెత్తఁగవలసెన్
దనవారి కెంత కలగినఁ
దనభాగ్యమె తనకుఁగాక తథ్యము సుమతీ! ॥59॥

క. ధీరులకుఁ జేయు మేలది
సారంబగు నారికేళ సలిలము భంగిన్
గౌరవమును మఱి మీఁదట
భూరి సుఖావహము నగును భువిలో సుమతీ! ॥60॥

క. నడువకుమీ తెరువొక్కటఁ
గుడువకుమీ శత్రునింటఁ గూరిమి తోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరుల మనసు నొవ్వఁగ సుమతీ! ॥61॥

క. నమ్మకు సుంకరి జూదరి
నమ్మకు మగసాలివాని నటు వెలయాలిన్
నమ్మకు మంగడివానిని
నమ్మకుమీ వామహస్తు నవనిని సుమతీ! ॥62॥

క. నయమునఁ బాలుం ద్రావరు
భయమున విషమ్మునైన భక్షింతురుగా
నయమెంత దోసకారియొ
భయమే చూపంగ వలయు బాగుగ సుమతీ! ॥63॥

క. నరపతులు మేరఁ దప్పినఁ
దిర మొప్పగ విధవ యింటఁ దీర్పరియైనన్
గరణము వైదికుఁడయినను
మరణాంతకమౌను గాని మానదు సుమతీ! ॥64॥

క. నవరస భావాలంకృత
కవితా గోష్ఠియును మధుర గానంబును దా
నవివేకి కెంతఁ జెప్పినఁ
జెవిటికి సంకూదినట్లు సిద్ధము సుమతీ! ॥65॥

క. నవ్వకుమీ సభ లోపల
నవ్వకుమీ తల్లిదండ్రి నాథుల తోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ! ॥66॥

క. నీరే ప్రాణాధారము
నోరే రసభరితమైన నుడువులకెల్లన్
నారియె నరులకు రత్నము
చీరయె శృంగారమండ్రు సిద్ధము సుమతీ! ॥67॥

క. పగ వలదెవ్వరి తోడను
వగవంగా వలదు లేమి వచ్చిన పిదపన్
దెగనాడవలదు సభలను
మగువకు మనసీయవలదు మహిలో సుమతీ! ॥68॥

క. పతికడకుఁ దన్నుగూర్చిన
సతికడకును వేల్పుకడకు సద్గురుకడకున్
సుతుకడకు రిత్తచేతుల
మతిమంతులు చనరు నీతి మార్గము సుమతీ! ॥69॥

క. పనిచేయు నెడల దాసియు
ననుభవమున రంభ మంత్రి యాలోచనలన్
దన భుక్తియెడలఁ దల్లియు
ననఁ దన కులకాంత యుండ నగురా సుమతీ! ॥70॥

క. పరనారీసోదరుఁడై
పరధనముల కాసపడక పరులకు హితుఁడై
పరులు దనుఁ బొగడ నెగడియు
పరులలిగిన నలుగనతఁడు పరముఁడు సుమతీ! ॥71॥

క. పరసతి కూటమిఁ గోరకు
పరధనముల కాసపడకు పరునెంచకుమీ
సరిగాని గోష్ఠి సేయకు
సిరి చెడిఁ జుట్టంబుకడకుఁ జేరకు సుమతీ! ॥72॥

క. పరసతుల గోష్ఠినుండిన
పురుషుడు గాంగేయుఁడైన భువి నిందబడున్
బరసతి సుశీలయైనను
బరుసంగతి నున్న నిందపాలగు సుమతీ!॥73॥

క. పరు నాత్మఁ దలఁచు సతి విడు
మఱుమాటలు పలుకు సుతుల మన్నింపకుమీ
వెఱపెఱుఁగని భటు నేలకు
తఱచుగ సతిఁ గవయఁబోకు తగదుర సుమతీ! ॥74॥

క. పరుల కనిష్టము సెప్పకు
పొరుగిండ్లకుఁ బనులులేక పోవకుమెపుడున్
బరుఁ గవిసిన సతి గవయకు
మెఱిఁగియు బిరుసైన హయమునెక్కకు సుమతీ! ॥75॥

క. పర్వముల సతులఁ గవయకు
ముర్వీశ్వరు కరుణ నమ్మి యుబ్బకు మదిలో
గర్వింప నాలిఁ బెంచకు
నిర్వహణము లేనిచోట నిలువకు సుమతీ! ॥76॥

క. పలు దోమి సేయు విడియము
తల గడిగిన నాఁటినిద్ర తరుణుల తోడన్
బొల యలుక నాఁటి కూటమి
వెల యింతని చెప్పరాదు వినురా సుమతీ! ॥77॥

క. పాటెఱుగని పతికొలువును
గూటంబున కెఱుకపడని కోమలి రతియున్
బేఁటెత్తఁజేయు చెలిమియు
నేటికి నెదురీఁదినట్టు లెన్నర సుమతీ! ॥78॥

క. పాలను గలసిన జలమును
బాల విధంబుననె యుండుఁ బరికింపంగాఁ
బాల చవిఁ జెఱుచుఁ గావున
బాలసుఁడగువాని పొందు వలదుర సుమతీ! ॥79॥

క. పాలసునకైన యాపద
జాలింబడి తీర్పఁదగదు సర్వజ్ఞునకున్
దేలగ్నిఁ బఁడగఁ బట్టిన
మేలెఱుఁగునె మీటుఁగాక మేదిని సుమతీ! ॥80॥

క. పిలువని పనులకుఁ బోవుట
కలయని సతిరతియు రాజుగానని కొలువున్
బిలువని పేరంటంబును
వలవని చెలిమియును జేయవలదుర సుమతీ! ॥81॥

క. పురికిని బ్రాణము కోమటి
వరికిని బ్రాణంబు నీరు వసుమతి లోనన్
గరికిని బ్రాణము తొండము
సిరికిని బ్రాణంబు మగువ సిద్ధము సుమతీ! ॥82॥

క. పులిపాలు తెచ్చి యిచ్చిన
నలవడఁగ గుండెగోసి యఱచే నిడినన్
దల పొడుగు ధనముఁ బోసిన
వెలయాలికిఁ గూర్మి లేదు వినురా సుమతీ! ॥83॥

క. పెట్టిన దినములలోపల
నట్టడవులకైన వచ్చు నానార్థములున్
బెట్టని దినములఁ గనకపు
గట్టెక్కిన నేమి లేదు గదరా సుమతీ! ॥84॥

క. పొరుగునఁ బగవాఁడుండిన
నిరవొందఁగ వ్రాఁతగాఁడె యేలికయైనన్
ధరఁ గాఁపు కొండెమాడినఁ
గరణాలకు బ్రతుకులేదు గదరా సుమతీ! ॥85॥

క. బంగారు కుదువఁ బెట్టకు
సంగరమునఁ బాఱిపోకు సరసుఁడవైనన్
నంగడి వెచ్చము లాడకు
వెంగలితోఁ జెలిమి వలదు వినురా సుమతీ! ॥86॥

క. బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలి చీమల చేతఁ జిక్కి చావదె సుమతీ! ॥87॥

క. మండలపతి సముఖంబున
మెండైన ప్రధానిలేక మెలఁగుట యెల్లన్
గొండంత మదపుటేనుఁగు
తొండము లేకుండినట్లు దోఁచుర సుమతీ! ॥88॥

క. మంత్రిగలవాని రాజ్యము
తంత్రము చెడకుండ నిలచుఁ దఱచుగ ధరలో
మంత్రివిహీనుని రాజ్యము
జంత్రపుఁ గీలూడినట్లు జరుగదు సుమతీ! ॥89॥

క. మాటకుఁ బ్రాణము సత్యము
కోటకుఁ బ్రాణంబు సుభటకోటి ధరిత్రిన్
బోటికిఁ బ్రాణము మానము
చీటికిఁ బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ! ॥90॥

క. మానఘనుఁ డాత్మధృతిఁ జెడి
హీనుండగువాని నాశ్రయించుట యెల్లన్
మానెఁడు జలములలోపల
నేనుఁగు మెయి దాఁచినట్టు లెఱుగుము సుమతీ! ॥91॥

క. రాపొమ్మని పిలువని యా
భూపాలునిఁ గొల్వ భుక్తి ముక్తులు గలవే?
దీపంబు లేని యింటను
జేపుణికిళ్ళాడినట్లు సిద్ధము సుమతీ! ॥92॥

క. రూపించి పలికి బొంకకు
ప్రాపగు చుట్టంబు నెగ్గు పలుకకు మదిలోఁ
గోపించు రాజుఁ గొల్వకు
పాపపు దేశంబు సొరకు పదిలము సుమతీ! ॥93॥

క. లావు గలవాని కంటెను
భావింపఁగ నీతిపరుఁడు బలవంతుఁడౌ
గ్రావంబంత గజంబును
మావటివాఁడెక్కినట్లు మహిలో సుమతీ! ॥94॥

క. వఱదైన చేను దున్నకు
కఱవైనను బంధుజనుల కడ కేఁగకుమీ
పరులకు మర్మము సెప్పకు
పిఱికికి దళవాయితనముఁ బెట్టకు సుమతీ! ॥95॥

క. వరిపంట లేని యూరును
దొరయుండని యూరు తోడు దొరకని తెరువున్
ధరను బతిలేని గృహమును
నరయంగా రుద్రభూమి యనఁదగు సుమతీ! ॥96॥

క. వినఁదగు నెవ్వరు సెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
గని కల్ల నిజముఁ దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ! ॥97॥

క. వీడెము సేయని నోరును
జేడెల యధరామృతంబుఁ జెందని నోరున్
బాడంగరాని నోరును
బూడిద కిరవైన పాడు బొందర సుమతీ. ॥98॥

క. వెలయాలివలనఁ గూరిమి
గలుగదు మఱిఁ గలిగెనేని కడతేరదుగా
పలువురు నడిచెడు తెరువునఁ
బులు మొలవదు మొలిచెనేని బొదలదు సుమతీ! ॥99॥

క. శుభముల నొందని చదువును
నభినయమును రాగరసము నందని పాటల్
అభిలాష లేని కూటమి
సభమెచ్చని మాటలెల్లఁ జప్పన సుమతీ! ॥100॥

క. సరసము విరసము కొఱకే
పరిపూర్ణసుఖంబు లధిక బాధల కొఱకే
పెరుఁగుట విరుఁగుట కొఱకే
ధరతగ్గుట హెచ్చుకొఱకె తథ్యము సుమతీ. ॥101॥

క. మేలెంచని మాలిన్యుని
మాలను నగసాలివాని మంగలి హితుగా
నేలిన నరపతి రాజ్యము
నేలఁ గలసిపోవుఁగాని నెగడదు సుమతీ. ॥102॥

క. స్త్రీలయెడ వాదులాడకు
బాలురతోఁ జెలిమి సేసి భాషింపకుమీ
మేలైన గుణము విడువకు
యేలినపతి నిందసేయ కెన్నఁడు సుమతీ. ॥103॥

క. సిరిదా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్
సిరి దాఁ బోయిన బోవును
కరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ. ॥104॥

క. మది నొకని వలచియుండఁగ
మది చెడి యొక క్రూరవిటుఁడు మానక తిరుగున్
అది చిలుకఁ బిల్లిపట్టినఁ
జదువునె యాపంజరమున జగతిని సుమతీ. ॥105॥

క. పుత్త్రోత్సాహము తండ్రికి
బుత్తుఁడు జన్మించినపుడే పుట్టదు జను లా
పుత్త్రునిఁ గనుఁగొని పొగడఁగఁ
బుత్త్రోత్సాహంబు నాఁడు పొందుర సుమతీ. ॥106॥

క. వెలయాలు సేయు బాసలు
వెలయఁగ నగసాలిపొందు వెలమల చెలిమియున్
గలలోనఁ గన్న కలిమియు
విలసితముగ నమ్మరాదు వినురా సుమతీ. ॥107॥

క. వేసరఁపు జాతి గానీ
వీసముఁ దాఁ జేయనట్టి వెంగలి గానీ
దాసికొడుకైనఁ గానీ
కాసులు గలవాఁడె రాజు గదరా సుమతీ. ॥108॥

భాస్కర శతకము

మారవి వెంకయ్య

ఉ. శ్రీగల భాగ్యశాలి కడఁజేరఁగ వత్తురు తారు దారె దూ
రాగమన ప్రయాసమున కాదట నోర్చియునైన నిల్వ ను
ద్యోగము చేసి; రత్ననిలయుండని కాదె సమస్తవాహినుల్
సాగరుఁ జేరుటెల్ల ముని సన్నుత! మద్గురుమూర్తి! భాస్కరా! ॥1॥

ఉ. అంగన నమ్మరాదు తన యంకెకు రాని మహాబలాఢ్యు వే
భంగుల మాయలొడ్డి చెఱుపం దలపెట్టు! వివేకియైన సా
రంగధరుం బదంబులు కరంబులు గోయఁగ జేసెఁ దొల్లి చి
త్రాంగి యనేకముల్ నుడువరాని కుయుక్తులు పన్ని భాస్కరా! ॥2॥

ఉ. అక్కరపాటు వచ్చు సమయంబునఁ జుట్టము లొక్కరొక్కరి
న్మక్కువ నుద్ధరించుటలు మైత్రికిఁ జూడఁగ యుక్తమే సుమీ
యొక్కట; నీటిలో మెరక నోడల బండ్లును బండ్లనోడలున్
దక్కక వచ్చుచుండుట నిదానము గాదె తలంప భాస్కరా! ॥3॥

చ. అడిగినయట్టి యాచకుల యాశలెఱుంగక లోభవర్తియై
కడపిన ధర్మదేవత యొకానొక యప్పుడు నీదు వాని కె
య్యెడల; నదెట్లు పాలు తమకిచ్చునె యెచ్చటనైన లేగలన్
గుడువఁగ నీనిచోఁ గెరలి గోవులు తన్ననుగాక భాస్కరా! ॥4॥

చ. అతిగుణహీన లోభికిఁ బదార్థము గల్గిన లేకయుండినన్
మితముగఁ గాని కల్మిగల మీఁదట నైన భుజింపఁడింపుగా
సతమని నమ్ము దేహమును సంపద; నేఱులు నిండి పాఱినన్
గతుకఁగ జూచుఁ గుక్క తన కట్టడ మీఱిక యెందు భాస్కరా! ॥5॥

చ. అదను దలంచి కూర్చి ప్రజ నాదరమొప్ప విభుండు కోరినన్
గదిసి పదార్థమిత్తురటు కానగ వేగమె కొట్టి తెండనన్

మొదటికి మోసమౌ; బొదుగు మూలముగోసినఁ బాలు గల్గునే
పిదికినఁ గాక భూమిఁ బశుబృందము నెవ్వరికైన భాస్కరా! ॥6॥

చ. అనఘుని కైనఁ జేకుఱు ననర్హునిఁ గూడి చరించునంతలో
మన మెరియంగ నప్పుడవమానము కీడు ధరిత్రియందు నే
యనువునైనఁ దప్పవు యదార్థము; తానది యెట్టులన్నచో
నినుమును గూర్చి యగ్ని నలయింపదె సమ్మెటపెట్టు భాస్కరా! ॥7॥

చ. అలఘుగుణ ప్రసిద్ధుఁడగు నట్టి ఘనుండొకఁ డిష్టుఁడై తనున్
వలచి యొకించు కేమిడినవానికి మిక్కిలి మేలుచేయుఁగా;
తెలిసి కుచేలుఁ డొక్క కొణిదెం డడుకుల్ దనకిచ్చినన్ మహా
ఫలదుఁడు కృష్ణుఁడత్యధిక భాగ్యములాతని కీఁడె? భాస్కరా! ॥8॥

చ. అవనివిభుండు నేరుపరియై చరియించినఁ గొల్చువార లె
ట్లవగుణు లైననేమి? పనులన్నియుఁ జేకుఱు వారిచేతనే;
ప్రవిమలనీతిశాలి యగు రాముని కార్యము మర్కటంబులే
తవిలి యొనర్పవే జలధి దాఁటి సురారులఁ ద్రుంచి భాస్కరా! ॥9॥

ఉ. ఆదరమింత లేక నరుఁడాత్మబలోన్నతి మంచివారికిన్
భేదము చేయుటం దనదు పేర్మికిఁ గీడగు మూలమె; ట్లమ
ర్యాద హిరణ్యపూర్వకశిపన్ దనుజుండు గుణాఢ్యుడైన ప్ర
హ్లాదున కెగ్గుచేసి ప్రళయంబును బొందఁడె మున్ను భాస్కరా! ॥10॥

ఉ. ఆరయ నెంత నేరుపరియై చరియించిన వాని దాపునన్న
గౌరవమొప్పఁగూర్చు నుపకారి మనుష్యుఁడు లేక మేలు చే
కూరదదెట్లు; హత్తుగడ గూడునె; చూడఁ బదాఱువన్నె బం
గారములోన నైన వెలిగారము కూడక యున్న భాస్కరా! ॥11॥

ఉ. ఈ క్షితినర్థకాంక్ష మదినెప్పుడు పాయక లోకులెల్ల సం
రక్షకుఁడైన సత్ప్రభుని రాకలు గోరుదు రెందుఁ; జంద్రికా
పేక్షఁ జెలంగి చంద్రుఁడుదయించు విధంబునకై చకోరపుం
బక్షులు చూడవే యెదు రపార ముదంబును బూని భాస్కరా! ॥12॥

ఉ. ఈ జగమందు దా మనుజుఁడెంత మహాత్మకుఁడైన దైవమా
తేజము తప్పఁ జూచు నెడఁ ద్రిమ్మరి కోల్పడు; నెట్లన న్మహా

రాజకుమారుఁడైన రఘురాముఁడు గాల్నడఁ గాయలాకులున్
భోజనమై తగన్వనికిఁ బోయి చరింపఁడె మున్ను భాస్కరా! ॥13॥

చ. ఉరుకరుణాయుతుండు సమయోచిత మాత్మ దలంచి యుగ్రవా
క్పురుషత జూపినన్ ఫలము గల్గుట తథ్యముగాదె; యంబుదం
బురిమినయంతనే కురియకుండునె వర్షము లోకరక్షణ
స్థిరతరపౌరుషంబున నశేషజనంబు లెఱుంగ భాస్కరా! ॥14॥

చ. ఉరుగుణవంతుఁడొడ్లు తనకొం డపకారము చేయునప్పుడుం
బరహితమే యొనర్చు నొకపట్టున నైనను గీడుఁ జేయగా నెఱు
గఁడు; నిక్కమేకద యదెట్లన? గవ్వముఁ బట్టి యంతయుం
దరువఁగఁ జొచ్చినం బెరుగుతాలిమి నీయదె వెన్న? భాస్కరా! ॥15॥

చ. ఉరుబలశాలి నంచుఁ దను నొల్లని యన్య [పతివ్రతాంగనా
సురతము గోరెనేని కడసుమ్మది భూతికిఁ బ్రాణహాని యౌ;
శిరములు గూల రాఘవునిచే దశకంఠుఁడు ద్రుంగిపోవఁడే
యెఱుఁగక సీత కాసపడి యిష్టుల భృత్యులఁ గూడి భాస్కరా! ॥16॥

ఉ. ఊరక వచ్చుఁ బాటు పడకుండిననైన ఫలం బదృష్ట మే
పారఁగఁ గల్గువానికిఁ బ్రయాసము నొందిన దేవదానవుల్
వారలటుండఁగా నడుమ వచ్చిన శౌరికిఁ గల్గెఁ గాదె స్వం
గారపుఁ బ్రోవు లక్ష్మియును గౌస్తుభరత్నము రెండు భాస్కరా! ॥17॥

ఉ. ఊరక సజ్జనుండొదిఁగి యుండిననైన దురాత్మకుండు ని
ష్కారణమోర్వలేక యపకారము చేయుట వాని విద్యగా;
చీరలు నూరుటంకములు చేసెడివైనను బెట్టె నుండఁగాఁ
జేరి చినింగిపోఁ గొఱుకు చిమ్మట కేమి ఫలంబు? భాస్కరా! ॥18॥

ఉ. ఎట్టుగఁ బాటుపడ్డ నొక యించుక ప్రాప్తము లేక వస్తువుల్
పట్టుపడంగ నేరవు; నిబద్ధి సురావళిఁ గూడి రాక్షసుల్
గట్టు పెకల్చి పాల్కడలిఁ గవ్వముచేసి మథించి రంతయున్
వెట్టియె గాక యేమనుభవించిరి వారమృతంబు భాస్కరా! ॥19॥

చ. ఎడపక దుర్జనుండొరుల కెంతయుఁ గీడొనరించుఁ గాని యే
యెడలను మేలు సేయఁడొక యించుకయైనను; జీడపుర్వు దాఁ

జెడఁ దిను నెంతెకాక పుడుసెండు జలంబిడి పెంప నేర్చునే
పొడవగుచున్న పుష్పఫల భూరుహ మొక్కటినైన భాస్కరా! ॥20॥

ఉ. ఎడ్డె మనుష్యుఁడే మెఱుఁగు నిన్నె దినంబులు గూడి యుండినన్
దొడ్డ గుణాఢ్యునందుఁ గల తోరపు వర్తనలెల్ల బ్రజ్ఞఁ బే
ర్వడ్డ వివేకి రీతి; రుచిపాకము నాలుకగా కెఱుంగునే?
తెడ్డది కూరలోఁ గలయఁ ద్రిమ్మరుచుండిననైన భాస్కరా! ॥21॥

ఉ. ఎప్పుడదృష్టతా మహిమ యించుక పాటిలు నప్పుడింపు సొం
పొప్పుచు నుండుఁగాక యది యొప్పని రూపుమాయుఁగా
నిప్పున నంటియున్న యతి నిర్మలినాగ్ని గురుప్రకాశముల్
దప్పిన నట్టి బొగ్గునకు దా నలుపెంతయుఁ బుట్టు భాస్కరా! ॥22॥

ఉ. ఏగతిఁ బాటుపడ్డఁ గలదే భువి నల్పునకున్ సమగ్రతా
భోగము భాగ్యరేఖగల పుణ్యునకుంబలె; భూరి సత్త్వసం
యోగ మదేభ కుంభయుగళోత్థిత మాంసము నక్కకూనకే
లాగు ఘటించు! సింహము దలంచినఁ జేకురు గాక భాస్కరా! ॥23॥

ఉ. ఏడ ననర్హుఁడుండు నటకేఁగు ననర్హుఁడు నర్హుఁడున్నచోఁ
జూడగఁ నొల్లడెట్లన; నశుద్ధగుణస్థితి నీఁగ పూయముం
గూడిన పుంటిపై నిలువఁ గోరిన యట్టులు నిల్వ నేర్చునే
సూడిదఁ బెట్టు నెన్నుదుటి చొక్కపుఁ గస్తురి మీఁద భాస్కరా! ॥24॥

ఉ. ఏల సమస్త విద్యల నొకించుక భాగ్యము గల్గియుండినన్
జాలు, ననేక మార్గముల సన్నుతికెక్క నదెట్లొకో యనన్
రాలకు నేడ విద్యలు తిరంబుగ దేవరరూపు చేసినన్
వ్రాలి నమస్కరించి ప్రసవంబులు పెట్టరె మీఁద భాస్కరా! ॥25॥

ఉ. ఒక్కఁడె చాలు నిశ్చల బలోన్నతుఁ డెంతటి కార్యమైనఁ దాఁ
జక్క నొనర్పఁ; గౌరవులసంఖ్యలు పట్టిన ధేనుకోటులం
జిక్కఁగనీక తత్ప్రబల సేన ననేక శిలీముఖంబులన్
మొక్కపడంగఁ జేసి తుదముట్టఁడె యొక్కకిరీటి భాస్కరా! ॥26॥

ఉ. కట్టడ దప్పి తాము చెడు కార్యముఁ జేయుచు నుండిరేని దో
బుట్టిన వారినైన విడిపోవుట కార్యము; దౌర్మదాంధ్యముం

దొట్టిన రావణాసురునితో నెడఁబాసి విభీషణాఖ్యుఁ డా
పట్టున రాముఁ జేరి చిరపట్టము గట్టుకొనండె భాస్కరా! ॥27॥

ఉ. కట్టడ యైనయట్టి నిజకర్మము చుట్టుచు వచ్చి యే గతం
బెట్టునొ పెట్టినయట్లనుభవింపక తీఱదు; కాళ్ళు మీఁదుగాఁ
గట్టుక వ్రేలుడంచుఁ దలక్రిందుగఁ గట్టిరె యెవ్వరైన నా
చెట్టున గబ్బిలంబులకుఁ జేసిన కర్మముగాక భాస్కరా! ॥28॥

ఉ. కట్టడ లేని కాలమున గాదు శుభం బొరులెంతవారు చే
పట్టిననైన మర్త్యునకు భాగ్యము రాదనుటెల్లఁ గల్లకా
దెట్టని పల్కినన్; దశరథేశ వసిష్ఠులు రామమూర్తికిన్
బట్టము కట్టఁ గోరి రది పాయక చేకుఱెనోటు భాస్కరా! ॥29॥

ఉ. కానగ చేరఁ బోలఁ డతికర్కుఁడు నమ్మిక లెన్ని చేసినం
దానది నమ్మి వానికడ డాయఁగ బోయిన హాని వచ్చు న
చ్చో నది యెట్లనం; గొఱఁకు చూపుచు నొడ్డిన బోను మేలుగా
బోనని కానకాసపడి పోవుచుఁ గూలదెఁ గొక్కు భాస్కరా! ॥30॥

ఉ. కాని ప్రయోజనంబు సమకట్టదు తా భువి నెంత విద్యవాఁ
డైనను దొడ్డరాజు కొడుకైన నదెట్లు; మహేశుపట్టి వి
ద్యానిధి సర్వవిద్యలకు, దానె గురుండు వినాయకుండు దా
నేనుఁగు రీతి నుండియు నదేమిటి కాడఁడు పెండ్లి? భాస్కరా! ॥31॥

ఉ. కామిత వస్తుసంపదలు గల్గు ఫలం బొరు లాసపడ్డచో
నేమియుఁ బెట్టఁడేని సిరి యేటికి నిష్ఫలమున్నఁ బోయినన్
బ్రామికపడ్డ; లోకులకుఁ బండగ నే మది యెండి పోవఁగా
నేమి ఫలంబు చేఁదు విడదెన్నటికైన ముసిండి భాస్కరా! ॥32॥

ఉ. కారణమైన కర్మములు కాక దిగంబడ వెన్ని గొందులం
దూఱిన నెంతవారలకుఁ; దొల్లి పరీక్షితు శాపభీతుఁడై
వారిధి నొప్పు నుప్పరిగ పైఁ బదిలంబుగ దాఁగి యుండినం
గ్రూరభుజంగ దంతహతిఁ గూలడె లోకులెఱుంగ భాస్కరా! ॥33॥

చ. కులమున నక్కడక్కడ నకుంఠిత ధార్మికుఁడొక్కఁడొక్కఁడే
కలిగెడుఁగాక పెందఱుచు గల్గగ నేరరు; చెట్టు చెట్టునన్

గలుగఁగ నేర్చునే? గొడుగు కామలు చూడఁగ నాడనాడ నిం
పలరఁగ నొక్కటొక్కటి నయంబునఁ జేకురుఁగాక భాస్కరా! ॥34॥

ఉ. క్రూర మనస్కులౌ పతులఁ గొల్చి వసించిన మంచివారికిన్
వారి గుణంబె పట్టి, చెడు వర్తన వాటిలు; మాధురీజలో
దారలు గౌతమీముఖమహానదు లంబుధిఁ గూడినంతనే
క్షారముఁ జెందవే మొదలి కట్టడ లన్నియుఁ దప్పి భాస్కరా! ॥35॥

ఉ. గిట్టుట కేడఁ గట్టడ లిఖించిన నచ్చటఁ గాని యెండుచోఁ
బుట్టదు చావు; జానువుల పున్కల నూడిచి కాశిఁ జావఁగా
ల్గట్టిన శూద్రకున్ భ్రమలఁ గప్పుచుఁ దద్విధి గుఱ్ఱమౌచు నా
పట్టునఁ గొంచు మఱ్ఱికడఁ బ్రాణము దీసెగదయ్య! భాస్కరా! ॥36॥

చ. ఘనబలసత్త్వ మచ్చుపడఁ గల్గిన వానికి హాని లేనిచోఁ
దనదగు సత్త్వమే చెరచుఁ దన్ను; నదెట్లన నీరు మిక్కిలిన్
గినుక వసించినన్ జెఱువు కట్టకు సత్వము చాలకున్నచోఁ
గనుమలు పెట్టి నట్టనడి గండి తెగంబడకున్నె భాస్కరా! ॥37॥

చ. ఘనుఁడగు నట్టివాఁడు నిజకార్య సముద్ధరణార్థమై మహిం
బనివడి యల్పమానవునిఁ బ్రార్థనఁ జేయుట తప్పుగాదుగా;
యనఘుతఁ గృష్ణజన్మమున నా వసుదేవుఁడు మీఁద టెత్తుగాఁ
గనుఁగొని గాలిగాని కడ కాళ్ళకు మ్రొక్కఁడె నాఁడు భాస్కరా! ॥38॥

చ. ఘనుఁడొకవేళ గీడ్పడిన గ్రమ్మఱ నాతని లేమిఁ బాపఁగా
గనుగొన నొక్క సత్ప్రభువుఁగాక నరాధము లోపరెందరుం;
బెనుఁ జెఱువెండినట్టి తఱిఁ బెల్లున మేఘుఁడు గాక నీటితోఁ
దనుపఁ దుషారముల్ శతశతంబులు చాలునటయ్య భాస్కరా! ॥39॥

ఉ. చంద్రకళావతంసు కృపచాలనినాఁడు మహాత్ముఁడైనఁ దా
సాంద్రవిభూతిఁ బాసి యొక జాతివిహీనునిఁ గొల్చియుంట యో
గీంద్ర నుతాంఘ్రి పద్మ మతిహీనత నొందుట కాదుగా; హరి
శ్చంద్రుఁడు వీరబాహుని నిజంబుగఁ గొల్వఁడె నాఁడు భాస్కరా! ॥40॥

ఉ. చక్కఁదలంపఁగా విధివశంబున నల్పుని చేతనైనఁ దా;
జిక్కి యవస్థలం బొరలుఁ జెప్పఁగరాని మహాబలాఢ్యుఁడున్

మిక్కిలి సత్త్వ సంపదల మీఱిన గంధగజంబు మావటిఁ
డెక్కి యదల్చి కొట్టి కుదియించిన నుండదె యోర్చి భాస్కరా! ॥41॥

చ. చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు, గుణ సంయుతులెవ్వరు మెచ్చ రెచ్చటం;
బదనుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పు లేక రుచి పుట్టఁగ నేర్చు నటయ్య భాస్కరా! ॥42॥

ఉ. చాలఁ బవిత్రవంశమున సంజనితుండగునేని యెట్టి దు
శ్శీలునినైనఁ దత్కుల విశేషముచే నొక పుణ్యుఁడెంతయుం
దాలిమి నుద్ధరించును; సుధానిధిఁ బుట్టగఁగాదె శంభుఁడా
హాలాహలానలంబు గళమందు ధరించుట పూని భాస్కరా! ॥43॥

ఉ. చేరి బలాధిపుం డెరిఁగి చెప్పిన కార్యము చేయకుండినన్
బారము ముట్టలేఁడొక నెపంబున దాఁజెడు నెట్టి ధన్యుఁడున్
బోరక పాండుపుత్రులకు భూస్థలిభాగము పెట్టుమన్న కం
సారిని గాకుచేసి చెడఁడాయెనె కౌరవభర్త భాస్కరా! ॥44॥

ఉ. చేసిన దుష్టచేష్ట నది చెప్పక నేర్పునఁ గప్పిపుచ్చి తా
మూసిన యంతటన్ బయలు ముట్టక యుండ దదెట్లు; రాగిపైఁ
బూసిన బంగరుం జెదరిపోవఁ గడంగిన నాఁడు నాటికిన్
దాసిన రాగి గానఁబడ దా జనులెల్ల రెఱుంగ భాస్కరా! ॥45॥

చ. తగిలి మదంబుచే నెదిరిఁ దన్ను నెఱుంగక దొడ్డవానితో
బగఁగొని పోరుటెల్ల నతిపామరుడై చెడుటింతెగాక తా
నెగడి జయింపనేరఁడది నిక్కము తప్పదు; ధాత్రిలోపలన్
దెగి యొక కొండతో దగరు ఢీకొని తాఁకిన నేమి భాస్కరా! ॥46॥

చ. తడవగ రాదు దుష్టగుణుఁ దత్వ మెఱుంగక యెవ్వరైన నా
చెడుగుణ మిట్లు వల్వదని చెప్పిన గ్రక్కున గోపచిత్తుఁడై
కడుఁ దెఁగఁ జూచుఁగా; మఱుగఁ గాగిన తైలము నీటిబొట్టుపై
బడునెడ నాక్షణంబెగసి భగ్గున మండక యున్నె భాస్కరా! ॥47॥

చ. తనకు ఫలంబు లేదని యెదం దలపోయఁడు కీర్తి గోరు నా
ఘన గుణశాలి లోకహిత కార్యము మిక్కిలి భారమైన మే

లనుకొని పూను; శేషుఁడు సహస్ర ముఖంబుల గాలి గ్రోలి తా
ననిశము మోవఁడే మఱి మహాభరమైన ధరిత్రి భాస్కరా! ॥48॥

చ. తనకు నదృష్టరేఖ విశదంబుగఁ గల్గిన గాని లేనిచో
జనునకు నెయ్యెడన్ బరుల సంపదవల్ల ఫలంబు లేదుగా;
కనుగవ లెస్సఁగా దెలివి గల్గిన వారికి గాక గ్రుడ్డికిన్
కనఁబడు నెట్లు వెన్నెలలుఁ గాయగ నందొక రూపు భాస్కరా! ॥49॥

ఉ. తాలిమితోడుతం దగవు దప్పక నేర్పరి యొప్పుదప్పులం
బాలన సేయఁ గాకట నుపాయ విహీనుఁడు సేయనేర్చునే?
పాలను నీరు వేఱు పరుపంగ మరాళ మెఱుంగుఁగాని మా
ర్జాలమెఱుంగునే తదురు చారురసజ్ఞత బూన భాస్కరా! ॥50॥

ఉ. తాలిమితోడ గూరిమిఁ గృతఘ్నునకెయ్యెడ నుత్తమోత్తముల్
మేలొనరించినన్ గుణము మిక్కిలి కీడగుఁ, బాముపిల్లకున్
బాలిడి పెంచిన న్విషము పాయఁగ నేర్చునె దాని కోఱలం
జాలఁగ నంతకంత కొక చాయను, హెచ్చును గాక భాస్కరా! ॥51॥

చ. తెలియని కార్యమెల్లఁ గడతేర్చుట కొక్క వివేకిఁ జేకొనన్
వలయు నటైన దిద్దుకొనవచ్చు ప్రయోజన మాంద్య మేమియుం
గలగదు; ఫాలమందుఁ దిలకం బిడునప్పుడు చేత నద్దముం
గలిగినఁ జక్కఁ జేసికొనుఁ గాదె నరుండది చూచి భాస్కరా! ॥52॥

ఉ. దక్షుడు లేని యింటికిఁ బదార్థము వేఱొక చోటనుండి వే
లక్షలు వచ్చుచుండినఁ బలాయనమై చనుఁ, గల్ల గాదు ప్ర
త్యక్షము; వాగులున్ వఱదలన్నియు వచ్చిన నీరు నిల్చునే
అక్షయమైన గండి తెగినట్టి తటాకములోన భాస్కరా! ॥53॥

ఉ. దానపరోపకారగుణ ధన్యత చిత్తములోన నెప్పుడున్
లేని వివేకశూన్యునకు లేములు వచ్చినవేల సంపదల్
పూనినవేళ నొక్కసరి పోలును; జీఁకున కర్ధరాత్రియం
దైననదేమి పట్టపగలైన నదేమియు లేదు భాస్కరా! ॥54॥

ఉ. దానము సేయఁ గోరిన వదాన్యున కీయఁగ శక్తి లేనిచో
నైనఁ బరోపకారమునకై యొక దిక్కునఁ దెచ్చి యైన నీఁ

బూనును; మేఘుడంబుధికిఁ బోయి జలంబులఁ దెచ్చి యీయఁడే
వాన సమస్త జీవులకు వాంఛిత మింపెసలార భాస్కరా! ॥55॥

ఉ. దానముఁ జేయనేరని యధార్మికు సంపద యుండి యుండియున్
దానె పలాయనంబగుట తథ్యము; బూరుగు మ్రాను గాచినన్,
దాని ఫలంబులూరక వృథాపడిపోవవె యెండి గాలిచేఁ
గానలలోన నేమిటికిఁగాక, యభోజ్యములౌట భాస్కరా! ॥56॥

చ. నడవక చిక్కిలేమి యగునాఁడు నిజోదర పోషణార్థమై
యడిగి భుజించుటల్ నరుల కారయ వ్యంగ్యముకాదు; పాండవుల్
గడు బలశాలులేవురు నఖండవిభూతిఁ దొలంగి భైక్ష్యముల్
గుడువరె యేకచక్రపురిఁ గుంతియుఁ దారొకచోట భాస్కరా! ॥57॥

చ. నుడువుల నేర్పు చాలని మనుష్యుఁడెఱుంగక తప్పనాడినం
గడుఁ గృపతోఁ జెలంగుదురు కాని యదల్పరు తజ్ఞులెల్లఁ; ద
ప్పటడుగులు వెట్టుచు న్నడుచునప్పుడు బాలుని ముద్దు చేయఁగా
దొడుగుదు రింతెకాని పడఁద్రోయుదురే యెవరైన భాస్కరా! ॥58॥

ఉ. నేరిచి బుద్ధిమంతుఁడతి నీతివివేకము దెల్పినం జెడం
గారణమున్నవాని కది కైకొనఁగూడదు నిక్కమే; దురా
చారుఁడు రావణాసురుఁడసహ్యమునొందఁడె చేటుకాలముం
జేరువయైననాఁడు నిరసించి విభీషణు బుద్ధి భాస్కరా! ॥59॥

చ. నొగిలిన వేళ నెంతటి ఘనుండును దన్నొక రొక్క నేర్పుతో
నగపడి ప్రోదిసేయక తనంతట బల్మికిరాడు నిక్కమే;
జగమున నగ్నియైనఁ గడు సన్నగిలంబడియున్న, నింధనం
బెగయగఁ ద్రోచి యూదక మఱెట్లు రవుల్కొన నేర్చు భాస్కరా! ॥60॥

ఉ. పండితులైనవారు దిగువం దగనుండగ, నల్పుఁ డొక్కడు
ద్ధండతఁ బీఠమెక్కిన బుధ ప్రకరంబులకేమి యెగ్గగున్;
కొండొకకోతిఁ జెట్టు కొనకొమ్మల నుండగ, గ్రింద గండ భే
రుండ మదేభ సింహనికురంబములుండవె చేరి భాస్కరా! ॥61॥

ఉ. పట్టుగ నిక్కుచున్ మదముఁ బట్టి మహాత్ములఁ దూలనాడినం
బట్టిన కార్యముల్ చెడును బ్రాణముపోవు నిరర్థదోషముల్

పుట్టు, మహేశుఁ గాదని కుబుద్ధి నొనర్చిన యజ్ఞ తంత్రముల్
ముట్టక పోయి దక్షునికి మోసము వచ్చెఁగదయ్య భాస్కరా! ॥62॥

చ. పరహితమైన కార్య మతిభారము తోడిదియైనఁ బూను స
త్పురుషుఁడు లోకముల్పొగడఁ బూర్వమునందొక జాలవర్షమున్
గురియఁగ జొచ్చినన్ గదిసి గొబ్బున గోజనరక్షణార్థమై
గిరినొక కేల నెత్తెనట కృష్ణుఁడు ఛత్రము భాతి భాస్కరా! ॥63॥

చ. పలుచని హీనమానవుఁడు పాటిఁదలంపక నిష్ఠురోక్తులం
బలుకుచు నుండుఁగాని, మతి భాసురుఁడైన గుణప్రపూర్ణుఁడ
ప్పలుకులఁ బల్కఁబోవఁడు నిబద్ధిగ నెట్లన; వెల్తికుండఁ దా
దొలకుచునుండుఁ గాని మఱితొల్కునె నిండుఘటంబు భాస్కరా! ॥64॥

చ. పలుమఱు సజ్జనుండు ప్రియభాషలె పల్కుఁ గఠోరవాక్యముల్
బలుకఁడొకానొకప్పుడు నవి పల్కినన్ఁ గీడును గాదు నిక్కమే;
చలువకు వచ్చి మేఘుఁడొక జాడను దా వడగండ్ల రాల్చినన్
శిలలగు నోటు వేగిరమె శీతలనీరము గాక భాస్కరా! ॥65॥

ఉ. పాపపుఁ ద్రోవవాని కొకపట్టున మేను వికాసమొందినన్
లోపల దుర్గుణంబె ప్రబలుం గద! నమ్మగఁ గూడ దాతనిన్;
బాపటకాయకున్ నునుపు పైపయి గల్గినఁ గల్గుగాక యే
రూపున దానిలోఁగల విరుద్ధపుఁ జేదు నశించు భాస్కరా! ॥66॥

ఉ. పూనిన భాగ్యరేఖ చెడిపోయిన పిమ్మట నెట్టిమానవుం
డైనను వాని నెవ్వరుఁ బ్రియంబునఁ బల్కరు పిల్వరెచ్చటం
దానది యెట్లొకో యనినఁ దథ్యము పుష్పమువాడి వాసనా
హీనత నొంది యున్న యెడ నెవ్వరు ముట్టుదురయ్య భాస్కరా! ॥67॥

ఉ. పూరిత సద్గుణంబు గల పుణ్యున కించుక రూప సంపదల్
దూరములైన వాని యెడ దొడ్డగఁ జూతురు బుద్ధిమంతు లె
ట్లారయ; గొగ్గులైన మఱి యందుల మాధురి చూచి కాదె ఖ
ర్జూర ఫలంబులం ప్రియము చొప్పడ లోకులు గొంట భాస్కరా! ॥68॥

ఉ. ప్రల్లదనంబుచే నెఱుక పాటొక యింతయులేక యెచ్చటన్
బల్లిదుఁడైన సత్ప్రభు నబద్ధములాడినఁ గ్రుంగిపోదు; రె

ట్లల్ల సభాస్థలిం గుమతులై శిశుపాలుఁడు దంతవక్త్రుఁడుం
గల్లలు గృష్ణునుం బలికి కాదె హతంబగుటెల్ల భాస్కరా! ॥69॥

ఉ. ప్రేమను గూర్చి యల్పునకుఁ బెద్దతనంబును దొడ్డవానికిం
దా మతితుచ్ఛపుంబని నెదం బరికింపగ యీయరాదుగా
వామకరంబుతోడఁ గడువం గుడిచేత నపానమార్గముం
దోమఁగ వచ్చునే మిగులఁ దోఁచని చేఁతగు గాక భాస్కరా! ॥70॥

చ. ఫలమతి సూక్ష్మమైనను నృపాలుడు మంచిగుణాఢ్యుడైనచో
నెలమి వివేకులాతని కపేక్షయొనర్తు; రదెట్లు చంద్రికా
విలసనమైనఁ దా మనుభవింపఁ జకోరము లాసఁ జేరవే
చలువ గలట్టివాఁడగుటఁ జందురు నెంతయుఁ గోరి భాస్కరా! ॥71॥

ఉ. బంధుర సద్గుణాఖ్యుఁ డొక పట్టున లంపట నొందియైన దు
స్సంధిఁ దలంపఁ డన్యులకుఁ జాల హితం బొనరించుఁ గాక, శ్రీ
గంధపుఁ జెక్క రాగిలిచుఁ గాదె శరీరుల కుత్సవార్థమై
గంధములాత్మఁ బుట్టఁ దఱుఁగంబడి యుండుటలెల్ల భాస్కరా! ॥72॥

చ. బలము దొలంగు కాలమునఁ బ్రాభవసంపదలెంత ధన్యుఁడున్
నిలుపుకొనంగనోపఁ; డది నిశ్చయ మర్జునుఁడీశ్వరాదులం
గెలిచినవాఁడు బోయలకు గీడ్పడి చూచుచుఁ గృష్ణభార్యలు
బలువుర నీయఁడే నిలువఁ బట్ట సమర్థుఁడు గాక భాస్కరా! ॥73॥

చ. బలయుతుఁ డైన వేళ నిజ బంధుఁడు తోడ్పడుఁ గాని యాతఁడే
బలము తొలంగెనేని తన పాలిటి శత్రు; వదెట్లు పూర్ణుఁడై
జ్వలనుఁడు కానఁ గాల్చు తఱి సఖ్యముఁ జూపును వాయుదేవుఁడా
బలియుఁడు సూక్ష్మదీపమగు పట్టున నార్పదె గాలి భాస్కరా! ॥74॥

ఉ. బల్లిదుఁడైన సత్ప్రభువు పాయక యుండినఁగాని రచ్చలో
జిల్లరవారు నూఱుగురు సేరినఁ దేజము గల్గదెయ్యెడన్
జల్లని చందురుండెడసి సన్నపుఁ జుక్కలు కోటియున్న
జిల్లునె వెన్నెలల్ జగము జీఁకటులన్నియుఁ బాయ భాస్కరా! ॥75॥

చ. భుజబల శౌర్యవంతులగు పుత్త్రుల గాంచిన వారి కెయ్యెడన్
నిజహృదయేప్సితార్థములు నిక్కము చేకుఱుఁ గుంతిదేవికిన్

విజయబలాఢ్యుఁ డర్జునుఁడు వీరపరాక్రమ మొప్ప దేవతా
గజమును దెచ్చి తల్లి వ్రతకార్యము దీర్పఁడె తొల్లి భాస్కరా! ॥76॥

ఉ. భూనుతులైన దేవతలు పూర్వము కొందఱు వావివర్తనల్
మాని చరింపరో యనుచు మానవులట్ల చరింపఁబోల; దం
భోనిధులన్నియుం దనదు పుక్కిటఁ బట్టె నగస్త్యుఁడంచు నా
పూనిక కెవ్వఁడోపు నది పూర్వమహత్త్వము సుమ్ము భాస్కరా! ॥77॥

ఉ. భూపతి కాత్మబుద్ధి మది బుట్టనిచోట బ్రధానులెంత ప్ర
జ్ఞాపరిపూర్ణులైనఁ గొనసాగదు కార్యము; కార్యదక్షులై
యోపిన ద్రోణ భీష్మ కృప యోధులనేకులు గూడి కౌరవ
క్ష్మాపతికార్యమేమయినఁ జాలిరె చేయఁగ నాడు భాస్కరా! ॥78॥

ఉ. భూరి బాలాఢ్యుఁడైనఁ దలపోయక విక్రమశక్తిచే నహం
కారము నొందుటల్ తగవు గాదతఁడొక్కెడ మోసపోవుఁ గా
వీరవరేణ్యుఁ డర్జునుఁడు వింటికి నే నధికుండ నంచుఁ దా
నూరక వింటినెక్కిడఁగ నోపడు కృష్ణుఁడు లేమి భాస్కరా! ॥79॥

ఉ. భ్రష్టున కర్హవంతులగు బాంధవులెందఱు గల్గినన్ నిజా
దృష్టము లేదు గావున దరిద్రతఁ బాపఁగలేరు; సత్కృపా
దృష్టిని నిల్పి లోకుల కతిస్థిరసంపద లిచ్చు లక్ష్మి యా
జ్యేష్ట కదేటికిం గలుగఁజేయదు తోడనె పుట్టి భాస్కరా! ॥80॥

చ. మదిఁ దను నాసపడ్డయెడ మంచిగుణోన్నతుఁడెట్టి హీనునిన్
వదలఁడు మేలుపట్టున నవశ్యము మున్నుగ నాదరించుఁగా;
త్రిదశ విమానమధ్యమునఁ దెచ్చి కృపామతి సారమేయమున్
మొదల నిడండె ధర్మజుఁడు మూఁగి సురావళి చూడ భాస్కరా! ॥81॥

ఉ. మాటల కోర్వజాలఁ డభిమానసమగ్రుఁడు ప్రాణహానియౌ
చోటులనైనఁ దానెదురు చూచుచునుండుఁ; గొలంకు లోపల
న్నీట మునింగినప్పు డతి నీచము లాడిన రాజరాజు పో
రాట మొనర్చి నేలఁబడఁడాయెనె భీముని చేత భాస్కరా! ॥82॥

ఉ. మానవనాథుఁ డాత్మరిపు మర్మ మెఱింగినవాని నేలినం
గాని జయింపలేఁ డరులఁ; గార్ముకదక్షుఁడు రామభద్రుఁ డా

దానవనాయకున్ గెలువఁ దా నెటులోపుఁ దదీయ నాభికా
పానసుధ న్విభీషణుఁడు తార్కొని చెప్పకయున్న భాస్కరా! ॥83॥

ఉ. మానవుఁ డాత్మకిష్టమగు మంచిప్రయోజన మాచరించుచోఁ
గానక యల్పుఁడొక్కఁ డది గాదని పల్కిన వాని పల్కుకై
మానగఁజూడఁడా పని సమంచిత భోజనవేళ నీఁగ కా
లూనిన వంటకంబు దినకుండఁగ నేర్పగునోటు భాస్కరా! ॥84॥

ఉ. మానిని చెప్పు నెట్లెఱుకమాలిన వాఁడటు చేసినన్ మహా
హాని ఘటించు నే ఘనునికైన నసంశయ మూర్విపైఁ గృపా
హీనతఁ బల్కినన్; దశరథేశ్వరుఁ డంగన మాటకై గుణాం
భోనిధి రాముఁ బాసి చనిపోవఁడె శోకముతోడ భాస్కరా! ॥85॥

చ. మునుపొనరించు పాతక మమోఘము జీవులకెల్లఁ బూని యా
వెనుకటి జన్మమం దనుభవింపక తీఱదు; రాఘవుండు వా
లిని బడనేసి తా మగుడ లీల యదూద్భవుఁడై కిరాతుచే
వినిశిత బాణపాతమున వీడ్కొనఁడే తన మేను భాస్కరా! ॥86॥

ఉ. రాకొమరుల్ రసజ్ఞునిఁ దిరంబుగ మన్నన నుంచినట్లు భూ
లోకమునందు మూఢుఁ దమ లోపలనుంపరు; నిక్కమే కదా!
చేకొని ముద్దుగాఁ జదువు చిల్కను బెంతురుగాక పెంతురే
కాకము నెవ్వరైన శుభకారణ సన్మునిసేవ్య భాస్కరా! ॥87॥

ఉ. లోకములోన దుర్జనుల లోఁతు నెఱుంగక చేరరాదు సు
శ్లోకుఁడు చేరినం గవయఁజూతురు చేయుదు రెక్కసక్కెముల్
కోకిలఁ గన్నచోట గుమికూడి యసహ్యపుఁ గూతలార్చుచుం
గాకులు తన్నవే తఱిమి కాయము తల్లడమంద భాస్కరా! ॥88॥

ఉ. లోను దృఢంబుగాని పెనులోభిని నమ్మి యసాధ్యకార్యముల్
కానక పూనునే నతఁడు గ్రక్కునఁ గూలును; నోటిపుట్టిపై
మానవుఁ డెక్కిపోవ నొకమాటు బుటుక్కున ముంపకుండునే
తానొకలోఁతునం గెడసి దానిఁ దరింపఁగ లేక భాస్కరా! ॥89॥

ఉ. వంచన యింతలేక యెటువంటి మహాత్ముల నాశ్రయించినం
గొంచెమె కాని మేలు సమకూడ దదృష్టము లేనివారికిన్;

సంచితబుద్ధి బ్రహ్మ ననిశంబును వీఁపున మోచునట్టి రా
యంచకుఁ దమ్మితూండ్లు దిననాయెఁగదా ఫలమేమి భాస్కరా! ॥90॥

ఉ. వట్టుచుఁ దండ్రి యత్యధమ వర్తనుఁడైననుగాని వానికిం
బుట్టిన పుత్త్రకుండు తన పుణ్యవశంబున దొడ్డధన్యుఁడౌ;
నెట్టన మఱ్ఱివిత్తు మునుపెంతయుఁ గొంచెము దానఁబుట్టునా
చెట్టు మహోన్నతత్వమును జెందదె శాఖలనిండి భాస్కరా! ॥91॥

చ. వలనుగఁ గానలందుఁ బ్రతివర్షమునం బులి నాలుగైదు పి
ల్లలఁ గను దూడనొక్కటి నిలం గను ధేనువు రెండుమూఁడు నేఁ
డుల కటులైన బెబ్బులి కుటుంబము లల్పములాయె నాలమం
దలు గడువృద్ధిఁ జెందవె యధర్మము ధర్మముఁ దెల్ప భాస్కరా! ॥92॥

చ. వలవదు క్రూరసంగతి యవశ్య మొకప్పుడు సేయఁబడ్డచోఁ
గొలదియెఁ గాని యెక్కువలు గూడవు; తమ్ములపాకు లోపలం
గలసిన సున్నమించుకయ కాక మఱించుక యెక్కువైనచో
నలుగడఁ జుఱ్ఱుచుఱ్ఱుమని నాలుక పొక్కక యున్నె భాస్కరా! ॥93॥

ఉ. వానికి విద్యచేత సిరివచ్చె నటంచును విద్య నేర్వఁగాఁ
బూనినఁ బూనుఁగాక తన పుణ్యము చాలక భాగ్యరేఖకుం
బూనఁగ నెవ్వఁడోపు; సరిపో చెవి పెంచును గాకదృష్టతా
హీనుఁడు కర్ణభూషణము లెట్లు గడింపఁగనోపు? భాస్కరా! ॥94॥

ఉ. సంతత పుణ్యశాలి నొక జాడను సంపద వాసిపోయి తా
నంతటఁ బోక నెట్టుకొని యప్పటియట్ల వసించియుండు; మా
సాంతమునందుఁ జందురుని నన్నికళల్ పెడఁబాసి పోయినం
గాంతి వహింపఁడటోటు? తిరుగంబడి దేహమునిండ భాస్కరా! ॥95॥

చ. సకలజన ప్రియత్వము నిజంబుగఁ గల్గిన పుణ్యశాలి కొ
క్కొకయెడ నాపదైనఁ దడవుండదు వేగమె పాసిపోవుగా;
యకలుషమూర్తియైన యమృతాంశుఁడు రాహువు తన్ను మ్రింగినం
డకటక మాని యుండఁడె! దృఢస్థితి నెప్పటియట్ల భాస్కరా! ॥96॥

చ. సన్నుత కార్యదక్షుఁడొక చాయ నిజప్రభ యప్రకాశమై
యున్నపుడైన లోకులకు నొండక మేలొనరించు సత్త్వసం

పన్నుఁడు భీముఁడా ద్విజుల ప్రాణము కాఁవడె యేకచక్రమం
దెన్నికగా బకాసురుని నేపున రూపడఁగించి భాస్కరా! ॥97॥

చ. సరసగుణ ప్రపూర్ణునకు సన్నపు దుర్గుణ మొక్కవేళ యం
దొరసిన నిటు నీకుఁ దగునో యని చెప్పిన మాన నేర్చుగా
బురద యొకించుకంత తముఁ బొందిన వేళలఁ జిల్లవిత్తుపై
నొరసిన నిర్మలత్వమున నుండవె నీరములెల్ల భాస్కరా! ॥98॥

చ. సరసదయాగుణంబుగల జాణ మహిం గడు నొచ్చియుం
దఱచుగ వాని కాసపడి దాయఁగ వత్తురు లోకులెట్లనం
జెఱుకురసంబు గానుఁగను జిప్పిలిపోయిన మీదఁ బిప్పియై
ధరఁ బడియున్నఁ జేరవె ముదంబునఁ జీమలు పెక్కు భాస్కరా! ॥99॥

ఉ. సారవివేకవర్తనల సన్నుతికెక్కిన వారిలోపలం
జేరినయంత మూఢులకుఁ జేపడ దానడ; యెట్టులన్నఁ గా
సారములోన హంసముల సంగతి నుండెడి కొంగపిట్ట కే
తీరునఁ గల్గ నేర్చును దదీయగతుల్ దలపోయ భాస్కరా! ॥100॥

ఉ. స్థానముఁ దప్పివచ్చునెడఁ దానెటువంటి బలాఢ్యుఁడున్ నిజ
స్థానికుఁడైన యల్పుని కతంబున నైనను మోసపోవుఁగా;
కానల లోపలన్ వెడలి గంధగజం బొకనాఁడు నీటిలోఁ
గానక చొచ్చినన్ మొసలి కాటుకు లోఁబడదటోటు భాస్కరా! ॥101॥

చ. సిరిగలవాని కెయ్యెడలఁ జేసిన మేలది నిష్ఫలం బగున్
నెఱిగుఱి గాదు పేదలకు నేర్పునఁ జేసిన సత్ఫలంబగున్
వఱపున వచ్చి మేఘుఁడొక వర్షము వాడిన చేలమీఁదటం
గురిసినఁగాక యంబుధులఁ గుర్వఁగ నేమి ఫలంబు భాస్కరా! ॥102॥

చ. సిరివలెనేని సింహగుహ చెంత వసించినఁ జాలు సింహముల్
కరుల వధింపఁగా నచటఁ గల్గును దంతచయంబు ముత్యముల్
హరువుగ నక్కబొక్క కడ నాశ్రయమందిన నేమి గల్గెడుం
గొరిసెలు దూడతోఁకలును గొమ్ములు నెమ్ములుఁగాక భాస్కరా! ॥103॥

చ. స్థిరతర ధర్మవర్తన బ్రసిద్ధికి నెక్కినవాని నొక్క ము
ష్కరుఁ డతినీచవాక్యములఁ గాదని పల్కిన నమ్మహాత్ముఁడుం

గొఱత వహింపఁడయ్యెడ; నకుంఠిత పూర్ణసుధాపయోధిలో
నరుగుచుఁ గాకి రెట్ట యిడినందున నేమి కొఱంత భాస్కరా! ॥104॥

చ. స్ఫురతర కీర్తిమంతులగు పుత్త్రుల గాంచినఁగాక మూఢము
ష్కరులఁ గనంగఁ దేజములు గల్గవుగా; మణికీలితాంగుళా
భరణము లంగుళంబుల శుభస్థితిఁ బెట్టినఁగాక గాజు టుం
గరములు పెట్టినందున వికాసము గల్గునటయ్య? భాస్కరా! ॥105॥

ఉ. సేనగ వాంఛితాన్నము భుజింపఁగలప్పుడు కాక లేనిచో
మేనులు డస్సియుంట నిజమేకద దేహుల కగ్నిహోత్రుఁడౌ
నే నిజభోజ్యముల్ గుడుచు నేనియుఁ బుష్టి వహించు లేనిఁనా
డూని విభూతిలోనడఁగి యుండఁడె తేజము తప్పి భాస్కరా! ॥106॥

ఉ. హాళి నిజప్రబుద్ధి తిరమైన విధంబునఁ బెట్టుబుద్ధులా
వేళలకంతె కాని మఱి వెన్కకు నిల్వవు; హేమకాంతి యె
న్నాళులకుండుఁ గాని యొకనాడు పదంపడి సానఁ బట్టినన్
దాళియు నుండునే యినుప తాటకఁ జాయలు పోక భాస్కరా! ॥107॥

ఉ. హీనకులంబునందు జనియించినవారికి సద్గుణంబు లె
న్నేనియుఁ గల్గియున్న నొక నేరము చెందకపోదు; పద్మముల్
భూనుతిఁ గాంచియున్ బురదఁ బుట్టుట వల్ల సుధాకరోదయం
బైన ననహ్య మొందవె ప్రియంబునఁ జూడఁగ లేక భాస్కరా! ॥108॥

ఉ. ఇంచుక నేర్పు చాలక విహీనతఁ జెందిన నా కవిత్వమున్
మించు వహించె నీకతన మిక్కిలి యెట్లనఁ దోలుబొమ్మలున్
మంచివివేకి వాని తెరమాటున నుండి ప్రశస్తరీతి నా
డించిన నాడవే జనుల డెందము నింపవె ప్రీతి భాస్కరా! ॥109॥

కుమార శతకము

ఫక్కి వేంకట నరసింహ కవి

క. శ్రీభామినీ మనోహర
సౌభాగ్యు దయాస్వభావు సారసనాభున్
లో భావించెద నీకున్
వైభవము లొసంగుచుండ వసుధ కుమారా! ॥1॥

క. ఆజ్ఞ యొనర్చెడి వృత్తుల
లో జ్ఞానము గలిగి మెలఁగు లోకులు మెచ్చన్
బ్రాజ్ఞతను గలిగి యున్నన్
బ్రాజ్ఞులలోఁ బ్రాజ్ఞుడవుగ ప్రబలు కుమారా! ॥2॥

క. అతి బాల్యములోనైనను
బ్రతికూలపు మార్గములఁ బ్రవర్తింపక స
ద్గతిమీఱ మెలఁగ నేర్చిన
నతనికి లోకమున సౌఖ్యమగును ముమారా! ॥3॥

క. వృద్ధజన సేవ చేసిన
బుద్ధి విశేషజ్ఞుఁడనుచుఁ బూతచరితుఁడున్
సద్ధర్మశాలి యని బుధు
లిద్ధరఁ బొగడెదరు ప్రేమ యెసఁగఁ గుమారా! ॥4॥

క. పెద్దలు వద్దని చెప్పిన
పద్దులఁ బోవంగరాదు పరకాంతల నే
ప్రొద్దే నెదఁ బరికించుట
కుద్దేశింపంగఁ గూడ దుర్వీఁ గుమారా! ॥5॥

క. తనపై దయ నుల్కొనఁగను
గొన నేతెంచిన సుశీల గురుమతులను వం

దనముగఁ బూజింపఁ దగు
మనమలరఁగ నిదియ విబుధ మతము కుమారా! ॥6॥

క. ఉన్నను లేకున్నను పై
కెన్నఁడు మర్మంబుఁ దెలుప నేగకుమీ నీ
కన్న తలిదండ్రుల యశం
బెన్నఁబడెడు మాడ్కిఁ దిరుగు మెలమిఁ గుమారా! ॥7॥

క. పెద్దలు విచ్చేసినచో
బద్దకముననైన దుష్ట పద్ధతి నైనన్
హద్దెఱిఁగి లేవకున్నన్
మొద్దువలెం జూతు రతని ముద్దు కుమారా! ॥8॥

క. సతతముఁ బ్రాతఃకాలో
చిత విధులను జరుపు మరసి శీఘ్రముగ నహఃపతి పూర్వపర్వతాగ్రా
గతుఁడగుటకు మున్నె వెరపు గల్గి కుమారా! ॥9॥

క. పోషకుల మతముఁ గనుఁగొని
భూషింపక కాని ముదముఁ బొందఁడు మఱియున్
దోషముల నెంచుచుండును
దోషివయిన మిగులఁ గీడు దోఁచుఁ గుమారా! ॥10॥

క. నరవరుఁడు నమ్మి తను నౌ
కరిలో నుంచునెడ వాని కార్యములందున్
సరిగా మెలంగ నేర్చిన
పురుషుఁడు లోకమునఁగీర్తి బొందుఁ గుమారా! ॥11॥

క. పుడమిని దుష్టత గలయా
తఁడు లంచంబులను బట్టఁ దలఁచును మిడి యౌ
నడవడి విడి యందఱి వెం
బడి ద్రిప్పికొనుచును గీడు పఱుప బుత్రా! ॥12॥

క. పనులెన్ని కలిగి యున్నను
దిన దినముల విద్యపెంపు ధీయుక్తుఁడవై

వినఁగోరుము సత్కథలను
కని విబుధులు సంతసించు గతినిఁ గుమారా! ॥13॥

క. ధరణీనాయకు రాణియు
గురురాణియు నన్నరాణి కులకాంతను గ
న్నరమణి దను గన్నదియును
ధర నేవురు తల్లులనుచుఁ దలఁపుఁ గుమారా! ॥14॥

క. సదమల మతితోఁ బెద్దల
మది కింపుగ మెలఁగు, నింద మానుము పరులన్
మృదు మార్గములను వదలకు
విదితంబుగ దానఁగీర్తి వెలయుఁ గుమారా! ॥15॥

క. ఆచార్యున కెదిరింపకు
బ్రోచిన దొర నిందసేయఁ బోకుము కార్యా
లోచనము లొంటిజేయకు
మాచారము విడువఁబోకుమయ్య! కుమారా! ॥16॥

క. పుట్టినది మొదలు పరసతి
బట్టగ జూచుటయు నింద పద్ధతి యనుచు
న్నట్టి పురుషుఁడు పుడమిం
బుట్టిన జనతతులఁ గీర్తిఁ బొందుఁ గుమారా! ॥17॥

క. కల్లలగుమాట లాడక
యెల్ల జనంబులకు వేగ హృదయము కడు రం
జిల్లఁగఁ బల్కుము నీ కది
తెల్లమి రహిఁ గీర్తిఁ గాంచు తెఱఁగు కుమారా! ॥18॥

క. ఏనాఁడైనను వినయము
మానకుమీ, మత్సరమున మనుజేశులతోఁ
బూనకు మసమ్మతము, బహు
మానమును బొందు మిదియె మతము కుమారా! ॥19॥

క. నగఁగూడదు పరసతిఁ గనఁ
దగు మాతృసమాన మెన్నఁ దగు నెవ్వరితోఁ

బగ గూడదొరుల నిందిం
పగఁగూడదు గనుము వృద్ధ పథము కుమారా! ||20||

క. చేయకుము కాని కార్యము
పాయకుము మఱిన్ శుభం బవని భోజనమున్
జేయకుము రిపు గృహంబునఁ,
గూయకు మొరుమనసు నొచ్చుఁ గూఁత కుమారా! ||21||

క. పిన్నల పెద్దలయెడఁ గడు
మన్ననచే మెలఁగు సుజన మార్గంబుల నీ
వెన్నికొని తిరుగు చుండిన
నన్నియెడల నెన్నఁబడుదు వన్న! కుమారా! ||22||

క. తనకును విద్యాభ్యాసం
బును జేసిన వానికన్న బొలుపుఁగ బదిరె
ట్లను దూఁగుఁ దండ్రి, వానికి
జననియుఁ బదిరెట్లు తూఁగు జగతి కుమారా! ||23||

క. తమ్ములు తమ యన్న యెడ భ
యమ్మును భక్తియును గలిగి యారాధింపన్
దమ్ముల నన్నయు సమ్మో
దమ్మునఁ బ్రేమింపఁ గీర్తి దనరుఁ గుమారా! ||24||

క. అప్పం దన తల్లిగ మే
లొప్పం గని జరుపవలయు నుర్వీస్థలిఁ జి
న్నప్పుడు చన్నిడి మనిపిన
యప్పడఁతియు మాతృతుల్య యండ్రు కుమారా! ||25||

క. బూటకపు వర్తనముఁ గని,
జూటరి వీఁడనుచుఁ దప్పఁ జూతురుగా! యా
బాటను విడి సత్యము మది
పాటించి నటించువాఁడె నరుఁడు కుమారా! ||26||

క. తనయుఁడు చెడుగైయుండిన
జనకుని తప్పన్నమాట సత్యమెఱుఁగుదు గా

వున నీ జననీ జనకుల
కు నపఖ్యాతి యగురీతి గొనకు కుమారా! ॥27॥

క. తల్లిని దండ్రిని సహజల
నల్లరఁ బెట్టినను వార లలుగుచు నీపై
నుల్లముల రోయుచుందురు
కల్లరి వీఁడనుచుఁ గీర్తి గందఁ గుమారా! ॥28॥

క. లోకులు తనుఁ గొనియాడ వి
వేకి యదియు నింద గాక విననొల్లఁడు సు
శ్లోకుల చరితం బిట్టిది
చేకొనవలె నట్టి నడత చిన్ని కుమారా! ॥29॥

క. ధరణిని బరోపకారా
చరణవ్రత నిష్ఠ నెపుడు సలుపుము నీ కా
తెఱఁగుపవాసాది వ్రత
వర కర్మము కంటె మేలు వచ్చుఁ గుమారా! ॥30॥

క. వగవకు గడిచిన దానికిఁ
బొగడకు దుర్మతుల నెపుడు, పొసగని పనికై
యొగి దీనత నొందకుమీ
తగ దైవగతిం బొసంగు ధరను గుమారా! ॥31॥

క. పనిఁబూని జనులు సంతత
మునఁ దాలిమి సత్యశౌచములను బ్రవర్తిం
చిన యశము నొందుచుందురు
గనుగొను మిదె దొడ్డనడక గాఁగ కుమారా! ॥32॥

క. విను లోకంబున ధర్మం
బఁనగఁ గులాచార మట్ల నరసి నడువ! దాఁ
గను నాయుఃకీర్తుల నిహ
మునఁ బరమునఁ బొందు సౌఖ్యములను గుమారా! ॥33॥

క. సరివారిలోన నేర్పునఁ
దిరిగెడు వారలకుఁగాక తెరువాటులలో

నరయుచు మెలఁగెడి వారికిఁ
బరువేటికిఁగీడె యనుభవంబు గుమారా! ॥34॥

క. ఒరు లెవ్వరేని దనతోఁ
బరిభాషించినను మేలు పలుకవలయు సా
దరము గల చోటఁ గీడు
న్నరము నొనర్పంగరాదు గదర! కుమారా! ॥35॥

క. సిరి చేర్చు బంధువుల నా
సిరియే శుభముల నొసంగు చెలువులఁ గూర్చున్
సిరియే గుణవంతుండని
ధరలోఁబొగడించునంచుఁ దలఁపు కుమారా! ॥36॥

క. ఆకులతఁబడకు మాపద,
నేకతమునఁ జనకు త్రోవ, నింతికిఁదగు నం
తే కాని చన వొసంగకు,
లోకులు నిన్నెన్న సుగుణ లోల! కుమారా! ॥37॥

క. తనదు కులాంగన యాలో
చనమున మంత్రియును భుక్తి సమయంబునఁ దా
జననియు రతిలో రంభా
వనజేక్షణ యయినఁ బుణ్య వశము కుమారా! ॥38॥

క. మనుజుఁడు సభ్యుఁడు దానై
గనియున్న యధార్థమెల్ల గానని యట్లా
మనుజుండు పలుకకున్నను
ఘనమగు పాతకము నాఁడు గనును గుమారా! ॥39॥

క. అంగీకార రహిత మగు
సంగతికి బోవరాదు సామాన్యులతో
డం గడు జగడమునకుఁ జన
వెంగలితనమండ్రు వినుము కుమారా! ॥40॥

క. అల దేవగృహము కడ పయి
రుల గోవాటములయందుఁ ద్రోవలలో ర

చ్చుల కొట్టములను నొప్పదు
మలమూత్ర విసర్జనంబు మహిని గుమారా! ॥41॥

క. తనుజులను గురుల వృద్ధుల
జననీ జనకులను సాధు జనుల నెఁవడు దా
ఘనుఁడయ్యుఁ బ్రోవఁడో యా
జనుఁడే జీవన్మృతుండు జగతిఁ గుమారా! ॥42॥

క. ధీరుఁడు తనదగు సంపద
జారినయెడఁ జింత నొందఁజాలక తా ల
క్ష్మీరమణుని వరచరణాం
భోరుహములు గొలిచి ముక్తిఁ బొందుఁ గుమారా! ॥43॥

క. పాపపుఁబని మదిఁ దలఁపకు,
చేపట్టినవారి విడువఁ జేయకు, కీడున్
లోపలఁ దలఁపకు, క్రూరుల
ప్రాపును మది నమ్మఁబోకు రహిని గుమారా! ॥44॥

క. జగడంబు లాడుచోటను
మగువలు వసియించుచోట మదగజము దరిన్
బగతుండు తిరుగుచోటన్
మగిడి చనఁగవలయుఁ జలము మాని గుమారా! ॥45॥

క. దుర్జనుల నైనఁ దిట్టకు
వర్జింపకు సుజనగోష్ఠి, పరులను నెల్లన్
నిర్జింతు ననుచుఁ ద్రుళ్ళకు,
దుర్జనుఁడండ్రు నిను నిందఁ దోపఁ గుమారా! ॥46॥

క. తిరుగకు దుర్మార్గులతో
నరుగకు గహనాంతర స్థలాదుల కొంటిన్
జరుగకు శత్రులమ్రోల
న్మరువకు మేల్ హితులయెడల మదిని గుమారా! ॥47॥

క. తరళాక్షుల యెడ నెన్నఁడుఁ
బరిహాసాలాపములను బచరింపకుమీ

పరికించి నిరీక్షించిన
నురుదోషం బనుచుఁ దలఁపుచుండు కుమారా! ॥48॥

క. సంపద గలవారిని మో
దింపుచుఁ జుట్టుకొనియుందు రెల్లప్పుడు స
త్సంపద తొలంగిన నుపే
క్షింపుదు రవివేకజనులు క్షితిని గుమారా! ॥49॥

క. కాయమున నాటు శరము లు
పాయంబునఁ దీయవచ్చు బహు నిష్ఠురతన్
గూయ మది నాటుమాటలు
పాయవుగా యెపుడు వెగడు పరచుఁ గుమారా! ॥50॥

క. ధరణీజాతము లే యే
తరి నెట్లెట్లను ఫలించుఁ దగనటు పూర్వా
చరణ ఫలంబు ననుభవముఁ
గరమనుభవనీయ మగును గాదె? కుమారా! ॥51॥

క. పెను కోపము గర్వము ను
బ్బును జలతయు దురభిమానమును వ్యాపారం
బునఁ జొరక యునికియును న
ల్పుని గుణము లటంచుఁ దెలివిఁ బొందు కుమారా! ॥52॥

క. విత్తముఁ గూర్చిన మనుజుం
డుత్తమ దానంబు భోగ మొందని యెడ భూ
భృత్తస్కర శిఖిగతము ని
వృత్తి కరంబగును నట్టి పదవి కుమారా! ॥53॥

క. సద్దోష్మి సిరియు నొసఁగును
సద్దోష్మియె కీర్తిఁబెంచు సంతుష్మిని నా
సద్దోష్మియె యొనఁగూర్చును
సద్దోష్మియె పాపములను జంపుఁ గుమారా! ॥54॥

క. ఘనులు విని సమ్మతింపని
పనులకుఁ జొరఁబడక పొగడు పనులకు జొరు, మెం

దును బొంకఁబోక స
జ్జనములతోఁ గలసిమెలఁగు జగతిఁ గుమారా! ॥55॥

క. జారులతోఁ జోరులతోఁ
గ్రూరులతో నెపుడు పొత్తుఁ గోరక మది స
త్పూరుష పదాంబుజాతా
ధారుఁడవై బ్రతుకు, కీర్తి తనరఁ గుమారా! ॥56॥

క. జ్ఞానుల చరితము వీనుల
నానుచు సత్పురుషగోష్ఠి ననఘుం బనుచున్
బూనుము, ధర్మపథంబును
దానెఱిఁగిన యంత మఱువఁ దగదు కుమారా! ॥57॥

క. రోషావేశము జనులకు
దోషము తలపోయ విపుల దుఃఖకరమునౌ,
రోషము విడిచిన యెడ సం
తోషింతురు బుధులు హితము దోఁపఁ గుమారా! ॥58॥

క. ధనవంతులైన బహు స
జ్జనులైనను నీకు మిగుల సమ్మతులై యు
న్నను సతి జనకుని గృహమం
దున నుండుట తగదు కీర్తి తొలఁగుఁ గుమారా! ॥59॥

క. సభలోపల నవ్వినయెడ
సభకులు నిరసింతు రెట్టి జనుని, న్నెఱి నీ
కభయం బొసంగె నేనియుఁ
బ్రభు కరుణము నమ్మి గర్వ పడకు కుమారా! ॥60॥

క. తన పంక్తియందు బాంధవ
జనము లొక విధంబుగ మెసంగుచు నుండం
గను దా సద్రసముల మెసఁ
గిన విషభోజనసమంబు క్షితిని గుమారా! ॥61॥

క. పెరవారలుండ ఫలముల
నరయంగా వారికిడక యాతఁడె మెసవన్

సరిగాదు, విసపుమేఁతకు
సరియౌనని తలఁపు మానసమునఁ గుమారా! ॥62॥

క. గుణవంతుని సంగతి ని
ర్గుణులకు గుణములు ఘటించు, గుసుమాది సమ
ర్పణమున వస్త్రాదిక మా
క్షణమునఁ బరిమళము నొందు కరణిఁ గుమారా! ॥63॥

క. మును స్నానము సేయక చం
దన మలఁదుట యనుచితం బుదకయుత వస్త్రం
బును విదలించుట కూడదు,
మనమున నివి తెలిసి మనుము మహిని గుమారా! ॥64॥

క. పరజనులు కట్టి విడిచిన
వరచేలములైనఁ గట్ట వలదు, వలువన్
నెఱిమాయు మడత మార్చుచు
ధరియించుట యొప్పదండ్రు ధరను గుమారా! ॥65॥

క. మును మనుజుఁడు జన్మాంతర
మునఁజేసిన పుణ్యపాపములు పుడమిని వా
నిని బొందక విడువవు, దే
వుని నిందింపకుము కీడు వొడముఁ గుమారా! ॥66॥

క. అవయవహీనుని సౌంద
ర్యవిహీను దరిద్రు విద్య రాని యతని సం
స్తవనీయు దేవు శ్రుతులన్
భువి నిందింపఁ దగదండ్రు బుధులు కుమారా! ॥67॥

క. లోకమున సర్వజనులకు
నా కాలుఁడు ప్రాణహారి యై యుండఁగ శో
భాకృతకార్యముల వడిం
బ్రాకటముగఁ జేయకుండ రాదు కుమారా! ॥68॥

క. అల సరస్నానంబులఁ బరి
మళముం గలుగు వస్తువులను మహితల యానం

బుల నాసనముల నుబ్బకు,
కలుగుం జనుఁ గాలవశము గాను గుమారా! ॥69॥

క. ప్రజ్ఞావంతుని చేతను
బ్రజ్ఞాహీనునకుఁ గడమ వాటిల్లు నిలన్
బ్రాజ్ఞతగల్గి నటించినఁ
దజ్ఞులు నుతియింతు రదియె ధనము కుమారా! ॥70॥

క. మనుజుల తమసౌఖ్యము కొఱ
కును సంరక్షణము నవనిఁ గోరుదు, రొగి నే
జనపాలుఁడు సంరక్షిం
పను దగియును బ్రోవఁ డతఁడె పాపి కుమారా! ॥71॥

క. మండలపతి దండార్హుల
దండింపక యుండరాదు ధారుణి నతఁడా
ఖండల సమానుఁడైనను
మెండగు పాపంబునొంది మెలఁగుఁ గుమారా! ॥72॥

క. గరళముఁ బెట్టెడు వాని
న్బరుఁ జంపఁదలంచు వానిఁ జనులెల్ల బయ
ల్పఱచెడి వానిం జనధన
హరుని నృపతిం జంపి పుణ్యుఁ డగును గుమారా! ॥73॥

క. గృహదాహకునిం బరదా
రహరుం బంధుహితకార్య రహితుని దుష్టో
త్సహపరుని జంపి నరపతి
యిహపరములయందు గీర్తి నెనయుఁ గుమారా! ॥74॥

క. సత్తువగల యాతని పై
నెత్తిన దుర్బలుఁడు తస్కరించిన నతండున్
విత్తముఁ గోల్పడు నతఁడును
జిత్తజ పీడితుఁడు జింతఁ జెందుఁ గుమారా! ॥75॥

క. కత్తిని చేతంబట్టుచు
మొత్తఁదలఁచి వచ్చువాని ముఖ్యముగా మే

ల్లత్తించిన నదె ప్రాయ
శ్చిత్త మతనిఁ జంపఁదగదు చిన్ని కుమారా! ॥76॥

క. ఓరిమియె కలిగియుండిన
వారలఁ గని ప్రజ్ఞలేని వా రనియెద, రౌ
నారయ సత్పురుషాళికి
నోరిమియే భూషణంబు రోరి కుమారా! ॥77॥

క. పురుషుం డొనర్పని పనికి
నరయఁగ దైవం బదెట్టు లనుకూలించున్
సరణిగ విత్తకయున్నను
వరిపండునె ధరణిలోన వఱలి కుమారా! ॥78॥

క. తన సత్కర్మాచరణం
బున భాగ్యము వేగ వృద్ధి బొందు, జగత్ప్రా
ణుని వర సాహాయ్యముచే
ననలం బెంతైనఁ బెరఁగు నయ్య కుమారా! ॥79॥

క. చమురింకిపోయినను దీ
పము శమియించిన విధంబు పౌరుషము విహీ
నమె యగును, దైవ మనుకూ
లము గాకుండినను భూతలమునఁ గుమారా! ॥80॥

క. ఘన బీజము సాయము లే
కను భూములు నిష్ప్రయోజకంబైన విధం
బున దైవము తోడిలఁగా
కనె పౌరుష కర్మఫలము గలదె కుమారా? ॥81॥

క. ధరనే వస్తువులైనన్
దరుగుటకై వృద్ధినొందుఁ దగఁ బొడ వెదుగున్
విరుగుటకై, పాయుటకై
దరిఁ జేరును, వీని మదిని దలఁపు కుమార! ॥82॥

క. జనియించుట పొలియుటకే
పెను సుఖమొందు టది కష్ట విధి నొందుటకే

విను హెచ్చుట తగ్గుటకే
యని మనమున నమ్మవలయు నయ్య! కుమారా! ॥83॥

క. ఎటువంటి వరకులంబునఁ
బటుతరముగఁ బుట్టినేని పరఁగఁగ మును గ
న్నటువంటి కర్మఫలములఁ
గటగట! భోగింపవలయుఁ గాదె? కుమారా! ॥84॥

క. పెక్కుజనులు నిద్రింపఁగ
నొక్కండయ్యెడను నిద్ర నొందకయున్నన్
గ్రక్కున నుపద్రవం బగు
నక్కర్మమునందుఁ జొరకు మయ్య! కుమారా! ॥85॥

క. మధురంబులఁ గొననొల్లఁడు
బుధజనుఁ డేకతమ దారిఁ బోనొల్లఁడు నీ
విధ మెఱిఁగి నీవును మనో
రథ సిద్ధుఁడవగుచు మెలఁగ రాదె! కుమారా! ॥86॥

క. ధనవంతుఁడె కులవంతుఁడు
ధనవంతుఁడె సుందరుండు, ధనవంతుండే
ఘనవంతుఁడు బలవంతుఁడు
ధనవంతుఁడె ధీరుఁడనుచుఁ దలఁపు కుమారా! ॥87॥

క. విను ప్రాణరక్షణమునన్
ధనమంతయు మునిగిఁపోవు తఱిఁ బరిణయమం
దున గురుకార్యమున వధూ
జన సంఘములందు బొంకఁ జనును గుమారా! ॥88॥

క. కులభామల విడువకు, వెలి
పొలఁతుల వీక్షించి మోహమునఁ బొరలకుమీ
ఖలుఁ డందు రెట్టివారలుఁ
గులహీనుఁడు పుట్టెననుట కొఱలుఁ గుమారా! ॥89॥

క. చపలాత్ముఁ డవనిలోపల
నపాత్ర జనులకును దాన మందిచ్చుట హి

నపుఁ గుక్క నోటిలోపల
నిపుణత నెయిపోసినట్లు నెగడుఁ గుమారా! ॥90॥

క. యోగ్యుల నరయఁగ లేక య
యోగ్యులకున్ దాన మొసఁగు చుండుట యది స
ద్భోగ్యసతిన్ షండునకున్
భాగ్యముఁగని పెండ్లిచేయు పగిదిఁ గుమారా! ॥91॥

క. దీనుం డైనను శాత్రవుఁ
డైనన్ శరణనుచు వేఁడు నపుడు ప్రియత న
మ్మానవుని కోర్కెఁ దీర్చిన
వాని సుజనుఁడండ్రు బుధులు వసుధఁ గుమారా! ॥92॥

క. పాపంబులందు నెక్కుడు
పాపములు సుమీ! ధరిత్రి పై క్రోధగుణం
బేపారు లోభమును నివి
యేపురుషులఁ జెందఁగూడ దిలను గుమారా! ॥93॥

క. మునుగల్గి ధర్మమును జే
యునతఁడు పేదవడెనేని యున్నంతకుఁ దో
చిన భంగి నర్థులకు ని
చ్చునతఁడె బహుపుణ్యపూరుషుండు కుమార! ॥94॥

క. కడుమెల్లన నిడు నుత్తర
మడఁచును గోపమును దీక్షమమరఁగ దా న
ప్పుడు నుడివెడు నుత్తరముడి
వడిఁ గోపముఁ బెంచు నరయ వసుధఁ గుమారా! ॥95॥

క. మిత్రుండు దనకు విశ్వా
మిత్రముఁ జేసినను గాని మే లనవచ్చున్,
శాత్రవుఁడు ముద్దు గొన్నను,
ధాత్రిం దన కదియె కీడు తలపఁ గుమారా! ॥96॥

క. ధర నొక్క బుద్ధిహీనునిఁ
దిరముగ రోటనిడి దంచెఁ దేనియుఁ బెలుచం

దురు మగును గాని, యతనికి
సరసత్వము గలుగదండ్రు సతము కుమారా! ॥97॥

క. విత్తంబు విద్య కుల ము
న్మత్తులకు మదం బొసంగు మాన్యులకున్ స
ద్వృత్తి నొసంగున్, వీనిం
జిత్తంబున నిడి మెలగఁ జెలఁగు కుమారా! ॥98॥

క. ధరఁ గఱవుఁ గోరి ధాన్యం
బిరవున నిడుకొనినవాని నెగ్గింపఁ దలం
తురు, వాని నమ్మఁ దలఁచిన
పురుషుని నుత్తముఁడటంచుఁ బొగిడి కుమారా! ॥99॥

క. ఋణ మధిక మొనర్చి సమ
ర్పణ జేసిన తండ్రి, విద్య రాని కొడుకు, ల
క్షణశాలి రాణి దుశ్చా
రిణి యగు జననియును దలప రిపులు కుమారా! ॥100॥

క. మర్మము పరులకుఁ దెలుపకుఁ
దుర్మార్గున చెంత నెపుడు దూరకు, మిల దు
ష్కర్మములఁ జేయ నొల్లకు,
నిర్మలమతి నుంట లెస్స నిజము కుమారా! ॥101॥

క. సారమతి నిటుల తిరిగెడి
పూరుషరత్నంబు కీర్తిఁ బొందుచు ధరపై
గోరినకోర్కె ఫలము శ్రీ
మీఱ ననుభవించుచుండు మిగులఁ గుమారా! ॥102॥

క. ఇల ఫక్కికులోద్భవుఁడ
ప్పల నరసింహాఖ్యుఁ డిట్టి పద్ధతులు ధరం
గల బాలుర కెల్ల గుణం
బులు కలుగఁగ వెలయఁజెప్పె బుద్ధి కుమారా! ॥103॥

క. పదునెనిమిదివందల యఱు
వది యగు క్రీస్తుశకమందు వరరౌద్రిని మే

లొదవ రచింపబడె ని
య్యది బాలురకొఱకుఁ బౌష మందుఁ గుమారా! ॥104॥

కుమారీ శతకము

ఫక్కి వేంకట నరసింహ కవి

క. శ్రీ భూ నీళా హైమవ
తీ భారతు లతుల శుభవతిగ నెన్నుచు స
త్సౌభాగ్యము నీ కొసఁగఁగ
లో భావించెదరు ధర్మలోల కుమారీ! ॥1॥

క. చెప్పెడి బుద్ధులలోపలఁ
దప్పకు మొకటైన సర్వ ధర్మములందున్
మెప్పొంది యిహపరంబులఁ
దప్పింతయు లేక మెలగఁ దగును కుమారీ! ॥2॥

క. ఆటలఁ బాటలలో నే
మాటయు రాకుండఁ దండ్రి మందిరమందున్
బాటిల్లుఁ గాపురములో
వాట మెఱిఁగి బాల! తిరుగ వలయుఁ గుమారీ! ॥3॥

క. మగనికి నత్తకు మామకుఁ
దగ సేవ యొనర్చుఁచోటఁ దత్పరిచర్యన్
మిగుల నుతిఁ బొందుచుండుట
మగువలకుం బాడి తెలిసి మసలు కుమారీ! ॥4॥

క. పెనిమిటి వలదని చెప్పిన
పని యెన్నఁడుఁ జేయరాదు బావల కెదుటన్
కనఁబడఁగ రాదు కోపము
మనమున నిడుకొనక యెపుడు మసలు కుమారీ! ॥5॥

క. పరపురుషు లన్న దమ్ములు,
వరుఁడే దైవంబు, తోడి పడుచులు వదినల్
మఱిదండ్రు నత్తమామలు
ధరఁ దల్లియుఁ దండ్రి యనియుఁ దలఁపు కుమారీ! ॥6॥

క. పదములపైఁ జెయివేయక
మదవతి పతిచెంత నిద్ర మరగినఁ జేతుల్
గదలంగనీక కట్టుచు
గదఁ గొని శిక్షించు యముఁడు కాంక్షఁ గుమారీ! ॥7॥

క. తెచ్చినఁ దేకుండిన నీ
కిచ్చిన నీకున్న మగని నెగ్గాడకుమీ
యొచ్చెము నీపైఁ దేలును
రచ్చల కామాట లెక్కు రవ్వ కుమారీ! ॥8॥

క. మఱుదండ్రు వదినె లత్తలు
మఱఁదులు బావల కొమాళ్లు మఱి పెద్దలు రా
నురవడిఁ బీటలు మంచము
లరుఁగులు దిగుచుండవలయు నమ్మ కుమారీ! ॥9॥

క. నోరెత్తి మాటలాడకు
మాఱాడకు కోపపడిన మర్యాదలలో
గోరంత తప్పి తిరుగక
మీఱకుమీ యత్తపనుల మెలఁగు కుమారీ! ॥10॥

క. పతి పరకాంతలతో సం
గతిఁ జేసిన నాదుపుణ్యగతి యిట్లనుచున్
మతిఁ దలఁపవలయు లేదా
బతిమాలఁగవలయుఁ గలహ పడక కుమారీ! ॥11॥

క. పతి పాపపుఁ బనిఁజెప్పినఁ
బతిమాలి మరల్పవలయుఁ బతి వినకున్నన్
హిత మనుచు నాచరింపుము
మతిలోపల సంశయంబు మాని కుమారీ! ॥12॥

క. తిట్టిన దిట్టక, కొట్టిన
గొట్టక, కోపించెనేనిఁ గోపింపక, నీ
పుట్టినయింటికిఁ, బాదము
పెట్టినయింటికిని వన్నె పెట్టు కుమారీ! ॥13॥

క. దబ్బరలాడకు కదిమిన
బొబ్బలు పెట్టకుము మంచి బుద్ధిగలిగి యెం
దెబ్బెఱికముఁ బూనక కడుఁ
గొబ్బునఁ జిత్తమున వానిఁ గూర్పు కుమారీ! ॥14॥

క. పతి భుజియించిన పాత్రను
మెతు కొక్కటియైన భార్య మెసఁగుటకై తా
హిత మూనకున్న నది యొక
సతియే? కడుఁ బాపజాతి జగతి కుమారీ! ॥15॥

క. జపములు, గంగాయాత్రలు,
దపములు, నోములును, దాన ధర్మంబులు, పు
ణ్యపురాణము పతిభక్తికి
నుపమింపను సాటి రాక యుండు కుమారీ! ॥16॥

క. ఇరుగు పొరుగిండ్ల కైనను
వరుఁడో, కాక అత్తగారో, వదినెయొ, మామో
మఱఁదియో సెల విడకుండఁగఁ
దరుణి స్వతంత్రించి పోవఁ దగదు కుమారీ! ॥17॥

క. కూతురు చెడుగై యుండిన
మాతది తప్పన్నమాట మది నెఱుగుదుగా
నీతల్లిదండ్రులకు నప
ఖ్యాతులు రానీయఁ గూడదమ్మ! కుమారీ! ॥18॥

క. అమ్మకు రెం డబ్బకు రెం
డిమ్మహిఁ దిట్టించు కూఁతురెందుకు ధర నా
ద్రిమ్మరి పుట్టక పోయిన
నిమ్మళమని యండ్రు జనులు నిజము కుమారీ! ॥19॥

క. తన బావల పిల్లల యెడఁ
దన మఱఁదుల పిల్లలందుఁ దనపిల్లల కం
టెను మక్కువ యుండవలెన్
వనితల కటులైన వన్నె వచ్చుఁ గుమారీ! ॥20॥

క. ధనహీనుఁడైనఁ గడు దు
ర్జనుఁడైనఁ గురూపియైన జారుండైనన్
వినుఁ పాపియైన నెప్పుడుఁ
దనపతియే తనకు దైవతంబు కుమారీ! ॥21॥

క. ధనవంతు డైనఁ యప్పుడుఁ
పెనిమిటి చిత్తం బెఱింగి పెండ్లాము మెలం
గును లేమి మెలఁగ నేర్చిన
వనితకు లోకమున వన్నె వచ్చుఁ గుమారీ! ॥22॥

క. తలిదండ్రు లన్నదమ్ములు
తులఁ దూగఁగ నిమ్ము పసిడిఁ తోనైనను వా
రలయింట సతత ముండుట
వెలఁదికి మర్యాదగాదు వినవె కుమారీ! ॥23॥

క. కడుపారఁ గూడుఁ గూరలు
దొడవులు వస్త్రములు మిగుల దొరకవనుచుం దా
వడితనమునఁ బెనిమిటితో
నెడఁ బాసి చరింపఁ గూడదెపుడు కుమారీ! ॥24॥

క. పిల్లలఁ గనుగొనఁ దలఁచిన
యిల్లాలు గతాగతంబు లెఱుఁగక ఱాఁగై
యల్లరిఁ బెట్టినఁ జెడుఁ దా
నుల్లసములఁ బడును, గీడు నొందుఁ గుమారీ! ॥25॥

క. పతి కత్తకు మామకు స
మ్మతిగాని ప్రయోజనంబు మానఁగవలయున్
హిత మాచరింపవలయును
బ్రతుకున కొకవంక లేక పరఁగు గుమారీ! ॥26॥

క. పోకిళ్ళు పోక పొందిక
నాకులలోఁ బిందెరీతి నడఁకువగా నెం
తో కలిసిమెలసి యుండిన
లోకములోపలను దా వెలుంగుఁ గుమారీ! ॥27॥

క. అత్తపయిన్ మఱఁదలిపయి
నెత్తిన కోపమున బిడ్డ నేడ్పించుటకై
మొత్తినఁ దనకే కీడగుఁ
జిత్తములో దీనిఁ జింత సేయు కుమారీ! ॥28॥

క. మృతియైనను బ్రతుకైనం
బతితోడనె సతికిఁ జెల్లుఁ బతిబాసిన యా
బ్రతు కొక బ్రతుకా! జీవ
న్మృతి గాక వధూటి కెన్న నిదియుఁ గుమారీ! ॥29॥

క. మగని ప్రియ మబ్బె ననుచును
దెగ నీలిగి యింటివారి దిగఁద్రొక్కుచు దుం
డగురాలై తిరిగిన సరి
మగువలలో నిదియె తప్పు మాట కుమారీ! ॥30॥

క. జీవములు భర్తపద రా
జీవములని చిత్తమందు జింతించిన ల
క్ష్మీవల్లభు చరణంబుల
సేవ లతాంగులకు నెమ్మిఁ జేయుఁ గుమారీ! ॥31॥

క. కడు బుద్ధిగలిగి మెలఁగినఁ
బడఁతుక పుట్టింటివారు పదివేలవరా
లిడుకంటెఁ గీర్తియగు ద
మ్మిడి లేకుండినను నేర్చి మెలఁగు కుమారీ! ॥32॥

క. కడుఁ బెద్దమూటఁ దెచ్చినఁ
జెడుగై వర్తించు నేనిఁ జిరతర చింతం
బడుదురు తల్లిదండ్రులు తోఁ
బడుచులు సోదరులు నిందఁ బడుదురుఁ గుమారీ! ॥33॥

క. పుట్టింటివారి నీచతఁ
బెట్టకు మత్తింటివారు పెట్టెడి బాధల్
పుట్టింటఁ దెలియనీకు
రట్టడి చెలియందు రదియె రవ్వ కుమారీ! ॥34॥

క. తనకెంత మేలు చేసిన
మనమున కింపైన పనులుఁ మసలిన దాసీ
వనితల కెన్నటికైనం
జనవిచ్చి మెలంగరాదు జగతిఁ గుమారీ! ॥35॥

క. కులదేవతలకుఁ బెట్టిన
పొలుపునఁ దనయింటయాఁడు బొట్టెల కెల్లం
గలమాత్ర మొసఁగకుండినఁ
గలఁత పొడము దాన మేలు గాదు కుమారీ! ॥36॥

క. బద్ధకము సంజనిద్దుర
వద్దుసుమీ దద్దిరంబు వచ్చును దానన్
గద్దింతు రింటివారలు
మొద్దందురు తోడివారు ముద్దు కుమారీ! ॥37॥

క. ఇంటఁ గల గుట్టు నీ పొరు
గింట రవంతైనఁ దెలుప నేఁగకు దానం
గంటనపడి నీవారలు
గెంటించెద రిల్లు వెడలఁ గినుకఁ గుమారీ! ॥38॥

క. వేకువజామున మేల్కని
పైకి వెడలి వచ్చి ప్రాచి పనిఁ దీర్పవలెన్
లేకున్నఁ దెల్లవాఱిన
లోకులు నవ్వుదురు సభల లోనఁ గుమారీ! ॥39॥

క. ఇక్కడి దక్కడఁ నక్కడి
దిక్కడఁ జెప్పినను వారి కిద్దఱికిఁ బగల్
పొక్కినఁ గల చేడియ ల
మ్మక్కా! యిడుముళ్ళమారి యండ్రు కుమారీ! ॥40॥

క. తలవాకిట నెల్లప్పుడు
నిలువఁగ రా దెప్పు డెంత నిద్దురయైనన్
మెలఁకువ విడరాదు సుమీ
తల నడుచుచు విప్పికొనుట తగదు కుమారీ! ॥41॥

క. వారికి వీరికిఁ గలిగెను
గోరిన వస్తువులు మాకుఁ గొదవాయె నటం
చూరక గుటకలు మ్రింగుట
నేరముగాఁ దలఁపవలయు నెలఁత కుమారీ! ॥42॥

క. కొన్నాళ్లు సుఖము కష్టము
కొన్నాళ్లు భుజింపకున్నఁ గొఱగాదు సుమీ!
పున్నమ దినముల వెన్నెల
యెన్నంగ నమాసలందు నిరులు కుమారీ! ॥43॥

క. పొంతఁ బని సేయ కెన్నఁడు
పంతంబులు పలుకఁబోకు ప్రాఙ్ముఖముగ నీ
దంతంబులు దోమకు మే
కాంతంబులు బయలుపఱుప కమ్మ! కుమారీ! ॥44॥

క. నడకలలో నడుగుల చ
ప్పుడు వినఁబడకుండవలయు భువి గుంటలు క
న్పడరాదు మడమనొక్కులఁ
బడఁతుల మర్యాద లెఱిఁగి బ్రతుకు కుమారీ! ॥45॥

క. నవ్వంగ రాదు పలుమఱు
నవ్వినఁ జిఱునవ్వు గాని నగరా దెపుడున్
గవ్వలవలె దంతంబులు
జవ్వునఁ గానంగ బడెడి జాడఁ గుమారీ! ॥46॥

క. తొడవులు మిక్కిలి గలిగినఁ
గడుఁ ప్రేమన్ మగఁడు మిగుల గారామిడినన్
పడఁతుక పసుపుం గుంకుమ
గడియైనను విడువ రాదు గాదె కుమారీ! ॥47॥

క. చెడుఁగులతో లంజెలతో
గుడిసేటులతోడఁ బొత్తుఁ కూడదు మది నె
ప్పుడు నిల నుత్తమ కాంతల
యడుగులకు న్మడుగులొత్తు మమ్మ కుమారీ! ॥48॥

క. విసువకు పని తగిలినయెడఁ
గసరకు సేవకుల మిగులఁ గాంతునితోడన్
రొసరొస పూనకు మాడకు
మసత్యవచనంబు లెన్నఁ డైనఁ గుమారీ! ॥49॥

క. వేళాకోళంబులు గ
య్యాళితనంబులును జగడ మాడుటలును గం
గాళీపోకలుఁ గొండెము
లాలోచించుటయుఁ గూడ దమ్మ కుమారీ! ॥50॥

క. బంతులను బక్షపాత మొ
కింతైనను జేయరాదు హీనదశుల సా
మతుల నొక భంగి నిరీ
క్షింతురు బుధులెల్ల సంతసిల్లం గుమారీ! ॥51॥

క. మాసినతల మాసినయిలు
మాసిన వలువలు దరిద్ర మార్గంబులు నెం
తేసి ధనవంతులైనను
గాసిల్లుదు రల్పదశల గ్రాఁగి కుమారీ! ॥52॥

క. సన్నెకలుం బొత్రమ్మును
తన్నుకబోరాదు కాలఁ దగిలిన యెడలన్
గన్నుల నద్దుకొన న్వలెఁ
గ్రన్నన సిరి యందు నిలుచుఁ గాదె కుమారీ! ॥53॥

క. దీపము వెలిగిం చెడిచోఁ
జీపురుపుడ కుంచవలయుఁ జేతుల నేతం
బాపము పాలౌదువు మది
లోపల నిది తలఁపవలయు రూఢిం గుమారీ! ॥54॥

క. సరకులయెడ జాగ్రత్తయుఁ
జుఱుకు పనులయందు భక్తి సుజనులయందున్
గరుణ యనాథుల యెడలం
దరుణికి జెలువారవలయు ధరణిఁ గుమారీ! ॥55॥

క. చెప్పినఁ జెప్పక యుండినఁ
దప్పక సేయంగవలయుఁ దనపనులెల్లన్
మెప్పొందవఁగాను లేదా
ముప్పొదవును గాదె యెందు ముద్దు కుమారీ! ॥56॥

క. ఎంగిలి పరులకుఁ బెట్టకు
క్రంగున మ్రోయంగనీకు కాల్మెట్టియలన్
బంగారు లాభ ముండిన
దొంగతనము సేయుబుద్ధి దొలఁచు కుమారీ! ॥57॥

క. ఆపదల కోర్చి సంపద
లాపయి భోగించు ననెడి హర్షోక్తుల నీ
లోపలఁ దలఁచుచు లాంతరు
దీపముచందమున వెలుఁగఁ దివురు కుమారీ! ॥58॥

క. తనకడుపు కట్టుకొని యై
నను జుట్టమ్మునకు బెట్టి నను గీర్తి వహిం
చును భుక్తి ముక్తు లబ్బును
దన కెవ్వరు సాటిరారు ధరణిఁ గుమారీ! ॥59॥

క. వడి దనిపించుకొనుటకున్
గడి యైననుఁ బట్టకుండుఁ గాంతలలో నె
క్కుడు గుణవతి యనిపించెడి
నడవడి నేర్చుటయె కడు ఘనంబు కుమారీ! ॥60॥

క. చెప్పకు చేసినమేలు నొ
కప్పుడయినఁ గాని దాని హర్షింపరుగా
గొప్పలు చెప్పిన నదియును
దప్పే యని చిత్తమందుఁ దలఁపు కుమారీ! ॥61॥

క. ఎంతటి యాఁకలి కలిగిన
బంతిని గూర్చుండి ముందు భక్షింపకు సా
మంతులు బంధువులును నిసు
మంతైనను జెల్ల దందు రమ్మ కుమారీ! ॥62॥

క. అధికారము లేనిపనుల
కధికారము సేయఁబోకు మందునఁ గోపం
బధికం బగు నీవారికి
బుధు లది విని హర్ష మొందఁ బోరు కుమారీ! ॥63॥

క. తా నమ్ముడు వడియైనం
దీనుండగు ధవునియార్తిఁ దీర్చగ సతికిన్
మానము చంద్రమతీ జల
జాననఁ దలపోయవలయు నాత్మఁ గుమారీ! ॥64॥

క. తనకంటెఁ బేదరాండ్రం
గని యంతకుఁ దనకు మేలు గా యనవలయున్
దనకంటె భాగ్యవంతులఁ
గని గుటకలు మ్రింగ మేలు గాదు కుమారీ! ॥65॥

క. విఱుగఁబడి నడువఁ గూడదు
పరుల నడక లెన్ని తప్పు బట్టఁజనదు ని
ష్ఠురములు వచింపఁగూడదు
కఱపఁగవలె మేలు మేలు గలదు కుమారీ! ॥66॥

క. కోపమున నప్పు డాడ ని
రూపించినమాటఁ గొన్ని రోజులు చనినం
జూపెట్టుదు నని శాంతము
లోపలఁ గొనవలయు ధర్మలోల! కుమారీ! ॥67॥

క. కలహపడునింట నిలువదు
కలుముల జవరాలు కానఁ గలకాలం బే
కలహములు లేక సమ్మతి
మెలఁగంగా నేర్చెనేని మేలు కుమారీ! ॥68॥

క. గురుశుక్రవారముల మం
దిర గేహములందు లక్ష్మి తిరముగ నిలుచుం
గరగరిక నలకి మ్రు గ్గిడి
గురుభక్తి మెలంగఁ బాయు గొదువ కుమారీ! ॥69॥

క. అపకీర్తి బొందుట క
ష్టపుఁబని గా దొక్క గడియ చాలును గీర్తిన్
నిపుణత వహింపవలయును
జపలగుణములెల్లఁ బాసి చనఁగఁ గుమారీ! ॥70॥

క. సరకులు బట్టలు వన్నెల
కెరవులు తేఁదగదు తెచ్చెనేని సరకు ల
క్కఱఁ దీర్చుకొనుచు వెంటనె
మరలింపకయున్నఁ దప్పు మాట కుమారీ! ॥71॥

క. గొప్పదశ వచ్చెననుచు నొ
కప్పుడయిన గర్వపడకు మదిఁ దొలఁగినచో
జప్పట్లు చరతు రందఱుఁ
దప్పని దండించు దండధరుఁడు కుమారీ! ॥72॥

క. సుమతియును జంద్రమతియును
దమయంతియు జానకియును ద్రౌపదియును బ
న్నములం బడి పతిభక్తిం
గ్రమమున నడుపుటలు తలఁప గాదె? కుమారీ! ॥73॥

క. సుమతి యను రమణి పతికై
శ్రమనొందుట నీచసేవ సలుపుటయు వియ
ద్గమననిరోధము భానున
కమరించుటయుం దలంపు మాత్మఁ గుమారీ! ॥74॥

క. వాణియు శర్వాణియు హరి
రాణియు వాక్కునను మైనురంబున నుంటల్
రాణఁ దిలకించి మదిలో
బాణిగ్రాహియెడ నిల్పు భక్తిఁ గుమారీ! ॥75॥

క. వడ్డించునపుడు తాఁ గను
బిడ్డనికిం దల్లిభంగిం బ్రేమ దలిర్పన్
వడ్డింపవలయు భర్తకు
నెడ్డెతనము మానవలయు నెందుఁ గుమారీ! ॥76॥

క. పవళించునపుడు రంభా
కువలయదళనేత్రభంగి గోరినరీతిన్
ధవుని కొనఁగూర్పవలయును
దివి భువి నుతిఁ బొందునట్టి తెఱవ కుమారీ! ॥77॥

క. ఆలోచన యొనరించెడి
వేళలలో మంత్రిభంగి వివరింపవలెన్
కాలోచిత కృత్యంబుల
భూలోకమునందుఁ గీర్తి బొందుఁ గుమారీ! ॥78॥

క. పనిసేయునపుడు దాసీ
వనితవిధంబునను మేను పంపఁగవలయున్
ధనవంతుల సుత యైనను
ఘనత గలుగు దానివలనఁ గాదె కుమారీ! ॥79॥

క. దానములు ధర్మకార్యము
లూనంగాఁ గలిగినంత యుక్తక్రియలన్
మానవతుల కిది ధర్మము
గా నెఱిఁగి యొనర్పవలయుఁ గాదె కుమారీ! ॥80॥

క. శ్రమ యెంత సంభవించిన
క్షమ మఱువఁగ రాదు ధరణి చందంబున స
త్యమునఁ బ్రవర్తించిన యా
రమణియె లోకంబునందు రమణి కుమారీ! ॥81॥

క. ఈ రీతిఁ దిరుగ నేర్చిన
నారీమణి కీర్తిఁ బొందు నరలోకమునన్
దూఱులు తొలంగి పోవును
ఘోరదురితసంఘ మెల్ల గుందుఁ గుమారీ! ॥82॥

క. కామము సంకల్పంబున
బామొందెడుఁ దొలగుఁ దేహ భావము దెలియన్
వేమఱు నిది పరికించుట
క్షేమం బగు ముక్తిఁ గని సుఖింపు కుమారీ! ॥83॥

క. పరజనము లాచరించెడి
దురితంబునఁ గ్రోధగుణము దోఁచెడి నధిక
స్ఫురణన్ క్షమఁ గైకొనినం
దఱుఁగు నది యెఱింగి మెలఁగ దగును కుమారీ! ॥84॥

క. దృశ్యపదార్థము లెల్లను
నశ్యము లని తలపఁ కుండినను లోపంబౌ
దృశ్యంబున నస్థిరత న
వశ్యము చిత్తమునఁ దలఁప వలదె కుమారీ! ॥85॥

క. జనియించెడు నజ్ఞానం
బున మోహగుణంబు, ధర్మమునఁ బరికింపం
దునుమాడఁ బడును దీనిం
గనుఁగొని మెలఁగంగ వలయుఁ గాదె కుమారీ! ॥86॥

క. కులమున విత్తంబున వి
ద్యలను మదం బుద్భవించు నాయా పెంపుల్
తలపోయ మరలు నిది హృ
జ్జలజంబునఁ దలఁపవలయు సతముఁ గుమారీ! ॥87॥

క. మాత్సర్య మొదవు సత్యము
హృత్సరసీజమున లేమి నెల్లప్పుడుఁ దా
సత్సేవయందుఁ దిరిగిన
మాత్సర్య మణంగుఁ దెలిసి మనుము కుమారీ! ॥88॥

క. బహుకష్టములం బొందక
మహిలో సమకూడఁబోదు మానవజన్మం
బహహా! యీ జన్మంబున
నిహపరములఁ గొనెడుజాడ లెఱుఁగు కుమారీ! ॥89॥

క. ఎన్నాళ్లు బ్రతుకఁ బోదురు
కొన్నాళ్లకు మరణదశలఁ గ్రుంగుట జగమం
దున్నట్టివారి కందఱి
కిన్నిహితము సతము మంచి కీర్తి కుమారీ! ॥90॥

క. పెనిమిటికన్నఁ బతివ్రత
మునుపే మృతిఁ బొందెనేనిఁ బురుషాగమనం
బున కెదురుచూచు వచ్చినఁ
గనుగొని యనురాగ మెనయఁ గలయుఁ గుమారీ! ॥91॥

క. మును నాథుఁడు దరలినచో
వెనువెంటనె పోయి యెల్ల వేల్పులు పొగడం
గని యెందు నిందు నందును
ఘనకీర్తులఁ బొందుచుండుఁ గాదె కుమారీ! ॥92॥

క. మఱువవలెఁ గీడు నెన్నఁడు
మఱువంగారాదు మేలు మర్యాదలలోఁ
దిరుగవలె సర్వజనములు
దరిఁ బ్రేమ మెలంగవలయుఁ దరుణి కుమారీ! ॥93॥

క. ఆకు లొకిన్నియుఁ జేకొని
పోఁక నమిలి సున్న మడుగఁ బోయినఁ గని యీ
లోకులు నవ్వుదురు సుమీ!
కైకొనవలె మంచినడత ఘనతఁ గుమారీ! ॥94॥

క. నేలన్ వ్రాలిన పత్రము
లోలిం జోడించి, మడచు చుండిన యవియున్
బోలఁగ సున్నపుటాకులు
దూలించు దరిద్రదశల దోచఁ గుమారీ! ॥95॥

క. ఇద్దఱు గూడుక యొక చో
నొద్దిక మాటాడుచుండ నొదిఁగి యొదిఁగి యా
యొద్దకుఁ జనఁగూడదు తన
పెద్దతనంబెల్ల నణఁగ బెట్టుఁ గుమారీ! ॥96॥

క. తుడుపుదుమారమ్మును జెరు
గుడుధూళియు మేషరజముఁ గూడ దెపుడు మైఁ
బడ నెఱిఁగి తిరుగ నేర్చిన
బడఁతుల మర్యాద లెఱిఁగి బ్రతుకు కుమారీ! ॥97॥

క. దీపములనీడ మానవ
రూపంబులనీడ శనితరులనీడను ఖ
ట్వాపాదిత మగు నీడ
నేపట్టున నిలువఁగూడ దెపుడుఁ గుమారీ! ॥98॥

క. కొనగోళ్ళ వ్రేలువెండ్రుక
లను జాఱెడునీళ్ళు, కుండలన్ ముంతల వా
డిన వెన్క మిగులునీళ్ళును
జన దండ్రు దరిద్ర మొందు జగతిఁ గుమారీ! ॥99॥

క. ధర బక్కికులుఁడు వేంకట
నరసింహకవీంద్రుఁ డిట్టి నడతలు ధరపైఁ
దెఱవల తెరువు లటంచును
జిరతర సత్కీర్తి వెలయఁ జెప్పెఁ గుమారీ! ॥100॥

నీతి శతకము

భర్తృహరి

||మంగళాచరణమ్||

శ్లో. దిక్కాలాద్యనవచ్ఛిన్నానంత చిన్మాత్ర మూర్తయే ।
స్వానుభూత్యేక మానాయ నమః శాంతాయ తేజసే ॥

||మూర్ఖపద్ధతి||

శ్లో. బోద్ధారో మత్సర గ్రస్తాః ప్రభవః స్మయ దూషితాః ।
అబోధోపహతాః చాన్యే జీర్ణమంగే సుభాషితమ్ ॥ 1॥

శ్లో. అజ్ఞః సుఖమారాధ్యః సుఖతరమారాధ్యతే విశేషజ్ఞః ।
జ్ఞానలవ దుర్విదగ్ధం బ్రహ్మాపి తం నరం న రంజయతి ॥ 2॥

శ్లో. ప్రసహ్య మణిముద్ధరేన్మకర వక్త్ర దంష్ట్రాంతరాత్
సముద్రమపి సంతరేత్ప్రచలదూర్మి మాలాకులమ్ ।
భుజంగమపి కోపితం శిరసి పుష్పవద్ధారయేత్
న తు ప్రతినివిష్ట మూర్ఖ జన చిత్తమారాధయేత్ ॥ 3॥

శ్లో. లభేత సికతాసు తైలమపి యత్నతః పీడయన్
పిబేచ్చ మృగ తృష్ణికాసు సలిలం పిపాసార్దితః ।
కదాచిదపి పర్యటన్ శశ విషాణమాసాదయేత్
న తు ప్రతినివిష్ట మూర్ఖ జనచిత్తమారాధయేత్ ॥ 4॥

శ్లో. వ్యాళం బాల మృణాల తంతుభిరసౌ రోద్ధుం సముజ్జృంభతే
భేత్తుం వజ్రమణిం శిరీషకుసుమ ప్రాంతేన సన్నహ్యతి ।
మాధుర్యం మధుబిందునా రచయితుం క్షారాంబుధే రీహతే
మూర్ఖాన్యః ప్రతినేతు మిచ్ఛతి బలాత్సాక్షైః సుధా స్యందిభిః ॥ 5॥

శ్లో. స్వాయత్త మేకాంతహితం విధాత్రా
వినిర్మితం ఛాదనమజ్ఞతాయాః ।

విశేషతః సర్వ విదాం సమాజే
విభూషణం మౌనమపండితానామ్ ॥ 6॥

శ్లో. యదా కించిద్జ్ఞోఽహం ద్విప ఇవ మదాంధః సమభవం
తదా సర్వజ్ఞోఽస్మీత్యభవ దవలిప్తం మమ మనః ।
యదా కించిత్కించిద్బుధజన సకాశాదవగతం
తదా మూర్ఖోఽస్మీతి జ్వర ఇవ మదో మే వ్యపగతః ॥ 7॥

శ్లో. కృమి కుల చిత్తం లాలా క్లిన్నం విగంధి జుగుప్సితం
నిరుపమ రసం ప్రీత్యా ఖాదన్నరాస్థి నిరామిషమ్ ।
సురపతిమపి శ్వా పార్శ్వస్థం విలోక్య న శంకతే
న హి గణయతి క్షుద్రో జంతుః పరిగ్రహ ఫల్గుతామ్ ॥ 8॥

శ్లో. శిరః శార్వం స్వర్గాత్పశుపతి శిరస్తః క్షితిధరం
మహీధ్రాదుత్తుంగాదవనిమవనేశ్చాపి జలధిమ్ ।
అధో గంగా సేయం పదముపగతా స్తోకమథవా
వివేక భ్రష్టానాం భవతి వినిపాతః శతముఖః ॥ 9॥

శ్లో. శక్యో వారయితుం జలేన హుతభుక్ఛత్రేణ సూర్యాతపో
నాగేంద్రో నిశితాంకుశేన సమదో దండేన గౌర్గర్దభః ।
వ్యాధిర్భేషజ సంగ్రహైశ్చ వివిధైర్మంత్ర ప్రయోగైర్విషం
సర్వస్యౌషధమస్తి శాస్త్ర విహితం మూర్ఖస్య నాస్త్యౌషధమ్ ॥ 10॥

॥విద్వత్ప్రశంస॥

శ్లో. శాస్త్రోపస్కృత శబ్ద సుందర గిరః శిష్య ప్రదేయాగమా
విఖ్యాతాః కవయో వసంతి విషయే యస్య ప్రభోర్నిర్ధనాః ।
తజ్జాడ్యం వసుధాదిపస్య సుధియస్త్వర్థం వినాఽపీశ్వరాః
కుత్స్యాః స్యుః కుపరీక్షకై ర్నమణయో యైరర్ఘతః పాతితాః ॥ 11॥

శ్లో. హర్తుర్యాతి న గోచరం కిమపి శం పుష్ణాతి యత్సర్వదాఽ
ప్యర్థిభ్యః ప్రతిపాద్యమానమనిశం ప్రాప్నోతి వృద్ధిం పరామ్ ।

కల్పాంతేష్వపి న ప్రయాతి నిధనం విద్యాఖ్యమంతర్ధనం
యేషాం తాన్ప్రతిమానముజ్ఝత నృపాః కస్తైః సహ స్పర్ధతే ॥ 12॥

శ్లో. పరిగత పరమార్థాన్ పండితాన్ మాఽవమంస్థాః
తృణమివ లఘు లక్ష్మీర్నైవ తాన్ సంరుణద్ధి ।
అభినవ మద రేఖా శ్యామ గండ స్థలానాం
న భవతి బిసతంతుర్వారణం వారణానామ్ ॥ 13॥

శ్లో. అంభోజినీ వన విహార విలాసమేవ
హంసస్య హంతు నితరాం కుపితో విధాతా ।
న త్వస్య దుగ్ధ జల భేద విధౌ ప్రసిద్ధాం
వైదగ్ధ్య కీర్తిమపహర్తుమసౌ సమర్థః ॥ 14॥

శ్లో. కేయూరాణి న భూషయంతి పురుషం హారా న చంద్రోజ్జ్వలా
న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః ।
వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయంతేఽఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణమ్ ॥ 15॥

శ్లో. విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం
విద్యా భోగకరీ యశః సుఖకరీ విద్యా గురూణాం గురుః ।
విద్యా బంధుజనో విదేశ గమనే విద్యా పరా దేవతా
విద్యా రాజసు పూజ్యతే న హి ధనం విద్యా విహీనః పశుః ॥ 16॥

శ్లో. క్షాంతిశ్చేత్కవచేన కిం కిమరిభిః క్రోధోఽస్తి చేద్దేహినాం
జ్ఞాతిశ్చేదనలేన కిం యది సుహృద్దివ్యౌషధైః కిం ఫలమ్ ।
కిం సర్పైర్యది దుర్జనాః కిము ధనైర్విద్యాఽనవద్యా యది
వ్రీడా చేత్కిము భూషణైః సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్ ॥ 17॥

శ్లో. దాక్షిణ్యం స్వజనే దయా పరిజనే శాఠ్యం సదా దుర్జనే
ప్రీతిః సాధుజనే నయో నృపజనే విద్వజ్జనే చార్జవమ్ ।
శౌర్యం శత్రుజనే క్షమా గురుజనే కాంతాజనే ధృష్టతా
యే చైవం పురుషాః కళాసు కుశలాస్తేష్వేవ లోక స్థితిః ॥ 18॥

శ్లో. జాడ్యం ధియో హరతి సించతి వాచి సత్యం
మానోన్నతిం దిశతి పాపమపాకరోతి ।

చేతః ప్రసాదయతి దిక్షు తనోతి కీర్తిం
సత్సంగతిః కథయ కిం న కరోతి పుంసామ్ ॥ 19॥

శ్లో. జయంతి తే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః ।
నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్ ॥ 20॥

॥మానశౌర్య పద్ధతి॥

శ్లో. క్షుత్క్షామోఒపి జరాకృశోఒపి శిథిలప్రాయోఒపి కష్టాం దశామ్
ఆపన్నోఒపి విపన్న దీధితిరపి ప్రాణేషు నశ్యత్స్వపి ।
మత్తేభేంద్ర విభిన్న కుంభ పిశిత గ్రాసైక బద్ధ స్పృహః
కిం జీర్ణం తృణమత్తి మాన మహతామగ్రేసరః కేసరీ ॥ 21॥

శ్లో. స్వల్ప స్నాయు వసావసేక మలినం నిర్మాంసమప్యస్థి గోః
శ్వా లబ్ధ్వా పరితోషమేతి న తు తత్తస్య క్షుధా శాంతయే ।
సింహో జంబుకమంకమాగతమపి త్యక్త్వా నిహంతి ద్విపం
సర్వః కృచ్ఛ్రగతోఒపి వాంఛతి జనః సత్త్వానురూపం ఫలమ్॥ 22॥

శ్లో. లాంగూల చాలనమధశ్చరణావపాతం
భూమౌ నిపత్య వదనోదర దర్శనం చ ।
శ్వా పిండదస్య కురుతే గజ పుంగవస్తు
ధీరం విలోకయతి చాటు శతైశ్చ భుంక్తే ॥ 23॥

శ్లో. పరివర్తిని సంసారే మృతః కో వా న జాయతే ।
స జాతో యేన జాతేన యాతి వంశః సమున్నతిమ్ ॥ 24॥

శ్లో. కుసుమ స్తబకస్యేవ ద్వయీ వృత్తిర్మనస్వినః ।
మూర్ధ్ని వా సర్వలోకస్య శీర్యతే వన ఏవ వా ॥ 25॥

శ్లో. సంత్యన్యేఒపి బృహస్పతి ప్రభృతయః సంభావితాః పంచషాః
తాన్ప్రత్యేష విశేష విక్రమ రుచీ రాహుర్న వైరాయతే ।
ద్వావేవ గ్రసతే దివాకర నిశా ప్రాణేశ్వరౌ భాస్కరౌ
భ్రాతః పర్వణి పశ్య దానవపతిః శీర్షావశేషాకృతిః ॥ 26॥

శ్లో. వహతి భువన శ్రేణిం శేషః ఫణాఫలక స్థితాం
కమఠ పతినా మధ్యే పృష్ఠం సదా స చ ధార్యతే ।
తమపి కురుతే క్రోడాధీనం పయోధి రనాదరాత్
అహహ మహతాం నిఃసీమానశ్చరిత్ర విభూతయః ॥ 27॥

శ్లో. వరం ప్రాణోచ్ఛేదః సమదమఘవన్ముక్త కులిశ
ప్రహారై రుద్గచ్ఛద్బహుల దహనోద్గార గురుభిః ।
తుషారాద్రేఃసూనో రహహ పితరి క్లేశ వివశే
న చాసౌ సంపాతః పయసి పయసాం పత్యురుచితః ॥ 28॥

శ్లో. యదచేతనోఽపి పాదైః స్పృష్టః ప్రజ్వలతి సవితు రినకాంతః ।
తత్తేజస్వీ పురుషః పరకృతనికృతిం కథం సహతే ॥ 29॥

శ్లో. సింహః శిశురపి నిపతతి మద మలిన కపోల భిత్తిషు గజేషు ।
ప్రకృతిరియం సత్త్వవతాం న ఖలు వయస్తేజసాం హేతుః ॥ 30॥

॥అర్థ పద్ధతి॥

శ్లో. జాతిర్యాతు రసాతలం గుణ గణైస్తత్రాప్యధో గచ్ఛతాత్
శీలం శైల తటాత్పతత్వభిజనః సందహ్యతాం వహ్నినా ।
శౌర్యే వైరిణి వజ్రమాశు నిపతత్వర్థోఽస్తు నః కేవలం
యేనైకేన వినా గుణస్తృణ లవ ప్రాయాః సమస్తా ఇమే ॥ 31॥

శ్లో. యస్యాస్తి విత్తం స నరః కులీనః
స పండితః స శ్రుతవాన్గుణజ్ఞః ।
స ఏవ వక్తా స చ దర్శనీయః
సర్వే గుణాః కాంచనమాశ్రయంతి ॥ 32॥

శ్లో. దౌర్మంత్ర్యాన్నృపతిర్వినశ్యతి యతిః సంగాత్సుతో లాలనాత్
విప్రోఽనధ్యయనాత్కులం కుతనయాచ్ఛీలం ఖలోపాసనాత్ ।
హ్రీర్మద్యా దనవేక్షణాదపి కృషిః స్నేహః ప్రవాసాశ్రయాన్
మైత్రీ చాప్రణయాత్సమృద్ధిరనయాత్త్యాగ ప్రమాదాద్ధనమ్॥ 33॥

శ్లో. దానం భోగో నాశస్తిస్రో గతయో భవంతి విత్తస్య ।
యో న దదాతి న భుంక్తే తస్య తృతీయా గతిర్భవతి ॥ 34॥

శ్లో. మణిః శాణోల్లీఢః సమర విజయీ హేతి దళితో
మదక్షీణో నాగః శరది సరితః శ్యాన పులినాః ।
కలా శేషశ్చంద్రః సురత మృదితా బాలవనితా
తనిమ్నా శోభంతే గళితవిభవా శ్చార్థిషు నరాః ॥ 35॥

శ్లో. పరిక్షీణః కశ్చిత్ స్పృహయతి యవానాం ప్రసృతయే
స పశ్చాత్సంపూర్ణః కలయతి ధరిత్రీం తృణ సమామ్ ।
అతశ్చానేకాంతా గురులఘుతయాఽర్థేషు ధనినామ్
అవస్థా వస్తూని ప్రథయతి చ సంకోచయతి చ ॥ 36॥

శ్లో. రాజన్ దుధుక్షసి యది క్షితిధేను మేతాం
తేనాద్య వత్సమివ లోకమముం పుషాణ ।
తస్మింశ్చ సమ్యగనిశం పరిపోష్యమాణే
నానా ఫలైః ఫలతి కల్పలతేవ భూమిః ॥ 37॥

శ్లో. సత్యాఽనృతా చ పరుషా ప్రియభాషిణీ చ
హింస్రా దయాళురపి చార్థపరా వదాన్యా ।
నిత్యవ్యయా ప్రచుర నిత్య ధనాగమా చ
వారాంగనేవ నృపనీతి రనేకరీతిః ॥ 38॥

శ్లో. ఆజ్ఞా కీర్తిః పాలనం బ్రాహ్మణానాం
దానం భోగో మిత్రసంరక్షణం చ ।
యేషామేతే షడ్గుణా న ప్రవృత్తాః
కోఽర్థస్తేషాం పార్థివోపాశ్రయేణ ॥ 39॥

శ్లో. యద్ధాత్రా నిజఫాలపట్టలిఖితం స్తోకం మహద్వా ధనం
తత్ప్రాప్నోతి మరుస్థలేఽపి నితరాం మేరౌ చ నాతోఽధికమ్ ।
తద్ధీరో భవ విత్తవత్సు కృపణాం వృత్తిం వృథా మా కృథాః
కూపే పశ్య పయోనిధావపి ఘటో గృహ్ణాతి తుల్యం జలమ్ ॥ 40॥

॥దుర్జన పద్ధతి॥

శ్లో. అకరుణత్వమకారణ విగ్రహః
పరధనే పరయోషితి చ స్పృహా ।
సుజన బంధుజనేష్వసహిష్ణుతా
ప్రకృతి సిద్ధమిదం హి దురాత్మనామ్ ॥ 41॥

శ్లో. దుర్జనః పరిహర్తవ్యో విద్యయాఽలంకృతోఽపి సన్ ।
మణినా భూషితః సర్పః కిమసౌ న భయంకరః ॥ 42॥

శ్లో. జాడ్యం హ్రీమతి గణ్యతే వ్రతశుచౌ దంభః శుచౌ కైతవం
శూరే నిర్ఘృణతా మునౌ విమతితా దైన్యం ప్రియాలాపిని ।
తేజస్విన్యవలిప్తతా ముఖరతా వక్తవ్యశక్తౌ స్థిరే
తత్కో నామ గుణో భవేత్స గుణినాం యో దుర్జనైర్నాంకితః ॥ 43॥

శ్లో. లోభశ్చేదగుణేన కిం పిశునతా యద్యస్తి కిం పాతకైః
సత్యం చేత్తపసా చ కిం శుచి మనో యద్యస్తి తీర్థేన కిమ్ ।
సౌజన్యం యది కిం బలేన మహిమా యద్యస్తి కిం మండనైః
సద్విద్యా యది కిం ధనైరపయశో యద్యస్తి కిం మృత్యునా ॥ 44॥

శ్లో. శశీ దివసధూసరో గళితయౌవనా కామినీ
సరో విగతవారిజం ముఖమనక్షరం స్వాకృతేః ।
ప్రభు ర్ధనపరాయణః సతత దుర్గతిః సజ్జనో
నృపాంగణ గతః ఖలో మనసి సప్తశల్యాని మే ॥ 45॥

శ్లో. న కశ్చిచ్చండ కోపానామ్ ఆత్మీయో నామ భూభుజామ్ ।
హోతారమపి జుహ్వానం స్పృష్టో దహతి పావకః ॥ 46॥

శ్లో. మౌనాన్మూకః ప్రవచన పటుర్వాచకో జల్పకో వా
ధృష్టః పార్శ్వే భవతి చ వసన్ దూరతోఽప్యప్రగల్భః ।
క్షాంత్యా భీరుర్యది న సహతే ప్రాయశో నాభిజాతః
సేవాధర్మః పరమ గహనో యోగినామప్యగమ్యః ॥ 47॥

శ్లో. ఉద్భాసితాఖిల ఖలస్య విశృంఖలస్య
ప్రోద్గాఢ విస్తృత నిజాధమ కర్మవృత్తేః ।

దైవాదవాప్త విభవస్య గుణ ద్విషోఒస్య
నీచస్య గోచర గతైః సుఖమాప్యతే కైః ॥ 48॥

శ్లో. ఆరంభ గుర్వీ క్షయిణీ క్రమేణ
లఘ్వీ పురా వృద్ధి ముపైతి పశ్చాత్ ।
దినస్య పూర్వార్ధ పరార్ధ భిన్నా
ఛాయేవ మైత్రీ ఖల సజ్జనానామ్॥ 49॥

శ్లో. మృగ మీన సజ్జనానాం తృణ జల సంతోష విహిత వృత్తీనామ్ ।
లుబ్ధక ధీవర పిశునా నిష్కారణ మేవ వైరిణో జగతి ॥ 50॥

॥సుజన పద్ధతి॥

శ్లో. వాంఛా సజ్జనసంగతౌ పరగుణే ప్రీతిర్గురౌ నమ్రతా
విద్యాయాం వ్యసనం స్వ యోషితి రతిర్లోకాపవాదాద్భయమ్ ।
భక్తిః శూలిని శక్తిరాత్మ దమనే సంసర్గ ముక్తిః ఖలైః
యేష్వేతే నివసంతి నిర్మల గుణాస్తేభ్యో నమః కుర్మహే ॥ 51॥

శ్లో. విపది ధైర్యమథాభ్యుదయే క్షమా
సదసి వాక్పటుతా యుధి విక్రమః ।
యశసి చాభిరుచిర్వ్యసనం శ్రుతౌ
ప్రకృతి సిద్ధమిదం హి మహాత్మనామ్ ॥ 52॥

శ్లో. కరే శ్లాఘ్యస్త్యాగః శిరసి గురుపాద ప్రణయితా
ముఖే సత్యా వాణీ విజయి భుజయోర్వీర్యమతులమ్ ।
హృది స్వచ్ఛా వృత్తిః శ్రుతిమధిగతం చ శ్రవణయోః
వినాప్యైశ్వర్యేణ ప్రకృతి మహతాం మండనమిదమ్ ॥ 53॥

శ్లో. ప్రాణాఘాతాన్నివృత్తిః పరధనహరణే సంయమః సత్యవాక్యం
కాలే శక్త్యా ప్రదానం యువతిజనకథా మూకభావః పరేషామ్ ।
తృష్ణా స్రోతో విభంగో గురుషు చ వినయః సర్వ భూతానుకంపా
సామాన్యః సర్వ శాస్త్రేష్వనుపహత విధిః శ్రేయసామేష పంథాః ॥ 54॥

శ్లో. సంపత్సు మహతాం చిత్తం భవే దుత్పలకోమలమ్ ।
ఆపత్సు చ మహాశైల శిలా సంఘాత కర్కశమ్ ॥ 55॥

శ్లో. ప్రియా న్యాయ్యా వృత్తిర్మలినమసుభంగేఒప్యసుకరమ్
త్వసంతో నాభ్యర్థ్యాః సుహృదపి న యాచ్యః కృశ ధనః ।
విపద్యుచ్చైఃధైర్యం పదమనువిధేయం చ మహతాం
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్॥ 56॥

శ్లో. ప్రదానం ప్రచ్ఛన్నం గృహముపగతే సంభ్రమ విధిః
ప్రియం కృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః ।
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్ ॥ 57॥

శ్లో. సంతప్తాయసి సంస్థితస్య పయసో నామాపి న శ్రూయతే
ముక్తాకారతయా తదేవ నలినీపత్రస్థితం దృశ్యతే ।
అంతస్సాగర శుక్తిమధ్యపతితం తన్మౌక్తికం జాయతే
ప్రాయే ణాధమమధ్యమోత్తమ జుషా మేవంవిధా వృత్తయః ॥ 58॥

శ్లో. యః ప్రీణయే త్సుచరితైః పితరం స పుత్రో
యద్భర్తురేవ హితమిచ్ఛతి తత్కళత్రమ్ ।
తన్మిత్రమాపది సుఖే చ సమక్రియం య
దేతత్త్రయం జగతి పుణ్యకృతో లభంతే ॥ 59॥

శ్లో. నమ్రత్వేనోన్నమంతః పరగుణ కథనైః స్వాన్గుణాన్ఖ్యాపయంతః
స్వార్థాన్సంపాదయంతో విතత పృథుతరారంభ యత్నాః పరార్థే ।
క్షాంత్యైవాక్షేప రూక్షాక్షర ముఖర ముఖా న్దుర్జనా న్దుఃఖయంతః
సంతః సాశ్చర్యచర్యా జగతి బహుమతాః కస్య నాభ్యర్చనీయాః ॥ 60॥

॥పరోపకార పద్ధతి॥

శ్లో. భవంతి నమ్రాస్తరవః ఫలోద్గమైః
నవాంబుభిర్దూరావలంబినో ఘనాః ।

అనుద్ధతాః సత్పురుషాః సమృద్ధిభిః
స్వభావ ఏవైష పరోపకారిణమ్ ॥ 61॥

శ్లో. శ్రోత్రం శ్రుతేనైవ న కుండలేన
దానేన పాణిర్న తు కంకణేన ।
విభాతి కాయః కరుణ పరాణాం
పరోపకారేణ న చందనేన ॥ 62॥

శ్లో. పద్మాకరం దినకరో వికచం కరోతి
చంద్రో వికాసయతి కైరవ చక్రవాలమ్ ।
నాభ్యర్థితో జలధరోఒపి జలం దదాతి
సంతః స్వయం పరహితే విహితాభియోగాః ॥ 63॥

శ్లో. ఏతే సత్పురుషాః పరార్థ ఘటకాః స్వార్థాన్ పరిత్యజ్య యే
సామాన్యాస్తు పరార్థముద్యమ భృతః స్వార్థావిరోధేన యే ।
తేఒమీ మానుష రాక్షసాః పరహితం స్వార్థాయ నిఘ్నంతి యే
యే తు ఘ్నంతి నిరర్థకం పరహితం తే కే న జానీమహే ॥ 64॥

శ్లో. పాపాన్నివారయతి యోజయతే హితాయ
గుహ్యం నిగూహతి గుణాన్ప్రకటీకరోతి ।
ఆపద్గతం చ న జహాతి దదాతి కాలే
సన్మిత్ర లక్షణమిదం ప్రవదంతి సంతః ॥ 65॥

శ్లో. క్షీరేణాత్మగతోదకాయ హి గుణా దత్తాః పురా తేఒఖిలా
క్షీరోత్తాపమవేక్ష్య తేన పయసా స్వాత్మా కృశానౌ హుతః ।
గంతుం పావకమున్మనస్తదభవ ద్దృష్ట్వా తు మిత్రాపదం
యుక్తం తేన జలేన శామ్యతి సతాం మైత్రీ పునస్త్వీదృశీ ॥ 66॥

శ్లో. ఇతః స్వపితి కేశవః కులమితస్తదీయ ద్విషా
మితశ్చ శరణార్థినాం శిఖరిణాం గణాః శేరతే ।
ఇతోఒపి బడబానలః సహ సమస్త సంవర్తకై
రహో విత్తమూర్జితం భర సహం చ సింధోర్వపుః ॥ 67॥

శ్లో. జాతః కూర్మః స ఏకః పృథుభువనభరా యార్పితం యేన పృష్ఠం
శ్లాఘ్యం జన్మధ్రువస్య భ్రమతి నియమితం యత్ర తేజస్విచక్రమ్ ।

సంజాతప్యర్థపక్షాః పరహితకరణే నోపరిష్టా న్న చాధో
బ్రహ్మాండోదుంబరాంత ర్మశకవ దపరే జంతవో జాతనష్టాః ॥ 68॥

శ్లో. తృష్ణాం ఛింధి భజ క్షమాం జహి మదం పాపే రతిం మా కృథాః
సత్యం బ్రూహ్యనుయాహి సాధుపదవీం సేవస్వ విద్వజ్జనమ్ ।
మాన్యాన్మానయ విద్విషోఽప్యనునయ ప్రఖ్యాపయ ప్రశ్రయం
కీర్తిం పాలయ దుఃఖితే కురు దయా మేతత్సతాం చేష్టితమ్॥ 69॥

శ్లో. మనసి వచసి కాయే పుణ్య పీయూష పూర్ణాః
త్రిభువనముపకార శ్రేణిభిః ప్రీణయంతః ।
పరగుణ పరమాణూన్పర్వతీకృత్య నిత్యం
నిజహృది వికసంతః సంతి సంతః కియంతః ॥ 70॥

॥ధైర్య పద్ధతి॥

శ్లో. రత్నైర్మహాబ్ధే స్తుతుషుర్న దేవా
న భేజిరే భీమ విషేణ భీతిమ్ ।
సుధాం వినా న ప్రరయుర్విరామం
న నిశ్చితార్థాద్విరమంతి ధీరాః ॥ 71॥

శ్లో. ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః
ప్రారభ్య విఘ్ననిహతా విరమంతి మధ్యాః ।
విఘ్నైః పునః పునరపి ప్రతిహన్యమానాః
ప్రారబ్ధముత్తమ జనా న పరిత్యజంతి ॥ 72॥

శ్లో. క్వచిత్పృథ్వీశయ్యాః క్వచిదపి చ పర్యంకశయనః
క్వచిచ్ఛాకాహారః క్వచిదపి చ శాల్యోదన రుచిః ।
క్వచిత్కంథాధారీ క్వచిదపి చ దివ్యాంబరధరో
మనస్వీ కార్యార్థీ న గణయతి దుఃఖం న చ సుఖమ్॥ 73॥

శ్లో. నిందంతు నీతి నిపుణా యది వా స్తువంతు
లక్ష్మీః సమావిశతు గచ్ఛతు వా యథేష్టమ్ ।
అద్యైవ వా మరణమస్తు యుగాంతరే వా
న్యాయ్యాత్పథః ప్రవిచలంతి పదం న ధీరాః ॥ 74॥

శ్లో. కాంతాకటాక్ష విశిఖా న ఖనంతి యస్య
చిత్తం న నిర్దహతి కోప కృశానుతాపః ।
కర్షంతి భూరి విషయాశ్చ న లోభ పాశైః
లోక త్రయం జయతి కృత్స్నమిదం స ధీరః ॥ 75॥

శ్లో. కదర్థితస్యాపి హి ధైర్య వృత్తేః
న శక్యతే ధైర్యగుణః ప్రమార్ష్టుమ్ ।
అధోముఖస్యాపి కృతస్య వహ్నేః
నాధఃశిఖా యాతి కదాచి దేవ ॥ 76॥

శ్లో. వరం తుంగా చ్ఛృంగా ద్గురుశిఖరిణః క్వాపి విషమే
పతిత్వాఽయం కాయః కఠినదృషదంతే విదళితః ।
వరం న్యస్తో హస్తః ఫణిపతిముఖే తీక్ష్ణదశనే
వరం వహ్నౌ పాతస్త దపి న కృతః శీలవిలయః । 77॥

శ్లో. వహ్నిస్తస్య జలాయతే జలనిధిః కుల్యాయతే తత్క్షణాన్
మేరుః స్వల్ప శిలాయతే మృగపతిః సద్యః కురంగాయతే ।
వ్యాలో మాల్య గుణాయతే విషరసః పీయూష వర్షాయతే
యస్యాంగేఽఖిల లోక వల్లభతమం శీలం సమున్మీలతి ॥ 78॥

శ్లో. ఛిన్నోఽపి రోహతి తరుః క్షీణోఽప్యుపచీయతే పునశ్చంద్రః ।
ఇతి విమృశంతః సంతః సంతప్యంతే న విప్లుతా లోకే ॥ 79॥

శ్లో. ఐశ్వర్యస్య విభూషణం సుజనతా శౌర్యస్య వాక్సంయమో
జ్ఞాన స్యోపశమః శ్రుతస్య వినయో విత్తస్య పాత్రే వ్యయః ।
అక్రోధ స్తపసః క్షమా ప్రభవితుర్ధర్మస్య నిర్వ్యాజతా
సర్వేషామపి సర్వ కారణమిదం శీలం పరం భూషణమ్ ॥ 80॥

॥దైవ పద్ధతి॥

శ్లో. నేతా యస్య బృహస్పతిః ప్రహరణం వజ్రం సురాః సైనికాః
స్వర్గో దుర్గమనుగ్రహః ఖలు హరే రైరావణో వారణః ।

ఇత్యాశ్చర్య బలాన్వితోఒపి బలభిద్భగ్నః పరైః సంగరే
తద్వ్యక్తం నను దైవమేవ శరణం ధిగ్ధిగ్వృథా పౌరుషమ్ ॥ 81॥

శ్లో. భగ్నాశస్య కరండ పిండిత తనోర్మ్లానేంద్రియస్య క్షుధా
కృత్వాఖుర్వివరం స్వయం నిపతితో నక్తం ముఖే భోగినః ।
తృప్తస్తత్పిశితేన సత్వరమసౌ తేనైవ యాతః పథా
స్వస్థా స్తిష్ఠత దైవమేవ హి పరం వృద్ధౌ క్షయే కారణమ్॥ 82॥

శ్లో. యథా కందుకపాతే నో త్పత త్యార్యః పత న్నపి ।
తథా త్వనార్యః పతతి మృత్పిండపతనం యథా ॥ 83॥

శ్లో. ఖర్వాటో దివసేశ్వరస్య కిరణైః సంతాడితో మస్తకే
వాంఛన్దేశమనాతపం విధి వశాత్తాలస్య మూలం గతః ।
తత్రాప్యస్య మహాఫలేన పతతా భగ్నం సశబ్దం శిరః
ప్రాయో గచ్ఛతి యత్ర దైవహతక స్తత్రైవ యాంత్యాపదః ॥ 84॥

శ్లో. గజ భుజంగవిహంగమ బంధనమ్
శశి దివాకరయోర్గ్రహ పీడనం ।
మతిమతాం చ విలోక్య దరిద్రతాం
విధిరహో బలవానితి మే మతిః ॥ 85॥

శ్లో. సృజతి తావదశేష గుణాకరం
పురుష రత్నమలంకరణం భువః ।
తదపి తత్క్షణ భంగి కరోతి చే
దహహ కష్టమపండితతా విధేః ॥ 86॥

శ్లో. అయ మమృతనిధానం నాయకోఒప్యోషధీనాం
శతభిషగనుయాతః శంభుమూర్ధ్నోఒవతంసః ।
విరహయతి న చైవం రాజయక్ష్మా శశాంకం
హతవిధిపరిపాకః కేన వా లంఘనీయః ॥ 87॥

శ్లో. ప్రియసఖ విపద్దండాఘాత ప్రపాతపరంపరా
పరిచయబలే చింతాచక్రే నిధాయ విధిః ఖలః ।
మృదమివ బలాత్పిండీకృత్య ప్రగల్భకులాలవ
ద్భ్రామయతి మనో నో జానీమః కి మత్ర విధాస్యతి ॥ 88॥

శ్లో. విరమ విర మాయాసా దస్మా ద్దురధ్యవసాయతో
విపది మహతాం ధైర్యధ్వంసం య దీక్షితు మీహసే ।
అయి జడవిధే కల్పాపాయేఒప్యపేత నిజక్రమాః
కులశిఖరిణః క్షుద్రా నైతే న వా జలరాశయః ॥ 89॥

శ్లో. ధైవేన ప్రభుణా స్వయం జగతి యద్యస్య ప్రమాణీకృతం
తత్త స్యోపనమే న్మనా గపి మహా న్నైవాశ్రయః కారణమ్ ।
సర్వాశాపరిపూరకే జలధరే వర్ష త్యపి ప్రత్యహం
సూక్ష్మా ఏవ పతంతి చాతకముఖే ద్విత్రాః పయోబిందవః ॥ 90॥

॥కర్మ పద్ధతి॥

శ్లో. నమస్యామో దేవా న్నను హతవిధేస్తేఒపి వశగా
విధిర్వంద్యః సోఒపి ప్రతినియత కర్మైక ఫలదః ।
ఫలం కర్మాయత్తం యది కిమమరైః కిం చ విధినా
నమస్తత్కర్మేభ్యో విధిరపి న యేభ్యః ప్రభవతి ॥ 91॥

శ్లో. బ్రహ్మా యేన కులాలవన్నియమితో బ్రహ్మాండ భాండోదరే
విష్ణుర్యేన దశావతార గహనే క్షిప్తో మహా సంకటే ।
రుద్రో యేన కపాల పాణి పుటకే భిక్షాటనం సేవతే
సూర్యో భ్రామ్యతి నిత్యమేవ గగనే తస్మై నమః కర్మణే ॥ 92॥

శ్లో. యా సాధూంశ్చ ఖలాన్ కరోతి విదుషో మూర్ఖాన్ హితాన్ ద్వేషిణః
ప్రత్యక్షం కురుతే పరోక్షమమృతం హాలాహలం తత్క్షణాత్ ।
తామారాధయ సత్క్రియాం భగవతీం భోక్తుం ఫలం వాంఛితం
హే సాధో వ్యసనైర్గుణేషు విపులేష్వాస్థాం వృథా మా కృథాః ॥ 93॥

శ్లో. శుభ్రం సద్మ సవిభ్రమా యువతయః శ్వేతాతపత్రోజ్జ్వలా
లక్ష్మీ రిత్యనుభూయతే చిర మనుస్యూతే శుభే కర్మణి ।
విచ్ఛిన్నే నితరా మనంగకలహక్రీడాత్రుట త్తంతుకం
ముక్తాజాల మివ ప్రయాతి ఝుడితి భ్రశ్య ద్దిశోఒదృశ్యతామ్ ॥ 94॥

శ్లో. గుణవదగుణవద్వా కుర్వతా కార్య మాదౌ
పరిణతిరవధార్యా యత్నతః పండితేన ।
అతిరభస కృతానాం కర్మణామావిపత్తే
ర్భవతి హృదయ దాహీ శల్య తుల్యో విపాకః ॥ 95॥

శ్లో. స్థాల్యాం వైడూర్యమయ్యాం పచతి తిలకణాంశ్చందనైరింధనౌఘైః
సౌవర్ణైర్లాంగలాగ్రైర్విలిఖతి వసుధా మర్కతూలస్య హేతోః ।
ఛిత్త్వా కర్పూర ఖండాన్ వృతిమిహ కురుతే కోద్రవాణాం సమంతాత్
ప్రాప్యేమాం కర్మభూమిం న భజతి మనుజో యస్తోప మందభాగ్యః ॥ 96॥

శ్లో. నైవాకృతిః ఫలతి నైవ కులం న శీలం
ఆ. జీవభావ మెఱుగఁ జెడ దెన్నటికి మది
దైవమును నెఱుంగఁ దనరుబుద్ధి
తేజ ముదయమందఁ దిమిరంబు నిలువదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥79॥

ఆ. ఆశచేత మనుజు లాయువుగలనాళ్లు
దిరుగుచుంద్రు భ్రమను ద్రిప్పలేక
మురికిభాండమందు ముసరు నీఁగలభంగి
విశ్వదాభిరామ వినర వేమ. ॥80॥

ఆ. పరుస మినుముసోకి బంగారమైనట్లు
కప్పురంబు జ్యోతిఁ గలసినట్లు
పుప్పమందు దావి పొసఁగినట్లగు ముక్తి
విశ్వదాభిరామ వినర వేమ. ॥81॥

ఆ. కుండ పగిలెనేని క్రొత్తది కొనవచ్చు
భూతలంబునందు బొందుగాను
కూలబడిన నరుఁడు కుదురుట యరుదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥82॥

ఆ. సతము బాహ్యపూజ చాలఁ జేసినపిదప
కపటము విడలేక కష్టనరులు

ముక్తి నొందలేక మునిగిరి తమమున
విశ్వదాభిరామ వినర వేమ. ॥83॥

ఆ. ఊర్ధ్వలోకమందు నుచితక్రమంబున
రూప మేమి లేక రూఢితోను
పరమయోగి చూచు పరమాత్ముఁ డితఁడని
విశ్వదాభిరామ వినర వేమ. ॥84॥

ఆ. సత్య మమరియుండ జ్ఞాన మమరియుండు
జ్ఞాన మమరియుండ సత్యముండు
జ్ఞానసత్యములును సమమయిన ద్విజుఁడగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥85॥

ఆ. దాన మొసఁగుకన్నఁ దేజంబు మఱిహెచ్చు
తేజ మొసఁగుకన్నఁ దెలివి హెచ్చు
తెలివికన్న నాసఁ దెగ వేయునది హెచ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ॥86॥

ఆ. దొంగమాటలాడ దొరుకునె మోక్షంబు
చేతగానికూత చెల్ల దెపుడు
గురువుపద్దు గాదు గుణహీన మగుఁగాక
విశ్వదాభిరామ వినర వేమ. ॥87॥

ఆ. గాలిలేని దీపకళిక చందంబున
నలలుసుళ్లులేని జలధిరీతి
నిశ్చలాత్మయున్న నిర్వికారంబున
ముక్తియండ్రు దాని మొగిని వేమ. ॥88॥

ఆ. మంటలోహమునలు మ్రాను చీలలయందు
పటముగోడలందుఁ బరగ నిసుక
బెట్టనంటునట్ల పెనఁగు దేహముజీవి
విశ్వదాభిరామ వినర వేమ. ॥89॥

ఆ. కలుషమెల్లఁ దెలియఁ దలవంపులకు మూల
మరయఁదత్వ మెల్ల నాత్మఁబుట్టు

తెలిసినందుకు మఱిధీరుఁడు గావలె
విశ్వదాభిరామ వినర వేమ. ॥90॥

ఆ. అనఁగ ననగ రాగ మతిశయిల్లుచునుండు
తినఁగ దినఁగ వేము దీయనుండు
సాధనమున బనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినర వేమ. ॥91॥

ఆ. స్థూలము కనుగ్రుడ్డు సూక్ష్మంబు కన్నాప
కంటిపాప నుండు కారణంబు
కారణమున బ్రహ్మకళ నెఱుంగఁగవలె
విశ్వదాభిరామ వినర వేమ. ॥92॥

ఆ. తేనెతెరలజాడ తేనెటీఁగ యెఱుంగు
సుమరసంబుజాడ భ్రమర మెఱుఁగు
పరమయోగి జాడభక్తుం డెఱుంగును
విశ్వదాభిరామ వినర వేమ. ॥93॥

ఆ. అడవి దిరుగ లేదు ఆకసమున లేదు
అవనిఁ దీర్థయాత్రలందు లేదు
ఒడలు సిద్ధిఁజేసి యొడయని జూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥94॥

ఆ. కప్పురంబు మనసు గాంక్షించుయోగికి
జ్ఞానదీపశిఖయుఁ దానటించుఁ
గానవచ్చు నాత్మ క్రమమాణమై నిచ్చ
విశ్వదాభిరామ వినర వేమ. ॥95॥

క. నీ వాడిన నే నాడుదు
నీవుండిన నేను నుందు నిర్విణ్ణుఁడనై
నీవు తలంచినఁదలఁపుదు
నీవు నగిన నేను నగుదు నిజముగ వేమా. ॥96॥

ఆ. నీరు కార మాయె కారంబు నీరాయె
కారమైన నీరుకార మాయె

కారమందు నీరు కడురమ్యమైయుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥97॥

ఆ. శివుని యనుభవంబు సృష్టిలోపల లేక
సంశయంబు చెడదు సాధకులకు
చెలగుఁదివ్వె లేక చీఁకటిపాయునా?
విశ్వదాభిరామ వినర వేమ. ॥98॥

ఆ. ఇంద్రియములచేత నెగ్గొందుచుండెడు
వెఱ్ఱిమనుజుఁ డేల వెదకు శివుని?
ఇంద్రియముల రోసి యీశునిఁ జూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥99॥

ఆ. కడుపునిండ సుధను గ్రమముతోఁ ద్రావిన
బాలమీఁద నేల పాఱు మనసు?
తత్వ మెఱుఁగువెనుక తన్వంగు లేటికో?
విశ్వదాభిరామ వినర వేమ. ॥100॥

ఆ. ఉత్తమోత్తముండు తత్వజ్ఞుఁ డిలమీద
మహిమఁజూపువాఁడు మధ్యముండు
వేషధారి యుదరపోషకుఁడధముండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥101॥

ఆ. హృదయమందు నున్నయీశుని దెలియక
శిలలనెల్ల మ్రొక్కుజీవులార
శిలల నేమియుండు జీవులందే కాక
విశ్వదాభిరామ వినర వేమ. ॥102॥

ఆ. గంగగోవుపాలు గరిటెడైనను జాలు
కడివెడైననేమి ఖరముపాలు
భక్తిగలుగుకూడు పట్టెడైనను జాలు
విశ్వదాభిరామ వినర వేమ. ॥103॥

ఆ. బండమీఁద చెలమ పాటించిత్రవ్విన
నలయి కెక్కుఁడౌను నాశలేదు

గుంటపట్టు చెలమ కులముద్ధరించురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥104॥

ఆ. కాకిగూటిలోన కోకిల మున్నట్లు
భ్రమర మగుచుపురుగు బ్రతికినట్లు
గురుని గొల్చువెనుక గురువు తా నౌనయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥105॥

ఆ. మాట దిద్దవచ్చు మఱియెగ్గు లేకుండ
దిద్దవచ్చు జాతిఁదిన్నగాను
మనసు దిద్దరాదు మహి నెంతవారికి
విశ్వదాభిరామ వినర వేమ. ॥106॥

ఆ. మనసునందు ముక్తిమలయుచు నుండంగ
మనసు లెఱుఁగలేక మనుజులెల్ల
మనసు నంటలేక మాయమై పోదురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥107॥

ఆ. మనసు ముక్తియనుచు మది నెఱుంగఁగలేరు
మనసుచేతఁ దగిలి మాయమైరి
మనసు తానయైన మర్మజ్ఞుడగు యోగి
విశ్వదాభిరామ వినర వేమ. ॥108॥

ఆ. మదినెఱిఁగినవాని మహిఁగాన నెందును
మది నెఱుంగువాఁడు మహిని నరుఁడు
వెదకి తనువులోన వేడ్కతో నినుఁజూచు
విశ్వదాభిరామ వినర వేమ. ॥109॥

ఆ. బ్రహ్మమును నెఱుఁగవు భావమందుండిన
తనువు గుడిగఁ జేసి తన్ను నిలిపి
లోకబుద్ధివిడిచి లోఁజూపు చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥110॥

ఆ. నిన్నుఁజూచుచుండ నిండును దత్వంబు
తన్నుఁ జూచుచుండఁ దగులు మాయ

నిన్ను నెఱిఁగినపుడె తన్నుఁదా నెఱుఁగును
విశ్వదాభిరామ వినర వేమ. ॥111॥

ఆ. గాలి గాలి గలసె గగనంబు గగనంబు
మన్ను మన్ను గలసె మంట మంట
నీరు నీటఁ గలసె నిర్మలంబయి యుండె
విశ్వదాభిరామ వినర వేమ. ॥112॥

ఆ. వెదక వెదకఁ దొఱకు వేదాంతవేద్యుండు
వెదకువానిఁ దాను వెదకుచుండు
వెదకనేర్చునట్టి వెరవరుల్ గలరొకో
విశ్వదాభిరామ వినర వేమ. ॥113॥

క. తను వలచినఁదా వలచును
దను వలవక యున్నఁదన్ను దా వలవడిలన్
దనదు పటాటోపంబులు
తనమాయలు పనికిరావు ధరలో వేమా. ॥114॥

ఆ. స్వానుభూతిలేక శాస్త్రవాసనలచే
సంశయంబు చెడదు సాధకునకుఁ
జిత్రదీపమునకు జీఁకటి చెడనట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥115॥

క. శాంతమున సకలకార్యము
సంతోషంబునను బొందు సత్యము జయమౌ
పంతము చెల్లును ధర్మజుఁ
డెంతేసి ప్రయాసముల జయించెను వేమా. ॥116॥

ఆ. ఉర్విజనులు పరమయోగీశ్వరునిఁ జూచి
తెగడువారె గాని తెలియలేరు
అమృతస్వాదురుచులహస్త మేమెఱుఁగును
విశ్వదాభిరామ వినర వేమ. ॥117॥

ఆ. పురుషుఁడెన్నిగతులఁబుట్టువు మొదలుగఁ
బాపచింతఁజేయు జాపలమున

మహిని కుంటినక్క మాంసముదిన్నట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥118॥

ఆ. అంకి లెఱిఁగి మాట లాడనేర్చినపుడె
పిన్న పెద్దతనము లెన్నలేల
పిన్న చేతిదివ్వె పెద్దగా వెలుఁగదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥119॥

ఆ. మొదటఁ బోయునీవు మొగిబీజముల కెక్కి
మొదటి కుఱుకువేగ మొలక లెత్తు
మొలక పృథివిఁ బెరిగి వెలయును వృక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥120॥

ఆ. మగనికాలమందు మగువ కష్టించిన
సుతుల కాలమందు సుఖముఁ బొందు
కలిమి లేములెందుఁ గలవెంతవారికి
బలిమి పుత్రబలిమె బలిమి వేమ. ॥121॥

ఆ. ఆఱురుచులు వేఱు సారంబు నొక్కటి
సత్యనిష్ఠ వేఱు సత్యమొకటి
పరమబుషులు వేఱు భావ్యఁ డొక్కండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥122॥

ఆ. తారకంబుఁ జూచుదారి వేఱుగఁగల్గు
సమముగాను జూడఁ జక్కఁబడును
వెఱ్ఱిగాను జూడ వెలుగెల్ల బాఱురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥123॥

ఆ. సజ్జనముల చెలిమి చాలింపఁగా రాదు
ప్రకృతి నెఱుఁగకున్న భక్తిలేదు
పలువ లెట్టిరీతి భక్తి సల్పుదురయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥124॥

ఆ. ఇట్టికనుల బ్రహ్మ మెట్లు చూడఁగవచ్చుఁ
జూచుకనులువేఱు చూపువేఱు

చూపులోనమరిచి చూడంగవలవదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥125॥

ఆ. దూలములనుబోలు దురవస్థలనునెల్ల
రోసి యాసలన్ని గోసివేసి
వాసనను దెలిసినవాఁడెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥126॥

ఆ. మన్నును దినమన్న మండేరు జనులార
మంటిలోనిమేలు మఱువనేల
నీళ్లలోనిమేలు నిఖిలమై యుండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥127॥

ఆ. జీవమేడ నుండు భావమెక్కడ నుండు
కాఁపురంబు లేఁడఁ గదిసియుండుఁ
దనరుచున్న రెండిస్థల మేల తెలియరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥128॥

ఆ. ధనము గూడఁబెట్టి ధర్మంబు సేయక
తాను దినకలెస్స దాచుగాఁక
తేనె నీఁగె కూర్చి తెరువర్ల కియ్యదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥129॥

క. ఇచ్చెడి వారలసంపద
హెచ్చునదేకాని లేమి యేలా కలుగున్
అచ్చెలమ నీళ్లుచల్లిన
విచ్చలవిడి నూరుచుండు వినరా వేమా ॥130॥

ఆ. పాలఁగలయు నీరు పాలెయై రాజిల్లు
నదియు పానయోగ్య మయినయట్లు
సాధుసజ్జనముల సాంగత్యములచేత
మూఢజనుఁడు ముక్తి మొనయు వేమ ॥131॥

ఆ. చెడినమానవులను చేపట్టి రక్షించి
కడకుఁ జేర్చినట్టి ఘనులు దలఁప

కడగి పుణ్యమైనగల శివుసన్నిధి
నెడతెగకయునుండు రెపుడు వేమ ॥132॥

ఆ. ఒకరి నోరుఁగొట్టి యొకరు భక్షింతురు
వారినోరు మిత్తి వరుసఁగొట్టు
చేఁపపిండు పిల్ల చేఁపలఁ జంపును
జనుఁడు చేఁపపిండుఁ జంపు వేమ ॥133॥

ఆ. కన్నుపోవువాఁడు కాళ్లుపోయినవాఁడు
నుభయులరయఁ గూడి యుండునట్లు
పేద పేదఁగూడి పెనగొని యుండును
విశ్వదాభిరామ వినర వేమ. ॥134॥

ఆ. పరగ రాతిగుండు పగులఁగొట్టఁగ వచ్చుఁ
గొండలన్ని పిండిగొట్టవచ్చు
కఠినచిత్తు మనసు కరగింప రాదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥135॥

ఆ. అంత కొఱత దీఱి అతిశయకాముఁడై
నిన్ను నమ్మిచాల నిష్ఠతోడ
నిన్నుఁగొల్వ ముక్తి నిశ్చయముగఁ గల్గు
విశ్వదాభిరామ వినర వేమ. ॥136॥

ఆ. తత్వము తిరమైన తావుల వెదకుచుఁ
దాను తత్వమగును తత్త్వయోగి
తలఁపులన్ని యుడుగఁ దానెపో తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥137॥

ఆ. మాటలాడవేఱె మనసుకొలఁదియువేఱె
యొడలగుణమువేఱె యోజనవేఱె
యెట్లుగల్గు ముక్తి యేలాగు తనలాగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥138॥

ఆ. వెలఁది చక్కఁదనము వెరపైన యీడును
విభుని కరుణలేక వితగనుండు

నీదుకరుణలేక నేర్పులు కొఱగావు
విశ్వదాభిరామ వినర వేమ. ॥139॥

ఆ. ఎంతకష్ట ముండు నంత పాపపుఁజింత
చింతచేత మిగులఁ జివుకు మనసు
చింతలేకయున్న చెడనిసంపదఁజూచు
విశ్వదాభిరామ వినర వేమ. ॥140॥

క. ఎన్నాళ్ళకుఁ దానుండును
ఎన్నాళ్లను దాను నేర్చి యెన్నిటవెలయున్
కొన్నాళ్లకుఁ దాఁ జన్నను
మన్నేయగు విద్యలెల్ల మహిలో వేమా. ॥141॥

క. ధనమెచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణంబు మానును వేమా. ॥142॥

క. వినవలె నెవ్వరు చెప్పిన
వినినంతనె తమకపడక వివరింపవలెన్
విని కని వివరము దెలిసిన
మనుజుఁడెపో నీతిపరుడు మహిలో వేమా. ॥143॥

క. ఈకపట నాటకంబును
ఈకపటపుఁ జదువులన్ని యింపు దలిర్పన్
ఏకపటాత్ముఁడు సేసెనొ
యాకపటాత్మునకు మ్రొక్కి యలరుము వేమా. ॥144॥

ఆ. ఎండవేళఁ జీఁక టేకమైయున్నట్లు
నిండుకుండ నీరు నిలిచినట్లు
దండిగఁ బరమాత్మ తత్వంబు దెలియరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥145॥

క. ఎండినమ్రా నొక టడవిని
నుండిన నందగ్నిపుట్టి యూడ్చును చెట్లన్

దండిగలవంశ మెల్లను
చండాలుం డొకఁడుపుట్టి చెఱుచును వేమా. ॥146॥

ఆ. శిష్యవర్గమునకు శివుఁ జూపనేరక
కానిమతములోని గలుగునట్టి
గురునియెఱుక నరయ గ్రుడ్డెద్దు చేనురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥147॥

ఆ. ఇంటిలోనిధనము నిదినాది యనుచును
మంటిలోనఁదాచు మంకుజీవి
కొంచఁబోడు వెంట గుల్లకానును రాదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥148॥

ఆ. దేశవేషములను తేటసేయక దేవుఁ
డాత్మలోన నుండ ననగిపెనగి
వేషమరసిచూడ గ్రాసంబు కొఱకయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥149॥

ఆ. మిఱుపగింజఁ జూడ మీఁద నల్లగనుండుఁ
గొఱికిచూడలోన చుఱుకుమనును
సజ్జను లగువారి సారమిట్టుల నుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥150॥

ఆ. పర్వత వనవాసి పరిణామ వర్తన
కూపవాసి కెట్టు గుఱుతుపడును
బ్రహ్మవిష్ణువెంటఁ బ్రాకృతుఁ డరుగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥151॥

ఆ. కస్తూరి యటుచూడఁ గాంతి నల్లగనుండు
పరిమళించుదాని పరిమళంబు
గురువులయినవారి గుణము లీలాగురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥152॥

ఆ. దొంగతనము అంకు దొరసియుండుర జగతి
అంకులాడికింత శంకపుట్టు

దొంగకన్న జేవెలుం గొప్పకానట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥153॥

ఆ. గురువులేక విద్య గుఱుతుగా దొరకదు
నృపతిలేక భూమి తృప్తిగాదు
గురువు విద్యలేక గురుతర ద్విజుఁడౌనె
విశ్వదాభిరామ వినర వేమ. ॥154॥

ఆ. అల్పసుఖములెల్ల నాశించి మనుజుండు
బహుళ దుఃఖములను బాధపడును
పరసుఖంబు నొంది బ్రతుకంగ నేరఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥155॥

ఆ. కాలవశముఁ బట్టి కర్మజీవులపిండు
మత్తులగుచును మదమత్తులైరి
మత్తులయిన జనుల మనసేటి మనసయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥156॥

ఆ. కడగివట్టియాస కడతేఱనీయదు
ఇడుములందుఁ బెట్టి యాడ్చుఁగాని
పుడమి జనులభక్తిఁ బొడమంగ నియ్యదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥157॥

ఆ. పాలలోన బులును లీలతోఁ గలిసిన
విఱిసి తునుక లగును విరివిగాను
తెలివి మనసులోన దివ్యతత్త్వము తేట
విశ్వదాభిరామ వినర వేమ. ॥158॥

క. దేహము లెస్సగ నుండిన
పోషణ తత్వంబులన్ని పొందుగఁ దెలియున్
దేహము బడలికఁ బడినను
పోషణ తత్వములు వచ్చి పొందవు వేమా. ॥159॥

ఆ. అధికుడైనరాజు నల్పును చేపట్టు
వానిమాట చెల్లు వసుధలోన

గణికు లొప్పియున్న గవ్వలు చెల్లవా
విశ్వదాభిరామ వినర వేమ. ॥160॥

ఆ. ధర్మమరసి పూని ధర్మరాజాదులు
నిర్మలంపు ప్రౌఢి నిలుపుకొనిరి
ధర్మమే నృపులకు తారకయోగంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥161॥

ఆ. దానములను జేయఁ దన చేతులాడక
బహుధనంబుఁగూర్చి పాతిపెట్టు
తుదను దండుగ నిడు మొదలు చేర్చునరుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥162॥

క. నిత్యంబు కానియొడలికి
నిత్యము దుఃఖమునఁబడును నిరతము ధరలో
నిత్యానందపు పదవికి
నిత్యంబును దుఃఖపడఁగ నేరదు వేమా. ॥163॥

ఆ. విను వివేకమనెడి వింతగొడ్డలిచేత
వలయవిద్యయనెడు నడవి నఱికి
తెలివియనెడుగొప్ప దీపంబు చేఁబట్టి
ముక్తిఁ జూడవచ్చు మొనసి వేమ. ॥164॥

క. ఎక్కడిసుతు లెక్కడిసతు
లెక్కడిబంధువులు సఖులు నెక్కడి భృత్యుల్
డొక్కువడి పోవు వేళలఁ
జక్కటికిని నెవరురారు సహజము వేమా. ॥165॥

ఆ. పాలనీరుక్రమము పరమహంస యెఱుంగు
నీరుపాలక్రమము నెమలి కేల
అజ్ఞుఁడయినవాఁడు నలశివు నెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥166॥

ఆ. కన్నులందు మదము గప్పి కానరుగాని
నిరుడు మీదటేఁడు నిన్న మొన్న

దగ్ధులయిన వారు తమకంటెఁ దక్కువా
విశ్వదాభిరామ వినర వేమ. ॥167॥

క. దీపంబు లేని యింటను
రూపంబును దెలియలేరు రూఢిగఁ దమలో
దీపమగు తెలివి గలిగియు
పాపంబుల మఱుగుత్రోవఁ బడుదురు వేమా. ॥168॥

ఆ. ఏరుదాఁటి మెట్ట కేగినపురుషుండు
పుట్టి సరుకుగొనక పోయినట్లు
యోగపురుషుఁడేల యొడలిఁ బాటించురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥169॥

ఆ. మంటికుండవంటి మాయాశరీరంబు
చచ్చు నెన్నడయినఁ జావఁ డాత్మ
ఘటము లెన్నియైన గగనంబదేకమే
విశ్వదాభిరామ వినర వేమ. ॥170॥

ఆ. మాయను చెఱసాల మనమను గొలుసును
భేదమనెడుబొండ బెరసియుండు
ఇట్టిబద్ధజీవి కెన్నడు మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥171॥

ఆ. ఎఱుకకన్నను సుఖమే లోకమునలేదు
ఎఱుకనెఱుఁగ నెవని కెఱుకలేదు
ఎఱుకసాటి ఎఱుక యేతత్వమున లేదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥172॥

క. కనియుండి కానలేరట
వినియుండియు వినగలేరు విస్మయమేమో
కనుగ్రుడ్డియు వినుచెవుడుం
చనునది నిజమయ్యె జగమునందున వేమా. ॥173॥

ఆ. ఊరకుంట దెలియ నుత్తమయోగంబు
మానసంబు కలిమి మధ్యమంబు

ఆసనాది విధుల నధమ యోగంబురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥174॥

ఆ. మనసుసూచి గెల్చి మనసులో సుఖియించి
కడకు మోక్షపదము గనునువాఁడు
చెట్టుఁబెట్టు ఫలము చేకూర కుండునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥175॥

ఆ. మాటలాడవచ్చు మనసు నిల్పగరాదు
తెలుపవచ్చు దన్నుఁ దెలియరాదు
సురియఁబట్టబచ్చు శూరుండు కారాదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥176॥

ఆ. చూపు వెలయఁజేసి సూక్ష్మంబు వత్తిచే
చిత్తమనెడు దివ్వె నెన్నుపఱచి
పాపమనెడు తిమిర మేపాఱ పాపని
పాపజాతి గురుఁడు పశువు వేమా. ॥177॥

ఆ. గురువు చిల్లగింజ కుంభ మీదేహంబు
ఆత్మ కలుషవంక మడుగుఁబట్టఁ
దెలిసి నిలిచెనేని దివ్యామృతంబురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥178॥

క. గురుఁడనఁగా మొదలంతకు
గురుశిష్య లనంగ నెల్లకొమ్మలుకాగా
గురువును గానగఁ జాలరు
ధరలోపల మనుజులెల్లఁ దలఁపరు వేమా. ॥179॥

క. గురుఁ డనఁగా పరమాత్ముఁడు
పరగంగా శిష్యుఁడనఁగఁ బటుజీవుఁడగున్
గురుశిష్య జీవసంపద
గురుతరముగఁ గూర్చు నతఁడు గురువగు వేమా. ॥180॥

ఆ. లోకములకు గురువు లోకులకును గురు
వదియుఁ దెలిసి మోక్ష మందుగోరి

గురునిఁ గనక నరక కూపము నందురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥181॥

ఆ. జీవిలోననుండు సిద్ధునిగానక
తిరుగు నస్థిరంబు వరుసనమ్మి
స్థిరము నస్థిరమును దెలియ జీవికిముక్తి
విశ్వదాభిరామ వినర వేమ. ॥182॥

ఆ. గతము చూతమన్న కలఁగన్న యర్థంబు
నడుచు కార్యమేని నమ్మరాదు
క్షణములోని బ్రతుకు సంసార విభ్రాంతి
విశ్వదాభిరామ వినర వేమ. ॥183॥

ఆ. తాననంగ నెవరు తనవారన నెవరు
తెలిసి తెలియలేరు తిక్క నరులు
అరయ పిసినికాయ పురుగు పద్ధతికాగ
విశ్వదాభిరామ వినర వేమ. ॥184॥

క. భయముసుమీ యజ్ఞానము
భయముడిగిన నిశ్చయంబు పరమార్థంబౌ
లయముసుమీ యీ దేహము
జయముసుమీ జీవుఁడనుచుఁ జాటర వేమా. ॥185॥

ఆ. చచ్చెఁ జచ్చె ననుచుఁ జావుకు వగచెడు
దీననరుల వెఱ్ఱి దెలుపరాదు
ప్రాణమునకు మృత్యు బంధంబు లుడుగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥186॥

ఆ. జననమరణములకు సరి స్వతంత్రుఁడు గాఁడు
మొదట కర్తగాఁడు తుదను గాఁడు
నడుమకర్త ననుటనగుబాటు కాదొకో
విశ్వదాభిరామ వినర వేమ. ॥187॥

ఆ. బ్రహ్మమేడ ననుచు పలుమాఱు లాడేరు
వెఱ్ఱిమూర్ఖ జనుల విధముఁజూడ

బ్రహ్మ మన్నిటందుఁ బరిపూర్ణమైయుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥188॥

ఆ. పసులవన్నె వేఱు పాలెల్లనొక్కటి
పుష్పజాతి వేఱు పూజయొకటి
దర్శనంబు వేఱు దైవంబ యొక్కటి
విశ్వదాభిరామ వినర వేమ. ॥189॥

ఆ. పనితొడవులు వేఱు బంగార మొక్కటి
పరగ ఘటము వేఱు ప్రాణమొకటి
అరయఁ దిండ్లు వేఱు ఆఁకలి యొక్కటి
విశ్వదాభిరామ వినర వేమ. ॥190॥

ఆ. కానలేఁడు నుదురు కర్ణముల్ వీఁపును
నెఱులు కానలేఁడు నెత్తిమీఁద
తన్ను గానలేఁడు తత్వ మేమెఱుఁగును
విశ్వదాభిరామ వినర వేమ. ॥191॥

ఆ. తిరిగి తిరిగి నరుఁడు మరులుకొనుటేగాక
అందువలన నేమి యాసలేదు
అంతరాత్మ నిలుపునతఁడెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥192॥

ఆ. చిత్తమనెడు వేరు శిథిలమైనప్పుడే
శక్తియనెడు చెట్టు పడును పిదపఁ
గోర్కు లనెడు పెద్ద కొమ్మలెండును గదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥193॥

ఆ. తిట్టికొట్టిరేని తిరిగి మాఱాడక
యూరకున్నఁ జూడనుర్వీమీద
వాఁడగు పరమాత్మ వర్ణింప శక్యమా
విశ్వదాభిరామ వినర వేమ. ॥194॥

ఆ. కల్మషంబు సోఁకఁ గనుపించ దెందును
రూప మెవ్వరికిని రూఢితోడ

తామసం బుడిగినఁ దగఁగల్గు జ్ఞానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥195॥

ఆ. నీటిలోన వ్రాఁత నిలువకయున్నట్లు
పాటిజగతిలేదు పరములేదు
మాటమాటకెల్ల మనసు కోరుచునుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥196॥

ఆ. దొంగతెలివిచేత దొరకునా మోక్షంబు
చేతఁగానిపనులఁ జేయరాదు
గ్రుడ్డనంగ వలదు గుణహీనుఁడనవలె
విశ్వదాభిరామ వినర వేమ. ॥197॥

ఆ. అసలఁ దెగఁగోసి యనలంబుఁ జల్లార్చి
గోచి బిగియఁబెట్టి కోపమడఁచి
గుట్టు మీఱువాఁడు గురువుకు గురువురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥198॥

ఆ. ఆశలనెడు తాళ్ళ నమరఁ గోయగఁ జేసి
పారవైవఁగాని పరములేదు
కొక్కు తిండియాసఁ జిక్కి చచ్చినయట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥199॥

తే. ముక్కు గోరును సద్గంధములను జెలఁగి
చెవులు చర్మంబు కన్నులు జిహ్వ ముక్కు
నిన్నియుం చాడినటువంటి యిల్లురోసి
తన్ను గనుగొని సుఖియింపఁ దగును వేమ. ॥200॥

ఆ. శ్రీకరశివతత్వశీలుఁడౌ వేమన
ప్రాకటముగ వేయు పద్యములను
లోకమందుఁ జదివెలోవెతఁ బాయరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥201॥

ఆ. వేయుపద్యముల వివేకియై భక్తితోఁ
బఠనఁ జేసినట్టి భక్తులకును

బాయకుండు మోక్షపద మరచేతిదై
విశ్వదాభిరామ వినర వేమ. ॥202॥

క. శతసంఖ్యపదమ్ముల నే
మతిమంతుఁడు పఠననేయు మమతులు దీరు
న్నతఁడే నాలుగుపదముల
శితికంఠునిపదముఁ జేరు సిద్ధము వేమా. ॥203॥

క. ఎన్నఁగ మననే కారణ
మన్నిటికిని జూడఁజూడ నాత్ముఁడు తానై
యున్నంతకాలమెచ్చట
నున్నను నిది నిజముఁ దెలియ నొప్పగు వేమా. ॥204॥

క. సర్వము తానని తెలిసిన
నిర్వాణికిఁ గాక ముక్తి నిలుపఁగ వశమా
ఉర్వెల్లఁ దాను తిరిగిన
పర్వత బిలజలధులందుఁ బడినను వేమా. ॥205॥

క. చదువులఁ జదివినవారలు
పదవిన్ని బొందంగ లేరు పరమార్థముగాఁ
బెదవులఁ గదలక యుండిన
మదిలో నది రాజయోగమహిమము వేమా. ॥206॥

చ. తలపఁగ మూలమందు పరతత్త్వము దెల్పఁగ పాటుగాదు లో
బలిమిని నాత్మగుట్టు మది భావననెంచగ బ్రహ్మకల్పమున్
గలుగును ముక్తి జీవులకుఁ గావున నాత్మవిధానదృశ్య మీ
సలలిత శక్తిరూపు నిను సన్నుతి వేమన చేసె కల్పమున్. ॥207॥

ఆ. ఆకు చాటునుండు నన్నిలోకంబులు
కొమ్మ గానరాదు బ్రహ్మకైన
కొమ్మ గానఁబడినఁ గొనియాడవచ్చురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥208॥

చ. పిలిచినఁ బల్కకుండు మరి పిల్చిన నేమనకూరకుండుఁ దన్
దలఁచిన నెవ్వ రేమనినఁ దన్ననుగాదని నవ్వుచుండు నా

త్మలఁ దలపోయుచుండు నెఱ తత్వము నిత్యము దానయై సదా
తెలిసినయోగి వేమనగతిన్ శివరూపుఁడు నెల్లతావులన్. ॥209॥

ఉ. ఒక్కఁడు రోగి యాయె మఱియొక్కఁడు దిక్కులఁ ద్యాగి యాయె
వేఱొక్కఁడు భోగి యాయెనటు నొక్కఁడు చక్కనియోగి యాయెఁ
దా నొక్కఁడు రాగియాయె నినుబోలు మహాత్మునిఁగాన మెచ్చుటన్
నిక్కము నిన్నిరూపములు నీకును జెల్లుగదన్న వేమనా. ॥210॥

క. విషయములు తెరలపొలుపున
విషయము లంటక మహాత్ము విధమున ధరలో
విషసంసారము లన్నియు
విషయము లన్నియును గెల్వ వేమన నేర్చున్. ॥211॥

క. కాదని యెవ్వరి తోడను
వాదాడక దిరుగు వెఱ్ఱివాఁడును వలెనే
భేదాభేదము లడచును
వేదాంత రహస్య మెల్ల వేమన నేర్చున్. ॥212॥

ఆ. దాన మమరఁజేసి దరిఁజేరు నొకవంక
మనము నమ్మెనేని మాయ గల్గు
జ్ఞానకలిక నమ్మఁ జంపును వైరుల
విశ్వదాభిరామ వినర వేమ. ॥213॥

ఆ. ఎందు నెఱుకవాని కిహపరములు లేవు
ప్రాణహానిలేదు ప్రళయమునను
ప్రళయకాలమైనఁ బరమాత్మఁ గలయురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥214॥

ఆ. దేవుఁడనఁగ వేఱు దేశమం దున్నాఁడె
దేహితోడ నెపుడు దేహమందె
వాహనముల నెక్కి వడిఁదోలు మన్నాఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥215॥

ఆ. సొమ్ము దొరకుదనుక జ్యోతి యంతియెకాక
సొమ్ము దొరకునెనక జ్యోతి యేల

దేవుఁడైన వెనుక దేహంబు మఱియేల
విశ్వదాభిరామ వినర వేమ. ॥216॥

ఆ. గురుచరణముఁ బట్టఁ గుక్కలు గఱచును
గురుచరణము విడువఁ గుక్క గఱచుఁ
గుక్కకున్న బుద్ధి గురునకు లేదురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥217॥

ఆ. ఆత్మబుద్ధివల్ల నఖిలంబు తానయ్యె
జీవబుద్ధివలన జీవుఁడయ్యె
మోహబుద్ధినియము ముందరఁ గనుగొని
విశ్వదాభిరామ వినర వేమ. ॥218॥

క. ఈ దేహ మన్నిభంగులఁ
బ్రోచియు నొనరంగ నేలపోవుట కాదె
మీఁదెఱిగి మురికి గడుగను
భేదంబులు మాన ముక్తి బెరయుర వేమా. ॥219॥

ఆ. పిల్లి యెలుకబట్టఁ బ్రియమున నుండగ
నదియు కోడిఁబట్ట ననుగమించు
మమత విడువకున్న మానునా మోహంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥220॥

క. ఏక బ్రహ్మము నిత్యము
వైకల్పితమైనయట్టి వస్తువులెల్లన్
నేకత్వంబని యెఱిగిన
శోకము లేనట్టిముక్తి సులభము వేమా. ॥221॥

ఆ. మహిని దధిని ఘృతము మ్రానులం దనలంబు
సొరుసుమములందు సౌరభంబు
తిలలఁ దైలమట్ల తేజరిల్లుఁ జిదాత్మ
విశ్వదాభిరామ వినర వేమ. ॥222॥

ఆ. తరువఁ దరువఁ బుట్టు దరువున ననలంబు
తరువఁ దరువఁ బుట్టు దధిని ఘృతము

తలఁప దలపఁ బుట్టు తనువునఁ దత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||223||

క. జీవుని దెలిసిన దనుకను
దేవుని భ్రమఁ బొదలు నరుఁడు దేవుఁడు దలఁపన్
జీవుండని వివరించిన
భావింపగ ముక్తి బట్టబయలుర వేమా. ||224||

ఆ. ఇంతకాలముండి యెఱుకమాలినజీవి
చచ్చిపుట్టుచుండు సహజమనుచు
నెఱుక మఱచుచోట నెఱుఁగునా బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||225||

ఆ. మ్రానులోన నగ్ని మఱియుండఁగా వచ్చు
నగ్ని నుండ మ్రాను కలవిగాదు
మ్రానులోనియగ్ని మర్యాద సంసారి
విశ్వదాభిరామ వినర వేమ. ||226||

ఆ. మేఘ మడ్డమయిన మిహిరుని జెఱచును
జిత్తమడ్డమయిన స్థిరముఁ జెఱచు
పఱుపు లడ్డమైన మఱిముక్తి జెఱచురా
విశ్వదాభిరామ వినర వేమ. ||227||

ఆ. దోసములువంటి తుర్యమం దాత్మను
జూచి యాసలనటుతోచివేసి
వాసనను దెలిసినవాఁడెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||228||

ఆ. వెదకి కానలేఁడు వేదాంతవేద్యుని
తత్వవేత్తలేఁడు ధరణిలోనఁ
గలిగెనేని యతఁడు కనఁబోఁడు మఱివేఱె
విశ్వదాభిరామ వినర వేమ. ||229||

క. విషయములఁ బొరలి రోయక
విషమంటినగతిని జూచి విముఖత ధరలో

విష సమమాయా సుఖముల
విషయములన్ గూడకుండ్రు వేత్తలు వేమా. ||230||

ఆ. వాక్కునందు గురువు వాక్తత్వము గురువు
చీఁకటింట గురువు చిక్కియుండు
అఖిలమునకు గురువె యాధార మయియుండు
విశ్వదాభిరామ వినర వేమ. ||231||

క. కర్మాకర్మము లొక్కటి
కర్మవినోదునకు దత్వఘునునకు దెలియున్
ధర్మాధర్మము లేర్పడ
నిర్మలమతి తెలుపవలయు నిజముగ వేమా. ||232||

ఆ. ఈషణత్రయంబు నెడపంగ నేరక
మోహనరాశిలోన మునిఁగియుండు
జనుల కెట్టు మోక్షసౌఖ్యంబు గల్గును
విశ్వదాభిరామ వినర వేమ. ||233||

ఆ. ఎఱుకమాలి జీవి యెంతకాలంబుండి
చచ్చిపుట్టుచుండు సహజముగను
ఎఱుకమఱచుచోటు నెఱుగుట బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||234||

క. సద్గురు కృపజ్ఞానంబున
సద్గతి దీపించుచున్న చాలగు చదువుల్
సద్గతిఁ గలుగంజేసెడి
సద్గురువే దైవమనుచుఁ జాటర వేమా. ||235||

ఆ. సిగ్గు విడువకున్న శివసౌఖ్యమేలేదు
తగ్గ మొగ్గకున్న సిగ్గు విడదు
సిగ్గు విడుచువాఁడు చిరకాల జీవిరా
విశ్వదాభిరామ వినర వేమ. ||236||

క. అమ్మసుమీ యా లనఁగా
నమ్మనఁగా నాలు సుమ్మియాయిద్దరినిన్

ఇమ్మహిలోఁ బరమాత్ముని
నెమ్మదిలోఁ దెలియఁ దానె నేర్పరి వేమా. ||237||

ఆ. ఆశ విడక గాని పాశముక్తుఁడు గాఁడు
ముక్తుఁడయినఁగాని మునియుఁగాఁడు
మునికిఁగాని సర్వమోహంబు లూడవు
విశ్వదాభిరామ వినర వేమ. ||238||

ఆ. ఆత్మలోన నాద మాలించి మాలించి
యాసలందుఁ జిక్కఁ డాదియోగి
ఆత్మలోనికళల నంటినఁ దత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||239||

ఆ. మానసంబు మంచిమల్లెపూవులచవికె
బావితోఁటచేసి బాలఁగూడి
భోగినయ్యెద ననఁ బోయెపో కాలంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||240||

ఆ. సొమ్ములున్నచోటు శోధింపఁగలుగును
సొమ్ములేనిచోట శోధనేల
యంజనంబులేక యా సొమ్ము తెలియదు
విశ్వదాభిరామ వినర వేమ. ||241||

ఆ. నిజము కల్ల నెఱిఁగి నిత్యుండు గాఁడాయె
పలుకులోన బిందు పదిలపఱచి
వేడుకైన బిందు వెదఁబెట్టకుండదు
విశ్వదాభిరామ వినర వేమ. ||242||

ఆ. అగ్ని శిఖలయందు నమరంగ మమకార
మభవుమీఁద ధ్యాన మమర నునిచి
యాహుతి యగువెనుక హరున కర్పితమౌను
విశ్వదాభిరామ వినర వేమ. ||243||

క. మ్రాకున ననలము పుట్టును
మ్రాకెదుగును ననలమునకు మనుజునిలోనన్

మ్రాకుననలముల క్రియఁ జీ
జా కుడి నయోగి నెవరు గానరు వేమా. ||244||

క. అండములో నాకాశం
బుండంగాఁ జూడఁజూడ నొనరుఁగ దీనిపై
యుండును నన్నియుఁ దెలిసిన
మెండుగ నెటుచూచి చన్నమేలగు వేమా. ||245||

ఆ. బ్రహ్మగుడ్డు ననెడిపట్టణంబులోపల
బ్రహ్మ మెఱుగలేని బాపఁడేల
తనమనంబు దెలియఁ దానెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||246||

ఆ. గురువు సెప్పువిద్య గురువునకును దెలియు
గురువుసెప్పు విద్య గురునయెఱుఁగు
గురువుమహిమ పరమగురునకుఁదెలియును
విశ్వదాభిరామ వినర వేమ. ||247||

ఆ. మనసులోనఁ దెలిసి మనసులోనే కలిసి
మనసులోనివాని మరలఁదిగిచి
మనసునిల్పువాఁడు మర్మజ్ఞుఁడగు యోగి
విశ్వదాభిరామ వినర వేమ. ||248||

ఆ. తానె తత్వమనుచు తన్నెఱుంగక లేక
మాయతత్వమనుచు మఱుగుచుండు
ధర్మకర్మములను తగరోయ దత్వమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ||249||

క. నిరతం బెడతెగ కుండక
బరిపూర్ణ బ్రహ్మ మాత్మపదమున నుండన్
నిరవద్యమయిన యడవిని
జరియించును జగమెఱుంగ సత్యము వేమా. ||250||

ఆ. తఱచుచీఁకటి విడి తఱితోడఁ దనుమఱచి
పరమునందు మనసుఁ బదిలపఱచి

గరిమయున్నయట్టి ఘనుఁడెందు లేదురా
విశ్వదాభిరామ వినర వేమ. ||251||

ఆ. త్రాడుపామతంచుఁ దాఁజూచి భయపడి
తెలిసి త్రాడటన్నఁ దీఱు భయము
భయము దీఱినపుడె బ్రహ్మంబు నంగురా
విశ్వదాభిరామ వినర వేమ. ||252||

ఆ. చూచువారికెల్లఁ జూడ వేఱైయుండు
చూపుఁజూచి దెలియఁ జూచువారు
చూచి తాముచూపుచూపె తామగుదురు
విశ్వదాభిరామ వినర వేమ. ||253||

క. దేహియు జ్ఞానానలమున
దాహంబై దేహ మెల్లఁ దల్లడపడ నా
దేహములోఁ బొర్లాడుచు
మోహమడచి శివునిఁ జూడ ముక్తిర వేమా. ||254||

ఆ. ధ్యానివలెనె యుండు మౌనివలనె యుండు
భోగివలెనె యుండు రోగివలెనె
సకలము దెలిసినను సర్వజ్ఞుఁడై యుండు
బరమయోగివలెనె పరగ వేమా. ||255||

ఆ. ఉండడె సుఖశీలి యుండును గొన్నాళ్లు
యుండి యుండి యుండి యుండలేక
ఉండ వెరవు దెలిసి గండిదొంగను బట్టి
చెండిచెండి తావుచేరు వేమా. ||256||

ఆ. తరువున నెడియింటఁ దనశత్రుమిత్రులఁ
దెలియ లేనివాని తెలివదేల
తెలిసిన మనుజునకు దివ్యామృతమ్మురా
విశ్వదాభిరామ వినర వేమ. ||257||

ఆ. నది నుదకంబులు చనుక్రియ
మది నొదవెడు తత్వబుద్ధిమగ్నత లెల్లం

దుది పదవి గలయ ఘనుఁడగు
మదధిఁ బ్రవేశించి గంగ యొప్పున వేమా. ||258||

ఆ. మనసుఁ బాఱవీడి మనసుఁ దా మగుడించి
మనసులోనఁగలుగు మర్మమెఱిగి
మనసు తాను నిల్ప మఱియుఁదా బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||259||

క. దేహాభిమాన ముండఁగ
మోహాదులు జననవార్ధిముంచును కలగా
నీహా విషయభావన
కూహాదులు పోవు మేలుకొన్నను వేమా. ||260||

ఆ. మర్మమంతగొనకు మనసైన్యమేగాన
పరరహస్య మంత బయలుపడదు
పడినమనస దెన్న బయలుపడినరీతి
విశ్వదాభిరామ వినర వేమ. ||261||

క. ఈతనువునందుఁ జూచిన
నేతనువుల కింతె యనుచు నెఱిగియుఁ దన్నుఁ
జూతురు నాలోఁ జూపున
నాతురమునఁ దపసులెల్ల నమరఁగ వేమా. ||262||

ఆ. గురుని పరమగురుని గుఱుతుగాఁ దెలియక
గురువుగాను నుండు గ్రుడ్డిరీతి
గురువుకు గురువైన గురుఁడు ప్రాణేశుండు
విశ్వదాభిరామ వినర వేమ. ||263||

గీ. రాజయోగీంద్రుఁ డాతఁడై తేజరిల్లు
వెలయ జగముల విహరించు విశ్రుతముగ
బాలు విధమున వృద్ధుని పగిదిసోకు
కరణివెంగలిక్రియ చూడ ఘనత వేమా. ||264||

క. మనసున నెఱుకను మరుపునఁ
గని విని చూడంగలేరు కదిసినపిదపన్

పెనగొని పట్టినచోనది
మనచోటను మాయమౌను మహిలో వేమా. ॥265॥

ఆ. మాయ నరకమనుచు మాయ రోయకసాటి
సమముగ నరదేవసభలయందు
నందఱు ఘనులయిన హరునకుఁ దావేది
విశ్వదాభిరామ వినర వేమ. ॥266॥

ఆ. బ్రతుకులెల్ల మాయ భవబంధములు మాయ
తెలివి మాయ తన్నుఁ దెలియ మాయ
మాయ దెలియువాఁడు మర్మజ్ఞుఁడగు యోగి
విశ్వదాభిరామ వినర వేమ. ॥267॥

ఆ. మాయలోక మన్న మర్మంబు దెలియక
మాయఁజిక్కి యంత మాయఁబడిరి
మాయ దెలియ దివ్వె మాయదా జన్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥268॥

ఆ. సతులు సుతులు మాయ సంసారములు మాయ
ధనము ఘనము మాయ తనువు మాయ
మాయ గెల్చువాఁడు మర్మజ్ఞుఁడగు యోగి
విశ్వదాభిరామ వినర వేమ. ॥269॥

ఆ. మాయలోనఁ బుట్టి మాయలోననె పెరిగి
మాయఁ దెలియలేని మనుజుఁడేల
మాయఁ దెలియువాఁడు మహిమీఁద ధన్యుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥270॥

క. మాయల సంసారమునకు
మాయలనే తిరుగుచుండు మనుజుఁడులోనై
మాయలఁ దెలిసిన యంతట
మాయలనే ముక్తి గలుగు మహిలో వేమా. ॥271॥

ఆ. సుప్తి జాగరముల సొలపులఁ దానుండి
కప్పుకొన్న మాయఁ గానలేక

దబ్బర నిజములను తానులెస్స గనక
గొబ్బున చెడిపోవు గుణము వేమా. ||272||

ఆ. మాయరూపు రూపు మాయ తాఁజేసియు
మాయరూపులఁ బెనుమాయఁజేసి
మాయలోని మాయమహిమ నెఱుంగురా
విశ్వదాభిరామ వినర వేమ. ||273||

ఆ. ముఱికికొంపలోన నిఱికించి జీవుని
కర్మపాశములను గట్టివేసి
నిట్టికర్మజీవి కెట్లొకో మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||274||

ఆ. విత్తులేని వృక్షమొక్కటి పుట్టె
ఫలము లేని పువ్వు మొదలు పత్రిలేదు
స్వాదులేదు చూడ నాపాటుకును లెస్స
దీనిభావ మేమి తెలుపు వేమా. ||275||

ఆ. మోదమునను గురుని ముఖ్యకరుణచేతఁ
దొమ్మిదిస్థలముల దొడ్డు పాయ
సర్వజీవుఁడాయె సర్వమ్ముఁ దానాయె
విశ్వదాభిరామ వినర వేమ. ||276||

క. పగయుడుగుఁ గోప ముడిగినఁ
బగ యుడుగన్ గోర్కులుడుగు పరజన్మములన్
దగు లుడుగు భేద ముడిగినఁ
ద్రిగుణము లుడుగంగ ముక్తి స్థిరమగు వేమా. ||277||

ఆ. ప్రణవ మెఱుఁగఁ బోఁడు భక్తుఁ డెప్పుడు గాఁడు
జ్యోతియెఱుఁగఁ బోడు యోగిగాఁడు
నిత్య మెఱుఁగ వాఁడు నిర్వాణిగాఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ||278||

ఆ. పగలురేయి మరచి భావంబు లోపలఁ
దాను నేను ననెడు తలఁపు మఱచి

యున్నయట్టి యతఁడు నుత్తమ యోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥279॥

ఆ. తన్ను వెదకిచూడఁ దానెపో జీవుండు
తత్వ మరసిచూడఁ దానె యాత్మ
మన్ను మిన్ను లేదు మాయరా లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥280॥

ఆ. మూలచక్ర మట్టె మొనసి గట్టిఁగ బట్టి
శోధఁజేసి శక్తి చొరవ దెలిసి
భేదపరచి మనసు బాధించి మోక్షము
సాధ్యమైన యోగి సరణి వేమా. ॥281॥

గీ. తత్వ మింద్రియముల దరిఁజూచి గెలుచును
దత్వవేత్తయైనఁ దానె మిగిలి
రాజయోగి యనుచుఁ దేజంబుచేతను
దెలిసియుండు జగతి వినర వేమ. ॥282॥

ఆ. మాటచెఱపు మూట మర్మము కర్మము
ఆశయ కడగట్టు అప్పుముప్పు
బాస దోస మెన్నఁ బలుకులు ములుకులు
లేశమయినఁ దెలియలేరు వేమా. ॥283॥

క. తొమ్మిది క్రంతపత్తికి
నిమ్మగు సొమ్ములును గులము నేటికిఁ జెపుమా
నమ్మకు దేహము నాదని
నెమ్మది బ్రహ్మంబు దెలియునే నని వేమా. ॥284॥

క. అరిషడ్వర్గంబులచే
నరులెల్లను జొక్కిచిక్కినయగతి యనుచున్
జరుగుదురు గాకతత్వము
నరయంగను లేరు నించుకైనను వేమా. ॥285॥

ఆ. మ్రానుఁ గాలవేసి మహిమీఁద నొకజాణ
పూని తిరుగుచుండుఁ బొందుగాను

కాలవేయు మ్రాను కడురమ్యమైయుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥286॥

క. బయలున బంధము గప్పను
బయలునఁ బరమాత్మునకును బంధము తొలఁగున్
బయలున బంధము లూడిన
నయవర్తన ముక్తిఁగాంచు నరుఁడటు వేమా. ॥287॥

మ. ఎప్పుడు చూచిన న్నితర మేమియుఁ జూడక ముక్తి యందుఁగన్
ఱెప్పల మూసి మూయకయ రేయిఁ బగ ళ్ళొకరీతి నుండఁగా
దప్పుల నొందఁ జేయు యమ ధర్ముని పాలికినొంద నేర్చునే
చెప్పఁగ నేమి వేమనకు జెల్లునుముక్తి విధానమంతయున్. ॥288॥

ఆ. మాట లుడుగకున్న మంత్రంబు దొరకదు
మంత్ర ముడుగకున్న మనసు నిలదు
మనసు నిలుపకున్న మఱి ముక్తి లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥289॥

ఆ. ఎండచీఁకటులకు నిమ్మయియుండెడు
నిండు కుండలోన నిద్రమఱచి
దండియైన పరమతత్వంబు దెలియురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥290॥

తే. కడఁగి సంకల్పములనెల్లఁ గట్టిపెట్టి
చిత్తమున నేమి తలఁపక చిత్రరూపు
కైవడిని నున్న యాతఁడు ఘనుఁడు దలఁప
నడవియందైనఁ బట్టణమందు వేమా. ॥291॥

క. రెప్పలు మూసియు మూయఁగఁ
దప్పక తనమనమునందుఁ దత్వము గూడున్
ఎప్పుడు చూచెడువానికిఁ
జొప్పెడు నెచ్చోట ముక్తి సులభము వేమా. ॥292॥

క. తలఁచిన దత్వంబగునా
తలఁపక తా నూరకున్నఁ దత్వంబగునా

తలఁచుట తలఁపమి రెండును
దలఁపక తానుండెనేని దత్వము వేమా. ||293||

ఆ. ఆఱుమతములందు నధికమైన మతము
లింగమతముకన్న లేదు జగతి
లింగధారికన్న దొంగలు లేరురా
విశ్వదాభిరామ వినర వేమ. ||294||

ఆ. సమమునైన దృష్టి సమముగా మదినిల్పి
బయలురుచులు మాని భద్రముగను
పరగఁజూడ బట్టబయలగు బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||295||

ఆ. వినరననక మెల్ల వెలిమూసి వాయువుల్
మనసుతోడఁ గూర్చి మర్మ మెఱిఁగి
యాత్మలింగపూజ నంటిన ముక్తిరా
విశ్వదాభిరామ వినర వేమ. ||296||

ఆ. నాసికంబునడుమ ననుఁజూచు యోగికి
వాసి వన్నె లేదు వసుధలోన
కాశినాథునైనఁ గనఁగలఁ డాయోగి
విశ్వదాభిరామ వినర వేమ. ||297||

ఆ. సూచికాగ్రదృష్టి సొరిది భ్రూమధ్యము
జూచి చూచి మఱియు చూచెనేని
ఆత్మరాకపోక లప్పుడె తెలియురా
విశ్వదాభిరామ వినర వేమ. ||298||

ఆ. నిద్రలోనినిద్ర నిజముగాఁ దెలిసిన
భద్రమౌను విద్య బ్రహ్మవిద్య
నిద్రదెలియువాఁడు నిర్మలయోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ||299||

ఆ. ముక్కుతుదను దృష్టి ముదముతోడుత నిల్పి
హృదయమందుఁజూడ నొసగుముక్తి

పదవులెరుగకున్న పరమాత్మ యోగియౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥300॥

ఆ. బయలులోని బయలు పరికించి చూడక
బయలు రూపుఁ జూచి వలచెఁగాక
ముఱికిదేహమందు మోహంబు విడదాయె
విశ్వదాభిరామ వినర వేమ. ॥301॥

క. తలఁచినను శూన్యతత్వము
తలఁపక యుండినను శూన్యతత్వం బదియౌ
తలఁచిన తలఁపీడేఱును
దలఁచకయుండినను దానె తత్వము వేమా. ॥302॥

ఆ. అంతరంగమందు నభవు నుద్దేశించి
నిల్పి చూడఁదలఁపు నిలుచుఁగాక
బాహ్యమందు శివుని భావింప నిలుచునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥303॥

ఆ. ఆఱుగురిని జంపి హరిమీఁద ధ్యానంబు
నిలిపి నిశ్చలముగ నెగడి యాత్మ
నతని నొకనిఁ జేయ నాతఁడె యోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥304॥

ఆ. తాను నేననియెడు తత్వభేదంబును
మాని కడువివేక మహిమఁ దనరి
యూరకున్నవాఁడు నుత్తమోత్తముఁడురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥305॥

క. తా నొకటి దెలియునన్నది
తానట్టిది లేక యెల్లతావులు దానై
తానేగి పరిణమించిన
మానవునకు ముక్తి గలదు మహిలో వేమా. ॥306॥

క. బైలున బంధము గలపక
వ్రాలెను పరమాత్మునకును వాంఛిత మొప్పన్

బైలున బంధము గలిపిన
కైలాసముఁజేరి ముక్తి గాంచుర వేమా. ॥307॥

ఆ. లోన బయలుచేసి లోకంబు దెగటార్చి
కులము గాలఁబెట్టి గుణము వదలి
చింతలోనిచింతఁ జేరిన యోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥308॥

ఆ. రోయవచ్చుఁ బరము రూఢిగాఁ దెలిసిన
గానవచ్చు గ్రుడ్డు కదలకున్న
రెప్పలార్పకున్న రెంటి సందుననుండి
విశ్వదాభిరామ వినర వేమ. ॥309॥

ఆ. కొంపలోన నున్న కోర్కెలు ఛేదించి
పరగ హృదయ మట్టె పదిలపఱచి
గృహము నిల్పువాఁడు బహుతత్త్వవేదిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥310॥

ఆ. దర్శనంబులందు ధర షణ్మతములందు
వర్ణకాశ్రమముల వదల కెపుడు
తిరుగుచున్నవాఁడు ధరలోన నధముండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥311॥

క. అక్షరపుటడవిఁ బొరలక
యక్షరమగు మహిగాన నవనిం దొలుతొ
నక్షరమును జపియించిన
నక్షరమగు నదియు చాల నరయఁగ వేమా. ॥312॥

ఆ. బ్రహ్మ మనగవేఱె పరదేశమున లేదు
బ్రహ్మ మనగ దానె బట్టబయలు
తన్నుదా నెఱిఁగినఁ దానెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥313॥

ఆ. అణువులోన నుండు నఖిలజగంబులు
నణువు తనదులోన నణఁగియుండు

మనసు నిల్ప నరుఁడు మఱిముక్తిఁ జేరురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥314॥

ఆ. వెన్న చేతఁబట్టి వివరంబు దెలియక
ఘృతముఁ గోరునట్టి యతనిభంగి
తాను దైవమయ్యు దైవంబుఁ దలఁచును
విశ్వదాభిరామ వినర వేమ. ॥315॥

ఆ. అదిఁజూచుచుండ నన్నిటఁ దా నుండు
నాదిఁ జూప నొకని కలవిగాదు
ఆదిముక్తిఁ దెలుపు నాత్మనే యుండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥316॥

ఆ. తన్నెఱుఁగనివాఁడు తానె తానై యుండుఁ
దన్నెఱుంగువాఁడు తానె తాను
తనువులేనివాఁడు తానె తానౌనయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥317॥

క. తానును సమస్తభువనము
లోనసువుల యంగఁదెలిసి లోనను వెలయున్
దానై వెలుఁగఁగ నేర్చిన
మానవునకు ముక్తి గలుగు మహిలో వేమా. ॥318॥

క. బయలున సర్వము పుట్టును
బయలందే లీనమగును బ్రహ్మం బనఁగా
బయలని మదిలోఁ దెలిసిన
బయలందే ముక్తి బట్టబయలగు వేమ. ॥319॥

ఆ. బయలు రూపు రూపు బయలునుగాఁ జేసి
బయలు రూపు బట్టబయలు చేసి
బయలులోనివాని భావింపఁ దత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥320॥

ఆ. కంటిలోనివానిఁ గఱుకంతుఁ డెఱుఁగును
గంటిలోనివాని మింటఁ జూడ

కన్నుమిన్ను హృదయంబాయె నెంచంగ
విశ్వదాభిరామ వినర వేమ. ॥321॥

ఆ. నిజము వరుస నెఱిఁగి నిత్యుండు గావలె
పలుకులోనిపలుకు పదిలపఱుపు
పలుకుఁజూడ నెవరొ పరికించి చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥322॥

ఆ. పంచవర్ణు నెఱుఁగఁ బరము నెఱుంగును
పరము నెఱుగ నిచ్ఛ ప్రజ్వరిల్లు
ప్రజ్వరిల్లునాఁడు పరముతా నౌనయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥323॥

ఆ. ఇహము విడువ ఫలము లింపుగఁ గలవని
మహిని బలుకువారి మాటకల్ల
యిహములోనఁ బరము నెరుఁగుట కానరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥324॥

ఆ. లింగమందుచూడ లీనమై యుండెనా
యంగమందు లింగ మమరియుండు
లింగభావమెఱిఁగి లీనమై యుండరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥325॥

ఆ. మూఁడులోకములను మొనసి యొక్కటిఁజేసి
యారులోకములను నట్లగూర్చి
స్థిరముగాను నుండు శివమూర్తి గురుఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥326॥

ఆ. ఆసనం బెఱుంగక యామర్మకర్మంబు
గురువుచేతఁ దెలిసి కూర్చకున్న
మనసు నిలుపకున్న మఱిద్విజుం డెట్లగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥327॥

ఆ. బ్రహ్మగ్రుడ్డు మేను ప్రాణమన్నది గాలి
కనులు చంద్రరవులు గారవింప

నింతకంటె బ్రహ్మ మెక్కడనున్నది
విశ్వదాభిరామ వినర వేమ. ॥328॥

ఆ. వాయువందె పుట్టి వాయువందె పెఱిగి
వాయువందు మేలు వరుసఁ దెలియ
వాయువందు ప్రాణవాయువు తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥329॥

ఆ. దానములలో నన్నదానము దొడ్డది
గానములను సామగాన మెచ్చు
ధ్యానములను శివునిధ్యానము శ్రేష్ఠము
విశ్వదాభిరామ వినర వేమ. ॥330॥

ఆ. తలపులోని తలఁపు దలఁపోసి తెలియకా
తలఁపులెల్ల విడిచి తగినభంగి
తలఁపులోనితలఁపె తత్వంబు నాత్మరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥331॥

ఆ. తాను సకలమైనఁ దనలోన సకలంబు
తనదులోని వెలుఁగు తానెఱింగి
యున్నమానవునకు నొనరంగ ముక్తిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥332॥

ఆ. సర్వ మొకటిఁ జూడ సమకూరును ధ్రువంబు
రెప్పవేయఁబోక రేయిఁబగలు
పగలులోని పగలు పరమాత్మ చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥333॥

ఆ. రూపడఁగక జీవరూపంబుఁ గనరాదు
నట్టిరూప మడగ నలవిగాదు
బ్రహ్మ మడఁగకున్న బ్రహ్మంబుఁ గనఁరాదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥334॥

క. భయమంతయు దేహముదే
భయ ముడిగిన నిశ్చయంబు పరమాత్మునిదే

లయమంతయు దేహముదే
జయమంతయు జీవుఁడనుచుఁ జాటర వేమా. ||335||

ఆ. ఏకమయినవర్ణ మెఱిఁగినయోగికిఁ
బరము నెఱిఁగిచూడ భావమొందు
నాకృతులును మఱియుననన్నిటఁ దానౌను
విశ్వదాభిరామ వినర వేమ. ||336||

క. తాను దప్పకుండ తనమనంబు నిల్పి
తావుఁ జేరునట్ల తంత్రపఱచి
తాను తావుఁ జేరి తావుఁదానేకమై
తాను దాన యగుచుఁడనరు వేమా. ||337||

సీ. తమ తలంపులలోనఁ దత్వ శిఖామణిఁ, దలఁచిన వారెల్లఁ దత్వ విదులు
ఘనమైన నిబిఢాంధ కారంబునను జ్యోతి ననువునఁ జూచిన యతఁడె యోగి
శివునిలో జీవుని జీవునిలో శివు నొనరఁ దెలిసినవాఁడు యోగదృక్కు
సౌఖ్య యోగంబున సర్వంబు శివుఁడని నిశ్చయించినవాఁడు నిర్మలుండు ||338||

ఆ. భూమిలోనఁ బుట్టు భూభార మెల్లను
తనువులోనఁ బుట్టు దత్వమెల్ల
శ్రమములోనఁ బుట్టు సర్వంబుఁ దానౌను
విశ్వదాభిరామ వినర వేమ. ||339||

ఆ. కాయముఁదగఁ గూడి కడఁగి యోగిగనున్న
కాయ ముండికాని ఘనుఁడు గాఁడు
కాయమునను ముక్తిగతి కేగవలెనయా
విశ్వదాభిరామ వినర వేమ. ||340||

ఆ. ఆది నొకటి దెలిసియాదిని మదినిల్పి
యాదిఁబాయకున్న నభవుఁ డవును
ఆదిఁ బాయువాఁడు నంధకు రీతిరా
విశ్వదాభిరామ వినర వేమ. ||341||

ఆ. అందు నిందుననక యన్నిటఁ బరికించి
విష్ణు వరయుచుండు విదితముగను

చక్రి తిరుగు భూమిచక్రంబులోపల
విశ్వదాభిరామ వినర వేమ. ||342||

ఆ. ఆకృతి యనఁగను నిరాకృతి యనఁదగు
నాకృతి నొగిఁదగు నిరాకృతిట్టు
లవియు రెండు లే యపురూపమై యుండు
విశ్వదాభిరామ వినర వేమ. ||343||

ఆ. లోను చూడఁజూడ లోకాభిరామంబు
బయలు చూడఁజూడ బంధనంబు
తన్నుఁజూడఁజూడ తారక బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||344||

ఆ. తలఁపుచేతఁగల్గు తారక బ్రహ్మంబు
తలచిఁచూడఁదానె తత్వమగును
తలఁపులోనె తలఁపు తానె తానెఱిఁగిన
విశ్వదాభిరామ వినర వేమ. ||345||

క. కమలభవాండం బెల్లను
విమలపుసుజ్ఞానులెల్ల నీక్షింతురయా
విమలంబౌ మనముదగన్
సుమహిత పిండాండ మెపుడు చూడర వేమా. ||346||

క. నరకులమునఁ దాఁబుట్టియు
నరకులమునఁ దాని బెరిగి నరుఁడయ్యును దా
నరకులమును ఛీ ఛీ యని
హరకులమునఁ దిరిగెనేని హరుఁడగు వేమా. ||347||

ఆ. ఎండయన తిరుగు నిర వెఱింగిన యోగి
యుండు నెల్లకాల ముర్విలోనఁ
దిండిపోతు వశమె తెలియంగ జ్ఞానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||348||

క. తనుసంరక్షణ కొఱకయి
మనమున కార్యములు మానుమను తత్వముచే

దినదినము తిరిగి తిరిగియు
తనువునఁ గనుగొన్న నాత్మ తత్వము వేమా. ||349||

ఆ. ఒక్కఘటములోనఁ బెక్కురూపులు నిల్చు
నెన్నియెన్నిరూపు లెనఁగుచుండు
నవియుఁదొలఁగెనేని యన్నియు బయలౌను
ఆత్మతత్వ మిట్టులౌర వేమా. ||350||

ఆ. హంగుమీరఁ దాను యతులజన్మంబుల
నరసి చెప్పునెంతవారికైన
ఆడకాడ కనువు నతిశయమై వచ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ||351||

ఆ. తనువుఁ దా ననుకొనుఁ దనకుఁదా ననఁదగి
జనన మరణములను జిక్కిచిక్కి
పొలుపుపొం దెఱుఁగక పొర్లాడుచుండెడి
భ్రాంతిజీవి కేటిపరము వేమా. ||352||

క. చిత్తము బుద్ధియు మఱచియు
హత్తు నహంకారములను నాత్మకు లోగా
మొత్తముగఁ జేయ నేరని
మత్తునకును ముక్తిలేదు మహిలో వేమా. ||353||

ఆ. తాను తనువు యనుచు ద్వయమును బలుకుచు
మోహవారిరాశి మునిఁగియున్న
జనుల కెట్లు మోక్ష సంగతి సిద్ధించు
విశ్వదాభిరామ వినర వేమ. ||354||

క. నిఖిలాకారుం డాతఁడు
నిఖిలాత్ముఁడు సర్వసాక్షి నిజముగఁ దానై
నిఖిలంబు నిందుజూఁడగ
నిఖిలంబై యుండు నిచ్చ నిజముగ వేమా. ||355||

ఆ. విన్నవానికన్నఁ గన్నవాఁ డధికుండు
కన్నవానికన్నఁ గలియువాఁడు

ఉన్నతోన్నతుఁడయి యుర్విలోపల నుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥356॥

ఆ. బ్రహ్మమును దెలిసెడు భావమందున నిల్చి
తనువు గుడిని జేసి తన్ను నిలిపి
లోకమందు నిలిచి లోఁజూపు చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥357॥

ఆ. జీవసంజ్ఞ గలుగు జీవుని తత్వంబ
జీవపరుని గురుని జెందఁజేసి
తన్ను నిల్పువాఁడు తానె తత్వజ్ఞుఁడౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥358॥

క. తనలోననె సకలంబును
తనరందా నగుటయెఱిఁగి తారకమాత్మన్
దనువనుచుఁ బరిణమించిన
మనుజునకును ముక్తికలదు మహిలో వేమా. ॥359॥

ఆ. తాను దానె యనెడి తత్వాల లోపల
నన్య మెఱుఁగకుండు నబ్బతోడు
తానెతానునయిన దల్లడం బేలరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥360॥

క. తానే నేర్పరియయినం
తారకములఁ దానెతన్ను దప్పించుకొనున్
దానెన్ని విధము లడరిన
తానే పరమాత్మ యనుచుఁ దలఁచర వేమా. ॥361॥

క. తా నగుట యెఱిఁగి సర్వముఁ
దా నగుటయుఁ దెలిసి యెల్లతత్వముదానై
తానెఱిఁగి పరిణమించిన
మానవులకు శక్తిలేదు మహిలో వేమా. ॥362॥

క. ఇదినాకుఁ జాలఁదనుచును
వదలక మదిలోననైన వస్తువు భ్రమతల్

కదిసి విడనాడ కుండిన
నదియే సంసారబీజ మందుర వేమా. ||363||

ఆ. రూపు పేరు రెండు రూఢితోఁ గలిసిన
పేరు రూపిక్రియలు పెనగిఁయుండు
నామరూపమ్ములు నాశ మొందుటమేలు
విశ్వదాభిరామ వినర వేమ. ||364||

ఆ. దేహగుణము లెల్ల దెలిసిన శివయోగి
మోహమందుఁ జిక్కి మోసపోఁడు
ఇంద్రజాలకుండు నెందుకుఁ జిక్కురా
విశ్వదాభిరామ వినర వేమ. ||365||

క. చేతస్సంకల్పంబులు
నీతిని వర్జించి నపుడె నిర్మల పదవుల్
ప్రీతిం బొందు నటందురు
భూతములనఁ బరఁగ యోగ పురుషులు వేమా. ||366||

ఆ. సుఖసుఖాన దాను సుగుణుఁడై యుండఁగఁ
బ్రకృతి పెండ్లిచేసి పరముఁ జెడిచి
విధులఁ బుట్టఁజేయు విధినిదాఁగానఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ||367||

ఆ. పడుచు పక్వమెన్నఁ బసివాఁ డెఱుంగునా
యెఱుక దివ్యయోగి యెఱుఁగుఁగాక
మోహగుణ మెఱింగి మోహంబు విడనాఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ||368||

ఆ. రూపు మాయ చూపు రూఢియై వెలుగొందుఁ
గాదుమాయమ్రానుఁ గల్పతరువు
చూపు గ్రుంగఁ జేసి చూచుట సుఖమురా
విశ్వదాభిరామ వినర వేమ. ||369||

ఆ. సిగ్గునేడనుదాగుఁ జీక టేడను దాగు
నాఁకలేడదాగు నాత్మలోన

దాగియున్న నిద్ర దాగుట తెలియుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ॥370॥

ఆ. శత్రువరుల నరసి సరగున ఖండించి
మిత్రవర్గమునకు మేలుచేసి
దండివెలుగుఁజూపి పిండమధ్యంబున
నర్థి నిలుచువాఁడు హరుఁడు వేమా. ॥371॥

ఆ. దేహ సంకటమును దెగితేరకాండ్రకు
మోహదృష్టి విడిచి మూల మెఱిఁగి
వ్యూహ మొక్కటిపన్ని యుల్లంబు సంధించి
స్నేహ మెఱుఁగ యోగ సిద్ధి వేమ. ॥372॥

క. విషయము లొరసిన నొరయఁడు
విషయేంద్రియ పరదళంబు సేయగ మఱిదా
విషమాది షట్కమను దు
ర్విషయములను బొందకుండ వేమన నేర్చున్. ॥373॥

క. తన నిజరూపముఁ జూడఁగ
తన మాయను సిద్ధులయినఁ దపముల మాయన్
తానెంతటి ఘనుఁడయినను
తనిసినవాఁడైన జూడ ధరలో వేమా. ॥374॥

ఆ. తాను పుట్టుచోటు తాఁజూచి పలికెనా
తాను బుద్ధిదిరుగు ధరణిలోన
తాను బుట్టుచోటు తత్వంబు తలపోయ
విశ్వదాభిరామ వినర వేమ. ॥375॥

క. అనలంబున జనియించియు
ననలంబున సలిలమగును నాకాశమునన్
గనిపించి పుట్టుఁదానే
జనకుఁడు లేనట్టిదాయె చరితము వేమా. ॥376॥

గీ. ఇట్టిజాడఁగాన నెందఱయిన నేమి
పుట్టఁ గాలశివుని పట్టఁగలరె

పొట్టనీవు పాసిపోగఁ దా నుబ్బురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥377॥

ఆ. కర్మగుణము లన్ని కడఁబెట్టి నడువక
తత్వమేల దన్ను దగులుకొనును
నూనెలేక దివ్వె నువ్వులమండునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥378॥

క. విత్తును నుముకయుఁ ధరలోఁ
బొత్తున జనియించి పొట్టుపోయినభంగిన్
వేత్తయగువానికర్మం
బత్తెఱగున విడిచిపోవు ననువున వేమా. ॥379॥

క. కర్మము జ్ఞానికి దవ్వగు
గర్మమునకు జ్ఞాని దవ్వుకలియుగ మందున్
గర్మజ్ఞానము లుడిగిన
నిర్మలునకుఁ గలుగు ముక్తి నిజముగ వేమా. ॥380॥

ఆ. కర్మమయుఁడుగాక ధర్మంబు దెలియఁడు
కర్మజీవి మేలు గానలేఁడు
నీరుచొరక లోతు నికరము దెలియదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥381॥

ఆ. కర్మఫలములన్ని కపటంబుగాఁ జూచి
ధర్మఫలములన్ని దగిలియుండు
ధర్మమర్మములను దాటుట ముక్తిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥382॥

ఆ. చెట్టునందుఁబుట్టి చెలరేఁగి కాయలు
దనరుఁగాంతితోడఁ దగిలిపండ్లు
పండ్లు దినుచుఁ గాయవర్ణంబు దెలియుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ॥383॥

ఆ. హంస మానసోద మంటక తిరిగిన
యట్టు కర్మచయము నంటకుండ

యోగి తిరుగు సకలభోగంబుతోడను
విశ్వదాభిరామ వినర వేమ. ॥384॥

క. తనువు శోధఁజేసి దైవమ్ము మొనఁజేసి
ముందు కర్మములను మూలఁద్రోసి
మనము నిజముఁజేసి మమతలన్నియు రోసి
మొనసి నిల్చువాఁడు మోక్షి వేమా. ॥385॥

ఆ. అన్నమునకు నంటునైన నాత్మకునంటు
ఆత్మను పెనగొన్న నన్నమంటు
ఆత్మశుద్ధియన్న మన్న శుద్ధియునాత్మ
మిన్నుమన్నుమాడ్కి మెఱయు వేమా. ॥386॥

క. హరివిధిసురిమును లాదిని
మెరసియు జన్మించి పిదప మేలులకెడగా
జరయందు మరణమందును
వరుస న్వర్తిలిరి మాయవాసన వేమా. ॥387॥

ఆ. మూల మెవ్వ రనుచు ముగ్గురిలోపల
మూల మెఱుఁగలేరు మూఢజనులు
మూలమందఱికును ముఖ్యమౌ గర్మము
విశ్వదాభిరామ వినర వేమ. ॥388॥

ఆ. ముగ్గురిలోన హెచ్చు ముందుగా కనలేక
నరకమునకుఁ బోవు నరులు గలరు
ముగ్గురికిందనట్టి మూలమూర్తి యొకండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥389॥

ఆ. ముగ్గురి నెఱుఁగునట్టి మూలంబు నెఱిఁగియు
ముగ్గురిమీఁద నొకటి మునుపు తెలిసి
పరగఁజిహ్వాచేతఁ బ్రస్తుతి చేయరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥390॥

క. విధికృతములందు రన్నియు
విధికిని విధి లెస్సయయ్యె విష్ణు జపింపన్

విధియుభవురూప మందెను
విధి బ్రహ్మము సుమ్ముదలప వినరా వేమా. ॥391॥

ఆ. కుండఁగుంభ మండ్రు కొండఁ బర్వతమండ్రు
ఉప్పు లవణ మండ్రు నొకటి గాదె
భాషలింతెవేఱు పరతత్వ మొక్కటి
విశ్వదాభిరామ వినర వేమ. ॥392॥

ఆ. ఆకు కానవచ్చు హరిహరాదులకును
కొమ్మ గానరాదు కోరిచూడ
కొమ్మగానరాగఁ గొనియాడ కుండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥393॥

ఆ. వాఁడు వాఁడు వాఁడు వానిలోపల నుండు
వాఁడు వాఁడు వాఁడు వాఁడుగాఁడు
వాని వానిగూర్చువాఁడెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥394॥

ఆ. అయిదు నక్షరముల యంగంబు దెలిసిన
నైదునందు ముక్తి యమరియుండు
నైదులోననున్న యతఁడెపో బ్రహంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥395॥

ఆ. బ్రహ్మఁ జంపి విష్ణుభాగంబులోఁ గల్పి
విష్ణుఁ జంపి శివునివెలయఁ గల్పి
శివునిఁ జంపి తాను శివయోగి కావలె
విశ్వదాభిరామ వినర వేమ. ॥396॥

ఆ. ఇంత వగవ వెలసె నేకాంత బుద్ధితా
హరిహరాదులందు నాశ లుడిగి
శాంతబుద్ధి నుండ సమకూరును సుఖంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥397॥

ఆ. బ్రహ్మఘటము మేను ప్రాణంబు దగ గాలి
మిత్రచంద్రవహ్ని నేత్రచయము

మఱియుఁ బ్రహ్మ మనఁగ మహిమీదలేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥398॥

ఆ. పంచశత్రుఁ దెగడి పంచబాణుని గెల్చి
పంచవర్ణములను పఠనఁ జేసి
పంచముఖములు గల భవసంజ్ఞ గలవాని
పంచఁ జేరువాఁడు పరుఁడు వేమా. ॥399॥

ఆ. అచరచరసమూహ మంగము లింగము
సరణి దెలియనట్టి శైవమేల
అష్టతనువు లమర హరుఁడౌట నెఱుఁగరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥400॥

ఆ. ఈశ్వరుని దలంప నేడుపాళ్లుగఁ జేసి
తనదుమూర్తినెల్ల ధారఁబోసి
నిత్యకర్మములను నిలుచురా నెఱయోగి
విశ్వదాభిరామ వినర వేమ. ॥401॥

ఆ. ఏడె యక్షరముల నీయంద మొందిన
నందు నిందు ముక్తి యలరుచుండు
నందు నిందుఁ దెలియ నదియెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥402॥

ఆ. ఎసఁగువేత్త యనుచు నెఱుగరే యీనరుల్
వేయిమార్గములను వేలు పజుఁడు
అవని సృష్టికర్త యంతకు గురుఁ డెన్న
నతనికి తలయేది యరయ వేమా. ॥403॥

క. వేమన చెప్పిన మాటలు
సామంబున సకలవేద సారంబుగదా
సామెత పంచాక్షరిలో
నీమహిమలఁ దెలియకున్న నింపా వేమా. ॥404॥

ఆ. ప్రణవమంత్రమహిమ భావింప లింగంబు
మూడుమూర్తులందు మొనసియుండు

నతని నెఱిఁగి కొలువ నన్యుల వశమా
విశ్వదాభిరామ వినర వేమ. ॥405॥

ఆ. అక్షరపుట మిట్టి యండంబులోఁ గూర్చి
యమరునొక్క రవము ననుభవించు
నతని కన్న ముక్తి యక్షరమై యుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥406॥

క. అక్షరపుటడవిఁజొర వే
లక్షలఁ జదువంగ నేల లాలితముగఁ బ్ర
త్యక్షముగను శివ యను రెం
డక్షరములు మనకి శుద్ధి యగురా వేమా. ॥407॥

ఆ. లోను బదిలపఱచి లోనివికారముల్
దలఁచి మెట్టువారు తెలియువారు
ఆకసమున వేడ్కనరయంగ నుందురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥408॥

ఆ. సూక్ష్మమధ్యమునను సొరిది జీవుం డుండు
స్థూలమధ్యమందు సూర్యుఁ డుండు
నాదబిందుకళల నాబ్రహ్మ ముండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥409॥

ఆ. చూపులోనిచూపు సూక్ష్మమౌ దెలియంగఁ
జూపులోనిచూపు శుభ్రమాయె
జూపులోనిచూపు సురవరగమ్యము
విశ్వదాభిరామ వినర వేమ. ॥410॥

ఆ. ప్రణవ మరయలేక భక్తుఁడు గాలేఁడు
జ్యోతి నరయలేక జోగికాఁడు
నిత్య మరయలేక నిర్వాణికాఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥411॥

ఆ. ఆత్మయందు జ్యోతి యెఱుగుట లింగంబు
తెలిసిచూడగాను తేటపడును

అదియు గురువులేక యబ్బునా తెలియంగ
విశ్వదాభిరామ వినర వేమ. ॥412॥

క. ఘంటారావము మదిలో
వింటిన్నే కంటఁగంటి విమలపుకాంతిన్
వెంటాడక బ్రహ్మంబును
గంటిని వగ కాదు నన్నుఁ గనుగొన వేమా. ॥413॥

ఆ. మొదలు చూచిచూచి తుదిఁ జూడకుండెనా
చూపు తప్పినపుడె సొరగవలెను
సొరగకున్నవానిఁ జులకగాఁ జూతురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥414॥

ఆ. జ్ఞానముద్రచేతఁ గానవచ్చెడితళ్కు
నదియ మదికి శ్రేష్ఠ మనుచు మునులు
పలికి రదియుఁ దెలియఁ బరమార్థ మగునయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥415॥

ఆ. నాదబిందుకళల నయమొంది యాత్మ
యం దంటి చపలచిత్త మమర నిల్పి
బ్రహ్మరంధ్రమునను బ్రబలిన యోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥416॥

ఆ. మనసు హక్కు కర్మ మదియేమి లేకయ
రాకపోకలేని రాజవీధి
పరగ హాని గలదె పరతత్వయోగికి
విశ్వదాభిరామ వినర వేమ. ॥417॥

ద్వితీయాశ్వాసము

ఆ. సూక్ష్మరూప మెఱిగి సుఖమొందగా లేక
బహుళముగను జదువఁబడుచు నరుఁడు
చావుచేటెఱుఁగని చదువేల చదువునో
విశ్వదాభిరామ వినర వేమ. ॥1॥

ఆ. ఉత్తముని కడుపున నోగు జన్మించిన
వాఁడు చెఱచువానివంశమెల్ల
చెఱకువెన్ను పుట్టి చెఱపదా తీపెల్ల
విశ్వదాభిరామ వినర వేమ. ॥2॥

ఆ. తనువ దెవరిసొమ్ము తనదని పోషింప
ధనమదెవరిసొమ్ము దాచుకొనఁగ
ప్రాణ మెవరిసొమ్ము పాయకుండఁగ నిల్ప
విశ్వదాభిరామ వినర వేమ. ॥3॥

ఆ. జీవిఁజంపుటెల్ల శివభక్తి తప్పుట
జీవు నరసిచూడ శివుఁడు గాదె
జీవుఁడు శివుఁడగును సిద్ధంబు దెలియరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥4॥

ఆ. పరగ చెట్టుఁబెట్టి పాలింప కుండెనా
వెలుగుదాటి వీధి వెళ్ళిరాఱు
ఆడువారి చిత్త మటువలె నుండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥5॥

ఆ. కొంకణంబు పోఁవగుక్క సింహము గాదు
కాశిబోవఁబంది గజము గాదు
వేఱె జాతివాఁడు విప్రుఁడు గాఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥6॥

ఆ. ఇచ్చువానియొద్ద నీయనివాడుండఁ
జచ్చుగాని యీవి సాగనీఁడు
కల్పతరువుక్రింద గ్రచ్చ చెట్టునట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥7॥

ఆ. అల్పబుద్ధివాని కధికార మిచ్చిన
దొడ్డవారినెల్లఁ దొలఁగఁగొట్టు
చెప్పుతినెడికుక్క చెఱకుతీ పెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥8॥

ఆ. ఆపదందుఁ జూడు మారయ బంధుల
భయమువేళఁజూడు బంటుగుణము
పేదపడ్డ వెనుక పెండ్లము మతిఁజూడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥9॥

ఆ. మగఁడు మదనుఁడైన మంచికాఁపురమైన
సహజ మేల మాను జారకాంత
పాలుద్రావు కుక్క బడిబడి పోవదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥10॥

ఆ. పురుషుఁ డెఱుఁగఁ జంపు భూపతి వినఁజేటు
నఖిలనిందలకును నాలయంబు
పరపురుష గమనము ప్రత్యక్ష నరకము
విశ్వదాభిరామ వినర వేమ. ॥11॥

ఆ. ఆలి వంచలేక యధమత్వముననుండి
వెనుక వంతుననుట వెఱ్ఱితనము
చెట్టుముదర నిచ్చి చిదిమినఁ బోవునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥12॥

ఆ. ఎలుకతోక దెచ్చి యెందాక నుతికిన
నలుపుగాక యేల తెలుపు గలుగు
కొయ్యబొమ్మ తెచ్చి కొట్టిన గుణియౌనె
విశ్వదాభిరామ వినర వేమ. ॥13॥

ఆ. కుక్కతోకఁ దెచ్చి గొట్టంబుఁ జేర్చిన
గ్రోవిచెంతనుండుఁ గొంతతడవు
ఎంతఁజెప్పఁ జెడుగు పంతంబు మానునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥14॥

ఆ. ఆలు మగనిమాట కడ్డంబు వచ్చెనా
యాలుఁగా దది మరగాలు కాని
యట్టియాలు విడచి యడవి నుండుట మేలు
విశ్వదాభిరామ వినర వేమ. ॥15॥

ఆ. మాటవిననియాలు మగనికి మృత్యువు
యోటిపడవ సర్ప మొంటిగృహము
తనకుఁగానియాలు దానవురాలయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥16॥

ఆ. ఓజమాలుపొలతి యోలిమాడలు చేటు
పోటికెడలుబంటు కూటి చేటు
పనికిమాలినతొత్తు బత్తెంబు చేటురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥17॥

ఆ. తప్పు లెన్నువారు తండోపతండము
లుర్వి జనులకెల్ల నుండుఁ దప్పు
తప్పు లెన్నువారు తమతప్పు నెఱుఁగరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥18॥

ఆ. మ్రుచ్చు తీర్థమేగి ముల్లె విడుచును గాని
మ్రొక్కఁబ్రొద్దు లేదు మొనసి యెపుడు
కుక్క యిల్లుచొచ్చి కుండలు వెతుకదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥19॥

ఆ. కల్లలాడువాని గ్రామకర్త యెఱుంగు
సత్యమాడువాని స్వామి యెఱుంగు
బెక్కుతిండిపోతుఁ బెండ్లా మెఱుంగురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥20॥

ఆ. పాగ పచ్చడంబు పైకిఁ గూసంబును
పోగు లుంగరములు బొజ్జకడుపు
గలిగినట్టివానిఁ గందురు చుట్టముల్
విశ్వదాభిరామ వినర వేమ. ॥21॥

ఆ. ఈఁతకంటె లోతు నెంచంగఁ బనిలేదు
చావుకంటెఁ గీడు జగతిలేదు
గోచిపాతకంటె కొంచెంబు మఱిలేదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥22॥

ఆ. జాణలనయట్టి చపలాయతాక్షుల
వలపు లరసిచూచి బ్రమయకేల
బయలిరూపులరసి పరికింపగా నేల
విశ్వదాభిరామ వినర వేమ. ॥23॥

ఆ. ఇంతిఁ జూచెనేని యింతంత యనరాదు
కానవచ్చినలక్క కరఁగినట్లు
వట్టిమోహ మిట్లు రట్టులఁ జేసెరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥24॥

ఆ. కలిమి కలిగెనేని కాముగాఁజూతురు
లేమిచేతఁ జిక్క లేమ లధిపు
మదనువంటివాని మాలఁగాఁ జూతురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥25॥

ఆ. కలిగిన మనుజుండు కాముఁడుసోముఁడై
మిగులఁ దేజమునను మెఱయుచుండు
విత్తహీనుఁడైన రిత్తయై పోవును
విశ్వదాభిరామ వినర వేమ. ॥26॥

ఆ. విటులకనుల కెంత విభ్రమమై యుండు
సాటిలేని పొలఁతి చక్కఁదనము
కంటిలోనిపాప కుంటెనకాఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥27॥

ఆ. గురువునకును పుచ్చుకూరైన నియ్యరు
అరయ వేశ్యకిత్తు రర్థమెల్ల
గురుఁడు వేశ్యకన్న గుణహీనుఁ డేమొకో
విశ్వదాభిరామ వినర వేమ. ॥28॥

ఆ. తీపులోన తీపు తెలియంగఁ బ్రాణంబు
ప్రాణవితతికన్నఁ బసిడి తీపు
పసిడికన్న మిగులఁ బడతిమాటలు తీపు
విశ్వదాభిరామ వినర వేమ. ॥29॥

ఆ. పనసతొనలకన్నఁ బంచదారలకన్న
జుంటితేనెకన్న జున్నుకన్నఁ
జెఱుకురసముకన్నఁ జెలిమాట తీపురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥30॥

ఆ. కొమ్మదిమ్మరైనఁ ద్రిమ్మరులవలదు
సరసవిటులనేల సమ్మతించు
పేడతిన్న పురుగులెల్ల మేమెఱుఁగురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥31॥

ఆ. ఆలివంకవార లాత్మబంధువు లైరి
తల్లివంకవారు తగినపాటి
తండ్రివంకవారు దాయాది తగవులౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥32॥

ఆ. కుక్క యేమెఱుంగు గురులింగజంగంబుఁ
బిక్కనొడిసిపట్టి పీఁకుగాక
సంతపాకతొత్తు సన్యాసి నెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥33॥

ఆ. తొత్తుతోడిపొందు తొట్టిపెసలమూట
ముచ్చుతోడిపొందు తెచ్చునింద
తలవరింటిపొందు తలతోటిదీరురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥34॥

ఆ. తనదునృపతితోడఁ దనయాయుధముతోడ
నగ్నితోడఁ బరులయాలితోడ
హాస్యమాడుటెల్ల హాని ప్రాణమునకు
విశ్వదాభిరామ వినర వేమ. ॥35॥

ఆ. మంచిరుచులను గోరు మంచిస్త్రీలను గోరు
మనుజుఁ డెంత చెడ్డమనసు చూడ
నించుకైన నేలని విడువఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥36॥

ఆ. తరుణి సొగసుఁగన్న తనయుని గన్నను
మరునికళల మించి మనము పాఱు
పాపజాతి మనము పట్టంగ రాదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥37॥

ఆ. తేనె పంచదార తియ్యమామిడిపండు
తిన్నఁగాని తీపు తెలియగరాదు
కన్న నింపు పుట్టుఁ గామినియధరంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥38॥

ఆ. ఎద్దుకన్న దున్న యేలాగు తక్కువ
యెరువులేకపోయి తిరిగె విలువ
నేర్పెఱుఁగనివాని నెఱయోగి యందురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥39॥

ఆ. పదుగు రాడుమాట పాటియై ధరఁజెల్లు
నొక్కఁడాడుమాట యెక్కదెందు
నూరకాడుకాని కూరెల్ల నోపదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥40॥

ఆ. గుణయుతునకు మేలు గోరంతఁ జేసినఁ
గొండయౌను వానిగుణముచేత
కొండకొలఁదిమేలు గుణహీనుఁ డెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥41॥

ఆ. పతిని విడువరాదు పదివేలకైనను
పెట్టి చెప్పరాదు పేదకైన
పతిని దిట్టరాదు పతి రూపవతియైన
విశ్వదాభిరామ వినర వేమ. ॥42॥

ఆ. సుతులు పతులు మాయ సుఖదుఃఖములు మాయ
సంస్మృతియును మాయ జాతిమాయ
మాయబ్రతుకుకింత మాయ గల్పించెరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥43॥

ఆ. మాటనిలుపలేని మనుజుండు చండాలుఁ
డాజ్ఞ లేనిరాజు ఆఁడుముండ
మహిమలేని వేల్పుమంటిఁ జేసినపులి
విశ్వదాభిరామ వినర వేమ. ॥44॥

ఆ. సిగ్గువారల మని సృష్టిలోపలివారు
వెఱ్ఱివేమనఁ గని వెఱఁగుపడిరి
తనకుఁ గలుగుసిగ్గు దైవ మెఱుంగురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥45॥

ఆ. విడువ ముడువ లేక కుడువఁ గట్టఁగ లేక
వెఱపులేక విద్య నొరయలేక
వెడలలేనివాని నడపీనుఁ గందురో
విశ్వదాభిరామ వినర వేమ. ॥46॥

ఆ. లేని కాలమునకు లేమిమనము నొందు
నీనిన పులిరీతి నెఱుఁగకుండు
కఠినబుద్ధి కిట్లు కలిమేమి గల్గురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥47॥

ఆ. ఇంచుకంతబోన మీశ్వరార్పణ మన్న
పుణ్యలోకమునకుఁ బోవు నతఁడు
అన్నదానమునకు నధికదానము లేదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥48॥

ఆ. ప్రియములేని విందు పిండివంటలచేటు
భక్తిలేని పూజ పత్రిచేటు
పాత్ర మెఱుఁగ నీవి బంగారు చేటురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥49॥

ఆ. తన్నుఁ దానెఱుఁగఁడు తా నెవ్వరికి నేర్పు
ప్రాలుమాలితిరుగు పశువుకొడుకు
కాసులకొఱకైన కర్మముల్ గట్టురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥50॥

ఆ. సుతులచేతఁ బుణ్య సుఖముఁబొందుదు నని
మనుజుఁడుండు కర్మమతముఁ దగిలి
యేనుఁగు పడియున్న నెత్తునా మశకంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥51॥

ఆ. ఎంతచదువుఁ జదివి యెన్ని విన్నను గాని
హీనుఁ డవగుణంబు మానలేఁడు
బొగ్గు పాలఁగడుగఁ బోవునా మలినంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥52॥

క. మొదటను మతమును వదలక
తుద నెవ్వరిమతమునైన దూషింపకయున్
పదిలుఁడయి కోర్కెఁగోరక
ముదమునఁ జరియించువాఁడె ముఖ్యుఁడు వేమా. ॥53॥

ఆ. తిరిపెగాని మిగుల దీపించఁ గనరాదు
వెఱ్ఱివానిమాట వినఁగ రాదు
వెఱ్ఱికుక్కఁ బట్టి వేటాడ వచ్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥54॥

ఆ. ఆలు బిడ్డలు ధన మరయఁ దల్లియుఁ దండ్రి
కలమనుజుఁడు మిగుల కష్టపడును
తనకు నెవరులేరు తాను బ్రహ్మముఁగన్న
విశ్వదాభిరామ వినర వేమ. ॥55॥

ఆ. పూసపోగుపైడి పుట్టంబు విడియంబు
కాయపుష్టిమిగులఁ గలిగియున్న
హీనజాతి నైన నిందురమ్మందురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥56॥

ఆ. మాసిన తలతోడ మలినవస్త్రముతోడ
నొడల జడ్డుతోడ నుండెనేని
యగ్రజన్ముఁడయిన నట్టిపొమ్మందురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥57॥

ఆ. కొండెగాఁడు చావఁ గొంపదనుకఁ బోక
వంతు కింతెకాని వగపులేదు
కొంకనక్క చావ గొఱ్ఱెలేమిటి కేడ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ॥58॥

ఆ. వాడకుఱికి తిట్టు వలదన్న మొఱఁబెట్టు
ముందు మగనిఁ దిట్టు ముసుఁగుపెట్టు
గడుసురాలు మగని గంపఁ బెట్టమ్మురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥59॥

ఆ. ఆడు పాపజాతి యన్నిటికంటెను
ఆశచేత యతులు మోసపోరె
చూచి విడుచువారు శుద్ధాత్ములెందును
విశ్వదాభిరామ వినర వేమ. ॥60॥

ఆ. నిజములాడువాని నిందించు జగమెల్ల
నిజము లాడరాదు నీచుతోడ
నిజమహాత్ముఁగూడ నిజమాడవలయురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥61॥

క. వెఱవవలెఁ బామునకు నిల
వెఱవఁగవలె మరణమునకు విశ్వములోనన్
మఱవగవలె సంగమముల
మఱి మఱువగ వలదు మేలు మహిలో వేమా. ॥62॥

క. ఇచ్చకము భువిని వశ్యము
కుచ్చిత మీలోకనింద కోవిదునకు నీ
తుచ్ఛమున హాని వచ్చును
మచ్చరమే తన్నుఁ జెఱచు మహిలో వేమా. ॥63॥

ఆ. కోతిఁ బట్టితెచ్చి క్రొత్తపుట్టముగట్టి
కొండమ్రుచ్చు లెల్లఁ గొలిచినట్లు
నీతిహీనునొద్ద నిర్భాగ్యు లుందురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥64॥

ఆ. గాడ్దెమేనునిండ గంధంబుఁ బూసిన
నేమి యెఱుఁగలేక యెగసితన్ను
నీడుకానివాని నిష్ట మీలాగురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥65॥

ఆ. విడువవలయు నూరు విశ్రాంతి గాకున్న
విడువవలయు నాలి విధముఁ దెలిసి
విడువవలయు రాజు వితరణి గాకున్న
విశ్వదాభిరామ వినర వేమ. ॥66॥

ఆ. అప్పుదీయ రోత హరిహరాదులకైన
మొప్పెతోడ మైత్రి మొదలె రోత
తప్పు బలుక రోత తాకట్టిడిన రోత
విశ్వదాభిరామ వినర వేమ. ॥67॥

ఆ. ఎడ్డె దెలుపవచ్చు నేఁడాది కైనను
మౌనిఁ దెలుపవచ్చు మానమందు
మొప్పెఁ దెలుపరాదు ముప్ప దేండ్లకు నైన
విశ్వదాభిరామ వినర వేమ. ॥68॥

ఆ. చూపువలనఁ బుట్టు సుఖదుఃఖములు రెండు
పతికి సతికిఁ బుట్ట పరగ సుతుఁడు
సతికి సుతునివలన సౌఖ్యంబు గలుగును
విశ్వదాభిరామ వినర వేమ. ॥69॥

ఆ. నీళ్ళమీదఁ జూడు నెరయ నోడలపర్వు
బయలుమీఁదఁ జూడు పక్షిపర్వు
నాఁడువారిగమన మీలాగు నుండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥70॥

ఆ. ఆలు రంభయైన నతిశీలయైన
జారపురుషుఁడేల జాడ మాను
మాలవాడ కుక్క మరగినచందంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥71॥

ఆ. చాకివాఁడు కోక చీకాకుపడఁ జేసి
మయిలఁబుచ్చి మంచిమడుపుఁ జేయు
బుద్ధిచెప్పువాఁడు గ్రుద్దిన నేమయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥72॥

ఆ. కలిమినాఁడు మగని కామిని చూచును
లేమిఁజిక్కునాఁడు లేవకుండు
మనినమగనినైన మడియంగఁ జూచును
విశ్వదాభిరామ వినర వేమ. ॥73॥

ఆ. పాలు పంచదార పాపరపండ్లలో
చాలఁబోసి పండ్లఁ జవికిరావు
కుటిలమానవులకు గుణ మేల కలుగురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥74॥

ఆ. భూమి నాదియన్న భూమి ఫక్కున నవ్వు
దానహీనుఁ జూచి ధనము నవ్వు
కదన భీతుఁ జూచి కాలుండు నవ్వును
విశ్వదాభిరామ వినర వేమ. ॥75॥

ఆ. తనదుభ్రాత లెల్ల దానంబు సేయంగ
తనకు ఫలమటంచుఁ దలఁచరాదు
తనదుకాలు కోయఁ దన తమ్ముఁడేడ్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥76॥

ఆ. పంకజాక్షిఁ గన్న బంగరు పొడగన్న
దిమ్ముబట్టియుండు తెలివి కెల్ల
మనుజులకును తత్వమహి మెట్టు గల్గురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥77॥

ఆ. దాతగానివాని తఱుచుగా వేఁడిన
వాడుఁ దాతయగునె వసుధలోన
అవురు దర్భ యౌనె యబ్ధిలో ముంచిన
విశ్వదాభిరామ వినర వేమ. ॥78॥

ఆ. మొండివాని కేల ముంజేతి కడియాలు
తొట్టివాని కేల కట్టపండ్లు
గాడిదలకు నేల గడ్డముల్ మీసముల్
విశ్వదాభిరామ వినర వేమ. ॥79॥

ఆ. దొడ్డవాండ్రమనుచుఁ ద్రోవడొంకలు బెట్టి
యడ్డమైన జనులనంటఁగట్టి
దోచుకున్న నట్టి దోష మెక్కడఁబోవు
విశ్వదాభిరామ వినర వేమ. ॥80॥

ఆ. పట్టనేర్చు పాము పడగ నోరఁగఁజేయు
చెఱుపఁజూచువాఁడు చెలిమిఁజేయు
చంపఁ దలఁచురాజుచనువిచ్చు చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥81॥

ఆ. ఎంతసేవఁజేసి యేపాటుపడినను
రాచమూక నమ్మరాదు రన్న
పాముతోడిపొందు పదివేలకైనను
విశ్వదాభిరామ వినర వేమ. ॥82॥

ఆ. మొదల క్రియను దప్పి మోసంబుచేసియు
పొట్టకొఱకు మనసుఁ బొందుపఱచి
బీద కుక్కరీతి పెరుగును మనుజుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥83॥

ఆ. కలికిచిత్ర మరయఁ గామునియంత్రంబు
పువ్వుఁ బోడిచుక్కబొట్టు గన్న
కాంతిబెళుకు గన్న కడు పొక్కు పుట్టురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥84॥

క. చక్కెర గలిపియు తినఁగా
ముక్కిన తవుడైన లెస్స మోహము గలుగన్
వెక్కురు బానిసయైనన్
మక్కువఁ గను దివ్యభామ మహిలో వేమా. ॥85॥

ఆ. ఎట్టివానికైనఁ బుట్టును మోహంబు
పుట్టు మోహమెల్లబ్రోవఁద్రొక్కి
గట్టిచేసి చూడఁ గాన్పించు బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥86॥

ఆ. పట్టుకొమ్మ లేక బలుపాట్ల బడువారు
పెట్టిపోయ లేక తిట్టువారు
ముట్టిశివునిపూజ మొదలు సేయరు వారు
విశ్వదాభిరామ వినర వేమ. ॥87॥

ఆ. ఆత్మలోని శివుని ననువుగా శోధించి
నిశ్చలముగ భక్తి నిలిపెనేని
సర్వముక్తుడౌను సర్వంబుఁ దానౌను
విశ్వదాభిరామ వినర వేమ. ॥88॥

ఆ. ఎఱిఁగిన శివపూజ యెన్నడు చెడిపోదు
మొదలఁబట్టుపట్టి వదల రాదు
మొదలు విడిచి గోడ తుదిఁ బెట్ట గల్గురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥89॥

ఆ. చేటు వచ్చెనేని చెడనాడు దైవంబు
మేలు వచ్చెనేని మెచ్చుఁ దన్ను
చేటు మేలుతలఁపుఁ జేసినకర్మముల్
విశ్వదాభిరామ వినర వేమ. ॥90॥

ఆ. కడుపుచిచ్చుచేత కామానలముచేత
క్రోధవహ్నిచేత కుతిలపడకను
యుక్తమనసుతోడ నుండినప్పుడె ముక్తి
విశ్వదాభిరామ వినర వేమ. ॥91॥

క. ఏవంక మనసు కలిగిన
నా వంకకు నింద్రియంబు లన్నియు నేగున్
నీ వంక మనసు కలిగిన
నే వంకకు నింద్రియంబు లేగవు వేమా. ॥92॥

ఆ. పాలు పెరుగు వెన్న పాయసాన్నము నెయ్యి
జున్ను లెన్నియైనఁ జూడ పాలె
పొలవంటికులము బ్రహ్మంబు కానరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥93॥

ఆ. చదువులందు రాజపదవులందును పాడి
మొదవులందు స్త్రీల పెదవులందు
నాశ లుడుగునట్టి యయ్యలు ముక్తులు
విశ్వదాభిరామ వినర వేమ. ॥94॥

ఆ. కడుపు కేల మనసు కళవళపడియెడు
కడుపు కేలతృప్తి కలుగుచుండు
కరప రాతిలోని కప్పకుఁ గలుగదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥95॥

ఆ. శూద్రతనము పోయె శూద్రుఁడఁ గానని
ద్విజుఁ డనుకొనుటెల్ల దెలివిలేమి
ఇత్త డెసఁగ పసిడి కీడన వచ్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥96॥

ఆ. అధికమైన యజ్ఞ మల్పుండు తాఁ జేసి
మొనసి శాస్త్ర మనుచు మురువు దక్కు
దొబ్బ నేర్చుకుక్క దుత్తల మోచునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥97॥

ఆ. శాంతమానసమునఁ జల్లనై శీతల
భాతి నున్నవాఁడు పరమయోగి
యట్టివాఁడు ముక్తి నతివేగఁ గైకొను
విశ్వదాభిరామ వినర వేమ. ॥98॥

ఆ. కనకమేడల మంచి కాంతలయెడలను
వలఁచియుందు రెంతవారలైన
తోయజాక్షిఁ బాయుదొర లెవ్వరును లేరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥99॥

ఆ. మధురసములు గోరి మక్షికంబులు చేరి
చొచ్చి వెడలలేక చచ్చున్నట్లు
మునిగిఁ వెడల లేఁడు మోహంబు రాశిలో
విశ్వదాభిరామ వినర వేమ. ॥100॥

ఆ. ఒడలుఁ బెంచులంజ యుబ్బకంబుననైన
వేగ విటునిమీఁద విఱుఁగఁబడును
పందికొక్కుమీద బండికల్ పడ్డట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥101॥

క. వెలయాలి వలనఁ గూరిమి
కలుగదు, మఱి కలిగెనేని కడతేరదురా
పలువురు నడిచెడి తెరువున
పులు మొలవదు, మొలిచెనేని పొదలదు వేమా. ॥102॥

ఆ. తొత్తుతోడి పొందు దోషంబు దోషంబు
లంజతోడిపొందు లజ్జ చెడును
జారతోటిపొందు చావుకుమూలమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥103॥

ఆ. బ్రహ్మ మున్నచోటు పరగంగఁ దెలియక
యెందొవెదుక బ్రహ్మ మేల కలుగు
అంజనంబు లేక యా సొమ్ము దొరకదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥104॥

ఆ. వెఱ్ఱిమొద్దు కేల వేదశాస్త్రంబులు
ముద్దులాడి కేల ముసలిమగఁడు
చద్ది మిగులనింట సంసార మేలరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥105॥

ఆ. సాధుచరితయైన సతి సత్ప్రవర్తన
జార యే మెఱుంగు సాధువైన
బ్రహ్మనిష్ఠ నెఱుఁగుఁ బ్రాకృతుఁ డెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥106॥

ఆ. హీనుఁ డెన్నివిద్య లిల నభ్యసించిన
ఘనుఁడు గాఁడు హీనజనుఁడె కాని
పరిమళమ్ము గర్దభము మోయ ఘనమౌనె
విశ్వదాభిరామ వినర వేమ. ॥107॥

ఆ. చక్కఁదనము లేల సంపత్కరము లేల
విద్యలేల భూమివిరివి యేల
పుత్రపదవికన్న పుట్టునె పదవులు
విశ్వదాభిరామ వినర వేమ. ॥108॥

ఆ. భాగ్యవంతురాలు పరులయాఁకలి దప్పి
దెలిసి పెట్టనేర్చుఁ దీర్ప నేర్చు
తర దుష్టురాలు తన యాఁకలినె గాని
పరులయాఁక లెఱుంగ దరయ వేమ. ॥109॥

ఆ. మనసులోన నున్న మమత లన్నియుఁ గోసి
దృఢముఁ జేసి మనసు తేటఁబఱచి
ఘటము నిల్పువాఁడు ఘనతరయోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥110॥

ఆ. పచ్చవిల్తుచేత గ్రచ్చఱ జను లెల్ల
తచ్చువాడఁ బడిరి ధరణిలోన
కులజుఁ డెవ్వఁ డిందుఁ గులహీనుఁ డెవ్వడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥111॥

ఆ. కాఁగల పను లెల్లగా కెట్లుపోవును
కాని పనులు భువిని కానె కావు
మహిమవేఱె యుండు మనతోడ నున్నదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥112॥

ఆ. శత్రువులను ద్రుంచి శాంతంబు వహియించి
కృత్యములను నడుపు నిత్యు నెఱిగి
సత్యము చెడకుండ సాధించినటువంటి
పురుషుఁ డౌను పుణ్యపరుండు వేమ. ॥113॥

ఆ. తనదు దేహమందు తనకున్న పరివార
మందఱం బిగించి హర్ష మెసఁగ
నెల్లచావు లెఱిఁగి యిందందు నెఱిఁగియు
నడవ నేర్చుమేటి నరుఁడు వేమ. ॥114॥

ఆ. మొదట నాకుఁ బెట్టి తుది లేదు పొమ్మను
పరమలోభులైన పాపులకును
వారియుసురు దాకి వగచెడి పోవరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥115॥

ఆ. బడుగు నెఱుఁగ లేని ప్రాభవం బది యేల
ప్రోదియిడని బంధు భూతి యేల
వ్యాధి దెలియలేని వైద్యుఁడు మఱియేల
విశ్వదాభిరామ వినర వేమ. ॥116॥

ఆ. తుంటవింటివాని తూపుల ఘాతకు
మింటి మంట నడుమ మిడుకఁ దరమె
యింటియాలి విడిచి యెట్లుండవచ్చురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥117॥

ఆ. పాముకన్న లేదు పాపిష్టిజీవము
అట్టిపాము చెప్పినట్టు వినును
ఇలను మూర్ఖుఁ దెలుప నెవ్వరి వశమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥118॥

ఆ. ఎవ్వ రెఱుఁగకుండ నెప్పుడు పోవునో
పోవు జీవ మకట బొంది విడిచి
అంతమాత్రమునకు నపకీర్తి నెఱుఁగక
విరుగఁబడును నరుఁడు వెఱ్ఱి వేమ. ॥119॥

ఆ. తనువు విడిచి తాను తరలిపోయెడివేళ
తనదు భార్య సుతులు దగినవార
లొక్కరైన నేగ రుసురు మాత్రమె కాని
తనదుమంచి తోడు తనకు వేమ. ॥120॥

ఆ. పూర్వ వాసనగల పుణ్యాత్ము లెప్పుడు
నూటచెలమరీతి నూరునెప్పు
డెందఱికి నొసంగ నెప్పటి యట్లుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥121॥

ఆ. ఆడితప్పువార లభిమానహీనులు
గో డెఱుఁగనివారు కొద్దివారు
కూడి కీడు సేయఁగ్రూరుండు తలపోయ
విశ్వదాభిరామ వినర వేమ. ॥122॥

ఆ. వానరాకడ మఱి ప్రాణంబు పోకడ
కానఁబడదు ఘనుని కైనఁగాని
కానఁబడిన మీఁద కలి యిట్లునడుచునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥123॥

ఆ. తగినకులజుఁడైన తలయెత్తు ధనమైన
భాగ్యపురుషునేల పట్టనెంచు
పరమసాధ్వి చూడ పరులనంటదు సుమీ
విశ్వదాభిరామ వినర వేమ. ॥124॥

ఆ. పరులదత్త మిట్లు పాలనఁ జేసిన
నిల స్వదత్తమునకు నినుమడియగు
నవని పరులదత్త మపహరించిన స్వద
త్తంబు నిష్ఫలంబు ధరణి వేమ. ॥125॥

ఆ. తనదుదాన మవనిఁ దనకూఁతు సమమగు
తండ్రిదాన మెల్లఁ దనకుఁ దోడు
అన్యు లిచ్చుదాన మది తనవంటిది
విశ్వదాభిరామ వినర వేమ. ॥126॥

ఆ. గతము చేసినట్టి కర్మబంధము లన్ని
తరలిపోవు సత్యగురునివలన
కమ్మరి కొకయేఁడు గుదియకు నొకనాఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥127॥

ఆ. జాతులందు మిగుల జాతి యే దెక్కువో
యెఱుక లేక తిరుగు నేమిఫలము
ఎఱుక గలుగువాఁడె హెచ్చైన కులజుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥128॥

ఆ. కూటికి వగలేక కూర్చున్నవారికి
నాఁడుదానిమీఁది యాస గలదె
యన్నమదముచేత నన్ని మదంబులౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥129॥

ఆ. ఒడ్డు పొడుగు గలిగి గడ్డంబుఁ బొడుగైన
దానగుణములేక దాత యగునె
యెనుము గొప్పదైన నేనుఁగుంబోలునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥130॥

ఆ. సతులఁ జూచి నరుఁడు సౌఖ్యంబు గోరును
గతులఁ గానలేఁడు కర్మమందు
గతుల సతులవలనఁ గానంగ లేఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥131॥

ఆ. అన్నిజాడ లుడిగి యానందగాముఁడై
నిన్ను నమ్మఁజూచు నిష్ఠతోడ
నిన్ను నమ్మ ముక్తి నిక్కంబు నీయాన
విశ్వదాభిరామ వినర వేమ. ॥132॥

ఆ. ఆలిమాటలు విని యన్నదమ్ముల రోసి
వేఱుపడెడువాఁడు వెఱ్ఱివాఁడు
కుక్కతోకఁ బట్టి గోదావ రీఁదునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥133॥

ఆ. స్త్రీలు కల్గుచోట చెల్లాటములుకల్గు
స్త్రీలులేని చోటఁ జిన్నఁబోవు
స్త్రీలచేత నరులు చిక్కుచున్నారయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥134॥

ఆ. మాల మాలగాఁడు మహిమీఁద నేప్రొద్దు
మాటతిరుగువాఁడు మాలగాక
వాని మాలయన్నవాఁడెపో పెనుమాల
విశ్వదాభిరామ వినర వేమ. ॥135॥

ఆ. చిప్పలోనఁ బడ్డ చినుకు ముత్యం బాయె
నీళ్ళలోనఁగలిసి నీరె యాయె
ప్రాప్తము గలచోట ఫలమేల దప్పురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥136॥

ఆ. కులము గలుగువారు గోత్రంబు గలవారు
విద్యచేత విఖ్యవీగువారు
పసిఁడిగల్గువాని బానిసకొడుకులు
విశ్వదాభిరామ వినర వేమ. ॥137॥

ఆ. కానివాని తోడఁ గలసి వర్తించెనా
హాని వచ్చు నెంతవాని కైన
తాటిక్రింద పాలు ద్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥138॥

ఆ. కరఁగకరగఁబుట్టు కనకంబునకు వన్నె
పెనఁగ పెనఁగబుట్టు ప్రేమసతికి
ముదియ ముదియఁ బుట్టు మోహంబు లోభంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥139॥

ఆ. ఎఱుక లేనిదొరల నెన్నాళ్ళు కొలిచిన
బ్రతుకులేదు వట్టి భ్రాంతి గాని
గొడ్డుటావు పాలుగోరిన చేపునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥140॥

ఆ. గొడ్డుటావుఁ బితుకకుండఁ గొంపోయిన
పండ్లు నూడఁదన్నుఁ బాలు రావు
లోభివాని నడుగ లాభంబు లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥141॥

ఆ. కులము లేనివాఁడు కలిమిచే వెలయును
కలిమిలేనివాని కులము దిగును
కులముకన్న మిగులకలిమి ప్రధానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥142॥

ఆ. నెయ్యి లేనికూడు నీయాన కసవది
కూరలేని తిండి కుక్కతిండి
ప్రియములేనికూడు పిండపుఁ గూడురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥143॥

ఆ. నోటి పుప్పి కెల్ల నొప్పిలేకుంటకు
నాకు పోకసున్న మౌషధముగ
పెట్ట కుండెనేని పెనురోత వేయురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥144॥

ఆ. అన్నమదమువలన నతివలు పురుషులు
ఏపురేఁగి మదనుఁ డేఁచె నందు
రన్న ముడుగువెనుక నతఁ డెందుఁబోయెరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥145॥

ఆ. ఎఱ్ఱనాఁడుదాని నేపారఁ జూచిన
వేకిపుట్టి చాల వెఱ్ఱిపట్టు
పల్లుదెఱవనట్టె పరఁగు పెన్భూతంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥146॥

ఆ. హీనజాతివాని నిలుఁజేర నిచ్చెనా
హాని వచ్చు నెంతవాని కైన
ఈఁగ కడుపుఁ జొచ్చి యిట్టట్టు చేయదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥147॥

ఆ. తలఁప వశముగాదు తత్వంబు బ్రహ్మంబు
తెలియలేఁడు బ్రహ్మదేవుఁడైన
ఇసుక బావి త్రవ్వ నెవ్వరి వశమయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥148॥

ఆ. ఎట్టిస్త్రీలఁ గనిన నింతంత యనరాదు
కాలవహ్ని లక్క కరఁగినట్లు
ఇట్టిగాఢమోహ మెంతైనఁ జేయురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥149॥

ఆ. కాంత కుంకయైనఁ గానికులం బైనఁ
బాయలేక విటుఁడు బ్రమసియుండు
మరగి గ్రుడ్డికుక్క మాంసంబు గన్నట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥150॥

ఆ. పప్పులేని కూడు పరుల కసహ్యమౌ
నప్పులేనివాఁడె యధిక బలుఁడు
ముప్పులేనివాఁడు మొదల సుజ్ఞానుఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥151॥

క. పేదరిక మంతదోషము
లేదే యీ జగతిలోన నీశ్వరుఁ డెఱుఁగన్
పేదను పొడఁగనువాడున్
గాదము విధమునను జూచుఁ గదరా వేమా. ॥152॥

ఆ. ధార్మికునకుఁ గాని ధర్మంబుఁ గనరాదు
కష్టజీవి కెట్లు కానఁబడును
నీరుచొరకలోతు నిజముగాఁ దెలియదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥153॥

ఆ. మొగముఁ జూచినపుడె మోహంబు ఘన మౌను
ధనముఁ జూచినపుడె తగులు మనసు
కూలినప్పు డరయకుసులెల్ల విఱుగును
విశ్వదాభిరామ వినర వేమ. ॥154॥

ఆ. ఎన్ని మతములైన జరుగఁ దగదు
సత్య మింతలేక జరుగఁ దగదు
సత్యము గలవాఁడు జగతిలో ద్విజుఁ డయ్యె
విశ్వదాభిరామ వినర వేమ. ॥155॥

ఆ. పరుల మోసపుచ్చి పరధన మార్జించి
కడుపునింపుకొనుట కానిపద్దు
ఋణముసేయు మనుజుఁ డెక్కువ కెక్కునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥156॥

ఆ. స్థిరముగాని క్షుద్రపర నటనలుచేసి
హెచ్చుతగ్గు లొంది హీనమతులు
గాడ్దెపిల్ల లరుతుఁ గ్రక్కునఁ జెడుదురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥157॥

ఆ. ధర్మమన్న వినరు తము నమ్మి భూనరుల్
యమునివారు వచ్చి యడలు నించి
చొచ్చి కట్టఁదారు చొరఁబారఁ గలరొకో
విశ్వదాభిరామ వినర వేమ. ॥158॥

ఆ. దానమడుగువాఁడు ధరలోన నధముండు
దానమడుగఁడేని ధైవసముఁడు
దానమీనివాఁడు ధన్యుండు కాఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥159॥

ఆ. తనకు ప్రాప్తిలేక దానమియ్యరటంచు
దోషబుద్ధిచేత దూరుటెల్ల
ముక్కువంకఁ జూచి ముక్కఱదూరుట
విశ్వదాభిరామ వినర వేమ. ॥160॥

ఆ. పెక్కుజనులఁ జంపి పేదల వధియించి
డొక్కకొరకు నూళ్లు దొంగలించి
యెక్కడికిని బోవ నెఱిఁగి యముఁడు చంపు
విశ్వదాభిరామ వినర వేమ. ॥161॥

ఆ. తండ్రికన సుగుణి తనయుఁడు గల్గెనా
పిన్న తనము లెన్నఁదగదు
వాసుదేవు విడిచి వసుదేవు నెంతురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥162॥

ఆ. పాల నీడిగింటఁ గ్రోలుచు నుండెనా
మనుజు లెల్లగూడి మద్యమండ్రు
నిలువఁదగనిచోట నిలువ నిందలు వచ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ॥163॥

ఆ. కన్నపుత్రునాశ కనకంబుమీఁ దాస
స్త్రీలమీఁద నాశ చిత్తమెడలి
భ్రమలు విడువకున్న బ్రహ్మంబుఁ గానరొ
విశ్వదాభిరామ వినర వేమ. ॥164॥

ఆ. చెట్టుచేనుగొట్టి చుట్టుగోడలఁబెట్టి
యిట్టునట్టుఁ బెద్దయిల్లు గట్టి
మిట్టిపడును నరుఁడు మీఁదిచే టెఱుంగక
విశ్వదాభిరామ వినర వేమ. ॥165॥

క. వచ్చెడిది పోయెడిది మఱి
చచ్చెడిదియుఁ గనకలేక సహజము లనుచున్
విచ్చలవిడిగాఁ దిరుగుట
చిచ్చునఁబడునట్టి మిడుత చెలువము వేమా. ॥166॥

ఆ. కుక్కతోలు దెచ్చి యెఱుపుబొమ్మను జేసి
యాడునట్టుచేసి యట్టివేసె
తన్నుఁ ద్రిప్పువానిఁ దానేలకానఁడో
విశ్వదాభిరామ వినర వేమ. ॥167॥

ఆ. పరబలంబుఁజూచి ప్రాణరక్షణమున
కుఱికి పాఱిపోవు పిఱికినరుఁడు
యముఁడు కుపితుఁడైన నడ్డ మెవ్వండయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥168॥

ఆ. తల్లిదండ్రి చావఁ దనయుఁడు తానేడ్చు
మగఁడు చావ నాలు వగచుచుండు
కార్యవశము గాని కలుగదు మోహంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥169॥

ఆ. మనసులోని ముక్తి మఱియొక్క చోటను
వెదుకఁబోవువాఁడు వెఱ్ఱివాఁడు
గొఱ్ఱెఁ జింకఁ బెట్టి గొల్ల వెదుకురీతి
విశ్వదాభిరామ వినర వేమ. ॥170॥

ఆ. ఆశకన్న దుఃఖ మతిశయంబుగ లేదు
చూపు నిలుపకున్న సుఖము లేదు
మనసు నిల్పకున్న మఱి ముక్తి లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥171॥

ఆ. తత్వహీను లుండ్రు తఱుచుగా భువిలోన
తత్త్వ మెఱుగువారు తఱుచులేరు
కలిగిలేనివారు కనిపింపరారయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥172॥

ఆ. తామసేంద్రియములఁ దనర జయించిన
తత్వ మరసి చూడఁ దాన యగును
రాజయోగి యిట్లు తేజరిల్లుచు నుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥173॥

ఆ. స్త్రీలమాయచేతఁ జిక్కి తాఁ గొన్నాళ్ళు
తగులు గోరునట్లు తగిలిపోవు
తనిసిపోయి తాను దైవంబుచేఁజెడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥174॥

ఆ. చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలిముల్లు
ఇంటిలోని పోరు నింతింత కాదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥175॥

ఆ. వారకాంత లెల్ల వలచి యేతెంతురా
పొందుఁజేసి ధనము పుచ్చుకొఱకు
మాచలమ్మ వచ్చి మఱి యిల్లువెళ్లురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥176॥

ఆ. గురువుఁగూడుఁజేసి గుణము వత్తిగఁజేసి
సరవిఁగర్మఁ జమితి సమురుఁ జేసి
మూల నొక్కజ్యోతి ముట్టించి చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥177॥

ఆ. ఎన్నియెన్ని పూజలెచటఁ జేసిన నేమి
భక్తిలేని పూజ ఫలములేదు
భక్తి గల్గుపూజ బహుళ కారణమురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥178॥

క. శివుగుడిని దీప మిడినను
శివమందిర మెల్ల వెలుగు జేయుట యరుదా
శివయోగి జ్ఞానదీపము
భువనంబుల వెలుఁగఁ జేయు పొలుపుగ వేమా. ॥179॥

ఆ. ఆపగాళివెంట నడవులవెంటను
కొండరాళ్ళవెంట గొడవయేల
నుల్లమందె శివుఁడటుండుటఁ దెలియరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥180॥

క. లలితశివ తత్వపదమునఁ
గలసిన శివయోగియేల కలియును జనులన్
జలబిందువు ముత్తియమై
కలియునె తొల్లింటి నీటఁగనరా వేమా. ॥181॥

ఆ. గాడ్డె యేమెఱుంగు గంధంబు వాసన
కుక్క యేమెఱుంగు గొప్పబుద్ధి
అల్పుఁడే మెఱుంగు హరునిఁ గొల్చు విరక్తి
విశ్వదాభిరామ వినర వేమ. ॥182॥

ఆ. మూఁడువేళలందు ముదముతో శివు నాత్మఁ
బూజచేయువాఁడు పుణ్యమూర్తి
పూజలేక మోక్షభోగంబు దొరకునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥183॥

ఆ. రుద్రరూపుఁ దాల్చి రుద్రుని నిందించి
భ్రష్టుత్రోవఁ దిరుగు భ్రష్టజనులు
ఱంకులకునుదిరుగు రమణులవలె నుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥184॥

ఆ. ఒడలు బడలఁజేసి యోగుల మనువారు
మనసు కల్మషంబు మాన్పలేరు
పుట్టమీదఁ గొట్ట భుజగంబు చచ్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥185॥

ఆ. మాలవానిఁ జూచి యేల నిందింపఁగ
పాటిలేనిమాట పలుకు టొకటె
వానిలోనఁ బల్కు వానికులం బేది
విశ్వదాభిరామ వినర వేమ. ॥186॥

ఆ. కుక్క యేకతంబు కొక్కెరధ్యానంబు
గాడ్దెరాగ మెన్నఁ గప్పుమునుఁగు
ఆత్మ యెఱుఁగుభావ మదియేల చేయరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥187॥

ఆ. సకల శాస్త్రములను జదివియు వ్రాసియు
తెలియఁగలరు చావు దెలియ లేరు
చావు తెలియలేని చదువులవేలరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥188॥

ఆ. కొండరాళ్లు దెచ్చి కోరికఁ గట్టిన
గుళ్ళలోనఁదిరిగి కుళ్ళ నేల
పాయని శివుఁడు ప్రాణమై యుండంగ
విశ్వదాభిరామ వినర వేమ. ॥189॥

ఆ. కులమువలనఁ గొంత బలిమివలనఁ గొంత
కలిమివలనఁ గొంత గర్వమునకు
అంకు చదువు చదివి అంకునఁ బడుదురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥190॥

ఆ. విశ్వము నడుపంగ విశ్వేశ్వరుం డుండ
బ్రహ్మలకునునేల పాటిదక్కె
వనములోని క్రోతి వసుమతి నడుపునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥191॥

ఆ. చదువువానికన్న చాకలి తా మేలు
కులము వేల్పుకన్న కుక్క మేలు
సర్వసురలకన్న సకలేశ్వరుఁడు మేలు
విశ్వదాభిరామ వినర వేమ. ॥192॥

ఆ. బూదిపూఁత లెన్న భుజముల పొంకాలు
వ్రాలు లింగములును వరుసమతము
తిక్కడగునుగాక యెక్కఁడ దగ దట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥193॥

క. అడుగ దగువారి నడుగమి
నిడినయెడన్ కొసరు చుంట యీలేననఁగా
గడుసుపడి యాసచేఁదా
నడుగుట దుర్మార్గవృత్తు లగురా వేమా. ॥194॥

ఆ. అద నెఱిఁగిన మగువ యనువెర్గు చనువెర్గు
ముదముతోడ మగని మోహ మెఱుఁగు
విభుని శ్రేష్ఠగుణము వేశ్యతా నెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥195॥

ఆ. ఆఁకటికి దొలంగు నాచార విధు లెల్ల
చీఁకటికి దొలంగు చిత్తశుద్ధి
వేఁకటికిఁ దొలఁగు వెనుకటి బిగువెల్ల
విశ్వదాభిరామ వినర వేమ. ॥196॥

క. త్రాసును పడియును లంజయు
భాసురగతి నొక్కరూపు పరికింపంగా
వీసంబధికంబిచ్చిన
వాసరమున నొక్కవంక వారలు వేమా. ॥197॥

క. నిరుపేదల రక్షించెడు
సరసుఁడు నెఱవాతగాక సంపన్నులఁ దా
భరియించువాఁడు దాతయె
మెరమెచ్చులదాత యతఁడు మేదిని వేమా. ॥198॥

ఆ. తన్నుఁజూచి యొరులు దగ మెచ్చవలెనని
సొమ్ము లెలమిఁ బెట్టు నెమ్మిమీఱ
నొరులకొఱకుఁ దాన యుబ్బుచు నుండును
తన్ను దెలియ లేఁడు ధరణి వేమ. ॥199॥

ఆ. ధనము లేకయున్న ధైర్యంబు నిలువదు
ధైర్య మొదవలేని ధనము లేదు
ధనము ధైర్య మరయ ధర భూమిపతులకు
విశ్వదాభిరామ వినర వేమ. ॥200॥

ఆ. ఇచ్చిపుచ్చుకొన్న హితమయిన మనువులు
తగ్గులేక యల్లు తామరవలె
కాచిపూచి పండి కడురమ్యమై యుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥201॥

ఆ. సతికి పతికినైన సంపద సంపదే
పుత్రసంపదలును భువిని మేలు
సరిగముదిసి బ్రతుకు సంపదే సంపద
విశ్వదాభిరామ వినర వేమ. ॥202॥

ఆ. కడఁక నింద్రియములు గట్టి వేయగ లేక
చావు వచ్చునపుడు సన్యసించు
నాత్మ జితములేక యందునా మోక్షము
విశ్వదాభిరామ వినర వేమ. ॥203॥

ఆ. అధిక సూక్ష్మమైన యానంద మెఱుఁగక
మతియు లేక చదివి మగ్నుఁ డయ్యె
నతిరహస్య మెల్ల నాజనుఁ డెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥204॥

ఆ. కడక నఖిలమునకు నడినాళమం దున్న
వేఁగుచుక్కవంటి వెలుఁగు దిక్కు
వెలుఁగుకన్న దిక్కు వేఱెవ్వ రున్నారు
విశ్వదాభిరామ వినర వేమ. ॥205॥

ఆ. రామనామపఠనమహిమచే వాల్మీకి
పరఁగ బోయ యయ్యు బాపఁడయ్యె
కులము ఘనము గాదు గుణము ఘనంబురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥206॥

ఆ. కలిమి కల్గనేమి కరుణలేకుండెనా
కలిమి యేలనల్ప కర్ములకును
తేనెఁగూర్చి యీఁగ తెరువునఁ బోవదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥207॥

క. కన్నుఁగవరీతి సంపద
కొన్నాళ్ళకు వ్రేగుఁజూపి గొబ్బున వ్రాలున్
వెన్నెల చీఁకటి సరి యగు
నన్నా శివంగమాయ లన్నియు వేమా. ॥208॥

క. ఆలు పతిసౌఖ్యముల కిల
నాలయ మగునేని దానినా లన వచ్చున్
ఆలాగునఁ గాకుండిన
కాలునిపెనుదూత యదియ కదరా వేమా. ॥209॥

ఆ. తుమ్మచెట్ల ముండ్లు తోడనెపుట్టును
విత్తులోననుండి వెడలినట్లు
మూర్ఖునకును బుద్ధి ముందుగాఁ బుట్టును
విశ్వదాభిరామ వినర వేమ. ||210||

ఆ. కామి కానివాఁడు కవి గాఁడు రవి గాడు
కామిగాక మోక్షకామి గాఁడు
కామియైనవాఁడు కవియగు రవియగు
విశ్వదాభిరామ వినర వేమ. ||211||

ఆ. కుక్క గోవు గాదు కుందేలు పులికాదు
దోమ గజము గాదు దొడ్డదైన
లోభి దాత గాఁడు లోకంబు లోపల
విశ్వదాభిరామ వినర వేమ. ||212||

ఆ. కూడు గుడిచి లెస్స గూర్చున్నవాఁడైన
నాడుదానిఁ గన్న నట్టె తగులు
నన్న సారమొడలి కతిమదం బిడునుమీ
విశ్వదాభిరామ వినర వేమ. ||213||

ఆ. దేవపూజ సేయ దివ్యభోగము గల్గు
తత్వ మెఱింగెనేని దైవసముఁడె
యేమిలేనినరున కేగతిలేదురా
విశ్వదాభిరామ వినర వేమ. ||214||

క. వానను దడియనివారును
పూనిక విడ మన్న చేఁత బొరయనివారున్
నానాదిక్కుల వెదకినఁ
గానమురా నెంతవాని గానము వేమ. ||215||

ఆ. బ్రహ్మవేత్తల మని పౌరుష మాడేరు
బ్రహ్మ మనఁగ దాని భావమేమి
తెలుపొ నలుపొ యెఱుపొ తెలిసినఁ బలుకుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ||216||

ఆ. ఎట్టివాఁడు తానో యెఱుఁగడు తొలిపుట్టు
నీచబ్రతుకుకింత నీమమేల
కష్టనరుల కెల్ల కలుగునా మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥217॥

ఆ. కూళకూళ మెచ్చు గుణవంతు విడనాడి
యెట్టివారు మెత్తు రట్టివారి
మ్రోవిదూలమునకు జ్ఞానంబు తెలియునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥218॥

ఆ. శివ మతమునకైన వివరింపగా గుర్వు
హరిమతమునకైన నరయ గుర్వు
గురువు నెఱుఁగలేని గుణహీనుఁడేమెఱుఁగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥219॥

ఆ. మునిజనములు కలఁగ మునిఁగి వెళ్ళిన బావి
బ్రహ్మకుఁ దలయెత్తరాని బావి
మొలల బంటిగానుముంచు నెవ్వరినైన
విశ్వదాభిరామ వినర వేమ. ॥220॥

ఆ. అమృతసాధనమున నందఱుబలుతురు
అమృతమెంచిచూడ నందలేరు
అమృతము విషమాయె నదియేమి చిత్రమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥221॥

ఆ. కొండఱేఁడు మామ కొండకూతురు నాలు
కొండ యిల్లు పసిఁడికొండ విల్లు
కొండవంటి దొరకు గుండురూపంబురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥222॥

ఆ. వెలయ పరమతత్వ విభవంబు దెలియక
బాహ్యవిద్యచేత బరఁగు టెల్ల
పూరి మెసవఁగ హరి పోయినచందంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥223॥

ఆ. ఒల్ల నన్నఁ బోదు నొల్ల ననఁగరాదు
తొల్లి చేయునట్టి ధూర్తఫలము
ఉల్లమందు వగవకుండుట యోగ్యంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥224॥

ఆ. కంటిమంటచేత కాముని దహియించి
కామమునను కడఁగి గౌరిఁ గూడె
నట్టి శివుని తేజ మంటినంతనె చూడ
పూర్వకర్మ ఫలము పోవు వేమ. ॥225॥

క. స్త్రీ నెత్తిన రుద్రునకును
స్త్రీ నోటను బ్రహ్మకెపుడు సిరి గుల్కంగా
స్త్రీ నెదిరి ఱొమ్మున హరికి
స్త్రీ నెడపఁగ గురుఁడ నీవు దేవర వేమా. ॥226॥

క. ఎఱుఁగక పుట్టును తనువులు
ముఱికి మునిఁగి తనువులెన్నో మోయుటగాదా
యెఱుకగల తనువు నొందిన
మరియును జన్మించు టెట్లు మహిలో వేమా. ॥227॥

ఆ. సతులఁ బడయ రాదు సుతులఁ బడయరాదు
వెతలఁ బడినవాఁడు వెఱ్ఱివాఁడు
నేలనున్న ఱాయి నెత్తి కెత్తినయట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥228॥

ఆ. ద్వార బంధమునను తనయులు సంపద
బంధువర్గ మెల్ల ప్రహరిగోడ
మూఢులైన నరులు మొక్కలి కాండ్రయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥229॥

ఆ. కాళ్ళ ముంద ఱేకు కడతేర నీదక
ముగ్గురు ముగురాండ్ర మునిఁగినారు
నరుఁడు నీఁదెదనుట నగుబాటు గాదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥230॥

ఆ. జీవి జీవిఁ జంపి జీవికి వేయఁగా
జీవి వలన నేమి చిక్కియుండె
జీవ హింసలకుఁ జిక్కునె మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥231॥

ఆ. తంత్రవాదు లెన్న తఱుచుగా నుందురు
మంత్రవాదు లెన్న మహిని లేరు
జంత్రగాని బొమ్మ చందంబు లాయెరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥232॥

ఆ. కల్లునీళ్లు ద్రాగి కడుపెద్ద వారిలో
చీర విడిచి తిరుగు సిద్ధురాలు
పనులు దీరువెనుక పాతలు గట్టురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥233॥

ఆ. కుక్క తిన్నవాఁడు గురిలింగ జంగంబు
పంది తిన్నవాఁడు పరమయోగి
యేన్గుతిన్నవాఁడు నెంతనుజ్ఞానిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥234॥

ఆ. ముండమోపితోడ మునుఁగుచుఁ దేలుచు
నుండఁగానె మోహ ముండెఁ గాక
అండఁబాయు వెనుక నాయాసలే లేవు
విశ్వదాభిరామ వినర వేమ. ॥235॥

క. చరణంబులు పదితోకలు
పరగంగా మూడు తలలు బైటనె తిరుగున్
వరభూమి తల్లడిల్లగ
నిరవొందఁగ దీని దెలియ నీశుఁడు వేమా. ॥236॥

ఆ. ప్రజ లెఱుంగ బ్రదుకుఁ బట్టభద్రుఁడు గాఁడు
పైఁగిరీటముండు బ్రహ్మగాఁడు
ఓగుఁ దెలిసి పలుకు యోగీశ్వరుఁడు గాఁడు
అట్టివానిఁ దెలియ నగును వేమ. ॥237॥

ఆ. బూతులేని లంజ భూతంబు కూఁతురు
ప్రీతిలేనిపాటు ధాత్రిచేటు
దాతలేని యూరు దయ్యాల పేటరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥238॥

ఆ. లంజ లంజకానిలాగెల్లఁ గొనియాడు
లంజతల్లివాని లజ్జ గడుగు
తల్లి గలుగులంజఁ దగులుట దోషంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥239॥

క. రతిలేక ముదియు నంగన
రతి కలిగిన ముదియు నశ్వరత్నము ధరలో
సతతము భ్రాంతిని చేసెడు
తతిరతిచే ముదియు నరుఁడు తథ్యము వేమా. ॥240॥

ఆ. దొమ్మరీనిలంజతోఁ గూడ దోషంబు
పాపియైన మనసుఁ బట్టరాదు
వీడు గదలిపోవ వెళ్లుదు రెటులనో
విశ్వదాభిరామ వినర వేమ. ॥241॥

ఆ. లంజ దానియొక్క లాలించిముద్దాడు
మిండ డరయ లంజమీఁది ప్రేమ
ఆడుదానివంక నందఱు చుట్టముల్
విశ్వదాభిరామ వినర వేమ. ॥242॥

ఆ. యోనియందె పుట్టి యోనికి రుచిఁజేయు
చన్నుగుడిచి పెరిగి చన్నుఁబట్టు
సృష్టిలోన నడఁగు సిగ్గెఱుగని జీవి
విశ్వదాభిరామ వినర వేమ. ॥243॥

ఆ. మొలక చనులనాఁడు మూఁడు కోటులు చేయు
కులుకు చనులనాఁడు కోటిసేయు
తటుకుచనులనాఁడు దమ్మిడి చేయదో
విశ్వదాభిరామ వినర వేమ. ॥244॥

ఆ. ఇంచుకంత యోని కెగసెడు జనములు
కంచముకడ పిల్లి గాచినట్లు
పంచబాణునింటి బానిసె కొడుకులు
విశ్వదాభిరామ వినర వేమ. ||245||

ఆ. పండువలనఁ బుట్టి పరఁగ ప్రపంచంబు
పండువలనఁ బుట్టె పరము నిహము
పండు కాసపడిరి బ్రహ్మాది సురలెల్ల
విశ్వదాభిరామ వినర వేమ. ||246||

ఆ. తగులుసతిని గూడి బిగువుగా రమియింప
కడుబలుండు పుట్టు గట్టిగాను
పురుషుఁ డబలుఁడైనఁ బుత్రు లబలులురా
విశ్వదాభిరామ వినర వేమ. ||247||

ఆ. కాంతమేనుఁజూచి కళవళపడుదురు
కడుపులోని రోతఁ గాన లేరు
యింతరోత బ్రతుకు కీ దేహ మేలరా
విశ్వదాభిరామ వినర వేమ. ||248||

ఆ. ముఱికిలోనఁ బుట్టి ముఱికిలోనఁ బెరిగి
ముఱికితనువు కింత మురిప మేల
ముఱికి తెలియు నరుఁడు ముఱుగునఁ బుట్టునా
విశ్వదాభిరామ వినర వేమ. ||249||

క. చన్నులు పరసతి కొప్పిన
చన్నులపై పాప దృఢతఁ జన కటుయునుపే
చన్నులు తగ దాఁగుడిచియు
చన్నులపై తలఁపు వలదు సత్యము వేమా. ||250||

క. చెట్టునన విత్తును బుట్టెను
చెట్టును విత్తున పుట్టెఁ జెలిమి దలిర్పన్
చెట్టును విత్తును రెండును
పుట్టిన విధిఁ దెలియవలయు భువిలో వేమా. ||251||

ఆ. తలి గర్భమందుఁ దాఁబుట్టి నప్పుడు
మొదల బట్ట లేదు తుదను లేదు
నడుమ బట్టగట్ట నగుఁబాటు గాదటో
విశ్వదాభిరామ వినర వేమ. ॥252॥

ఆ. తవిటి కరయఁ బోవ దండులంబుల గంప
శ్వానమాశ్రయించు సామ్యమునకు
కోమటింటి సొమ్ము క్రూరులపా లౌను
విశ్వదాభిరామ వినర వేమ. ॥253॥

ఆ. బాపఁ డెముకకూడు భక్షించుచుండును
పేరటంబుఁబోవు పెండ్లి మగువ
కులము మానము వీడ కోర్కెలు మెండాయె
విశ్వదాభిరామ వినర వేమ. ॥254॥

ఆ. మద్యమాంసరుచిని మాదిగె ధైవాల
యెంగిలిదినువారి దెట్టికులము
భక్తిని హరిఁగొల్చి భవ్యులుగారైరి
విశ్వదాభిరామ వినర వేమ. ॥255॥

ఆ. ప్రళయకాలమందు ప్రమధులచేతను
నష్టమైరిగాదె నాటిజనులు
తెలియనేరరైరి దేవుని ద్విజులెల్ల
విశ్వదాభిరామ వినర వేమ. ॥256॥

ఆ. వైష్ణవుల మటంచు వార్తమాత్రమె కాని
భ్రష్టు లంతకన్న వేఱులేరు
చారు బలమధైన నీరుగాఁ బోవునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥257॥

ఆ. బ్రహ్మ యెవనికొడుకు పరికింపఁగా భువి
విష్ణు వెవనికొడుకు వెలయఁజూడ
శివుఁడు నెవనికొడుకు సిగ్గెఱుఁగరు జనుల్
విశ్వదాభిరామ వినర వేమ. ॥258॥

ఆ. సోమయాజిని బట్టి సొడ్డు వేసెను రంభ
యందె సోమయా జనంగఁబట్టి
క్రతువుఁజేయు ఫలము గల్గెరా చేసెఁత
విశ్వదాభిరామ వినర వేమ. ॥259॥

ఆ. మునిఁగి బ్రాహ్మణుండు ముందుఁగానకపోయె
తిరిగి తిరిగి యతఁడు ద్రిమ్మ రాయె
కూసికూసితుదకు కుక్కయై పోయెరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥260॥

ఆ. చచ్చువారిఁజూచి చావని పుట్టని
తత్వ మెల్ల నాత్మఁ దలఁపుఁ జేసి
యరసి చూచినట్టి యతనికి మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥261॥

క. కప్పయు పామును బోరఁగ
కప్పను నాపాముమ్రింగె కడువేడుకతో
కప్పను చెడలందిగిచెడి
విప్పను నా చొప్పు దెలియ వేమననేర్చున్. ॥262॥

ఆ. మన్ను మిన్ను నంటి మహిమీఁద నొకకోట
కొమ్మ లమరియుండు కొనలుసాగి
దివ్వెలేని వెలుఁగు తేజరిల్లుచు నుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥263॥

ఆ. మొదలమ్రాను నగును తుద పక్షియును గాదు
నోరు లేదు పండ్లు నాఱు గలుగు
జీవమొకటిలేదు జీవులఁజంపురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥264॥

ఆ. కాలు చేయి లేదు కంచుకంబు గలదు
కొమ్మ లేదు ఉరికి చిమ్ము వేగ
గరిడిలేక చంపుఁగడు పెద్దచోద్యమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥265॥

ఆ. వాఁత నాకు మేను వలపట మెడవాఁడు
ఒంటికాలువాఁడు నొప్పుచుండు
రాజసభలయందె రంజిల్ల మాట్లాడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥266॥

ఆ. బ్రహ్మ గుఱ్ఱ మాయె భవుఁడు పల్లం బాయె
నాదివిష్ణువెన్న నంకె మాయె
నందు మీఁదివాఁడు నాఁడుదో మగవాఁడొ
విశ్వదాభిరామ వినర వేమ. ॥267॥

ఆ. రమణి నవ్వుచుండు రమణుఁడు నేడ్చును
రమణ సేయుచుండు ఱంకుమీర
ఱంకు చూడఁగానె పరమైన తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥268॥

ఆ. రూపులేని వనితరూఢి పతివ్రత
నీటు లేనివాఁడు బంటు కాఁడు
తెలుప వచ్చువాఁడు దేవరబంటురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥269॥

ఆ. ఇహమునందు నేమి యిడుములఁ బడినను
పరమ సాధనార్హ పదవి గాదు
పరులుకారు నెట్టి వెరవునఁ జూచిన
విశ్వదాభిరామ వినర వేమ. ॥270॥

ఆ. సతి యొనర్చు చెడ్డ పతి కవశ్యము వచ్చు
పతియొనర్చు మంచి సతికి నగము
పతి యొనర్చు చెడ్డ సతి కేల రాదురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥271॥

చ. కురుపులు గండముల్ కఠినకష్టపు రోగము లెన్నివచ్చినన్
గరిమను జీవరాసులకు గట్టిగ నాయువు గల్గినంత వే
మరు వగవంగ నేల క్షుధమాయను లేదననేల మూఢుఁడై
యరయ దయాళుఁడైన పరమాత్ముఁడె యొక్కఁడు దిక్కు వేమా. ॥272॥

ఆ. ఘటము జలములందు గగనంబు కనఁబడు
ఘటము జలము లేమి గగనమేది
ఘటములోన జ్యోతిఁ గ్రమమునఁ దెలియుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ||273||

ఆ. ఘటముఁగాన్గఁజేసి కామ మెడ్డుగఁజేసి
తెలిసి కర్మములను తిలలుఁ జేసి
తెలిసి గాను గాఁడు తిలకార కాత్మయు
విశ్వదాభిరామ వినర వేమ. ||274||

క. ఆమడ కామడ కడవులు
గ్రామంబులు చెరువు నదులు కర్మము లింతే
తా మెందులోనఁ దిరిగిన
వేమన తోడగుచువచ్చు వెంటనె వేమా. ||275||

ఆ. ఆత్మ దేహమందు నతిసూక్ష్మముగఁ జూచి
దేహమాత్మయందుఁ దేటపరచి
యాత్మ నెందుఁ జూడ నతఁడెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||276||

ఆ. పుడమి నుప్పరంబుఁ బురిగొల్పి జగముల
రక్ష సేయగల్గు రాజు లెవరు
మహిసతి యనుపేర మనుజున కేడదో
విశ్వదాభిరామ వినర వేమ. ||277||

ఆ. ఎఱుకయుండువాని కెఱుకయేయుండును
ఎఱుకలేనివాని కెఱుకలేదు
ఎఱుకలేని యెఱుక నెఱుగుట తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||278||

ఆ. గింజఁ జెడగనాడ గీడు తోడనె తాకు
గింజ గల్గియున్నఁ గీడుపోవు
గింజలు గలవాని లంజలపంచను
గంజి కుండ్రు జనులు కడఁగి వేమా. ||279||

ఆ. అధిక భుక్తిచేత మొదటి సొమ్ముకుహాని
కుదువసొమ్ము కొన్నఁ గొంత హాని
మొదటి పక్షమునను మూలకర్తకు హాని
విశ్వదాభిరామ వినర వేమ. ॥280॥

ఆ. మనసులోని శివుని మానుగాఁ దెలిసిన
యోగియండ్రు వాని యుర్విజనులు
జీవునిన్నెఱుఁగ నీవెపో శివుఁడవు
విశ్వదాభిరామ వినర వేమ. ॥281॥

ఆ. పృథివి కుదక మేగె పృథివిపై మొలకెత్తె
మగుడ పృథివి కేగె మగఁడె సుతుఁడు
ధరణి జనులకెల్ల తల్లియ పెండ్లామ
విశ్వదాభిరామ వినర వేమ. ॥282॥

ఆ. అవుటఁగా మెఱుఁగని యజ్ఞానజీవులు
మూలము దెలియకను ముట్టుచేత
ననుదినము సృజించి యాత్మఁ దెలియ లేక
చచ్చి పుట్టుచుండు జగతి వేమా. ॥283॥

ఆ. తనువు లస్థిరములు ధర్మము నిత్యము
చేయుధర్మమెల్ల చెడని పదవి
కనివిని మఱి తెలియఁ గానరు నరపశుల్
విశ్వదాభిరామ వినర వేమ. ॥284॥

ఆ. ఆర్తవిద్య లెల్ల యపకీర్తి పాలాయె
వార్త కెక్కునంత వారికైన
ఆర్తవిద్య లెల్ల ధూర్తులపాలాయె
విశ్వదాభిరామ వినర వేమ. ॥285॥

ఆ. కడుపు కెంత నరులు కళవళపడుదురు
కడుపుకొఱకు నూళ్ళు గహనములును
కడుపు కెట్ల యయినఁ గలుగును భుక్తిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥286॥

ఆ. దానధర్ములను తెగ రేపు నేఁడని
కాలవ్యయముఁ జేయు కష్టజనుఁడు
తానునేమి యౌనొ తనబ్రతు కేమౌనొ
మాయఁదెలియ లేదు మహిని వేమా. ||287||

ఆ. పరఁగ రాజకులు పాతిన ధనమెల్ల
భటులపాలు కవులపాలు తలఁప
నొనర హీనజనుని ధనము దాయాదుల
పాలు జారకాంత పాలు వేమా. ||288||

ఆ. ప్రాకటమున నిట్టిలోకములోఁ గుంటి
పల్లెముత్తఁ డెన్న పరమగురుడు
అన్నదానమునను హరిపూజచేతను
హరుని లోనఁగలసె నరయ వేమా. ||289||

ఆ. ఎంతకరువు నయిన నెంగిలి యన్నము
పరులకిడెడు ధర్మపరులు చూడ
భూమిమీద నెంగ్లిపుల్లెలు నాకెడు
కుక్కలై పుడుదురు కూడి వేమా. ||290||

ఆ. తనదుదత్తము పరదత్త మొకటిగాగఁ
జూడ కనుభవింపఁజోద్య మిలను
తొడగి యాలు నమ్మితొత్తును గొన్నట్టు
విశ్వదాభిరామ వినర వేమ. ||291||

ఆ. ఈఁకె లండఁజేసి తోఁక లండలఁజేసి
కోక లండఁజేసి కొఱఁతమాపె
నాకు లండఁజేసి నఖిల జంతువులకు
విశ్వదాభిరామ వినర వేమ. ||292||

క. ఒల్లనిపతి నొల్లనిసతి
నొల్లని చెలికాని విడువ నొల్లనివాఁడె
గొల్లండు గాక ధరలో
గొల్లనికిం గలవె వేఱె కొమ్ములు వేమా. ||293||

ఆ. ఎంత సంపదున్న నంత కష్టపుఁజింత
చింతచేత మిగుల చివుకు మనసు
చింతలేయుంట చెదలని సంపద
విశ్వదాభిరామ వినర వేమ. ||294||

ఆ. జీవభేద మెఱిగి చెడిపోనివారికి
భావిజనుల చెలిమి పట్టుపడదు
ఈశ్వరునినెఱిఁగిన నెఱుగఁడీ జగమును
విశ్వదాభిరామ వినర వేమ. ||295||

ఆ. పతికి మాఱుపల్కు పడతియే శునకంబు
మీఱుసతిని గవయ మిగులు వగలు
పంది పంది కూడి పడదొకో రొంపిలో
విశ్వదాభిరామ వినర వేమ. ||296||

ఆ. పొట్టివాఁడు కీడు పొదిలపురుగు కీడు
వట్టియాస కీడు వరడు కీడు
పొట్టిచేయికాలు పొసగుట కీడురా
విశ్వదాభిరామ వినర వేమ. ||297||

ఆ. కట్టెపైన నున్న కట్టెకు ఘనమేమి
చెట్టు పైననున్నఁ జేరు ఘనము
కట్టెచెట్టుగూడి గలసె దైవంబులో
విశ్వదాభిరామ వినర వేమ. ||298||

క. కొట్టినఁ దిట్టినఁ గాని
కట్టు బిగించినను గాని కరకరి సేయన్
కట్టడివడి యన కుండును
దిట్ట మదిని శివుని దలఁప దీరదు వేమా. ||299||

ఆ. సిగ్గటంచనఁ బడు సిగ్గునెచ్చోనుండు
ఆఁకలనుచు నుందు రాఁకలేది
దాఁగియున్న వానిఁ దానేల యెఱుఁగఁడో
విశ్వదాభిరామ వినర వేమ. ||300||

క. తన కేనాఁడు సుభిక్షము
తన కేనాఁడును భంగంబు తనకుఁదనుజుఁడున్
తానున్నయట్టి దశకును
మనసున నిల చివుకుచుండు మనుజుఁడు వేమా. ||301||

ఆ. పెట్టిపోయ నొగిని విరుగుఁడు సౌఖ్యంబు
బలుచచ్చినగతి యదియుగాక
నుండు నాశివుండు నొగివానియందున
విశ్వదాభిరామ వినర వేమ. ||302||

ఆ. పొట్లకాయ రాయి పొడవు త్రాటను గట్ట
లీలతోడ వంక లేక పెరుఁగు
కుక్కతోక గట్టఁ జక్కఁగా వచ్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ||303||

క. నోరెఱిఁగి తాము నేమియు
నేరజంతువులఁ జంపి నెమ్మదిఁ దినునా
క్రూరపు సంకర జాతుల
మారణ మేమందు నింక మహిలో వేమా. ||304||

ఆ. వంటవారియింట తిన్నవంటకమును
వంట తినినయపుడె వెంటవచ్చు
వచ్చు నట్లగాక వరఁకు నుభయులకు
కంటకమగు వంటకమును వేమా. ||305||

క. తామరపాకున నీర్వలె
వేమన చరియించుచుండు వెదకుచు శివునిన్
నీమాయ నమ్మరాఁగా
దీమనమునఁ దెలియరాదు నీశుని వేమా. ||306||

క. వేమన్నా నీమహిమలు
నేమన్నా తెలియ దింక నెటువలె నన్నా
వేమన్నా నీచిత్త మ
దేమన్నా నీవె మాకు నెఱుక గదన్నా. ||307||

ఉ. కూటికి లేనివానివలెఁ గోపములేకయు నెల్లతావులన్
మాటికిమాటికిన్ మఱియు మాటకుమాటకు పద్యపద్ధతిన్
ధాటి నెఱుంగఁ జెప్పుచును ధారుణిలో శివరూపధారియై
మాటికి నున్న వేమన సమానము నెవ్వరు గల్గు వేమనా. ||308||

ఆ. ఎవ్వరేమెఱుంగు నింపయిన వస్తువు
దేహ మే మెఱుంగు దివ్యబోధ
విధముఁ దెలిసి మీరు వేదాంత మెఱుగుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ||309||

క. యుగములఁ జల్లగఁ జూచును
తగలక యుగయుగమునందు తపసుల కైనన్
వగవక యేవకయుండిన
నిగనిగమనుకాంతి మదిని నిలుచుర వేమా. ||310||

ఆ. వినియు వినకయుండు వెఱ్ఱివాఁడై యుండు
కనియుఁ గానకుండు కడఁగి యోగి
మనుజవరులచేత మఱిపూజఁ గొనుచుండు
విశ్వదాభిరామ వినర వేమ. ||311||

ఆ. సుఖములెల్లఁ దెలిసి చూడంగ దుఃఖముల్
పుణ్యములును పాపపూర్వకములె
కొఱతవేయ దొంగ కోరినచందమా
విశ్వదాభిరామ వినర వేమ. ||312||

ఆ. ఆలుబిడ్డ లనుచు నతిమోహమున నున్న
ధనముమీద వాంఛ తగిలియున్న
నట్టివానిముక్తి యవనిలో లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ||313||

ఆ. కాకు లున్నగూడు కోకిల కగునట్లు
భ్రమరి కీటకమయి బ్రతుకుమాడ్కి
సత్యముక్తలని చెలఁగును నరుఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ||314||

ఆ. విటునిఁగన్నయంత విశదమై వలపుండు
బోటిఁజూడకట్టిపాటి గలదె
కంటిలోనిపాప కన నెంతవాఁడురా
విశ్వదాభిరామ వినర వేమ. ||315||

ఆ. ప్రభుని కిచ్చునట్లు పేదలకియ్యరు
వనిత కిచ్చునట్లు వడుగు కీరు
సురకు నిచ్చునట్లు సుమతుల కియ్యరు
మనసు పదిలపడదు మహిని వేమా. ||316||

ఆ. ఊరు ననుచునుండ నొగి సంతసింతురు
అడవియనుచు నుండ నడలుచుందు
రూరు నడవి రెండు నొకటిగాఁ జూచిన
నారితేఱు యోగి యతఁడు వేమా. ||317||

క. నీచుల వినుతులు సేయుచు
యాచకమున తిరిగి తిరిగి యలయుటకంటెన్
వీచిన నింద్రియపశువులఁ
గాచినవాఁ డిందు నందు ఘనుఁ డగు వేమా. ||318||

క. భోగంబుల కాశింపక
రాగ ద్వేషంబు లుడిగి రంగుగ భువిలో
వేగమె మోక్షము తనకును
రాఁగన్ననువాఁడు యోగిరాయఁడు వేమా. ||319||

ఆ. పేదవాని బాధ పెనుభూతమై యుండు
చూడ నట్టిబాధ జాడ కనదు
కలుగువాని బాధ కనులఁ జూడఁగ రామి
కేమి చెప్పవచ్చు నింక వేమా. ||320||

ఆ. జీవగుణము గల్గుజీవుండు బ్రహ్మంబు
సాటివచ్చునెట్లు సరవితోడ
నూరికుక్క సింగమొకటి జేయురా
విశ్వదాభిరామ వినర వేమ. ||321||

ఆ. అరయ నాస్తి యనక యడ్డుమాటాడక
తట్టుపడక మదిని తన్నుకోక
తన్నుఁ దాఁ గనుగొని తాఁ బెట్టినది పెట్టు
విశ్వదాభిరామ వినర వేమ. ॥322॥

ఆ. పరుల నిందఁజేసి పరులు నావారని
స్థిరము నస్థిరము తెలియలేక
పరఁగ దన్నుఁ జేతఁబట్టుక పెట్టిన
పెట్టుగాదు కట్టిపెట్టు వేమా. ॥323॥

ఆ. ఒరులకొఱకు భూమి నొరసెటివారును
అవనిపతికి వశ్యులయినవారు
పాలవంటివారు పన్ను పెట్టెడువారు
వాకెఱుంగరు శాఖవారు వేమా. ॥324॥

ఆ. బీఱుబోవుకులకు బిరుదు మ్రింగుకులంబు
నెల్ల జీవులకు భరించుకులము
ఇట్టుకులమువారు హరదూరులు
పట్ట గలుగువాఁడు పరఁగ వేమా. ॥325॥

ఆ. కోమటికిక యాశ కొండలు వాములు
చందనంబు శోభ చంద్రకళలు
తనకు మితిలేదు నక్కడ గతిలేదు
వదన శుద్ధిలేనివాఁడు వేమా. ॥326॥

ఆ. ప్రజ యొనర్చుచెడ్డ ప్రభువుకు వచ్చును
ప్రభువు మంచికొరత ప్రజలకు సగము
ప్రభు వొనర్చు చెడ్డ ప్రజల కేలరాదురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥327॥

ఆ. ఆఁడు దానిబొంకు గోడపెట్టినయట్టు
పురుషవరుని బొంకు పూలతడిక
స్త్రీలనేర్పులు భువి చీకు రాయితపము
విశ్వదాభిరామ వినర వేమ. ॥328॥

ఆ. అన్యులకును వచ్చునాపదఁ దనదిగా
నెన్నువాఁడు భువిని నున్నవాఁడు
ఎన్నువారిలోన నిహపరంబులు లెస్స
కన్నవాఁడు మిగుల ఘనుఁడు వేమా. ||329||

ఆ. కండలెల్లఁ గోయ కావికిఁజాలని
బండగోవు కాసపడినఁ గలదె
కొండఁ బసిఁడి కొండ గోరిన చందమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ||330||

ఆ. ఎలమిని ధనకాంక్ష నెదిరిఁ దన్నెఱుఁగక
కన్నుఁ గాన కెల్ల కర్మలాగు
పుట్టినపుడు పుట్టె బుద్ధిహీనతవాని
నడుఁగబోవ కష్టమదియ వేమా. ||331||

ఆ. అష్టకష్టు బ్రదుకు నగ్నిపాలై పోవు
నిర్దయాత్ము బ్రతుకు నీటఁగలియు
క్రూరకర్ముబ్రతుకు చోరులపాలౌను
విశ్వదాభిరామ వినర వేమ. ||332||

ఆ. బాలచనులఁ బూలబంతులఁ బోల్తురు
ప్రాలుమాలినట్టి భ్రష్టు లవని
మాంసఖండమందు మఱియేమియున్నది
విశ్వదాభిరామ వినర వేమ. ||333||

ఆ. ఒకనికీడు వేఱెయొక్కని కియ్యఁడు
ఒకరిమేలు వేఱెయొకరి కీఁడు
కీడుమేలు వారు పోఁడిమి దెలియరు
కాలుఁ డెఱుఁగు వారిగతిని వేమా. ||334||

ఆ. పరగ నీవఱకును పడినపా ట్లెఱుగక
ఘనుఁడుగాగ మనుజుఁ డనఁగఁ బుట్టి
కీడు మే లెఱుఁగక క్రిందాయెఁ జూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ||335||

ఆ. పుట్టలోన తేనె పుట్టినరీతిని
గుట్టమీఁద మణియు పుట్టువిధము
కట్టెలోన నగ్ని పుట్టినవిధమున
పుట్టి పెట్టవలెను భువిని వేమా. ||336||

ఆ. తనదునీడ శిశువు దాఁజూచుకొన్నట్టు
తనదునీడఁ జూచి తన్ను మఱచి
పతిని ననుమ నుడువు భ్రాంతుల నేమందు
విశ్వదాభిరామ వినర వేమ. ||337||

ఆ. తావులేనిచోట తాను తానె యుండు
తావు కలుగుచోట తానులేఁడు
తావు తానెయైన తత్వంబుఁ దెలియుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ||338||

ఆ. తన్నువలె నవియును ధరఁబుట్టినవి గావొ
పరఁగఁదమ్మువంటి బ్రతుకు గాదొ
జ్ఞాని జ్ఞానిఁ జంపిఁ గారణమేమిరా
విశ్వదాభిరామ వినర వేమ. ||339||

ఆ. ఒక్కమనసుతోడ నున్నది సకలము
తిక్క బట్టి నరులు తెలియలేరు
తిక్క నెఱిఁగి నడువ నొక్కఁడే చాలురా
విశ్వదాభిరామ వినర వేమ. ||340||

ఆ. పరఁగ ముందఱి తమ బ్రతుకుతె ర్వెఱుఁగక
సకల సంపదలును సతము లనుచు
జలముఁ బాయు చేఁపచంద మేర్పడి తుద
గతియువేఱెలేక గలుగు వేమా. ||341||

ఆ. తిట్టికొట్టిరేని తిరిగి మాటాడక
యడరుఁజూచి యదరింపకనీవు
తన్నుఁ గాదని నట్లు కాతఱపడకున్న
నట్టివాఁడు బ్రహ్మ మౌను వేమా. ||342||

ఆ. పిడుగును నరచేతఁ బిగఁబట్టి యందులోఁ
గల్మషంబునెల్ల కడకఁదీసి
కడమచేతి చేత కలియుగమును బ్రోచు
కర్మ కర్మ నెఱుగఁ గదర వేమా. ||343||

ఆ. పూర్ణమైన తనదు భుజబల్మిఁ జూడక
భువిని చెడుగుతోడ పోరరాదు
పాలకుండ కింత పొలసినా సారాయి
విశ్వదాభిరామ వినర వేమ. ||344||

ఆ. పరుల కుపకరించి పరుసొమ్ము పరునకు
పరఁగ నిచ్చె నేని పరము గల్గు
పరముకన్న నేమి పావనమా సొమ్ము
విశ్వదాభిరామ వినర వేమ. ||345||

ఆ. పలుగువానికేల పదనమృద్ధి దలంప
పలుగువరుస వానిబలిమి దప్ప
చలమువాని కేల సాత్వికధర్మంబు
ఏమి యొకటి ఘనము నిలను వేమా. ||346||

ఆ. సాగి పాఱురారు సకలకార్యంబుల
వాక్ప్రగల్భములచె వరలుచుండ్రు
సాగిపాఱక సఱిసమకూడ దొక్కటి
ధనమదెంతయున్న ధరను వేమా. ||347||

ఆ. అదయ హస్తమందు నభయహస్తంబీయ
దర్పకాంగుఁడైన తన్నుఁ జూచి
మంగళంబుచేయు మంగళహీనుఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ||348||

ఆ. ఎఱుక నెఱుగువాని కెఱుక యే నడుచును
ఎఱుకలేనివాఁడు నెఱుఁగలేఁడు
ఎఱుకలోని యెఱుక నెఱుఁగుట తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||349||

క. జన్మమరణ సుషుప్తుల జనము లెల్ల
జరుగుచుండంగ నరుఁడు తా జంగమమను
నదియుఁ దెలియంగలేర నీయజ్ఞులైన
భూప్రజలు బుద్ధిలేకయు పొసఁగు వేమా. ||350||

ఆ. పుత్తడిగలవాని పుష్ట్యంబు పుండైన
వసుధలోన చాల వార్త కెక్కు
పేదవానియింట పెండ్లయిన నెఱుఁగరు
విశ్వదాభిరామ వినర వేమ. ||351||

ఆ. విద్దెదానిపొందు విడువఁ జాలక తుల్వ
చచ్చుదాఁకమోయు చాపగుడిసె
భాగవతులపట్టు పట్టంగ నోపఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ||352||

క. అనఘ పురుషుండు నొక్కఁడు
విను నిత్య మనిత్యమనెడివిధ మిట్టి దగున్
తన సంకల్పమె బంధము
తన సంకల్పక్షయంబె తత్వము వేమా. ||353||

ఆ. అమలమైన పలుకు లభిషేకవారిధి
తనువు దేవళంబు తాల్మి నొంది
యాత్మ శివునిఁజేర్చు నాతఁడే శివయోగి
విశ్వదాభిరామ వినర వేమ. ||354||

ఆ. ఎన్ని తనువులైన మృతికి నడ్డముగావు
మృతిని గెలువలేని యెఱుకలేక
దొంగరీతి కాఁగ దొరుకునో మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||355||

ఆ. ఎట్టిరూపుఁ జూడ నీరూపు కనిపించు
నీదురూపుఁజూడ నెగడుఁ దెలివి
హెచ్చు తెలివి యున్న నీశ్వరుఁ డేతోఁచు
విశ్వదాభిరామ వినర వేమ. ||356||

ఆ. తెలివియైనలేక తిరమును తెలియక
తిరుగునస్థిరుఁ డయి దేహి జగతి
తిరుగ నేల యనుచుఁ దెలియఁడా యజ్ఞాని
విశ్వదాభిరామ వినర వేమ. ॥357॥

ఆ. తపముజపములెన్నో ధాత్రిజనుల కెల్ల
నొనర శివునిఁజూడ నుపమగలదు
మనసుఁజెదరనీక మదిలోనఁజూడరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥358॥

ఆ. మతము లెన్నియైన సతముగా నుండవు
సతము కర్మముండు జగతి నొకటి
ఆమతముల విడిచి యా బ్రహ్మమరయుము
విశ్వదాభిరామ వినర వేమ. ॥359॥

ఆ. కోమటినిష్ఠలు గుఱికి రావెన్నఁడు
లోభగుణము చేతలోని కడఁగు
పులియు దానరి కీడుపొలువగు చందమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥360॥

ఆ. గోపురములు గుడ్లు కోనేర్లు తేరులు
ఆకు లసురుగుడులు నడలఁగాను
నేఱు వంతదిఱిఁగియెగఁ బట్టుకొనెనయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥361॥

ఆ. చెట్టఁబట్టువెనుక చేతాఁకువై యుండు
రంతకాఁడు గట్టి పగఱకండ్రు
ఆఁడువారికింత యడఁగుట చెల్లదో
విశ్వదాభిరామ వినర వేమ. ॥362॥

ఆ. తల్లిదండ్రులెన్నఁ దనతొలి గురులు
పార్వతీభవులును పరమగురువులు
కూలివాండ్ర జగతి గురు లన ద్రోహంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥363॥

క. నవ్వును చదువును పాడును
నొవ్వక తానిట్లు మెచ్చు నుడువును మఱచున్
నివ్వటిలియుండు ముదిమియు
నివ్విధమునఁ జూడఁజూడ నెవ్వడు వేమా. ||364||

ఆ. నీళ్ళమీఁదజూడు నెఱయ నోడలబల్మి
బట్టబయలఁ జూడు బండిబలిమి
ఆఁడుదాని బలిమి నాడనే చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ||365||

క. నే నెఁవడను తలపెట్టఁగ
మానసమునఁ దలపకున్న మనుజుని కకటా
కానఁబడు పడకముందే
మానుగఁ గనుగొనఁగవలయు మహిలో వేమా. ||366||

ఆ. బ్రతుకు నిత్య మనుచుఁ బదరుచు వగమీఱ
విఱ్ఱవీఁగువారు వెఱ్ఱివారు
ప్రాణులెల్ల యమునివారి గొఱ్ఱెలుసుమీ
విశ్వదాభిరామ వినర వేమ. ||367||

ఆ. బ్రహ్మవాదు లెల్ల బ్రహ్మంబనంగను
వలను తెలిసిచూడ వద్దనుండు
ముందునున్న యట్టి ముద్రిక కానరో
విశ్వదాభిరామ వినర వేమ. ||368||

ఆ. మదిని గానవలెను మఱిబ్రహ్మమూర్తిని
మదినిగన్నవారు మహినిలేరు
వెదకి తనువులోన వేడ్కతో నెఱిఁగిన
యతఁడె యోగివరుఁడు నగును వేమా. ||369||

క. మనసనలము రెంటికినిల
ఘనమును కొంచెంబుఁ దెలియఁగావలె సుమ్మీ
కనుమూసి తెరచినంతనె
ఘనమై విహరించుమనసుఁగానరు వేమా. ||370||

ఆ. మర్మ మెఱుఁగలేక మతములఁ గల్పించి
యుర్విదుఃఖ లగుదు రొకరి కొకరు
గాజువంటిఁ గుక్క కళవళపడురీతి
విశ్వదాభిరామ వినర వేమ. ॥371॥

ఆ. ఇహపరాదులకును నిది సాధనం బని
వ్రాసి చదివి విన్నవారికైన
మధ్యమకర్మములు మహిమతో నడచును
బడుగుకైన ముక్తిపదము వేమ. ॥372॥

ఆ. వేదవిద్య గాదు వీరవిద్యయుఁ గాదు
బాధవిద్యయుఁగాదు పరపు గాదు
మధురమైన యట్టి మనసు నిల్పెడివిద్య
సాధువిద్య యెన్న సరస వేమా. ॥373॥

ఆ. వేయువిధము లమర వేమనపద్యంబు
లర్థ మిచ్చువాని నరసి చూడ
చూడఁజూడఁ గలుగుచోద్యమౌ జ్ఞానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥374॥

క. వేమన పద్యము లన్నిటి
సామంబునఁ జదివినట్టి సజ్జను లెల్లన్
సోమనతల సుందరు కడు
నేమంబునఁ జూడరయ్య నేర్పున వేమ. ॥375॥

ఆ. అల్లుఁడైన నేమి యన్యుఁడైన నేమి
చెప్పఁదగిన రీతిఁ జెప్పినాము
హరునియెఱుక లేక యాకులల్లాడునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥376॥

ఆ. నూఱుపలుకవచ్చు నొకటి వ్రాయఁగరాదు
వ్రాఁతకన్న సాక్షి వలవ దెన్న
పరగవ్రాతలేని పక్షానికప్పుడు
సుద్దిసాక్షి తగనిబుద్ధి వేమా. ॥377॥

ఆ. ధారదత్తమైన తామ్రపుఁబలకను
లావుటుంగరమున లంకెజేసి
యరయ మీఁదముద్ర యమరియుండంగను
నదియ శాసనంబు నవని వేమ. ||378||

క. నీతి వైరాగ్యభక్తిని నీచులకును
ఘాతకులు కాని జ్ఞానసంకలితులకును
వ్రాల కందని పద్యముల్ వేల సంఖ్య
చేత నందుగ భువినిదాఁ జెప్పె వేమ. ||379||

ఆ. గుఱుతు తిథులవలనఁ గులమెల్లఁ జెడిపోయె
స్త్రీల నడతవలన సిగ్గుపోయె
ఏహ్యపల్వలముల నిలయెల్లఁ జెడిపోయె
చాన్లవలన బ్రతుకు సమయు వేమా. ||380||

ఆ. చిత్తవాజి నెక్కి శిక్షింప నేరక
తత్తఱించి రౌతు తరల నేల
వారణాసి తనకు వయ్యాళి కాబోలు
విశ్వదాభిరామ వినర వేమ. ||381||

ఆ. రాజయోగి మహిమ రాజయోగికి గాక
ఇతర జనులకెల్ల నేమిదెలియు
తాను దేవుఁడైన దైవముఁ గొలుచునా
విశ్వదాభిరామ వినర వేమ. ||382||

ఆ. దేవభూములందు దేవాలయములందు
దేవుఁడంచుఁ జెప్పి తెరువుఁజూపె
తెలియ విశ్వమెల్ల దేవాది దేవుఁడౌ
విశ్వదాభిరామ వినర వేమ. ||383||

ఆ. గంపెడంత తవుడు గంపలోఁ బెట్టక
చన్నుఁ బట్టనీదు కొన్నబట్టె
వారకాంత లేల వలతురు నూరక
విశ్వదాభిరామ వినర వేమ. ||384||

ఆ. తివిరి లేమియుంట తిరిపెకాఁ డెఱుగునె
మొఱ్ఱబెట్టి నెత్తి మొత్తుఁగాని
పతిస ధర్మ మెన్నపడుచు కత్తెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥385॥

ఆ. దాత లేని కొంప దయ్యాల పెనువాడ
నీతిగాని పాట వాతిచేటు
ప్రీతిలేని లంజ ఘాతియై తోఁచురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥386॥

ఆ. చినుఁగు బట్ట కాదు చీనాంబరము గాని
ముఱికియొడలు గాదు ముక్తి గాని
పరమయోగిమహిమఁ బరికింప నరుదురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥387॥

ఆ. అంధులైన వారు నందు నిం దనకుండు
నన్నితావులందు హరునివలెను
తెలియువారి కెల్ల దేవుఁడే కనుపించు
విశ్వదాభిరామ వినర వేమ. ॥388॥

ఆ. వాని గననివాఁడు వాఁడు కానేకాఁడు
వానిలోనివాఁడు వాఁడు సుమ్మి
వాని గన్నవాఁడు వాఁడెపో యోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥389॥

ఆ. కుక్క యేమెఱుంగు గురులింగ దేవుని
నక్క యేమెఱుంగు నొక్కప్రొద్దు
మూర్ఖుఁడే మెఱుంగు మోక్షంబుత్రోవను
విశ్వదాభిరామ వినర వేమ. ॥390॥

క. వెయ్యారుగతుల జలనిధి
తియ్యగ ననిశంబు గలయ దిప్పుట యరుదౌ
కొయ్యకుఁదా సుజ్ఞానము
వెయ్యి విధంబులను జెప్ప వృథరా వేమా. ॥391॥

ఆ. వెదకి కానలేరు వేదాంత వేద్యుని
నుత్తముండు గాంచు నుర్వీమీఁదఁ
గలిగెనేని వానిఁ గానంగ లేరయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥392॥

ఆ. జ్ఞానవంతుఁ జూచి సహకర్మబుద్ధులు
వెఱ్ఱియండ్రు ప్రకృతి విడువలేరు
వెఱ్ఱి కవనిఁ బ్రకృతి వెదకినఁ గల్గునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥393॥

ఆ. ఇంతికనులు చనులు నెంత లెస్సనిచూచి
మోహపడును బుద్ధి మోసపోయి
గరిసెలోనివానిఁ గానలే దాయెరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥394॥

ఆ. వాతగుణము చేత వలపున మగవాఁడు
లొట్టకనులదాని లోలతకును
పుట్టి జగతి నిలుచు పునరుద్భవంబగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥395॥

క. ఏసూత్ర మరసిచూచిన
స్త్రీ సూత్రం బదియుఁ గాక సిద్ధము కాఁగా
నా సూత్రముఁ స్త్రీ సూత్రము
నాసూత్రముఁ దెలియువాఁడు సాధుఁడు వేమా. ॥396॥

ఆ. బందెత్రాళ్ళఁ దెచ్చి బంధించి కట్టంగ
లింగఁడేమి దొంగిలించినాఁడొ
యాత్మలింగ మేల యర్చింపఁజూడరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥397॥

ఆ. మంత్రమెల్ల మఱచి మధురాధరముఁగోరు
నేవిధమున భక్తుఁ డెఱుఁగు నిన్ను
యోనిఁ జూచి పరమయోగంబు మఱచురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥398॥

ఆ. శైవవైష్ణవాది షణ్మతంబుల కెల్ల
దేవుఁ డొక్కఁ డనుచుఁ దెలియ లేరు
తమకు భేదమైన తత్వంబు భేదమా
విశ్వదాభిరామ వినర వేమ. ॥399॥

ఆ. పూసపోగు బెట్టిపురుషునిభుజ మెక్కి
కన్నులార్ప వారకాంత గాదు
తనకు లొంగువారిఁ దడయక చంపురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥400॥

ఆ. జదలుదాల్చు టెల్ల జగము ఛీయను టెల్ల
యొడలువిఱుచుటెల్ల యోగ మెల్ల
ముక్తికాంతఁ బట్టి ముద్దాడుకొరకురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥401॥

క. తనలో సర్వంబుండఁగ
తనలోపల వెదుకలేక ధరవెదకెడు నీ
తనువుల మోసెడి యెద్దుల
మనములఁ దెల్పఁగ వశమె మహిలో వేమా. ॥402॥

ఆ. కరములందు తాము గంగాధరుని బట్టి
తీర్థములకు పోయి తిరుగుచుండ్రు
వెన్నఁ బట్టి నెయ్యి వెదకిన చందమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥403॥

ఆ. అఱుతలింగ ముంచి యదిగనఁజాలక
పర్వతమున కేగు పామరుండు
ముక్తిఁగాన నగునె మూఢాత్ముఁడగుఁగాక
విశ్వదాభిరామ వినర వేమ. ॥404॥

ఆ. స్నాన మొనరఁజేసి తద్ధర్మమీయక
నీళ్ళ మునుఁగ నగునె నేర్పు లేక
నీళ్ళయందు కోడినెలవుగా మునుఁగదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥405॥

ఆ. కాలచక్ర మెఱుఁగఁగా లేక యెప్పుడు
సంధ్యజపమునేయు జాణలార
సంధ్యజపములోన జాడ లెట్లుండును
విశ్వదాభిరామ వినర వేమ. ॥406॥

ఆ. కాశియాత్రఁ బోయి గంగదానముఁ జేసి
కష్టపడిరి ముక్తిఁ గానలేక
ఎనుము తిరుగుచుండదే యెద్దువెంబడి
విశ్వదాభిరామ వినర వేమ. ॥407॥

ఆ. కాశిఁబోవువాని కర్మ మేమని చెప్పఁ
బాపహేతువుండి వచ్చెనేని
మనసు కాశిఁజేరు మఱి ముక్తి లేదురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥408॥

ఆ. యోగి ననుచుఁ గొంత యోగము గూర్చుక
జగములోనివానిఁ జంపితినుచు
ధనము కొఱకు మిగుల తగవాడుచుండిన
యోగిగాఁడు వాఁడె యోగు వేమా. ॥409॥

ఆ. పరమహంస ననుచు వరవఁ గట్టుక భూమి
పరధనముల కాసపఁడెను వాఁడు
పరమహంస గాఁడు పరమహింసుఁ డటండ్రు
విశ్వదాభిరామ వినర వేమ. ॥410॥

ఆ. మునిఁగి మునిఁగి మునిఁగి ముద్దయై ముద్దయై
వనరి వనరి వనరి వక్కి వక్కి
తిరిగి తిరిగి తిరిగి దిమ్మరై యుండును
విశ్వదాభిరామ వినర వేమ. ॥411॥

ఆ. బారెడేసి జడలు భస్మంబుపూఁతలు
మరునితోడ మాఱుమలయఁ గలరు
ముంజికోకలెల్ల లంజెకోకలాయె
విశ్వదాభిరామ వినర వేమ. ॥412॥

ఆ. బోడితలల నెల్ల బూడిదెపూఁతల
నాసనముల మారు తాపనముల
యోగిగాఁడు లోన బాగు గాకుండిన
విశ్వదాభిరామ వినర వేమ. ॥413॥

ఆ. ఆఱువేషములను నటుచూడ బహువింత
లాత్మయందు ధ్యాన మమర దెందు
భీకరంబె కాని బిరుదు లేదు విరక్తి
విశ్వదాభిరామ వినర వేమ. ॥414॥

ఆ. కుక్కుటమననంబు కొక్కెర ధ్యానంబు
యతుల నొసట నొనరునట్లు వ్రాసె
తొల్లి చేసినట్టి దోషంబు తగిలెనో
విశ్వదాభిరామ వినర వేమ. ॥415॥

ఆ. ఒడల భూతిఁ బూసి జడలు ధరించిన
నొడయుఁడైన ముక్తిఁ బడయలేఁడు
తడకబిఱ్ఱుపెట్టఁ దలపుతో సరియౌనె
విశ్వదాభిరామ వినర వేమ. ॥416॥

ఆ. శివుఁడు బ్రహ్మ మనుచు స్మృతులెల్లఁ బలుకంగ
వేఱె దైవములను వేయిగొల్చి
బ్రహ్మజనులు చూడ భ్రష్టులైపోయిరి
విశ్వదాభిరామ వినర వేమ. ॥417॥

ఆ. తలను వ్రేలవేసి తాలిమి నిలుచుక
మూసి తెఱచు గన్ను మూగి యగును
జ్ఞాన మదియుఁగాదు కష్టము శేషంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥418॥

ఆ. శివుని భక్తులెల్ల భువి మంటిపాలైరి
వాదమేల దైవభేదమేల
విష్ణుభక్తులెల్ల వెలిబూదిపాలైరి
విశ్వదాభిరామ వినర వేమ. ॥429॥

ఆ. తన్నుఁ దెలియకున్న తగ వేదములు వెట్టి
సర్వ సంపదకు ముసాబు వెట్టి
యాఱు శాస్త్రములును నా పురాణములును
జబ్బు లనుచు జగతిఁ జాటు వేమా. ॥420॥

ఆ. వేముఁడిట్లు చెప్పె వేల పద్యంబులు
తప్పు లెన్నియున్న నొప్పియుండు
తత్తఱపడ కందుఁ జిత్తము నిల్పుము
విశ్వదాభిరామ వినర వేమ. ॥421॥

ఆ. వెట్టినక్కలవలె వేదముల్ చదివెద
రాశయంబు లెఱుఁగరయ్య వారు
వేదసారమంత వేమన యెఱుఁగును
విశ్వదాభిరామ వినర వేమ. ॥422॥

ఆ. ఆలిఱంకుఁ దెలుపు నఖిలయజ్ఞంబులు
తల్లిఱంకు తెలుపుఁ దద్దినములు
కానితెరువు కర్మ కాన కల్పితమాయె
విశ్వదాభిరామ వినర వేమ. ॥423॥

ఆ. హింసఁ జేయకుండుటే ముఖ్య ధర్మంబు
ఆనక హింసచేసి రవనిసురులు
చావుపశువుఁ దినెడు చండాలుఁడే మేలు
విశ్వదాభిరామ వినర వేమ. ॥424॥

ఆ. ముక్కుత్రాళ్ళ గ్రుచ్చి ముఱికిపోవఁగఁ దోమి
కచ్చనీరు నించి కడిగి కడిగి
డొక్క దోమినంత దొరకునా తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥425॥

ఆ. జాతసూతకములు సత్యమై యుండంగ
నంటిన గుణములు హతమ్ముగాక
యతియుఁగాగనేల నవనిలో జీవుఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥426॥

ఆ. మదమువలనఁ గల్గు మాటల బహుపల్కి
మ్రుచ్చునుద్దులఁ గొని మోసపుచ్చి
కాసురాఁబెనగెడు కష్టుండుగురుఁ డౌనె
విశ్వదాభిరామ వినర వేమ. ॥427॥

ఆ. పేరు సోమయాజి పెనుసింహబలుఁడయా
మేఁకపోతుఁబట్టి మెడలువిఱువఁ
గానిక్రతువువంకఁ గలుగునా మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥428॥

ఆ. సందె వార్చఁగ నేమి జపము సేయగ నేమి
వేదశాస్త్రములను వెలయ నేమి
పడఁతిఁ గనినవాఁడు బాపఁడు గాఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥429॥

క. కుక్కల దిని కడుబాపలు
నక్కను భుజియించువారు నాకేశులగున్
చొక్కముగ జీవహత్యల
మిక్కుటముగఁ జేసి తమిని మించిరి వేమా. ॥430॥

ఆ. అరయఁదోచునాఁడు గురువని తా నెంచి
తిరుగువాఁడు తన్ను నరయలేఁడు
పనికిమాలినట్టి బానిసె కొడుకురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥431॥

ఆ. చాడికానిమాట చావడిలో నిక్కు
వెంటఁ బో శునకము వెలయ నిక్కు
స్త్రీలఁజూచినపుడు శిశ్నంబు నిక్కురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥432॥

ఆ. పుట్టుశక్తు లైదు పుడమి నటింపగ
విప్రులెల్ల వేదవేత్తలండ్రు
శక్తిపుత్రకులము జగతిలో నెఱుగరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥433॥

క. భేదాభేదంబులకును
వాదంబై జనముచూడ వర్తించును నా
భేదాభేదము లుడిగిన
వేదాంత ధ్యాని యగుచు వెలుఁగుర వేమా. ॥434॥

ఆ. ద్విజవరుండు చెడ్డ పిండంబు దినఁబోయె
పేరటాలు మురువు పెండ్లిమొనసె
కులము మొదలుఁ బోయెఁ గూలెఁబో మానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥435॥

ఆ. చీరగట్టి రాత్రి సిగ్గును నెఱిఁగుండు
పగలు చీరవిడుచు పను లదేల
చేడె గాదుర యిది చేవాడికత్తెర
విశ్వదాభిరామ వినర వేమ. ॥436॥

ఆ. శూద్రుఁడనుచు మిగుల శూద్రులఁ బోనాడు
మాలకంటె మగఁడు మాలయనుచు
ద్విజుఁడ నేనటన్న ద్విజుఁడు కానేర్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥437॥

సీ. చెవులు గోరును మంచి జిలిబిలిపాటలఁ - దియ్యని మాటల తెఱఁగు వినఁగ
జన్మంబు గోఱును సరవితోడుత శీత - పృథుల సంస్పర్శ సంపదల నెపుడు
కన్నులు గోరును గమలయవర్ణంబు - లయినట్టి రూపంబు లనువుతోడ
నాలుక గోరును నయముతోడ తీపు - నొగరు కారమ్ము చేదుప్పు పులును ॥438॥

ఆ. బ్రహ్మనృపతి వైశ్యపతులును శూద్రులు
బ్రహ్మవిష్ణుహరులు పశువు లెన్న
బ్రహ్మముం దెలియక బహురూపులైరిట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥439॥

ఆ. కలుషమొక్క యింత గాన్పింప దెందును
జూడ నెవరికైన సొంపుమీఱఁ
దామసం బడంగఁ దావెల్గు జ్ఞానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥440॥

ఆ. తనువునందు నగ్ని దఱికొని కాల్పంగ
కాల్చుకొనుట యేమి కర్మమునకు
కాల్చుకొన్న యంత ఘనుఁడు తానాయెనా
విశ్వదాభిరామ వినర వేమ. ॥441॥

ఆ. త్రాడు మెడనువేసి తనదు శూద్రత్వంబు
పోయె ననెడి దెల్ల బుద్ధి కొదువ
మనసులకును త్రాడు మఱివన్నెఁ దెచ్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥442॥

ఆ. పట్టుచీరఁ గట్టి పట్టె తిరుమణి నిడి
సృష్టివైష్ణవంబు శిఖలు మించె
చిన్నెలన్ని చేసి చేర వైష్ణవ మిట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥443॥

ఆ. కసవు నేరి తినెడు పసరపు మైఁ దిన
మాలఁడండ్రు వాని మహిని నరులు
పట్టికోడిఁ దిన్న ప్రాజ్ఞులందురు జనుల్
విశ్వదాభిరామ వినర వేమ. ॥444॥

ఆ. ఊరిబావిలోని యుదకమ్ము నిందించి
పాదతీర్థమునకు భ్రమయువారు
పాదతీర్థములను ఫలమేమి కందురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥445॥

ఆ. మొనసి యింద్రియముల మొదట నిల్పఁగలేక
సమసిపోవు వేళ సన్యసించు
ఆత్మశుద్ధిలేక యంటునా మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥446॥

ఆ. చావుఁ దెలియువాఁడు సన్యసించునదెల్ల
కడవలందు కులము చెడినయట్లు
పాపమొకటె మీఁద ఫలమేమి లేదురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥447॥

తే. వెల్లకుక్కల యెంగిలి విశదమాయె
పడుచువేశ్యల యెంగిలి ప్రాప్తమాయె
చెడుగు నెంగిలి యెంతకు శ్రేష్ఠమాయె
ఇష్టమగువారి యెంగిలి యెగ్గు వేమ. ॥448॥

ఆ. ప్రియము సత్యమెప్డు పృథివిఁ బల్కెడువాని
నోరె యమృతవాపి మారులేదు
అనుదినంబుచూడ ననృతమాడెడినోరు
నోరె కాదు క్రింది నోరు వేమ. ॥449॥

ఆ. అంగమందు లింగ మతిశయంబునఁ గట్టి
లింగమందు ముక్తి నిలుపలేరు
ముక్తిలేక తుదను మూర్ఖుఁడై పోవురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥450॥

ఆ. విష్ణుభక్తులెల్ల వెలిబూదిపాలైరి
వాదమేల మతవిభేదమేల
తెలియ లింగధారులు తిరుమణిపాలైరి
విశ్వదాభిరామ వినర వేమ. ॥451॥

ఆ. తల్లిగర్భమందు తాను వెడలువేళ
నఱుత లింగముండ దరసిచూడ
నడుమ లింగమూన నగుఁబాటు గాదటో
విశ్వదాభిరామ వినర వేమ. ॥452॥

ఆ. పట్టుపాగఁ జుట్టి పట్టుదోవతిఁ గట్టి
వట్టి వైష్ణవుండు మిట్టిపడును
చిన్నె లింతెకాని శ్రీవైష్ణవమతంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥453॥

ఆ. రూపవతులు ముగ్గురు రూపవంతులు చూడ
వారి వారి నేల గారవింప
మొద లెఱుగకయున్న మోక్షంబు గలుగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥454॥

ఆ. మాలవాని నేల మఱిమఱి నిందింప
నొడల రక్తమాంస మొకటెగాదె
వానిలోన మెలఁగువాని కులంబేది
విశ్వదాభిరామ వినర వేమ. ॥455॥

క. స్థావరముల భక్షింతురు
భావింపగ జంగమములు బహువిధ రుచులన్
ఆవల సకలప్రాణులు
తీవరమునఁ దమ్ముఁ దామె తిందురు వేమా. ॥456॥

ఆ. సతులు జపతపములు సలుపంగ సాగిన
పురుషు లేలయికను పుడమిలోన
పాప మెంచవద్దు పట్టి శిక్షింపుడీ
పుణ్యపురుషు లెల్ల భువిని వేమా. ॥457॥

ఆ. ప్రాణ లింగ మెన్నఁ బ్రార్థించి కీర్తించి
కట్టివేయ నేమి కల్గఁజేసె
నఖిలజనులకెల్ల నానందమే సాక్షి
విశ్వదాభిరామ వినర వేమ. ॥458॥

ఆ. ఉపవసములనుండి యొగినీళ్ళ మునిగియు
కూడువండి వేల్పుఁ గుడువు మనుచు
దాని నోరుఁగొట్టి తమరె తిందురుగదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥459॥

ఆ. శిలలఁ జూచి నరులు శివుఁడని మెత్తురు
శిలలు శిలలె కాని శివుఁడుగాఁడు
తనదులోని శివునిఁ దా నేల తెలియఁడో
విశ్వదాభిరామ వినర వేమ. ॥460॥

ఆ. తల్లి గౌరి తనకు దండ్రియే శంభుండు
ప్రమథగణము లఖిలబాంధవులు
తనకుఁ బుట్టినిల్లు తనరుఁ గైలాసంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥461॥

ఆ. తల్లిదండ్రులనెడి తత్వంబు నెఱుఁగరు
యోనిలింగములను నుద్భవించి
విష్ణువరయఁదల్లి వెలయరుద్రుఁడె తండ్రి
విశ్వదాభిరామ వినర వేమ. ॥462॥

ఆ. మనసు గెలచి పూని మన్ననుజ్ఞానులు
కడఁక మోక్షపదముఁ గనుచునుండ్రు
చెట్టుఁబెట్ట ఫలము చేకూర కుండునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥463॥

క. మోహము తీఱక యుండిన
దాహంబై దేహమంత దల్లడపడ నీ
గేహములోఁ బోరాడక
దేహమునం దున్న శివునిఁ దెలియర వేమా. ॥464॥

ఆ. లింగ మంగమునను లీలఁ దెలియువెన్క
మనసు లింగమందు మరులుకొనును
మనసు నిల్పనందె మఱిలింగ ముండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥465॥

ఆ. శివుఁడు బ్రహ్మ మనుచు శ్రుతులెల్లఁ బలుకంగ
పరులఁ గొల్చు నేల బ్రాహ్మణుండు
హరునిభక్తజనుల యగ్రజు లగుఁ గాదె
విశ్వదాభిరామ వినర వేమ. ॥466॥

ఆ. అగ్ని చేతఁబట్టి యాపరమేశుని
నిండఁజేసి నరులు నీఱుగారె
దక్షుక్రతువులోని తల్లడ మెఱుఁగరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥467॥

తృతీయాశ్వాసము

ఆ. కలియుగముననున్న కాపు కులానకు
వేమన దనకీర్తి విక్రయించె
నున్న ధర్మమెల్లనుర్విలో నరులకు
కోరుఁ బెట్టె పరముఁ గోరి వేమ. ॥1॥

ఆ. చెవిని నిలుగట్టి చెప్పెను వేమన
బట్టబయలనుండు బ్రహ్మమనుచు
బుద్ధిఁ గలిగి యందుఁ బొంది సుఖించుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ॥2॥

ఆ. పొంకములకు మనసుఁ బోనీక సర్వేశు
వంక నిలుపువాఁడు వంశపరుఁడు
వంక నిల్పకున్న వచ్చునా పదవులు
విశ్వదాభిరామ వినర వేమ. ॥3॥

ఆ. ఉండియుండు జ్ఞాని యుగములు చనినను
బ్రాణహాని లేదు ప్రళయమునను
బ్రాణహానియైనఁ బరమాత్ము గలియునో
విశ్వదాభిరామ వినర వేమ. ॥4॥

ఆ. గురువు తానయైన హరిని తాఁ జూచును
బ్రహ్మలోక మతఁడు పాఱఁజూచు
శిష్యు నరసిపట్టి చీఁకటిఁ బాపురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥5॥

క. ధనమే మూలము జగతికి
ధనమే మూలంబు సకలధర్మంబులకున్
గొనమే మూలము సిరులకు
మనమే మూలంబు ముక్తి మహిమకు వేమా. ॥6॥

ఆ. కడగిఁ గాలిలేని గగనంబుభంగిని
బలుతరఁగలు లేని జలధిమాడ్కి
నిర్వికారమునను నిశ్చలత్వమునఁ దా
నుండెనేని ముక్తి యొనరు వేమ. ॥7॥

ఆ. నీళ్ళఁబోసి కడిగి నిత్యంబు శోధించి
కూఁడుబెట్టి మీఁద కోకగట్టి
యేమి పాట్లఁబడుదు రీ దేహమున కిల
విశ్వదాభిరామ వినర వేమ. ॥8॥

ఆ. గద్దె గణము నిద్ర కలలు కోరికలును
ముద మొసంగ శకునములకుఁ జెలఁగు
ప్రశ్నలు పదివేలు పరికించి చూడంగ
నవును కాకపోవునగును వేమా. ॥9॥

ఆ. లేఁడు లేఁడనినను లేఁడు లేనేలేఁడు
కాఁడు కాఁడటన్న కానెకాఁడు
తోడు తోడనినను తోడనే తోడౌను
విశ్వదాభిరామ వినర వేమ. ॥10॥

ఆ. శివునిమీఁద మనసు స్థిరముగా నుంచిన
నౌను మోక్ష మరయ నైనదౌను
శివునిమీఁద మనసు చీమంత తప్పిన
కాదుకాదు ముక్తి గాదు వేమా. ॥11॥

ఆ. తల్లి కెదురుకొనుట తండ్రి కెదురుకొనుట
యన్న కెదురుకొనుట యనఁగ మూఁడు
పాతకముల నెఱిఁగి వర్తింపఁగావలె
విశ్వదాభిరామ వినర వేమ. ॥12॥

ఆ. లోభమోహములును ప్రాభవములుదప్పు
దలఁచిన పనులెల్లఁ దప్పిచనును
తా మొకటి దలంప దైవమొక్కటిఁదల్చు
విశ్వదాభిరామ వినర వేమ. ॥13॥

ఆ. వరలు రత్నసమితివలెఁ గూర్చుధాన్యంబుఁ
జక్కదంచి వండి మిక్కుటముగ
సుష్టుభోజనములఁ జూరగా నిడువాఁడు
చెప్పనేల వాఁడు శివుఁడు వేమ. ॥14॥

ఆ. ఒకటిక్రింద నొక్క డొనర లబ్ధముఁ బెట్టి
వలనుగ గుణియింప వరుసఁ బెరుఁగు
నట్టిరీతి నుండు నౌదార్యఫలములు
విశ్వదాభిరామ వినర వేమ. ॥15॥

ఆ. అన్న మడుగనతని కన్నంబుఁ బెట్టిన
బాఱవేయుదాన ఫలిత మేమి
ధనికునకు నొసంగు దానంబు నటువలె
విశ్వదాభిరామ వినర వేమ. ॥16॥

ఆ. ఇరుగుపొరుగువారి కెనయుసంపదఁ జూచి
తనకులే దటన్న ధర్మమేమి
ధర్మమన్నఁ దొల్లి తన్నుక చచ్చిరి
విశ్వదాభిరామ వినర వేమ. ॥17॥

ఆ. ఆఁకలన్నవాని కన్నంబు పెట్టిన
హరున కర్పితముగ నారగించు
ధరవిహీనునకును దానము నటువలె
విశ్వదాభిరామ వినర వేమ. ॥18॥

ఆ. కలిగి పెట్టలేని కర్మజీవులకెల్ల
తిరిపెమును దొరకదు దీనులార
తెలియఁ జూచుకొనుఁడు దృష్టాంత మిదిమీకు
విశ్వదాభిరామ వినర వేమ. ॥19॥

ఆ. తిరిపెగాఁ డయినను దిరిపెమెత్తిన యట్టి
తిరిపెమందుఁ దాను దిరిపె మిడినఁ
దిరిపెము తిరిపమున దిగఁబడిపోవురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥20॥

ఆ. తాము బలిమిఁబెట్ట తమకు తామే కల్గు
నడుగనిడినఁ దాము నడుగఁగలుగు
విందునీనివాని కెందునులేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥21॥

ఆ. తాము గడననేయు ధనము తమదియని
నమ్మియుండ్రు వెఱ్ఱి నరులు భువిని
తాము నొకరి కిచ్చుధన మింతియేకాక
కడమది తనకేల గలుగు వేమ. ॥22॥

ఆ. తాను దినక యటుల ధర్మము సేయక
కొడుకుల కనిధనము కూడఁబెట్టి
తెలియఁజెప్పలేక తీఱిపోయినవెన్క
సొమ్ము పరులనందుఁ జూడు వేమ. ॥23॥

ఆ. రానిధనమునకును దానును కొడుకును
వాంఛఁబడుటె కాని వట్టి భ్రమలు
భాగ్యహీనునకును ఫలము లభించునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥24॥

ఆ. భాగ్యహీనులకును వరుసవేది దొరుక
నదియు నిల్వదపుడు వదలుఁగాక
వానతోడ వచ్చువడగండ్లు నిలుచునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥25॥

ఆ. ధనవిహీనుఁడైన తండ్రి గర్భంబున
భాగ్యపురుషుఁ డొకఁడు పరఁగఁబుట్టి
బహుళధనము గూర్చి భద్రమార్గంబున
పరుల కుపకరించి పరఁగు వేమ. ॥26॥

ఆ. ఇహమునందు బాధలెన్నైనఁ బడవచ్చు
యముని బాధలేక యమరవలెను
పరుల బాధలేక బ్రతుకుఁడీ నరులార
విశ్వదాభిరామ వినర వేమ. ॥27॥

ఆ. వల్లవైపులేక వాగ్దత్త మటుచేసి
యదిగొయిదిగొ యనుచు నాసఁబెట్టి
గడువుఁ బెట్టి రేపు గడియ కానిమ్మని
గడియలోనఁ బడియెఁ గదర వేమ. ॥28॥

ఆ. పరుల కుపకరింప పాపక్షయంబగు
పరుల కుపకరింపఁ బట్టుకొమ్మ
పరుల కుపకరింపఁ బరలోక సిద్ధియు
పరుల కుపకరింప బలిమి వేమ. ॥29॥

ఆ. అర్థవంతుల సొమ్ము నాసింతు రర్థులు
యర్థికీయ సొమ్ము వ్యర్థమౌను
వ్యర్థమైన సొమ్ము వ్యర్థులఁ జేరురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥30॥

ఆ. ధర్మకంటకుండు ధనముచే గర్వించి
సకలసంపదలను జాలఁ బొరసి
కడకు తాను మేలు గానక చెడిపోవు
విశ్వదాభిరామ వినర వేమ. ॥31॥

ఆ. ఇంతి తనదుపేరు నెల్లకాలంబును
ప్రజలు దలఁచునట్టి ప్రతిభఁ గాంచె
నింతికి పతిభక్తి యెంతనవచ్చును
విశ్వదాభిరామ వినర వేమ. ॥32॥

ఆ. ధర్మమునకుఁ గీడు తలఁచినవాఁడు తా
దుష్టమార్గుఁ డవును ద్రోవ చెడును
గురువుపత్నిగవయఁ గోరెడువాఁడు తా
మొదలెచెడును ముప్పు మొనసి వేమ. ॥33॥

ఆ. అలయఁజేసి మలఁచి యడిగండ్లు మలిగండ్లు
తిరిపెమిడెడు కటికిదేబెలెల్ల
నెలమి మన్నుదినెడు నెఱ్ఱలౌదురు సుమీ
విశ్వదాభిరామ వినర వేమ. ॥34॥

ఆ. మత్సరంబు మదము మమకార మనియెడి
వ్యసనములను దగిలి మసలఁబోక
పరుల కుపకరించి పరము నమ్మిక నుండ
నొనరుచుండు రాజయోగి వేమ. ॥35॥

ఆ. దానధర్ములును దయయు సత్యము నీతి
వినయ ధైర్య శౌర్య వితరణములు
రాజుపాలిటి కివి రాజయోగంబులు
విశ్వదాభిరామ వినర వేమ. ॥36॥

ఆ. క్రొవ్వు పొట్టపొరలు క్రూరకర్ములపొరల్
నొవ్వఁ జేసినట్టి రవ్వపొరలు
నెవ్వరైన నేమి యినజువాకిటఁ గాని
యవ్వలికిని బోవునటర వేమ. ॥37॥

ఆ. లోక మరసినట్టి లోకోపకారులు
భోగభాగ్యములను బొంది తుదను
పూర్వవాసన విడిపురహరు తావున
మ్రొగుచుంద్రు తారు మొనసి వేమ. ॥38॥

ఆ. జ్ఞానమెన్న గురువు జ్ఞానహీనము బుద్ధి
రెంటిసందు రిమ్మరేచు నపుడు
రిమ్మ తెలిసెనేని రెండొకరూపురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥39॥

సీ. నేమమునను నుండ నిల్చును చిత్తంబు - తామసమున నుండ దలఁగిపోవు
నిలిచిన చిత్తము నిర్భీతి నొందించు - నిర్భీతి సఖ్యంబు నీరసించు
సఖ్యదూరగుణము సమమును బొందించు - సమగుణమునఁ జూడ సమతపుట్టు
నట్టి సమత విశ్వమంతయుఁ దానగుఁ - దానె విశ్వంబయిన తత్వమగును ॥40॥

క. సకలాకారుఁ డనంతుఁడు
సకలాత్ములయందు సర్వసాక్షియుఁ దానే
సకలమున నిర్వికారుం
డకలంకస్థితిని బ్రహ్మ మగునుర వేమా. ॥41॥

క. నే నెవ్వండని వలపడు
మాననమునఁ బుడమిలోని మనుజుండటరా
కానడు తనశవమును దా
మానుగఁ గనుగొనుట యెట్లు మహిలో వేమా. ॥42॥

ఆ. జనుఁడు తెలివినొంద చంచలింపదు మది
దయయు దైవమొగిని దగులు బుద్ధి
తివురుభానుఁ జూచి తిమిరంబు నిలుచునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥43॥

ఆ. పగలురేయి మఱచి భావంబు మఱచియుఁ
దాను నేననియెడు తలఁపు మఱచి
యుండువాని నెంచ నుత్తమయోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥44॥

ఆ. మంటలోహమందు మ్రాకులు శిలలందు
పటము గోడలందుఁ బ్రతిమలందు
తన్నుఁ దెలియుకొఱకు తగులదా పరమాత్మ
విశ్వదాభిరామ వినర వేమ. ॥45॥

ఆ. మనసులోనివాని మానుగాఁ దెలిసిన
నుర్విజనులువాని యోగి యండ్రు
నీవె నిన్నెఱుంగ నీవెపో శివుఁడవు
విశ్వదాభిరామ వినర వేమ. ॥46॥

ఆ. మాటలోనివాని మహిమఁ దాఁ దెలియక
మాటబయలె లేక మమతఁ జిక్కె
మాట దెలిసెనేని మఱియాత్మ యోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥47॥

ఆ. వ్రేయవ్రేయనదియ విత్తన మనిపించు
వ్రేయవ్రేయఁ బ్రబల వృక్షమగును
తెలియఁ దెలియవాఁడు దేవుఁడనందగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥48॥

క. గడనగల పురుషుఁ గనుగొని
యడుగులకును మడుగు లిడుదు రతివలు ధరలో
గడన విడుపురుషుఁగనుగొని
నడపీనుగ వచ్చెనండ్రు నాతులు వేమా. ॥49॥

ఆ. వంటదప్పునపుడు వంటకము విషంబు
కంటుఁ జూడఁగానె కంటగించుఁ
గంటకమునఁ దిన్నకడి గండమైవచ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ॥50॥

ఆ. వండివచ్చునపుడు వంటక మమృతంబు
కంటికింపుగాను కానుపించు
నొడలతినినదిండి వడిమించ గడిదేఱు
విశ్వదాభిరామ వినర వేమ. ॥51॥

ఆ. కలిగి ధర్మమీయఁ గాననివారును
కలిగి తినక చాలగ్రాఁగువారు
కలిమి నెచటఁ జూడఁ గానక చెడుదురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥52॥

ఆ. అల్లువాని మృతికి నాత్మఁ జింతించును
తనయుమృతికిఁ దానె తల్లడిల్లుఁ
బుణ్యపురుషు మృతికి భూమిలో జనులకు
యుగము గ్రుంగినట్టు లుండు వేమ. ॥53॥

ఆ. సకలవిద్య లరసి చచ్చి బ్రతుకువిద్య
యొకటినేర మనుచు నుర్విజనులు
కటకటఁ బడుదురు కడహానిఁ దెలియరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥54॥

ఆ. దూరదృష్టిఁ గనరు దుడుకుడువదలక
బారప ట్టెఱుగరు పడినదనుక
దండసాధ్యు లయిరి ధర్మసాధ్యులుగాక
భూమిజనులు వెఱ్ఱిబుద్ధి వేమ. ॥55॥

ఆ. ముష్టి వేపచెట్టు మొదలుగా ప్రజలకు
పరఁగ మూలికలకు పనికివచ్చు
నిర్దయాత్మకుండు నీచుఁడెందునకును
పనికిరాఁడు గదర పరఁగ వేమ. ॥56॥

ఆ. ప్రభువు కోఁతియైనఁ బ్రగ్గడ పందియౌ
సైనికుండు పక్కి సేన పసులు
ఏనుఁగు లశ్వము లెలుకలు పిల్లులు
విశ్వదాభిరామ వినర వేమ. ॥57॥

ఆ. తిట్టెనేని మొట్టు మొట్టినఁ గొట్టును
కొట్టెనేని యముఁడు కొద్దిపఱచుఁ
గోప మెంచ చెడ్డపాపము నరహత్య
విశ్వదాభిరామ వినర వేమ. ॥58॥

ఆ. కోపమునను ఘనత కొంచెమై పోవును
కోపమునను మిగుల గోడుఁజెందుఁ
గోపమడచెనేని గోరిక లీడేరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥59॥

ఆ. కోపమునను నరక కూపముఁ జెందును
కోపమునను గుణము కొంచె మగును
కోపమునను బ్రతుకు కొంచెమై పోవును
విశ్వదాభిరామ వినర వేమ. ॥60॥

ఆ. రాజుమాటవలెను రసికుఁ డాడగవలె
నెంతపనికి నుబికి యెగురరాదు
కదిసి యెగిరెనేని గ్రహసమానము గాదె
దొడ్డ కొంచె మేల దొరకు వేమ. ॥61॥

క. సాధుసజ్జనులను సంతరించినవాఁడు
ప్రజల సంతసంబు పఱచువాఁడు
కదిసి శాత్రవులను గరుణఁజూచినవాఁడు
పాదుకొన్న ముక్తిపరుఁడు వేమ. ॥62॥

ఆ. పరఁగ లేమిచేత బంధువుల్ పగవారు
పరఁగ లేమిచేతఁ బరము తప్పు
పరఁగ లేమిచేతఁ బరపతి దప్పురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥63॥

ఆ. నేర్చి నడుతునన్న నేరమి తా వచ్చు
నోర్చి నడతునన్న నోర్పురాదు
కూర్చి నడతునన్నఁ గూడంగ నీయదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥64॥

ఆ. ధనము లేమి యనెడు దావానలం బది
తన్నుఁ జెఱచును దరిదాపుఁ జెఱచు
ధనములేమి చూడఁదలఁచగా పాపంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥65॥

ఆ. కాఁపు బల్మియున్నఁ గరణాన కది బల్మి
కరణముబలిమెల్ల గాఁపుబలిమి
కాఁపుసంతసంబు కరణముసంతోష
మరసిచూడ లోకమందు వేమ. ॥66॥

ఆ. కనుక గ్రామమునకుఁ గారణకర్తలి
ట్లుండయగుచు నుభయులుండిరేని
గండపక్షియుగళ ముండినరీతిని
నుద్దిగూడి బ్రతుకుచుండ్రు వేమ. ॥67॥

ఆ. చేకొనుచును తనకుఁ జేరి సాగినంతలోఁ
జెడిన ప్రజల రక్షసేయకున్న
తనదుసాగుటేమి తనతనువదియేమి
విశ్వదాభిరామ వినర వేమ. ॥68॥

ఆ. దోపునిచ్చువాఁడు తులలేని నెఱదాత
దోఁచుకొన్నవాఁడు ద్రోహి యయ్యె
ప్రాపుఁ జూపువాఁడు పరమపుణ్యుం డయ్యె
ప్రాపుఁజెఱచువాఁడు పశువు వేమ. ॥69॥

క. కాలము తన కిక చాలా
కాలము గలదంచునున్న కాలమునందున్
కూళఁడు తను దాఁదెలియక
కూలును తొలిజామునందు గొబ్బున వేమా. ॥70॥

ఆ. కూటవాసి యగుచు గుణములఁ బచరించి
నీటనీడవలెను నిలిచియుండు
నుదకఘటములందు నొగిఁదోఁచుటే గాని
సూర్యుఁడొకఁడు గాఁడె చూడ వేమ. ॥71॥

తే. ప్రాఁతచేసిన నర్తనల్ పదటఁగలిపి
క్రొత్తనర్తనఁ జేతురు కోడెకాండ్రు
కన్నతల్లిని విడనాడి కష్టపెట్టి
యన్యకాంతలఁ బోషించునట్లు వేమ. ॥72॥

ఆ. వావివర్తనలును వరుసలు మర్యాద
దప్పి నడచెనేని తగులుఁ గీడు
వదల దపుడు తాకు నది దప్పినం దుది
ముసలిముప్పునైన మునుగు వేమా. ॥73॥

ఆ. ఇంగలంబుతోడ నిలనల్పుతోడను
పరునియాలితోడ పతితుతోడ
సరసమాడు టెల్లచావుకు మూలంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥74॥

ఆ. మనసు నిల్పినట్టి మర్మజ్ఞులగువారు
గరిమ మోక్షపదముఁ గన్నవారు
చెట్టుఁబెట్ట ఫలము చేకొనఁడాతాను
విశ్వదాభిరామ వినర వేమ. ॥75॥

క. తనుఁదాఁ దెలియుట తత్త్వము
తన కన్యులు బోధసేయ ధరలోఁ గలరే
తనుఁదాఁ దెలియక యుండినఁ
దన కెవరుం దెలుపలేరు తథ్యము వేమ. ॥76॥

ఆ. మంచివారు లేరు మహిమీఁద వెదకినఁ
గష్టు లెందరైనఁ గలరు భువిని
పసిఁడి లేదె గాని సదడెంత లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥77॥

ఆ. మాటలాడ నేర్చి మనసు కరుఁగఁజేసి
పరఁగ ప్రియముపుట్టఁ బలుకకున్న
నొకరిచేత సొమ్ము లూరకవచ్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥78॥

ఆ. అండములను బుట్టు నలరు ప్రాణులు కొన్ని
బుద్బుదములఁ బుట్టుఁ బురుగు లెల్ల
స్వేదముననుబుట్టు జీవులు కొన్నిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥79॥

ఆ. అన్న మధికమైన నది తనుఁజంపును
నన్న మంటకున్న నాత్మ నొచ్చుఁ
జంప నొంప బువ్వ చాలదా వెయ్యేల
విశ్వదాభిరామ వినర వేమ. ॥80॥

ఆ. ఆశ లుడుగఁగాని పాశముక్తుఁడు గాఁడు
ముక్తుఁ డైనఁగాని మునియుఁగాఁడు
మునియు నయినఁగాని మోహంబు లుడుగవు
విశ్వదాభిరామ వినర వేమ. ॥81॥

ఆ. చంపఁదలఁచురాజు చనవగ్గలం బిచ్చుఁ
జెఱుపనున్న పగఱ చెలిమిసేయుఁ
గఱవనున్న పాము నెఱికాచుకొనియుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥82॥

ఆ. చెఱుకులోననైనఁ జెడ్డగుణం బున్నఁ
దీసివేయకున్నఁ దినగఁ బొసగ
దంతిపురము ద్రోహి యాతఁడెట్లుండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥83॥

ఆ. తనకు లేనివాఁడు దైవముందూఱును
తనకుఁ గలిగెనేని దైవ మేల
తనకు దైవమునకుఁ దగులాటమేశాంతి
విశ్వదాభిరామ వినర వేమ. ॥84॥

ఆ. తనదుమనసుచేతఁ దర్శించి జ్యోతిష
మెంతచేసెననుచు నెంచిచూడఁ
దనయదృష్ట మెల్ల దైవమ్ము తెలియురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥85॥

ఆ. తన్నుఁ దెలియువారు దైవజ్ఞు లెంతయు
నిన్నుఁ దెలియరేని నిలువరైరి
మాయఁ దెలియకుండ మంటపాలైరయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥86॥

ఆ. దైవమతుల నరులు తమవంటివా రని
యరసి గూఢతత్వ మరయ లేరు
ఇల్లు మూయఁబడిన నెట్లు మర్మ మెఱుఁగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥87॥

ఆ. నీవుగలుగుచోటు నెఱువు దెలియువాఁడు
వసుధయందు త్రోవ వదలఁ డెందుఁ
కాలు కదలనీక గ్రక్కునఁ జేరురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥88॥

ఆ. నీవు నిలిచియుండు నిఖిలంబు నిలువదు
నిలిచియుండు నెండు నీరువలెను
నీవు నిశ్చయంబు నిఖిలంబు మాయయౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥89॥

ఆ. మొదట నతఁడు జ్ఞాన ముద్రాంకితుఁడు గాక
యావిధమును దెలియ సజ్ఞుఁ డగును
నడుమ జ్ఞాన మొదవ నగుఁబాటు గాదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥90॥

ఆ. పికము వనములోన విలసిల్ల పలికిన
భంగి ప్రాజ్ఞుడనుల పలుకుకులుకు
కాకికూతఁ బోలుఁ గర్మబంధులకూఁత
విశ్వదాభిరామ వినర వేమ. ॥91॥

ఆ. చిక్కియున్న వేళ సింహంబునైనను
బక్కకుక్క చేరి బాధచేయు
బలిమిలేనివేళఁ బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥92॥

ఆ. జ్ఞానుల మని యెంచి చపలాత్ము లగువారు
తెలివిలేక తమ్ముఁ దెలియలేరు
కష్టగహనమందు కాడ్పడియున్నారు
విశ్వదాభిరామ వినర వేమ. ॥93॥

ఆ. పాపపుణ్యములును పసిమిగా పెఱిగినా
ధరను నరయ యోగి యెఱుగుఁగాక
లోనిపొందికఁగని లోహముల్ గూర్పరో
విశ్వదాభిరామ వినర వేమ. ॥94॥

ఆ. పెద్దల వచనములఁ బ్రేమతోఁ జూచి తా
నటుల నడవఁబోవ ననువుపడదు
పులిని చూచి నక్క పూతఁపూసిన యట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥95॥

ఆ. బుద్ధియుతున కేల పొసఁగని సౌఖ్యంబు
కార్యవాదికేల కడుచలంబు
కుత్సితునకు నేల గురుదేవతాభక్తి
విశ్వదాభిరామ వినర వేమ. ॥96॥

క. వినుకలి కనుకలి గోరము
కనుకలియాకాంతగూడి కవయగ గోరున్
గనుగొని ప్రేమన్బొరలును
ఘనతరమోహంబుచోటు గదరా వేమా. ॥97॥

ఆ. ఎల్లి రేపు నేఁడు నేలాగునైనను
మనసునిల్పువాఁడు మంచివాఁడు
శివుఁడు భర్త కర్త చింతింపనేలరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥98॥

క. మఱవవలె భావసంగతి
మఱవంగావలెను దురము మఱి విశ్వములో
మఱవవలెఁ బరులనేరము
మఱవంగా వలదు మేలు మహిలో వేమా. ॥99॥

ఆ. ఏమి గొంచువచ్చె నేమి తాఁగొనిపోవుఁ
బుట్టువేళ నరుఁడు గిట్టువేళ
ధనము లెచటి కేఁగు దానేగు నెచటికి
విశ్వదాభిరామ వినర వేమ. ॥100॥

ఆ. కడుపులోనిరోఁత కడు నోటియెంగిలి
కడుగ వశమె బ్రహ్మకొడుకుకైన
సత్యమున్న కొంత జగతిపై సిద్ధించు
విశ్వదాభిరామ వినర వేమ. ॥101॥

ఆ. అన్నిగోసివేసి యనలంబు చల్లార్చి
గోచిబిగియఁగట్టి కోప మడచి
యాసవిడిచెనేని యతఁడు తా యోగిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥102॥

ఆ. గుణహీనజనుని గుణ మెంచగా నేల
బుద్ధిలేనివాని పూజలేల
మనసు లేనివాని మంత్రంబు లేలరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥103॥

తే. కూడుఁగుడిచియు శతకోటిపడిగ లెత్తి
మాటిమాటికిఁ దినియును మంటఁగలిపి
కాటికేగువేళను రిత్తకూటి కగును
దాటిపోదురు నిజముగ దరికి వేమ. ॥104॥

ఆ. గీము విడిచి సుగుడి గిక్కురుమన కుండు
జీవు విడుచువేళ శివునిఁ దలఁచు
మనసు గొల్పకయును మాయచేఁ బొరలెడు
పాపనరుల కేటి పరము వేమ. ॥105॥

ఆ. తనకుఁ జేయుమేలుఁ దాఁ దెలియగ నేర్చు
నెలమితోడకుక్క యెఱుఁగు భువిని
తనకుఁ జేయుమేలు దాఁదెలియగలేని
మనుజుఁ డెంతఖలుఁడు మహిని వేమా. ॥106॥

ఆ. హీననరులతోడ నింతులతోడను
పడుచువాండ్రతోడ ప్రభువుతోడ
ప్రాజ్ఞ జనులతోడ బ్రహ్మఘ్ను జనులతో
వైపు దెలిసి పలుకవలయు వేమ. ॥107॥

ఆ. అధికజనులతోడ నాప్తులతోడను
పరువు గురు తెఱిఁగి పలుకకున్న
వచ్చు చెడ్డతనము హెచ్చుగా గాంభీర్య
హానిచెందుఁ దనకు నపుడు వేమ. ॥108॥

ఆ. అరుదుగా నడిగిన యతఁడర్థిగాఁబోడు
తఱచుగా నొసగక దాతగాఁడు
దాత కర్థి కింత తారతమ్యము సుమా
విశ్వదాభిరామ వినర వేమ. ॥109॥

ఆ. తల్లిదండ్రులందు దారిద్ర్యయుతులందు
నమ్మని నిరుపేద నరులయందు
ప్రభువులందుఁ జూడ భయభక్తు లమరిన
నిహముఫలము కల్గు నెసఁగు వేమ. ॥110॥

ఆ. ముట్టుముట్టనుచును ముట్టరా దందురు
ముట్టుకు దరి యేమి మూలమేమి
నవబిలములజికి నరుల కందఱకును
విశ్వదాభిరామ వినర వేమ. ॥111॥

ఆ. పరఁగఁదానొసఁగక పరులు చెప్పినదైన
నియ్యజాలకవిధి నెసఁగువాఁడు
పొట్టుఁదినెడులండి బువ్వలు పెట్టునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥112॥

ఆ. అండదప్పిన నరుఁడతిధార్మికునియిల్లు
చేరవలయు బ్రతుకఁజేయు నతఁడు
ఆ విభీషణునకు నతిగౌరవంబీడె
భూతలమున రామమూర్తి వేమ. ॥113॥

ఆ. సకలవిద్య లరసి సంతోషపడవచ్చుఁ
జెయ్యిసాచి కాసు లియ్యఁలేడు
చెలఁగి యొరులకైన చెప్పవచ్చునుగాని
తాను చేయలేఁడు ధరను వేమ. ॥114॥

ఆ. ధర్మసత్యములను దప్పకచేయని
కర్మజీవి మేలుఁ గానఁలేఁడు
నిర్మలహృదయుండు నీరూపమున నుండు
విశ్వదాభిరామ వినర వేమ. ॥115॥

ఆ. ధనములేమి కులము తక్కువపడవచ్చు
ధనములేమి కీర్తి దలఁగిపోవు
ధనములేమి శుచిని దగఁబుట్టనియ్యదు
ధనములేమి ఘనత తప్పు వేమ. ॥116॥

ఆ. ధనములేమి సుతులు తప్పుల నిడుదురు
ధనములేమి పత్నిఁ దాకరాదు
ధనములే మెవరికి తాళిక యుండదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥117॥

ఆ. చచ్చువార లెవరు చావనివా రేరి
చచ్చి బ్రతికియుండుజన్ము లెవరు
విచ్చలవిడిగాను వివరించి చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥118॥

ఆ. బ్రతుకువార లెవరు బ్రతుకకుందు రెవరు
బ్రతికిబ్రతుకలేని ప్రాణు లెవరు
క్షితిని శోధఁజేసి స్థిరమునఁజూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥119॥

ఆ. పెట్టువార లెవరు పెట్టకుందు రెవరు
పెట్టిపుట్టినట్టిదిట్ట లెవరు
పట్టుదప్పకుండ భావించి చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥120॥

ఆ. పుట్టువార లెవరు పుట్టకుందు రెవరు
పుట్టిగిట్టినట్టి పురుషు లెవరు
పుట్టిపుట్టనియట్లు బోధించి చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥121॥

ఆ. కట్టువార లేరి కట్టినవారేరి
కట్టికట్ట లేని కర్మ లేరి
గట్టిపఱచిలెస్స గనుగల్గి చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥122॥

ఆ. ఇట్టిపంచజనుని యేష్యము దెలిసిన
పెట్టి పుట్టి కట్టి పృథివి బ్రతికి
చచ్చి సిద్ధుఁడగుచు సర్వజ్ఞుఁడయినిల్చు
నెల్లమహిమ నీకు చెల్లు వేమ. ॥123॥

ఆ. మూఢకోపములను మోహలాభంబులు
నక్కజంపు క్రూర మధిక మయ్యె
కక్కసంబుచేతఁ గాలునిచేతను
మొక్కఁబోదురు తుది మొనసి వేమ. ॥124॥

ఆ. చిత్తముగలయోగి శివునివలనే యుండు
మిథ్యయోగి యుండు మిడుతవలెనె
నిత్యుఁడైన యోగి నీవలె నుండురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥125॥

ఆ. ఉన్న సరికి మనుజుఁ డుపకారి గాలేక
కన్నుగనక పల్కుగర్వములను
దీనులయినవారి దిగువారిగాఁజూచి
పరము గనకనూత బడును వేమ. ॥126॥

ఆ. రోగియైనవాఁడు రోగి నెఱుంగును
రోగి నరసిచూచి రూఢిగాను
రోగి కిడినవానిరాగి బంగా రౌను
విశ్వదాభిరామ వినర వేమ. ॥127॥

ఆ. ఎదుటితనబలంబు లెంచుకోనేరక
డీకొని చలమున నెదిర్చెనేని
యెలుగు పందిసేత కేర్పడు చందంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥128॥

ఆ. ఓగుబాగెఱుఁగని యుత్తమూఢజనంబు
లిలను ధీ జనముల నెంచుటెల్ల
కరినిజూచి కుక్క మొఱిగిన సామ్యమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥129॥

ఆ. నేరనిజనులకును నేర్పు నేరము లెల్లఁ
జక్కఁజేయరిల నసాధుజనము
లొప్పుదుర్జనులను తప్పుగనెంతురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥130॥

ఆ. దిక్కులేనిరోఁత దీనతఁ బాపిన
పురుషుఁడిహమునందు పూజ్యుఁడగును
పరమునందు వాని భాగ్య మేమనవచ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ॥131॥

ఆ. పలుగువాని కేల పరసమృద్ధి దలంప
పలుగువాని కేల భక్తిపదము
పలుగువాని కేల పరమార్థ తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥132॥

ఆ. తండ్రిసొమ్మునైన దాయాదిసొమ్మైనఁ
బరులసొమ్మునయినఁ బ్రాప్తధనము
దయను దీనులకును దాన మిచ్చినవాఁడె
బహుళపుణ్యజనుఁడు పరఁగ వేమ. ॥133॥

ఆ. తనదుసొమ్ముఁజూడ దాన మియ్యగవచ్చు
నవని దొడ్డగాద దెవరికైన
నదురు బెదురు లేక యన్యులసొమ్ముల
దానమిచ్చువాఁడు దాత వేమ. ॥134॥

ఆ. ధైర్యయుతుని కితరధనమైన నదురేమి
దాన మిచ్చునపుడె తనకుఁదక్కె
నెలమి మించుపనికినెవ రేమిసేయుదు
రడుగుదప్ప తప్పు పిడుగు వేమ. ॥135॥

ఆ. ద్రోహబుద్ధినైన దొంగఱికమునైన
నటననైన సాహసముననైన
సంపదధికునుండి సాధించి ధనమును
బడుగు కిచ్చి బాగుపడును వేమ. ॥136॥

ఆ. నరుఁడటు పరమాత్మ గురుని జేరునపుడు
హస్తమందె మోక్ష మపుడె చూపు
విఱివిసంపదలను విఱ్ఱవీగినజీవి
పర మెఱుఁగక యమునిపాలు వేమ. ॥137॥

ఆ. బిడ్డలను సతులను వేఱైనచుట్టాల
సంపదల తనువులఁ జాలనమ్మి
సంతసిల్లుచుండు క్షణభంగురము లన్ని
దెలియ నేరఁడేమి దెల్ప వేమ. ॥138॥

ఆ. ఉచితవంతుఁడైన నుద్యోగపరుఁడైన
సాగుబాటునున్న సమయమునను
పరుల కుపకరించి పరఁగ రక్షించును
విశ్వదాభిరామ వినర వేమ. ॥139॥

ఆ. పట్టువస్త్రములను పరఁగ భూషణములు
కుదువ లిడుటలెల్ల గొదువవద్దు
లనుభవింపఁగూడఁ డతఁడెంతవాఁడైన
విశ్వదాభిరామ వినర వేమ. ॥140॥

క. వినియుండెడి జనమెల్లను
చనిపోయినవారి పుణ్యసత్కథ లెలమిన్
వినవలెఁ గనవలె ననవలె
ననిమిషునకునైనఁ దెలియ దంత్యము వేమ. ॥141॥

ఆ. పచ్చఁజూచువారు పచ్చ మెచ్చెడివారు
పచ్చబడెడువారు చెడ్డవారు
పచ్చ విడుచువాని ప్రభువుఁగా జూతురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥142॥

ఆ. ప్రస్తుతించువేళ బద్యంబుఁ జదివినఁ
దప్పుదగిలియున్న నొప్పియుండు
వెలఁది సురతవేళ బిత్తరై యొప్పదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥143॥

ఆ. బంగరుఁ బొడఁగన్న భామలఁ బొడఁగన్న
చిత్తమునను చింత సేయఁడేని
వాఁడె పరమయోగి వర్ణింప జంగమందు
విశ్వదాభిరామ వినర వేమ. ॥144॥

క. పతియొప్పిన సతి యొప్పును
సతిపతు లొకటైనఁ బరమపావన మందూ
స్సతిపతిన్యాయమె మోక్షం
బతులితపరమాత్మ నైక్య మగురా వేమ. ॥145॥

క. ఆకాశంబున వాయువు
మ్రాకునదావాగ్ని యటుల మానసమందున్
ఏకాకారుఁడు జగమున
జోకైతనుదానె వెల్గు సుమ్మర వేమ. ॥146॥

ఆ. కండకావరమునఁ గానఁడు మరణంబు
మదముచేతఁ దత్వమహిమఁ గనఁడు
భోగవాంఛచేతఁ బుణ్యంబుఁ గానఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥147॥

ఆ. తెలుపు మాపుచేసి దిట్టతనంబునఁ
దెలుపు భస్ముగను దేటపఱుచు
విధముకన్నఁ బరుసవేదియు లేదురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥148॥

ఆ. దుండగీడు కొడుకు కొండీడు చెలికాఁడు
బండరాజునకును బడుగుమంత్రి
కొండముచ్చునకును గోతియు సరియౌను
విశ్వదాభిరామ వినర వేమ. ॥149॥

ఆ. పుట్టుదుఃఖముననను పొరలుదుఃఖముననను
గిట్టుదుఃఖముననను క్రిం దగుదురు
మనుజదుఃఖమువలె మఱిలేదు దుఃఖంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥150॥

ఆ. పెట్టినంత ఫలము పెక్కండ్ర కుపహతిఁ
జేయకున్నఁ దాను జెఱుపకున్న
పెండ్లిసేయునట్టి పెద్దఫలంబురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥151॥

ఆ. మేకఁ జంకఁబెట్టి మెలఁగుచు మందలో
బ్రమసి తిరుగు గొల్లపగిది గాక
దైవ మెఱుఁగక పరదైవముల్ దలఁచును
విశ్వదాభిరామ వినర వేమ. ॥152॥

ఆ. వేడబంబువాని వినయంబు లధికంబు
చెడ్డముండ ముసుఁగు చెలఁగిపెట్టు
చెడిపెకొడుకు మిగులచేయు నాచారంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥153॥

ఆ. పరధనమ్ములకును బారుగా చెయిపట్టి
సత్యమింతలేక చారుఁడయ్యె
ద్విజుఁ డనుకొనుఁదాదు తేజమింతయు లేక
విశ్వదాభిరామ వినర వేమ. ॥154॥

ఆ. ఇమ్ము దప్పువేళ నెమ్మెలన్నియుఁ దక్కి
కాల మొక్క రీతిఁ గడుపవలయు
విజయుఁ డనువుదప్పి విరటుని గొలువఁడా
విశ్వదాభిరామ వినర వేమ. ॥155॥

ఆ. మెలత నడవినుంచి మృగమువెంటనె పోయె
రామచంద్రుకన్న రసికుఁడేడి
చేటుకాలమునకు చెడుబుద్ధి పుట్టును
విశ్వదాభిరామ వినర వేమ. ॥156॥

ఆ. లంకపోవునాఁడు లంకాధిపతి రాజ్య
మంత కీశసేన లాక్రమించె
చేటుకాలమైనఁ జెఱుప నల్పుఁడె చాలు
విశ్వదాభిరామ వినర వేమ. ॥157॥

ఆ. రామవిభుఁడు పుట్టి రఘుకులం బలరించె
గురువిభుండు పుట్టి కులముచెఱచె
ఎవరి మంచిచెడ్డ లెంచిచూచినఁ దేట
విశ్వదాభిరామ వినర వేమ. ॥158॥

ఆ. పురహరునకు నేఁతపరువు తానేసిన
స్థిరముగల్గు జ్ఞానజీవ మయ్యె
నేత కేమివచ్చె నిజభక్తి హేతువు
విశ్వదాభిరామ వినర వేమ. ॥159॥

ఆ. శుద్ధదృష్టిఁ దెలిసి శుక్రునంతటివాఁడు
పట్టలేక మనసు పాఱవిడిచి
కన్నుపోయి పిదప కాకిచందం బయ్యె
విశ్వదాభిరామ వినర వేమ. ॥160॥

క. పంచాక్షరి పూజలచే
సంచితముగ నెఱుఁగు నాతఁ డఖిలజ్ఞుండై
వంచన మెఱుఁగక కువలయ
సంచారము సేయు నతఁడు శంభుఁడు వేమా. ||161||

ఆ. శూద్రులందుఁబుట్టి శూద్రుల దూషించి
ద్విజుఁడ ననెడిపేరు నిజముఁజేసి
మనసు నిల్పకున్న మఱిశూద్ర నీచుండు
విశ్వదాభిరామ వినర వేమ. ||162||

ఆ. నొసలు బత్తుఁడయ్యె నోరు తోడే లయ్యె
మనసు భూతమువలె మలయఁగాను
శివునిఁ గనియె నన్నసిగ్గెట్లు గాదొకొ
విశ్వదాభిరామ వినర వేమ. ||163||

ఆ. మాదిగ చెవులను మనసులోఁ బెట్టుక
మాదిగలను దెగడు మాదిగపుడు
మంచిగుణములేక మఱిద్విజుఁ డెట్లగు
విశ్వదాభిరామ వినర వేమ. ||164||

ఆ. కల్లలాడుకంటె కష్టంబు మఱిలేదు
కష్టమెపుడు కీడుఁ గలిగియుండు
ద్విజుఁడననుట చూడఁ ద్రిమ్మరితన మది
విశ్వదాభిరామ వినర వేమ. ||165||

ఆ. విప్రవరుల మనుచు వేదంబుఁ జదువక
ప్రాకృతులను జూచి పరిహసించు
ధరణిసురులకన్న దాసరిమత మెచ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ||166||

ఆ. వేష మొనరఁగట్టి వెలయ శూద్రత్వంబు
తనకు లేదనుకొను ధరణి ద్విజుఁడు
అరిది గిట్టువేళ నడఁగు ద్విజత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||167||

ఆ. సోమయాజి ననుచు సొంపుగా వేషంబు
గట్టి మాంసమెల్లఁ గాల్చితినును
ద్విజుఁడనంగ నేమితేజంబు తనవల్ల
విశ్వదాభిరామ వినర వేమ. ॥168॥

ఆ. అంతరాత్మఁ గనక యల్పబుద్ధులతోడ
మెలఁగునట్టి ద్విజులు మేదినందు
యమునినరకములకు నరుగంగ నది సాక్షి
విశ్వదాభిరామ వినర వేమ. ॥169॥

ఆ. కల్లటికెకు భూతి గట్టిగాఁ బెట్టిన
నందులోని కంపు లడఁగనట్లు
మెడను త్రాడు వేయ మెఱపుతో ద్విజుఁడౌనె
విశ్వదాభిరామ వినర వేమ. ॥170॥

ఆ. బిందురక్తములను బెరసిన దేహంబు
చంద మెఱుఁగక ద్విజశబ్ద మిడఁగ
నడచిన విడుచున నరకంబు మృత్యువు
విశ్వదాభిరామ వినర వేమ. ॥171॥

ఆ. భూతి దేహమందుఁ బూసిన నాయెనా
నిష్ఠ శివునియందె నిలుపవలయుఁ
గాని భస్మమందు గాడిదె పొర్లదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥172॥

ఆ. ఆకులెల్లఁదిన్న మేఁకపోతుల కేల
గాకపోవునయ్య కాయసిద్ధి
లోకులెల్ల వెఱ్ఱి పోకళ్ళఁ బోదురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥173॥

ఆ. బోడితలల జడల బూడిదెపూఁతల
భాషణాసనముల వేషములను
యోగిగాఁడు లోన బాగుగాకుండెనా
విశ్వదాభిరామ వినర వేమ. ॥174॥

ఆ. కాయగూరలుతిని కాషాయవస్త్రముల్
బోడినెత్తి గలిగి పొరయుచుండ్రు
తలలు బోడులైనఁ దలఁపులు బోడులా
విశ్వదాభిరామ వినర వేమ. ॥175॥

ఆ. కాలు చేయి వంచి గాలి నిండఁగఁజేర్చి
నేలవ్రాలి కొన్ని నిలిచికొన్ని
యాసనముఖవిద్య లభ్యాస విద్యలు
విశ్వదాభిరామ వినర వేమ. ॥176॥

ఆ. కావిపంచె గట్టికడుయోగివలెనుండి
వెదకి కోర్కులెల్ల విడిచిపెట్టి
తొడరి తిరుగువాఁడు దొంగసన్యాసిరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥177॥

ఆ. కలియుగమునఁ బుట్టి కడతేఱఁగా లేక
యొడలు బడలఁజేసి యుగ్రతపము
తపసు చేసియేమి తత్వంబుఁ గనలేరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥178॥

ఆ. ఇల్లునాలివిడిచి యినుపకచ్చులఁ గట్టి
వంటకంబు నీరువాంఛ లుడిగి
యొంటినున్న యంత నొదవునా తత్వంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥179॥

ఆ. జీవలింగపూజఁ జేసినవారికి
శిలలరూపమందుఁ జింతయేల
చెలఁగి మధువు గ్రోలఁజేదు రుచించునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥180॥

ఆ. శివుఁడు గలఁడటంచు శిలలకు మ్రొక్కెడి
వెఱ్ఱిజీవులార వెతల విడుడి
జీవులందె కాక శిలల నేమున్నది
విశ్వదాభిరామ వినర వేమ. ॥181॥

ఆ. రాతిప్రతిమ దెచ్చి రాజసంబుననుంచి
పూజసేయు నరుఁడు బుద్ధిమాలి
భావమందుఁ బరము భావించ నేరఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥182॥

ఆ. జంగమాఖ్య భక్తి సంధివేఱుగలేదు
సగుణభావ మదియ శాస్త్ర విధియు
నిర్గుణంబు వీడు నెఱినేదియెఱుఁగఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥183॥

ఆ. ఎంబెరుమతమని యెసఁగ మాంసము తిని
మారుపేరుఁ బెట్టి మధువు ద్రావి
వావివరుస దప్పి పలికి పాడెదురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥184॥

ఆ. జాతిమతము విడిచి చని యోగిగా మేలు
జాతితోనెయుండె నీతులెల్ల
మతముఁబట్టి జాతి మానకుంట కొఱంత
విశ్వదాభిరామ వినర వేమ. ॥185॥

ఆ. కట్టెపేరు లోలిగట్టి చెప్పఁగ రాదు
కానరాదు లోని కలిమితనము
జంగమయినపిదప జాతి నెంచరాదు
విశ్వదాభిరామ వినర వేమ. ॥186॥

ఆ. వేదవిద్యలెల్ల వేశ్యలవంటివి
భ్రమలపెట్టి తేటపడగ నీవు
గుప్తవిద్య యొకటె కులకాంతవంటిది
విశ్వదాభిరామ వినర వేమ. ॥187॥

ఆ. వేదశాస్త్రములను విని యేమి కుడిచిరి
యరిగితిరిగి సొత్తు రందఱిల్లు
బ్రహ్మమహిమఁ దెలిసి బ్రతుకుట నిజమయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥188॥

ఆ. వ్రతము లెన్నియైన వట్టిచిక్కులె కాని
యాత్మచిక్కుఁ గాన నలవిగాదు
ఆత్మచిక్కుఁ బాపునతఁడెపో ఘనయోగి
విశ్వదాభిరామ వినర వేమ. ॥189॥

ఆ. జననమరణములకు సంధ్యత్రాడును లేదు
సంధ్యత్రాడునులేదు జనని కెపుడు
తల్లి శూద్రురాలు దానెట్లు బాగురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥190॥

ఆ. ప్రేతయన్న మనుచుఁ బ్రీతితోఁ బిలిపించి
కాకులకును బెట్టు కర్ములార
కాకులందు నేమి ఘనులకుఁ బెట్టుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ॥191॥

ఆ. పిండములను జేసి పితరులఁదలపోసి
కాకులకును బెట్టు గాడ్దెలార
పెంటఁదినెడు కాకి పితరుఁ డెట్లాయెనో
విశ్వదాభిరామ వినర వేమ. ॥192॥

ఆ. నల్లబోడితలలు తెల్లనిగొంగళ్లు
ఒడల బూడ్దెపూత యొంటిరోఁత
యిట్టివేషములును పొట్టకోసము సుమీ
విశ్వదాభిరామ వినర వేమ. ॥193॥

ఆ. కంబళములఁ గట్టి గంటలు గజ్జలు
బోడితలలు కావి బొంతచిటికె
లాత్మదేవపూజ లవి సేయనేరవు
విశ్వదాభిరామ వినర వేమ. ॥194॥

ఆ. మానసంపురక్తి మసలక యాత్మలో
బోడితలల సొంపు పొల్పుమీఱ
కడుపుకొఱకుఁ దిరుగు కష్టంపుమతితోడ
విశ్వదాభిరామ వినర వేమ. ॥195॥

ఆ. పుస్తకములు జడలు పులితోలు బెత్తంబు
కక్షపాలలు పది లక్షలైన
మోత చేటు గాని మోక్షంబు లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥196॥

క. హృదయము పదిలంబైనను
గుదికొను సన్యాసమునకుఁ గొమ్మలు గలవా
యిదియెఱుఁగరు చదువరులటు
మది ముక్తికి నాస్పదంబు మహిలో వేమా. ॥197॥

ఆ. ఆసనములు పన్ని యంగంబు బిగియించి
యొడలు విఱుచుకొనెడి యోగమెల్ల
జెట్టిసాముకన్నఁ జింతాకు తక్కువ
విశ్వదాభిరామ వినర వేమ. ॥198॥

ఆ. కడుపు బోరగించి కన్నులు ముకుళించి
బిట్టబిగిసికొన్న బీదయోగి
యమునిబాఱిగొట్టె యతఁ డేమిసేయును
విశ్వదాభిరామ వినర వేమ. ॥199॥

క. రేచకపూరక కుంభక
సూచకములు రాజయోగి సుస్థిరమతియై
లోచూపుచూడనొల్లక
వాచాబ్రహ్మంబు పలుకవద్దుర వేమా. ॥200॥

క. పడిపడి మ్రొక్కఁగ నేటికి
గుడిలోపలి కఠినశిలల గుణములు చెడునా
గుడి దేహ మాత్మదేవుఁడు
చెడురాళ్ళకు వట్టిపూజ సేయకు వేమా. ॥201॥

ఆ. పలుగురాళ్ళఁ దెచ్చి పరఁగగుడులు కట్టి
చెలఁగిశిలలసేవఁ జేయనేల
శిలలసేవఁ జేయ ఫలమేమి గల్గురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥202॥

ఆ. ఉపవసములనున్న నూరపందిగఁబుట్టుఁ
దపసియై దరిద్రతను వహించు
శిలకు మ్రొక్కనగునె జీవమడుగు పొమ్ము
విశ్వదాభిరామ వినర వేమ. ||203||

ఆ. ఇహము విడచి ఫలము లింపుగఁ గలవని
మహిని బల్కు వారిమతము కల్ల
యిహములోనఁ బరము నెసఁగుట గానరో
విశ్వదాభిరామ వినర వేమ. ||204||

ఆ. వ్రాత వెంటఁగాని వరమీడు దైవంబు
సేతకొలదిగాని వ్రాతగాదు
వ్రాతకజుఁడు కర్త చేతకుఁ దాఁగర్త
విశ్వదాభిరామ వినర వేమ. ||205||

ఆ. దోసకారియైన దూసరికాఁడైనఁ
బతితుఁడైన వేదబాహ్యుఁడైన
వట్టిలేని పేదవాని కీఁదగు నీవి
ధనికునకు నొసంగఁ దగదు వేమ. ||206||

ఆ. కంటికంటి ననుచుఁ గర్మాధికారంబు
వెంటఁబట్టి చెడును వెఱ్ఱినరుఁడు
బట్టబయట ముక్తి చాటించిచూడరో
విశ్వదాభిరామ వినర వేమ. ||207||

ఆ. తాను విమలుఁడైనఁ దనగుణ మంతయు
శివుని కీనిగురువు చెడుగురుండు
గ్రుడ్డిగుఱ్ఱ మెక్కి గుడి దిరిగినటుల
విశ్వదాభిరామ వినర వేమ. ||208||

ఆ. జార పురుషుమీఁద సద్భక్తి నిలుపుచు
పతికి నిచ్చకంబు బడయుభంగి
పరముకొఱకు యోగి పాటించు దేహంబు
విశ్వదాభిరామ వినర వేమ. ||209||

ఆ. తనువులోన జీవతత్వ మెఱుంగక
వేఱె కలదటంచు వెదుకనేల
భానుడుండ దివ్వెఁబట్టి వెదుకు రీతి
విశ్వదాభిరామ వినర వేమ. ॥210॥

ఆ. చదువులందు లేదు శాస్త్రంబులను లేదు
వేదములను దైవభేదములను
బైటనున్న ముక్తి పాటించ లేఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥211॥

ఆ. చచ్చువారిని గని చావు నిశ్చయమని
తత్వమెల్ల నాత్మఁదలచి తెలివి
నదరు బెదరులేక యడరిన ముక్తుఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥212॥

ఆ. బొమ్మలాటవాఁడు బొమ్మల నాడించు
భువిని జనులుచూఁడ బొలుపుమీఱ
తానుమఱిగియుండి దైవ మాడించురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥213॥

ఆ. పరయువతిరతంబు పాటించి కోరిన
కోటిపూజలెల్లఁ గొల్లఁబోవు
సెగకు పొంతనున్న చెడదె తాపముచేత
విశ్వదాభిరామ వినర వేమ. ॥214॥

ఆ. తప్పురూపు గట్టి ధరలోనఁ దిరిగెడు
సేఁతలెల్ల మిత్తిఁజేరుకొఱకె
కడుపునిండ నింత కష్టంబు లేలరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥215॥

ఆ. వాక్కుశుద్ధి లేనివాఁడు చండాలుండు
ప్రేమశుద్ధిలేని పెట్టులేల
నొసలు భక్తుఁడైన నోరు తోడేలయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥216॥

ఆ. పరఁగ బొమ్మగుడ్డు పరికించి చూచిన
కులముల నిలయందుఁ గూడఁబెట్టు
నందఱొకటఁ గలియ నన్నదమ్ములె కదా
విశ్వదాభిరామ వినర వేమ. ॥217॥

ఆ. కూడ దేమిచేసె గులమేమి చేసెను
భూమి యేమిచేసె బొందికట్టె
నరుఁడు పడెడుపాట్లు నగుబాట్లు చూడరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥218॥

క. కానలేరు గాని కలియుగంబుననున్న
మనుజులందఱికిని మాన మొకటి
దొష్టికు లగువారు తమవలెఁ జూడక
పరులఁదూల నాడుదురుగ వేమ. ॥219॥

ఆ. జాతులందు నెట్టిజాతి ముఖ్యముచూడు
మెఱుఁగలేక దిరుగ నేమిగలదు
యెఱుక గలుగు మనుజుఁ డేజాతి గలవాఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥220॥

ఆ. చావు వచ్చినపుడు సన్యసించునదెట్లు
కడకు మొదటికులము చెడినదగును
పాప మొకటి గలదు ఫలమేమి లేదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥221॥

క. ఊరులు పల్లెలు మానుక
వారక యడవిం జరించువాఁ డరుదెంచున్
పెరుగులు కూరలు మెసవెడు
వీఱిఁడికెట మోక్షపదవి వినరా వేమా. ॥222॥

ఆ. శూద్రు లనుచు భువిని శూద్రులఁ బోనాఁడు
మాలకన్న చెడుగు మహినిలేఁడు
నరకమునకు నేగు నష్టమైన వెనుక
విశ్వదాభిరామ వినర వేమ. ॥223॥

ఆ. పూజకన్న నెంచ బుద్ధి నిధానంబు
మాటకన్న నెంచ మనసు దృఢము
కులముకన్న మిగుల గుణమే ప్రధానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥224॥

ఆ. కులము హెచ్చుతగ్గు గొడవలు పనిలేదు
సానుజాత మయ్యె సకలకులము
హెచ్చుతగ్గుమాట లెటులెఱుంగఁగ వచ్చు
విశ్వదాభిరామ వినర వేమ. ॥225॥

క. గ్రామము భూముల మానుక
ప్రేమోదయమింత లేక భీకరమతులై
భామల సుతులను వదలుక
బాములఁ బడనేల యడవిపట్టున వేమా. ॥226॥

ఆ. మాలవాని నేల మహిమీఁద నిందింప
నొడలరక్తమాంస మొకటిగాదె
వానిలోన మెలఁగువాని కులంబేది
విశ్వదాభిరామ వినర వేమ. ॥227॥

ఆ. మాలవాని నంటి మఱినీళ్ళ మునిగేరు
మనుజకర్మచేత మాలఁడయ్యె
నేలతెలియలేరో యీ నరపశువులు
విశ్వదాభిరామ వినర వేమ. ॥228॥

ఆ. మాదిగయనవద్దు మఱిగుణ మొనసిన
మాదిగది వసిష్ఠుమగువ చేడె
మాదిగ గుణమున్న మఱి ద్విజుఁడగునయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥229॥

ఆ. శిలను ప్రతిమఁజేసి చీఁకటింటను బెట్టి
మ్రొక్కవలదు మహిని మూఢులార
ఉల్లమందు బ్రహ్మముండుట దెలియరు
విశ్వదాభిరామ వినర వేమ. ॥230॥

ఆ. మాలవాఁడయినను మఱియాత్మమీఁదను
మనసు నిల్పెనేని మాలగాఁడు
మనసు నిల్పకున్న మహిమీఁద మాలఁడు
విశ్వదాభిరామ వినర వేమ. ॥231॥

ఆ. తాతఁ గన్నతల్లి తనతండ్రిఁ గనుతల్లి
తన్నుఁగన్న తల్లి తల్లితల్లి
తల్లి శూద్రురాలు తానెట్లు బాపఁడో
విశ్వదాభిరామ వినర వేమ. ॥232॥

ఉ. తాతజనించెఁ గన్యకకు తండ్రులు తామును కుండగోళకుల్
మాతపరానుకూలి మరి యెక్కువ ద్రౌపతి భర్తలేవురున్
నీతులు చెప్ప పాండవులనీమము లిట్టి వటంచు నెన్నుచున్
భూతలమందు మిక్కిలిగఁ బూజలఁ జేసిరి వెట్టి వేమనా. ॥233॥

ఆ. తనదు తల్లి లంజె తనయాలు మాదిగ
శ్రీపతికి గురువసిష్ఠుఁ డరయ
తపముచేత ద్విజుఁడు తర్కింప కులమెట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥234॥

ఆ. జాతివేఱు లేక జన్మక్రమంబున
నెమ్మదిని నభవుని నిల్పెనేని
అఖిలజనులకెల్ల నాతఁడె ఘనయోగి
విశ్వదాభిరామ వినర వేమ. ॥235॥

క. ధర గిరులు జలధు లన్నియు
పరికింపగఁ బ్రళయమునను భస్మావృతులౌ
సురలును మునులును జనఁగా
నెరయోగులు నుండఁగలరె నేర్పున వేమా. ॥236॥

ఆ. ఊర్వివారికెల్ల నొక్కకంచముఁబెట్టి
పొత్తుఁ గుడిపికులము పొలయఁ జేసి
తలను చేయిపెట్టి తగ నమ్మఁజెప్పరా
విశ్వదాభిరామ వినర వేమ. ॥237॥

ఆ. గట్టురాళ్ళఁ దెచ్చి కాళ్ళచేతులఁ ద్రొక్కి
కాసెయులులచేతఁ గాసిఁజేసి
మొఱపురాళ్ళ కెఱగుమొప్పెల నేమందు
విశ్వదాభిరామ వినర వేమ. ॥238॥

ఆ. తోలుకడుపులోన దొడ్డవాఁ డుండఁగ
రాతిగుళ్ళలోన రాశిఁబోయ
రాళ్లుదేవుఁడైన రాసుల మ్రింగవా
విశ్వదాభిరామ వినర వేమ. ॥239॥

ఆ. రాతిబసవని గని రంగుగా మ్రొక్కుచు
గునుకుబసవని గని గ్రుద్దుచుండ్రు
బసవభక్తులెల్ల పాపులె తలపోయ
విశ్వదాభిరామ వినర వేమ. ॥240॥

ఆ. మన్నుమెత్తి కడిగి మఱిరూపు గావించి
గుంతనిండఁ బూడ్చి గుఱుతు నిల్పి
మనుజులెల్లఁ గూడి మఱిదేవుఁ డందురు
విశ్వదాభిరామ వినర వేమ. ॥241॥

ఆ. మంచిశకునము లని యెంచి పెండ్లియాడు
వార లొకరు లేరు వసుధలోన
జనులకర్మములను శకునము ల్నిల్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥242॥

సీ. నియమాది సంగుఁడై నిలిచినఁ దత్వంబు - తామసంబగుఁ నిద్రఁ దలఁగఁజేయు
నిద్ర తలంగిన నిర్భీతినొందించు - శమమున నానంద సమితి పుట్టు
నానందమున విశ్వమంతయుఁ దానగుఁ - దాను విశ్వంబయినఁ దత్వమగును
తత్వ మింద్రియ పంచతత్వంబునను - నిల్చుఁ దత్వంబు నిలిచినఁ దానయగును ॥
243॥

ఆ. విషసహితులు నరులు విషధరు లెన్నఁగ
విష విషధరములను విరియఁగొట్ట
నఘము వచ్చుకడకు నాయువుకొదువగు
విశ్వదాభిరామ వినర వేమ. ॥244॥

ఆ. వేము పాలఁబోసి వెయ్యేండ్లు పెంచిన
చేదువిడిచి తీపు చెందదెపుడు
నోగుగుణము విడిచి యుచితజ్ఞుఁ డగునట్లు
విశ్వదాభిరామ వినర వేమ. ॥245॥

ఆ. వాడవదినెకేల వావివర్తనములు
చాడివాని కేల జాడబుద్ధి
మూఢసతులకేల ముదముతో జ్ఞానంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥246॥

ఆ. నేరనన్నవాఁడు నెరజాణ మహిలోన
నేర్తునన్నవాఁడు వార్తకాఁడు
ఊరకున్నవాఁడె యుత్తమోత్తముఁ డెందు
విశ్వదాభిరామ వినర వేమ. ॥247॥

క. దూలాలు టెంకినుండిన
వాలాయము చేటు వచ్చు వసుమతిలోనన్
లోలాక్ష విడిచిపెట్టిన
మేలిమిగా బ్రతుకవచ్చు మేదిని వేమా. ॥248॥

ఆ. మానినీమనోజమంది రానందైక
లోలురెల్ల రూర్ధ్వలోకసుఖము
మాలవాడకుక్క మధురాన్న మెఱుఁగునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥249॥

ఆ. తొత్తు తొత్తెగాని దొరసాని గాఁబోదు
అడఁచుటింతె దానికైన గుణము
మిత్తికూళ్ళ దొంగ మేలెఱుఁగ నేర్చునా
విశ్వదాభిరామ వినర వేమ. ॥250॥

ఆ. నాణెమైన చెడిప నయ మెఱింగి తిరుగు
విటుని కుస్తరించు వివర మెఱుఁగు
బానిసైనతొత్తు పాటింపరాదయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥251॥

ఆ. పంద నధికుఁ జేసి బవరంబునకుఁ బంపఁ
బాఱిపోవుఁ గార్యభంగమౌను
పాఱునట్టిబంటు పనికిరాఁ డెందును
విశ్వదాభిరామ వినర వేమ. ॥252॥

ఆ. తిరుమలకును బోవఁ దుఱక దాసరి గాఁడు
కాశిబోవ లంజ గరిత గాదు
గుక్క సింహ మగునె గోదావరికిఁ బోవ
విశ్వదాభిరామ వినర వేమ. ॥253॥

ఆ. కులుకుగుబ్బఁ జూపి గొబ్బున గరిగించి
చేతికానులెల్లఁ జేరఁ దీయు
అతనుచేతికత్తు లమరికకాంతలు
విశ్వదాభిరామ వినర వేమ. ॥254॥

ఆ. అనుకూల్యముగల యంగన కలిగిన
సతికిపతికి పరమసౌఖ్య మమరు
ప్రాతికూల్యమైన పరిహరింప సుఖంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥255॥

ఆ. గొప్పపిఱుఁదు గన్న కుచకుంభములఁ గన్న
చెప్పరానిచోటి చెలువుగన్న
ముప్పిరి గొనునయ్య మొనసిన మోహంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥256॥

ఆ. కాశి కాశి యనుచుఁ గడువేడ్కతోఁ బోదు
రందుఁగల్గు దేవుఁడిందు లేఁడె
యిందు నందు గలఁడు హృదయంబు లెన్సైన
విశ్వదాభిరామ వినర వేమ. ॥257॥

ఆ. మతముదారి యగుచు మధురాధరముఁ జూచి
మగువరూపుఁ జూచి మనసు మఱచు
యోనిఁజూచి సర్వయోగముల్ మఱచురా
విశ్వదాభిరామ వినర వేమ. ॥258॥

ఆ. నీళ్ళ మునుఁగనేల నిధుల మెట్టఁగనేల
మొనసి వేల్పులకును మ్రొక్కనేల
కపటకల్మషములు కడుపులో నుండఁగా
విశ్వదాభిరామ వినర వేమ. ||259||

ఆ. కూడు చీరఁ బాసి గుళ్ళపంచలఁబడు
నట్లువ్రాసె బ్రహ్మ యతులనుదుట
తోయజాక్షు లుండ దోషంబు లంటునా
విశ్వదాభిరామ వినర వేమ. ||260||

ఆ. కుంటికుక్క కేల కుందేటిపరువులు
పిరికిబంటుకేల బిరుదుగొడుగు
ముసలిముండ కేల ముసిముసినవ్వులు
విశ్వదాభిరామ వినర వేమ. ||261||

ఆ. ఎంతభూమి దిరిగి యేపాటు పడుచున్న
నంటనీకప్రాప్తి వెంటదిరుగు
భూమిక్రొత్తదైన భోక్తలుక్రొత్తలా
విశ్వదాభిరామ వినర వేమ. ||262||

ఆ. పరఁగ జలకమాడి పట్టెనామముదీర్చి
నీరుకావిపంచె నెగడఁగట్టి
వారకాంతఁజూచి వ్రతమెల్ల మఱచురా
విశ్వదాభిరామ వినర వేమ. ||263||

ఆ. మనసు నిల్పలేని మాయావిరక్తులు
మనసుపడుదు రొక్క మగువమీదఁ
నిట్టివ్యర్థజన్మ మీ బ్రతుకేటికి
విశ్వదాభిరామ వినర వేమ. ||264||

ఆ. తొడలమెఱుపుసొంపు తోరంపుకుచములు
వారకొప్పుగలుగు వనితఁజూచి
విటుఁడు నిలుచుటెట్లు విరహాగ్ని కొగ్గును
విశ్వదాభిరామ వినర వేమ. ||265||

ఆ. కాశినీళ్ళు మోసి కాళ్లు మొగము వాచి
యెందు సుఖము లేక యెండి యెండి
చచ్చివెనుక ముక్తి సాధించఁగలరొకో
విశ్వదాభిరామ వినర వేమ. ॥266॥

ఆ. దేశదేశములను దిరిగిగాసిలినొంద
నాత్మయందు ధ్యాన మంటుకొనునె
కాసులకును దిరుగఁ గలుగునా మోక్షంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥267॥

ఆ. కచ్చుమీఁద నాస కనకంబుపై నాస
లేనివాఁడు పుడమి లేనివాఁడు
కలిగెనేని యతఁడు గానంగ రాఁడయా
విశ్వదాభిరామ వినర వేమ. ॥268॥

ఆ. వలపు తీఱువెనుక వనజాక్షి యధరంబు
ములకపంటిగిజరు ముష్టిరసము
చింతలేనివేళ జీడిసమానమౌ
విశ్వదాభిరామ వినర వేమ. ॥269॥

ఆ. చదువులెల్ల చదివి సర్వజ్ఞుఁడై యుండు
బ్రహ్మవిద్యలెల్ల పదటఁ గలిపి
యిఱుకుయోనిఁ జూచి పరమయోగము మాను
విశ్వదాభిరామ వినర వేమ. ॥270॥

క. తాము నిలుచుచోట దైవములేదని
పామర జనులు తిరుపతులు దిరిగి
జోకవీడి చేతిసొమ్మెలఁ బోఁజేసి
చెడిగృహంబు తాను జేరు వేమ. ॥271॥

ఆ. కాశిమధురకాంచి గయప్రయాగము సేతు
వాస తోడ వీని నాత్మఁ జూచి
వాసనను దెలియఁడు వట్టివెఱ్ఱివిధంబు
విశ్వదాభిరామ వినర వేమ. ॥272॥

ఆ. చదువు చదువ నేల సన్యాసి గానేల
షణ్మతములఁజిక్కి చావ నేల
అతని భజనఁజేసి యాత్మలోఁ దెలియుఁడీ
విశ్వదాభిరామ వినర వేమ. ||273||

ఆ. మనములోనఁ బుట్టు మఱికోర్కులన్నియు
కోర్కులందు ముక్తి కుదురుపడదు
మనము బ్రహ్మమనుచు మదినెఱుంగఁగ లేరు
విశ్వదాభిరామ వినర వేమ. ||274||

ఆ. చదువులన్ని చదివి చాలవివేకియౌ
కపటికెన్న నెట్లు కలుగుముక్తి
దాలిగుంటఁగుక్క తలఁచిన చందము
విశ్వదాభిరామ వినర వేమ. ||275||

ఆ. తఱచు చదువు చదువఁ దర్కవాదమె కాని
దివ్యజ్ఞాన మన్న తేటపడదు
పసిరికాయపురుగు పగిదిని చెడిపోవు
విశ్వదాభిరామ వినర వేమ. ||276||

తే. అవని వేమన్న చెప్పిన యాత్మబుద్ధిఁ
దెలియలేనట్టి యజ్ఞాని తేజమెల్ల
తలనుఁ బాసిన వెంట్రుకవలెను జూడ
భుక్తి ముక్తులు హీనమైపోవు వేమ. ||277||

ఆ. ఇట్టి సాధువిద్య యెందులేదని చూచి
గాఢవిద్య నేర్చి కానలేక
సాధుసజ్జనముల సాంగత్యమెఱుఁగక
బాధపడుదురు తుది పరులు వేమ. ||278||

ఆ. ఇదియ పరమటంచు నితరచింతలు వీడి
మనసుఁ జెదరనీక మట్టుపఱచి
కొదువలేక నిలువ కోర్కెలు ఫలియించు
మనసులోన నుండు మహిమ వేమ. ||279||